ఈనాడు

విజయవాడ 9-11-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 89 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 8-00 పేజీలు 16+28 www.eenadu.net


Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

చిట్టిలు ఎన్నొచ్చినా.. పట్టు మనదే!

ఇల్లు శుభ్రం చేయడానికి... మీనాక్షి
పెరడు చూసుకోడానికి... నర్సింగ్.
కిచెన్‌లో పనులకు... రామ్
మేకప్ చేయడానికి... మృదుల
... ఇంతకూ వీళ్లెవరూ మనుషులు కాదు.
హ్యూమనాయిడ్ రోబోలు!

మనిషిలా కనిపించే.. చేదోడువాదోడుగా ఉండే... హ్యూమనాయిడ్ రోబోల విప్లవం రాబోతోందా?

...అంటే భవిష్యత్తులో తప్పనిసరిగా వస్తుందంటున్నారు నిపుణులు. అయితే సృజనాత్మకత, సహానుభూతుల కోసం తోటి మనిషిపై ఆధారపడాల్సిందేనంటున్నారు. హ్యూమనాయిడ్ రోబోల రంగంపై పరిశోధనలు సాగిస్తున్న హైదరాబాద్ సంస్థ పెర్సెప్టైన్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు నడిమింటి మృత్యుంజయ శాస్త్రి ఈ మరమనుషుల తీరుతెన్నుల్లో వస్తున్న మార్పులపై 'ఈనాడు'తో ముచ్చటించారు. వివరాలివీ...



ఇల్లు శుభ్రం చేయడం, వంట, లాండ్రీ వంటి రోజువారీ పనులను హ్యూమనాయిడ్ రోబోలు చేసే రోజు ఎంతో దూరంలో లేదు. 2060 నాటికి వీటి సంఖ్య 300 కోట్లకు చేరొచ్చని అంచనా. అప్పటికి ప్రపంచ జనాభా వెయ్యి కోట్లనుకుంటే ప్రతి ముగ్గురిలో ఒకరి వద్ద ఓ రోబో ఉంటుంది.

హ్యూమనాయిడ్ రోబో టెక్నాలజీ రంగం ప్రస్తుత పరిస్థితి ఏంటి? భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?

మనుషుల తరహాలోనే పరిస్థితులను ఆకళింపు చేసుకుని పనులు చేయగల బహుళ ప్రయోజనకర యంత్రమే హ్యూమనాయిడ్ రోబో. అది పూర్తిస్థాయి మానవ రూపంలో ఉండొచ్చు, చక్రాలతో కూడిన కదిలే యంత్రమైనా, అప్-డౌన్ గ్యాంట్రీ అయినా కావొచ్చు. ఇదో రకం ఏఐ. ఈ రోబోలు భౌతిక ప్రపంచాన్ని వీక్షించగలవు. అర్థం చేసుకుని పనిచేయగలవు. ఆ సాంకేతికత పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రోబో ఒక అరటిపండు తొక్కను తీస్తుంది. దుస్తులను మడత పెడుతుంది. మొబైల్ ఫోన్‌ను అసెంబుల్ చేస్తుంది. పిజ్జాను తయారుచేస్తుంది. కొరియర్ బాక్స్‌ను ప్యాక్ చేస్తుంది. వీటి తయారీ కోసం పలు కంపెనీలు, విశ్వవిద్యాలయాలు కొన్ని దశాబ్దాలుగా కృషి చేస్తున్నాయి. అయితే గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు, కృత్రిమ మేధ (ఏఐ) వంటి రంగాల్లో పురోగతి కారణంగా ఈ తరహా రోబోల రంగంలో అసలైన జోరు ఇప్పుడిప్పుడే సాధ్యమవుతోంది.

ఈ విషయంలో ప్రస్తుతం సాగుతున్న పరిశోధనలు, పెట్టుబడుల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి?

హ్యూమనాయిడ్లు, భౌతిక మేధస్సు రంగాలపై ప్రపంచవ్యాప్తంగా వందలకోట్ల డాలర్లను వెచ్చిస్తున్నారు. అమెరికా, చైనాల్లో పెద్ద ఎత్తున కృషి జరుగుతోంది. టెస్లా ఆప్టిమస్, ఫిగర్.ఏఐ, ఫిజికల్ ఇంటెలిజెన్స్ కంపెనీ, స్కిల్డ్.ఏఐ, అగిబాట్ వంటి సంస్థలు ఈ పనిలో ఉన్నాయి. భారత్‌లో పెర్సెప్టైన్ సహా కొన్ని కంపెనీలు ఈ తరహా పరిజ్ఞానాలను అభివృద్ధి చేస్తున్నాయి.

(మిగతా 3లో)

ఆ 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులివ్వండి

కార్యకర్తలకు బీమా లేఖలు ఇవ్వని వారి వివరాలు సేకరించండి

పార్టీ కార్యాలయ సిబ్బందికి సీఎం చంద్రబాబు ఆదేశం ● కొందరు ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం

పింఛన్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టీకరణ

ఈనాడు - అమరావతి

ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత కార్యక్రమాల్లో పాల్గొనని 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకోవాలని పార్టీ కార్యక్రమాల అమలు కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎన్నిసార్లు చెప్పినా కొందరు తీరు మార్చుకోకపోవడం, ప్రజలతో మమేకమయ్యేందుకు అవకాశమున్న కార్యక్రమాలకు దూరంగా ఉండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇకపై ఎవరైనా పాల్గొనకపోతే వెంటనే తన దృష్టికి తేవాలని, అలాంటి ఎమ్మెల్యేలపై చర్యలకు వెనకాడబోమని చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలోని వివిధ విభాగాలతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, నాయకుల బాధ్యతలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశారు. "పింఛన్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కార్యకర్తల కుటుంబాలకు బీమా సొమ్ము పంపిణీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలి. పార్టీ కార్యకర్తల బీమా లేఖలు ఇంకా అందజేయని శాసనసభ్యుల వివరాలు నాకు ఇవ్వండి. పేదలకు సేవలో (పింఛన్ల పంపిణీ) కార్యక్రమానికి నేను క్రమం తప్పకుండా హాజరవుతున్నాను. మిగతా నాయకులూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి" అని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించను

"ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించను. (మిగతా 3లో)



మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తన గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

- వివరాలు 3లో

క్వాంటమ్ కంప్యూటర్ సిద్ధమైంది.. తీసుకురావడమే మిగిలింది

నిర్ణీత గడువులోగా అమరావతికి తెస్తాం

22ఏ భూములకు త్వరలో పరిష్కారం

అత్యంత నిర్మాణాత్మకంగా విశాఖలో భాగస్వామ్య సదస్సు

మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి

లోపలి పేజీలో

'కుప్పం'లో ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన

వర్చువల్ విధానంలో చేసిన ముఖ్యమంత్రి

రూ.2,203 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉపాధి

త్వరలో రూ.6వేల కోట్లతో మరో 8 పరిశ్రమలు రానున్నట్లు చంద్రబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళలు, యువత ప్రతి ఒక్కరూ ఒక పారిశ్రామికవేత్త కావాలని ఆకాంక్షించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో ఏడు పరిశ్రమలకు సీఎం శనివారం శంకుస్థాపన చేశారు. హిందాల్కో, శ్రీజా డెయిరీ, ఏసీఈ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డెయిరీ, ఈ-రాయిస్ ఈవీ, ఎలీప్ కుప్పంలో రూ.2,203 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. (మిగతా 3లో)

న్యాయ పరిభాషను సరళీకరించాలి

జాతీయ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

సులభంగా న్యాయం అందేందుకు అది దోహదం చేస్తుంది

తీర్పుల అనువాదంలో సుప్రీంకోర్టును హైకోర్టులు అనుసరించాలి

దిల్లీ: న్యాయ పరిభాషను సరళీకరించడం ద్వారా చట్టం అందరికీ అవలీలగా అర్థమయ్యేలా చూడాలని, సామాజిక ఆర్థిక నేపథ్యంతో ప్రమేయం లేకుండా ప్రతి పౌరునికీ తేలికగా న్యాయం అందేందుకు ఇది దోహద పడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు. న్యాయశాస్త్ర గ్రంథాల్లోని భాషను సరళీకరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. న్యాయ సహాయం అందజేత వ్యవస్థల బలోపేతంపై శనివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) 30వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో.. సామాజిక మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించారు. అందరికీ న్యాయం అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న న్యాయ సహాయం.. పేదలకు తేలికగా న్యాయం అందేందుకు దోహదపడుతోందని చెప్పారు. (మిగతా 3లో)



సుప్రీంకోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ సదస్సులో ప్రధాని మోదీ, సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాటామంతీ

తీర్పులు స్థానిక భాషల్లో అందించాలి

కోర్టు తీర్పుల్ని, ఇతర న్యాయసంబంధ పత్రాలను స్థానిక భాషల్లో అందించాల్సిన అవసరం ఉంది. సుప్రీంకోర్టు 80 వేలకు పైగా తీర్పుల్ని 18 భారతీయ భాషల్లోకి అనువదించేందుకు చూపిన చొరవ అభినందనీయం. హైకోర్టులు, జిల్లా న్యాయస్థానాలు కూడా ఇలాంటి చొరవ చూపుతాయని ఆశిస్తున్నాను. సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి పౌరునికీ న్యాయం అందితే సామాజిక న్యాయం అందరికీ అందినట్లే. - మోదీ



బైక్‌ను ఢీకొట్టి ఆగిన కారు

ముగ్గురి ప్రాణాలు తీసిన నిద్రమత్తు

అదుపుతప్పి పలువురిపైకి దూసుకెళ్లిన కారు

కాకినాడ జిల్లాలో ఘటన

3లో

ఎర్రచందనం జోలికెళ్తే తాట తీస్తాం


ఐదేళ్లలో 1.30 లక్షల చెట్లు అడ్డగోలుగా నరికేశారు

దాదాపు రూ.10 వేల కోట్ల కలప స్మగ్లింగ్ జరిగింది

ఎర్ర దొంగల నియంత్రణకు ప్రత్యేక ఆపరేషన్

తిరుపతి జిల్లా పర్యటనలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్- తిరుపతి: న్యూస్‌టుడే- తిరుపతి (జీవకోన), రేణిగుంట: 'కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నేను అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు తీసుకున్నా. వైకాపా హయాంలో స్మగ్లింగ్ విపరీతంగా జరిగింది. ఐదేళ్లలో 1,30,000 ఎర్రచందనం చెట్లు నరికేశారు. దాదాపు రూ.10వేల కోట్ల విలువైన దుంగలను స్మగ్లింగ్ చేశారు. ఇకనుంచి ఎవరైనా ఎర్రచందనం కొట్టేసినా, అందుకు సహకరించినా.. వాళ్లు స్మగ్లర్లయినా, కింగ్ పిన్స్ అయినా సరే తాటతీసి కూర్చోబెడతాం. ఇందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్మగ్లర్లను హెచ్చరించారు. ఇందుకోసం ప్రత్యేక చట్టం ఉందని.. దొంగల ఆస్తులనూ సీజ్ చేయొచ్చని చెప్పారు. శనివారం ఆయన తిరుపతి సమీపంలోని కేంద్రీయ ఎర్రచందనం గోదాములను అటవీశాఖ సలహాదారు పి.మల్లికార్జునరావు, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, సీఎఫ్ సెల్వం, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి పరిశీలించారు. (మిగతా 13లో)



తిరుపతి కేంద్రీయ గోదాముల్లోని ఎర్రచందనం నిల్వను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఖరగ్‌పుర్-చెన్నై సరకు రవాణా కారిడార్‌కు బ్రేక్

ప్రత్యామ్నాయంగా విశాఖపట్నం-నిడదవోలు, విజయవాడ-గూడూరు మధ్య 3, 4 లైన్లు

వీటిని త్వరగా పూర్తి చేసేలా రైల్వే శాఖ కసరత్తు

ఈనాడు, అమరావతి: సరకు రవాణా రైళ్ల కోసం ఖరగ్‌పుర్-చెన్నై మధ్య ప్రత్యేక కారిడార్ నిర్మించాలని భావించిన రైల్వేశాఖ.. తాజాగా ఈ ప్రతిపాదనను పక్కనపెట్టింది. నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుందని ఈ ప్రాజెక్టును నిలిపేయాలని నిర్ణయించింది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం హావ్‌డా-చెన్నై ప్రధాన రైల్వే లైన్‌లో 2, 4 లైన్లను వేగంగా నిర్మించేలా కసరత్తు ఆరంభించింది. ఇప్పటికే కొన్నిచోట్ల మూడో లైన్ పనులు జరుగుతుండగా, నాలుగోది త్వరగా పట్టాలెక్కించాలని భావిస్తోంది. (మిగతా 3లో)

ఇదీ సంగతి!



ఇన్ని కుక్కల్ని తరలించడం కంటే బస్టాండ్‌నే ఊరవతలికి తరలించడం సులువు సార్!

'కల్తీ నెయ్యి'లో వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదం

తితిదే ఛైర్మన్‌గా అనామక ఫిర్యాదుతో భోలేబాబా డెయిరీపై విచారణకు ఆదేశం

కల్తీ నిర్ధారణ అయినా ఆ సంస్థలకు నెయ్యి సరఫరాకు అనుమతి

సుబ్బారెడ్డిని ఆయన ఇంట్లో కలిసిన భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పామిల్ జైన్

తన ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించకుండా ఉండాలని వినతి

ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ నుంచి సుబ్బారెడ్డి పీఏకు రూ.50 లక్షల ముడుపులు

హైకోర్టులో సిట్ ఐఓ కౌంటర్

ఈనాడు - అమరావతి

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా విషయంలో తితిదే అప్పటి ఛైర్మన్ (ప్రస్తుత వైకాపా రాజ్యసభ సభ్యుడు) వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉందని సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలోని సిట్ హైకోర్టుకు నివేదించింది. కేసు దర్యాప్తును ఓ కొలిక్కి తెచ్చేందుకే వైవీ సుబ్బారెడ్డి, ఆయన సతీమణి యర్రం స్వర్ణలతారెడ్డి బ్యాంక్ లావాదేవీల వివరాలను కోరుతున్నామని పేర్కొంది. నేర ఘటనతో బ్యాంక్ లావాదేవీలు ముడిపడి ఉన్నట్లు దర్యాప్తు అధికారి (ఐఓ)కి అనుమానం వస్తే ఆ ఖాతా వివరాలను పరిశీలించే అధికారం ఉంటుందని తెలిపింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని సుబ్బారెడ్డి దంపతులు వేసిన వ్యాజ్యాన్ని కొట్టేయాలని సిట్ ఐఓ ఇటీవల హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. కల్తీ నెయ్యి కేసు దర్యాప్తులో భాగంగా సుబ్బారెడ్డి, ఆయన భార్య బ్యాంక్ ఖాతాలు, లావాదేవీల వివరాలు ఇవ్వాలని హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని యాక్సిస్ బ్యాంక్ మేనేజర్‌కు సిట్ అదనపు ఎస్పీ నోటీసిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ సుబ్బారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలతారెడ్డి (మిగతా 3లో)



దేశ ప్రగతిలో కెనరా బ్యాంక్ ముఖ్య భూమిక

అధికారుల సంఘం 20వ త్రైవార్షిక సమావేశాలు ప్రారంభం



కెనరాబ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానిస్తున్న సంఘం ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు

విశాఖపట్నం (మధురవాడ, సాగర్‌నగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వరంగంలోని అతి పెద్ద బ్యాంకుల్లో ఒకటైన కెనరాబ్యాంక్.. ఖాతాదారులకు విశేష సేవలందిస్తూ దేశ ప్రగతిలో ముఖ్యభూమిక పోషిస్తోందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణరాజు పేర్కొన్నారు. విశాఖపట్నంలో మూడురోజుల పాటు జరగనున్న కెనరాబ్యాంక్ అధికారుల సంఘం 20వ త్రైవార్షిక సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంక్ అభివృద్ధిలో అధికారుల సంఘం పాత్ర ఎనలేనిదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు అధికారులంతా బ్యాంకింగ్ సేవలు విస్తృతమయ్యేలా కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ మాట్లాడుతూ.. దేశంలో రెండో అతిపెద్ద ట్రేడ్ యూనియన్‌గా సంఘం నిలవడంలో బ్యాంక్ అధికారుల ఐక్యత ప్రధానమన్నారు. కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణరాజుపై రూపొందించిన పుస్తకాన్ని ఆయన తల్లి రామసీత చేతులమీదుగా ఆవిష్కరించారు. సంఘం జాతీయ నూతన కమిటీ ఎంపిక సోమవారం జరుగుతుందని సభ్యులు వెల్లడించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్దీప్‌సింగ్ అహ్లూవాలియా, విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, కమిటీ ఛైర్మన్ రమాప్రసాద్, దేశవ్యాప్తంగా ఉన్న అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాకినాడ టౌన్-కొట్టాయం ప్రత్యేక రైలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు విజయవాడ మీదుగా ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07109 కాకినాడటౌన్-కొట్టాయం ప్రత్యేక రైలు ఈ నెల 17, డిసెంబరు 8, 15, 22, 29, జనవరి 5, 12, 19 తేదీల్లో, తిరుగు ప్రయాణంలో 07110 ప్రత్యేక రైలు ఈ నెల 18, డిసెంబరు 2, 9, 16, 23, 30 జనవరి 6, 13, 20 తేదీల్లో నడుస్తుంది. ఈ రైళ్లకు ఆదివారం ఉదయం 8 గంటలకు టికెట్ల బుకింగ్ ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

హౌ టు కిల్ ఓల్డ్ లేడీ?

- యూట్యూబ్ వీడియోలు చూసి.. అత్తను చంపిన కోడలు



మృతురాలు కనకమహాలక్ష్మి



నిందితురాలు లలిత

విశాఖపట్నం (వేపగుంట), న్యూస్‌టుడే: యూట్యూబ్ వీడియోలు చూసి అత్తను కోడలు అంతమొందించిన దారుణ ఘటన విశాఖలో సంచలనం రేకెత్తించింది. నగరంలోని 98వ వార్డు అప్పన్నపాలెం వర్షిణి అపార్ట్‌మెంట్ ఎఫ్ బ్లాకులో జయంతి కనకమహాలక్ష్మి (66) అనే వృద్ధురాలు శుక్రవారం ఉదయం మంటల్లో చిక్కుకుని అనుమానాస్పదంగా మృతిచెందారు. విచారణలో కోడలే ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి, హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. శనివారం పెందుర్తి స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఏసీపీ పృథ్వీతేజ, సీఐ సతీష్‌కుమార్ ఈ వివరాలు వెల్లడించారు.

భర్తకు చాడీలు చెబుతోందంటూ కక్ష

తనపై భర్తకు చాడీలు చెబుతోందని అత్త కనకమహాలక్ష్మిపై కోడలు లలిత కక్ష పెంచుకుంది. ఆమెను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుంది. దీని కోసం యూట్యూబ్‌లో 'హౌ టు కిల్ ఓల్డ్ లేడీ' అనే వీడియోలను పలుమార్లు చూసింది. ఈ నెల 6న సాయంత్రం పెట్రోలు కొని తెచ్చి, ఇంట్లో దాచింది. 7వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో భర్త బయటకు వెళ్లారు. ఇంట్లో కుమారుడు, కుమార్తె, లలిత తల్లి ఉన్నారు. తల్లి స్నానం చేయడానికి బాత్‌రూంలోకి వెళ్లింది. ఆమె బయటకు వచ్చేలోపు అత్తను అంతమొందించాలని లలిత నిర్ణయించుకుంది.

✦ నానమ్మతో కాసేపు దాగుడుమూతలు ఆట ఆడాలని పిల్లలకు చెప్పింది. ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి కాళ్లు చేతులను కుర్చీకి కట్టేసింది. కళ్లకు, నోటికి గంతలు కట్టేసి మీరు దాక్కోండి అని పిల్లల్ని గదుల్లోకి పంపించింది. అనంతరం ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించింది. అత్త అరుపులు చుట్టుపక్కల వారికి వినిపించకుండా టీవీ సౌండ్ పెద్దగా పెట్టింది.

✦ మంటలకు కనకమహాలక్ష్మి కాళ్లు, చేతులకు కట్టిన కట్లు కాలిపోయి విడిపోయాయి. ఆమె పెద్దగా కేకలు వేసుకుంటూ దేవుడి గది వైపు పరుగులు తీసింది. అక్కడే ఉన్న మనవరాలికి మంటలు అంటుకుని కాళ్లు, చేతులు కాలిపోయాయి.

✦ టీవీ వైర్లు తగిలి, నానమ్మకు మంటలు అంటుకున్నాయని పిల్లలకు చెప్పి నమ్మించింది. కనకమహాలక్ష్మి కేకలు విన్న లలిత తల్లి బాత్‌రూంలో నుంచి బయటకు వచ్చి చూసేసరికే ఆమె విగతజీవిగా నేలపై పడి ఉంది.

పోలీసులకు ఇలా చిక్కింది..

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అత్త చనిపోయిందని స్థానికులకు, దేవుడి గదిలో దీపం ఒత్తి అంటుకుని కాలిపోయారని పోలీసులకు చెప్పడంతో అనుమానం రేకెత్తింది. కనకమహాలక్ష్మి కాలిపోతుండటాన్ని ఎదురింట్లో ఏసీ బిగిస్తున్న వ్యక్తి చూసి మంటలు ఆర్పేందుకు రాగా లలిత అతణ్ని అడ్డుకుంది. దీంతో పోలీసులకు అనుమానం మరింత బలపడింది. శుక్రవారం రాత్రి వరకు పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. ఆమె ఫోన్ తీసుకుని పరిశీలించగా యూట్యూబ్‌లో 'హౌ టు కిల్ ఓల్డ్ లేడీ' అని వెతికి, వీడియోలు చూసినట్లు గుర్తించారు. ఎట్టకేలకు రాత్రి 11.30 గంటలకు లలిత తాను చేసిన నేరాన్ని ఒప్పుకొంది. అత్త తనను సూటిపోటి మాటలతో వేధించడం, భర్తకు చాడీలు చెప్పడంతో జీర్ణించుకోలేక ఇలా చేశానని, క్షమించాలని ప్రాధేయపడింది. పోలీసులు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి లలితను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

121 మంది కూలీల ప్రాణాలు నిలిపారు

- 'ఈనాడు-డయల్ యువర్ ఎస్పీ'కి అన్నదాతల ఫోన్

ఈనాడు, ఒంగోలు: 'మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు వరదలో చిక్కుకున్న 121 మంది కూలీలను ఎంతో శ్రమించి ఒడ్డుకు చేర్చారు. సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాగా స్పదించారు' అంటూ ప్రకాశం జిల్లా కొండపి మండలం చోడవరం రైతులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు అభినందనలు తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వహించగా, చోడవరం నుంచి ఫోన్ చేసిన రైతులు నాడు వరదతో ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. కొండపి నియోజకవర్గంలో ముసి నదిని ఆనుకొని ఉన్న పొలాల్లో పొగాకు నారు పెంచేందుకు రాజమహేంద్రవరం నుంచి 121 మంది కూలీలను రప్పించారు. గత నెల 29న తుపానుతో కురిసిన వర్షాలకు భారీగా వరద చేరడంతో గుడారాల్లో ఉన్న కూలీలు ముంపునీటిలో చిక్కుకున్నారు. ఆందోళనకు గురైన రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. వారు స్పందించి ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించారు. చీకటిపడి ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితుల్లోనూ వారితో కలిసి పోలీసులు సురక్షితంగా కూలీలను ఒడ్డుకు చేర్చారు. ఆ సంఘటనను గుర్తుచేసుకుంటూ ఎస్పీకి ఫోన్ చేసిన రైతులు.. కూలీల ప్రాణాలు నిలిపిన పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



గత నెల 29న కూలీలను ఒడ్డుకు చేర్చుతున్న ఎస్డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది

గ్రహం అనుగ్రహం

9-11-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం

చవితి: ఉ. 9-54 తదుపరి పంచమి

ఆర్ద్ర: రా. 2-29 తదుపరి పునర్వసు

వర్జ్యం: ఉ. 11-45 నుంచి 1-16 వరకు

అమృత ఘడియలు: సా. 5-02 నుంచి 6-33 వరకు

దుర్ముహూర్తం: సా. 3-52 నుంచి 4-37 వరకు

రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ.6.05; సూర్యాస్తమయం: సా.5.23

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	36.0	23.5
అనంతపురం	34.1	20.0
నెల్లూరు	33.2	25.5
కర్నూలు	33.2	21.1
కడప	33.0	23.0
ఒంగోలు	32.5	24.9
విజయవాడ	32.4	24.0
విశాఖపట్నం	32.4	23.6
తిరుపతి	32.4	22.6
గుంటూరు	32.0	25.0
విజయనగరం	32.0	20.0
తాడేపల్లిగూడెం	31.0	28.0

పోలవరం ప్రాజెక్టులో ప్రణాళిక ప్రకారం పనులు

సంతృప్తి వ్యక్తం చేసిన పీపీఏ సీఈవో అతుల్ జైన్

పోలవరం, న్యూస్‌టుడే: ప్రాజెక్టులో పనులు ప్రణాళిక ప్రకారం జరగడంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవో అతుల్ జైన్ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాప్-1లో జరుగుతున్న ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు, గ్యాప్-2లో జరుగుతున్న డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు, డీ వాల్ తొలగింపు పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల పురోభివృద్ధి గురించి ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి వివరించారు. అనంతరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో అతుల్ జైన్ సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఏడో మైలు వద్ద 15 అడుగుల కొండచిలువను పట్టుకున్న భాస్కర్‌నాయుడు

తిరుమలలో కొండచిలువల కలకలం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో కొండ చిలువలు కలకలం సృష్టించాయి. బాలాత్రిపుర సుందరి ఆలయం వద్దకు శనివారం ఓ కొండచిలువ వచ్చినట్లు స్థానికులు తితిదే అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారం తెలిపారు. అక్కడికి చేరుకున్న ఆయన పది అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. తరువాత మొదటి ఘాట్‌రోడ్డులో 15 అడుగుల పొడవున్న కొండచిలువ రోడ్డుపైకి రావడంతో దాన్నీ బంధించారు. వాటిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

చిట్టిలు ఎన్నొచ్చినా... పట్టు మనదే!

(మొదటి పేజీ తరువాయి)



నడిమింటి మృత్యుంజయ శాస్త్రి

ఈ రంగంలో విప్లవాత్మక మార్పులకు దోహదపడుతున్న పరిజ్ఞానాలేంటి?

తార్కికత, సందర్భోచితంగా స్పందించడం, ఆలోచించడం వంటి అంశాల్లో ఏఐ మంచి పురోగతిని సాధిస్తోంది. అయితే అదంతా డిజిటల్ రంగానికే పరిమితమవుతోంది. భౌతిక ప్రపంచంలో సాఫీగా పనిచేయగలిగేంత స్థాయి ఉన్న ఏఐ రోబోలకు అవసరం. దానికోసం కూడా కృషి జరుగుతోంది. సరసమైన ధరల్లో శక్తిమంతమైన కంప్యూటింగ్ శక్తి అందుబాటులోకి రావడం, సెమీ కండక్టర్ చిప్‌లు, పరీక్ష సాధనాల లభ్యత పెరగడం, హార్డ్‌వేర్ ఇంజినీర్లు... ఇవన్నీ సానుకూలాంశాలే.

ఇవి ఎక్కువగా ఉపయోగపడే రంగాలేంటి? ఇంట్లో మనిషిలా ఈ రోబో మారుతుందా?

అనిశ్చితి తక్కువగా, నియంత్రణ ఎక్కువగా ఉన్న రంగాలకు ప్రస్తుతం ఉన్న రోబోలతో ప్రయోజనం కలుగుతుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆటోమోటివ్ అసెంబ్లీ, పారిశ్రామిక వంటగదులు, వేర్‌హౌస్‌లు వంటివి ఇందులో ఉన్నాయి. మన ఇళ్లు చాలా వరకూ రకరకాల గదులతో అన్‌స్ట్రక్చర్డ్‌గా ఉంటాయి. కాబట్టి ఇళ్లలో వినియోగించడానికి అవసరమైన భౌతిక ఏఐ రూపుదిద్దుకోవడానికి ఇంకా సమయం పడుతుంది. అయితే ఈ దిశగా కొన్ని సానుకూల సంకేతాలు ఉన్నాయి. ప్రస్తుతమున్న భౌతిక ఏఐ, మానవులు టెలి ఆపరేషన్ ద్వారా ఇంటి అవసరాలకు ఈ రోబోలను వినియోగించొచ్చు.

ఉద్యోగాలపై హ్యూమనాయిడ్ రోబోల ప్రభావం ఎలా ఉండబోతోంది?


ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతోంది. కొన్ని పనులు చేయడానికి మానవ వనరులే లేని పరిస్థితి ఏర్పడబోతోంది. ఈ నేపథ్యంలో అంతగా ప్రాధాన్యం లేని పనులను ఆటోమేట్ చేయాలని చాలా కంపెనీలు భావిస్తున్నాయి. అయితే సృజన, పరిశీలన, సహానుభూతులతో కూడిన పనుల్లో మనుషుల అవసరం తప్పదు. దీర్ఘకాలంలో ఆటోమేషన్ అనివార్యమైనప్పుడు కొన్ని రకాల నైపుణ్యాలున్నవారు ఉద్యోగ మార్కెట్‌లో నిరర్థకమవుతారు. వారు ఉపాధి పొందడానికి ఇతర నైపుణ్యాలను సమకూర్చుకోవాల్సిందే.

ఈ రోబోలను వృద్ధుల సంరక్షణ, నర్సింగ్ వంటి అవసరాలకు విస్తృతంగా వినియోగించే అవకాశమున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనివల్ల నైతిక, భావోద్వేగపరంగా సమస్యలు ఎదురవుతాయా?

ఈ రంగాల్లో హ్యూమనాయిడ్లు ఇంకా వినియోగానికి రాలేదు. ఒకవేళ వచ్చినా మానవ ప్రమేయం కొనసాగాల్సిందే. టెలీ ఆపరేటింగ్ పద్ధతిలో ఏఐ ద్వారా అందించే రోబోటిక్ సేవల్లో మనుషుల పాత్ర తప్పనిసరి.

హ్యూమనాయిడ్ రోబోల ఖరీదు ఎంత ఉండొచ్చు?

ఈ ఏడాది చివరినాటికి హ్యూమనాయిడ్ రోబో హార్డ్‌వేర్ ఖరీదు 35వేల డాలర్లుగా ఉండొచ్చు. 2030-2035 నాటికి అది 13వేల నుంచి 17వేల డాలర్లకు దిగిరావొచ్చు. దీనికి అవసరమైన విడిభాగాల ఉత్పత్తి పెరగడం, వాటి నాణ్యత కూడా పెరగడం వంటివి ఇందుకు కారణాలు. ఒకేసారి పెద్దమొత్తంలో ఖర్చును భరించలేని చిన్నపాటి సంస్థలకు రోబోస్ యాజ్ ఎ సర్వీస్ (రాస్) నమూనా వల్ల క్లౌడ్ ఆధారిత సబ్‌స్క్రిప్షన్లు వరమవుతున్నాయి. ఈ పద్ధతిలో సులువుగా రోబోల సేవలను పొందగలుగుతున్నాయి. ఈ విధానంలో భారీగా సొమ్మును వెచ్చించి మరమనిషిని కొనుగోలు చేయాల్సిన అవసరంలేదు. కంపెనీలు.. సబ్‌స్క్రిప్షన్లు లేదా అద్దెకు ఈ యంత్రాలను సరఫరా చేస్తాయి.



ఇతర రకాల రోబోలతో పోలిస్తే హ్యూమనాయిడ్ రోబోతో ప్రయోజనాలేంటి?

మానవులు తమ కోసం తీర్చిదిద్దుకున్న ప్రపంచంలో హ్యూమనాయిడ్ రోబోలు చక్కగా ఇమిడిపోతాయి. ఉదాహరణకు.. ప్రస్తుతం వంట కోసం ఓ రోబోను తయారు చేస్తే దానికి అనుగుణంగా వస్తువులను, వంటపాత్రలను కూడా డిజైన్ చేయాల్సి ఉంటుంది. హ్యూమనాయిడ్ రోబో అయితే అచ్చం మన తరహాలోనే స్పందిస్తుంది కాబట్టి పరిసరాలను మార్చాల్సిన అవసరం లేదు. పూర్తిస్థాయి ఆటోమేటిక్ రోటీ తయారీ యంత్రం.. నాణ్యమైన రోటీలను చేయగలదు... కానీ అన్నం వండలేదు. పనీర్ కర్రీ సిద్ధం చేయలేదు. వంట తర్వాత పాత్రలను శుభ్రం చేయలేదు. హ్యూమనాయిడ్ రోబో అవన్నీ చేసేస్తుంది. ఇల్లు ఊడ్చే రోబో నేలపై దూళిని మాత్రమే తొలగిస్తుంది. మరో గదిలో ఉన్న డెటాల్ బాటిల్ తెచ్చి నేలను తుడవలేదు. మంచంపై దుప్పట్లను సర్దలేదు. కానీ హ్యూమనాయిడ్ రోబోతో అవన్నీ సాధ్యమే.

ఏది బలం?

హ్యూమనాయిడ్ రోబో బలాలు:

- నాణ్యత, నిలకడ విషయంలో ఎలాంటి తేడా లేకుండా ఏడాది పొడవునా ఒకే పనిని చేయగలదు.
- బోర్ అనేది ఉండదు. విశ్రాంతి, అనారోగ్యం, నిద్రకు తావులేదు.
- మురికి ఎక్కువగా అంటుకునే, ప్రమాదకరమైన వాతావరణాల్లోనూ పనిచేయగలదు.

మానవ వనరు బలాలు

- **నమ్మకం, ఇంగిత జ్ఞానం:** ఒక ఆమ్లెట్ తయారు చేయాలనుకున్నప్పుడు మనం ప్రతి దశలోనూ ఇంగిత జ్ఞానాన్ని ఉపయోగిస్తాం. గుడ్లు ఎక్కడున్నాయో పరిశీలించడం.. అవి లేకుంటే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయడం వంటివి.. ఒకవేళ అవి అందుబాటులో ఉన్నా.. పాడైపోయాయనుకోండి.. అప్పుడు వాటిని పారేసి, కొత్తవి తెప్పించుకోవడం వంటి పనులను మనం చేస్తాం. ప్రతి అంచెలోనూ ఇంగిత జ్ఞానాన్ని వాడతాం. నిర్ణయాధికారాన్ని ఉపయోగిస్తాం. ఇప్పుడున్న రోబోల్లో ఈ సామర్థ్యం లేదు.
- **సృజన, సహానుభూతి:** తాను ఒక పనిని ఎందుకు చేస్తున్నానన్న దానిపై మనిషికి పూర్తి అవగాహన ఉంటుంది. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఒక రెస్టారెంటు నడుపుతున్నాడనుకుందాం. రుచికరమైన ఆహారాన్ని అందించి, మంచి పేరు పొందాలన్న ఉద్దేశం అతడికి ఉంటుంది. రోబోలకు ఆలోచన ఉండదు.

హ్యూమనాయిడ్ రోబోలు మానవ మేధస్సును మించిపోయి, ప్రపంచం మొత్తాన్నీ తమ చేతుల్లోకి తీసుకోగలవా?

ఏ సాంకేతిక పరిజ్ఞాన ఆవిర్భావం, వినియోగమైనా అంచెలంచెలుగా సాగుతుంది. వాటిపై అనేక నియంత్రణలు ఉంటాయి. అందువల్ల సైన్స్ కాల్పనిక కథల్లో వర్ణించినట్లు ఈ రోబోలతో ప్రపంచానికి కీడు ముంచుకొచ్చే పరిస్థితి ఉండదు. అయితే ఏఐ శక్తి, ప్రస్తుత అనుసంధానిత, ప్రపంచీకృత ప్రపంచంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న తీరును బట్టి ఈ పరిజ్ఞానాలను వినియోగంలోకి తెచ్చేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి అంశాల నేపథ్యంలోనే ఈ తరహా సాంకేతికతల రంగంలో మన దేశం స్వయంసమృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. మనకు స్నేహపూర్వకం కాని దేశాలపై ఆధారపడాల్సిన అగత్యాన్ని తగ్గించుకోవాలి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఖరగ్‌పుర్-చెన్నై సరకు రవాణా కారిడార్‌కు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం హావ్‌డా-చెన్నై లైన్‌లో పెద్దఎత్తున ప్రయాణికుల రైళ్లు నడుస్తున్నాయి. వీటివల్ల గూడ్స్ రైళ్లు అనేక చోట్ల ఆపుతుండటంతో.. అవి ఆలస్యంగా వెళ్తున్నాయి. వాస్తవంగా సరకు రవాణా వల్లే రైల్వేకు ఎక్కువ ఆదాయం వస్తోంది. దీంతో పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పుర్ నుంచి ఒడిశా, ఏపీ మీదుగా చెన్నై వరకు సరకు రవాణాకు ప్రత్యేకంగా కారిడార్ నిర్మించాలనుకున్నారు. డీపీఆర్ కూడా తయారు చేశారు. నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుందని తేలడంతో రైల్వేశాఖ దీన్ని ప్రస్తుతానికి పక్కనపెట్టింది.

ప్రత్యామ్నాయంగా...

- సరకు రవాణా కారిడార్‌కు ప్రత్యామ్నాయంగా హావ్‌డా-చెన్నై లైన్‌లో ఏపీలో 3, 4 లైన్ల పనుల్లో వేగం పెంచాలనుకుంటోంది.
- ఇప్పటికే విజయవాడ నుంచి గూడూరు వరకు 288 కి.మీ. మేర రూ.6,238 కోట్లతో మూడో లైన్ నిర్మిస్తున్నారు. ఇందులో 260 కి.మీ. పూర్తయింది.
- విజయవాడ-గూడూరు వరకు(293కి.మీ.) 4వ లైన్ కోసం సర్వేచేస్తున్నారు.
- 3, 4 లైన్ల నిర్మాణానికి గూడూరు-సూళ్లూరుపేట (55 కి.మీ.)కు రూ.1,248 కోట్లు, సూళ్లూరుపేట-తమిళనాడులోని గుమ్మిడిపూండి(18 కి.మీ.)కి రూ.475 కోట్లతో డీపీఆర్ రూపొందించారు.

విజయవాడ-విశాఖపట్నం లైన్‌లో..

- ప్రస్తుతం విజయవాడ నుంచి ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా నిడదవోలు వరకు రెండు లైన్లు, విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం, నరసాపురం మీదుగా నిడదవోలు వరకు మరో 2 లైన్లు కలిపి 4 లైన్లుగా రైల్వేశాఖ పరిగణిస్తోంది.
- ఈ మార్గంలోని విజయవాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్లలో రోజుకు 30 వరకు గుడివాడ, భీమవరం మీదుగా మళ్లిస్తోంది.
- నిడదవోలు-విశాఖ సమీపంలోని దువ్వాడ వరకు 2 లైన్లే ఉండటంతో ప్రయాణికుల రైళ్లు, గూడ్స్ రైళ్లకు ఇవి సరిపోవడంలేదు.
- నిడదవోలు-దువ్వాడ వరకు (205 కి.మీ.) 3, నాలుగో లైన్ల నిర్మాణానికి రూ.8,790 కోట్లతో డీపీఆర్ సిద్ధంచేసి అధికారులు రైల్వే బోర్డుకు పంపారు.

కొత్త లైన్లతో ప్రయోజనాలు ఇవి..: మూడు, నాలుగో లైన్లు అందుబాటులోకి వస్తే ప్రయాణికుల రైళ్లు, గూడ్స్ రైళ్లు వేగంగా వెళ్లే వీలుంది. ఒకటి, రెండు లైన్లలో ప్రయాణికుల రైళ్లను మాత్రమే నడపొచ్చు. కొత్తగా నిర్మించే లైన్లు సాధారణంగా 30-40 కి.మీ. వరకు చిన్న స్టేషన్లలోని లైన్లకు అనుసంధానం లేకుండా ఉంటాయి. దీనివల్ల గూడ్స్ రైళ్లూ వేగంగా వెళ్లొచ్చు.

'కల్తీ నెయ్యి'లో వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదం

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టులో వ్యాజ్యం వేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు సిట్ ఐఓ ఇటీవల ఈ కౌంటర్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై 14న విచారణ జరగనుంది.

కల్తీ జరిగినట్లు తేలినా..: 'వైవీ సుబ్బారెడ్డి 2019-23 మధ్య తితిదే ఛైర్మన్‌గా పనిచేశారు. ఛైర్మన్ హోదాలో సుబ్బారెడ్డి.. ఓ అనామక ఫిర్యాదును 2022 మే 16న తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యానికి అప్పగించి, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్‌పై విచారణ జరిపించాలని సూచించారు. మే 20న క్యాంప్ కార్యాలయంలో సుబ్రహ్మణ్యం తనను కలిసినప్పుడు నెయ్యి నమూనాలను పరీక్ష నిమిత్తం మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌కు పంపించాలని పురమాయించారు. దీంతో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవీ డెయిరీ స్పెషాల్టీస్ లిమిటెడ్, భోలేబాబా డెయిరీలు సరఫరా చేసిన నెయ్యి నుంచి నమూనాలను 2022 జూన్‌లో సీఎఫ్‌టీఆర్ఐకు పంపించారు. ఆగస్టులో ఫలితాలొచ్చాయి. అన్ని నెయ్యి నమూనాల్లో వెజిటబుల్ ఆయిల్ కల్తీ జరిగినట్లు తేలిందని సుబ్బారెడ్డి దృష్టికి సుబ్రహ్మణ్యం తీసుకెళ్లారు. అయినా ఆ నెయ్యి సరఫరా చేసినవారిపై సుబ్బారెడ్డి ఎలాంటి చర్యలకూ సిఫార్సు చేయలేదు. పైగా 2024 వరకు ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవీ డెయిరీ స్పెషాల్టీస్ లిమిటెడ్ సంస్థలకు, 2022 అక్టోబరు వరకు భోలేబాబా డెయిరీకి నెయ్యి సరఫరాకు అనుమతిచ్చారు.

- భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్ (ఏ3), కైలాష్‌చంద్ మంగళ, శ్రీనివాసన్ 2022 మే 25న హైదరాబాద్‌లో సుబ్బారెడ్డిని కలిశారు. మీ పీఏ చిన్నఅప్పన్న కేజీ నెయ్యి సరఫరాకు కిలోకు రూ.25 డిమాండ్ చేస్తున్నారని పొమిల్ జైన్ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. తన ప్లాంట్‌లో ఏడాదిపాటు తనిఖీలు చేయకుండా ఉండాలని ఆయన్ను కోరారు.
- సుబ్బారెడ్డి పీఏ చిన్నఅప్పన్న తితిదేకి నెయ్యి సరఫరా చేసిన ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫు హవాలా ఏజెంట్ అమన్ గుప్త నుంచి దిల్లీలో పలుచోట్ల వివిధ సందర్భాల్లో రూ.20 లక్షలు, ఆ సంస్థ మేనేజరు విజయ్ గుప్త నుంచి రూ.30 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది.
- ఈ నేపథ్యంలో కల్తీ నెయ్యి వ్యవహారంలో వైవీ సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తోంది. దర్యాప్తులో అన్ని విషయాలను పరిశీలించాల్సి ఉంది. సంబంధిత వ్యక్తులు/ సంస్థల నుంచి సిట్ సమాచారాన్ని సేకరిస్తోంది' అని సిట్ ఐఓ కౌంటర్‌లో పేర్కొన్నారు.

రోజంతా వినతుల స్వీకరణ

తెదేపా కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి శనివారం వచ్చిన సీఎం చంద్రబాబు ప్రజలు, కార్యకర్తల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వస్తారనే సమాచారంతో పెద్దసంఖ్యలో ప్రజలు పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఉదయం 11:30 నుంచి సాయంత్రం 6 వరకూ చంద్రబాబు అక్కడే ఉన్నారు. అమరావతిలో ఎసైన్డ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు. భూములిచ్చిన వారికి కేటాయించిన ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించాలని మరికొందరు వినతి పత్రం అందజేశారు. 2014-19 మధ్య జక్కంపూడిలోని టిడ్కో సముదాయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో తెదేపా ప్రభుత్వం ఫ్లాట్ కేటాయించగా, తర్వాత వచ్చిన వైకాపా సర్కారు దాన్ని రద్దుచేసి మూడో అంతస్తులో ఇచ్చిందని విజయవాడకు చెందిన మహిళ ఇందిర వాపోయారు. షుగర్ కారణంగా 30 ఏళ్ల తన కుమారుడి కాలు తొలగించారని, పాత ఫ్లాట్‌నే తిరిగి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన వృద్ధుడు వినతిపత్రం అందజేశారు. చింతలపూడి ప్రాజెక్టు రెండో దశ పనులు తిరిగి ప్రారంభించాలని, భూములు కోల్పోయిన తమకు పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోటపాడు, చీపురుగూడెం, పోతసపల్లి గ్రామ రైతులు కోరారు. సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం అందించాలని పలువురు బాధితులు వినతిపత్రాలు అందజేశారు.

'కుప్పం'లో ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

ఈ 7 పరిశ్రమలకు 241 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు ఆన్‌లైన్‌లో మాట్లాడారు.. "రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు కుప్పం నియోజకవర్గానికి రాబోతున్నాయి. వీటి రాకతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 43వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని సూచించారు.



కుప్పంలోని ఏడు పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి



సంస్థల ప్రతినిధులు, స్థానికులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

22వేల మందికి ఉపాధి..

- ఏడు పరిశ్రమలతో 2,203 కోట్ల పెట్టుబడితో కుప్పంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా 22,330 మందికి ఉపాధి లభిస్తుంది.
- హిండాల్కో రూ.586కోట్లతో అల్యూమినియం ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్ ఏర్పాటుచేయనుంది. ఐఫోన్ ఛాసిస్ కోసం హైగ్రేడ్ అల్యూమినియం ఉత్పత్తి చేస్తుంది. 613మందికి ప్రత్యక్షంగా, 307మందికి పరోక్షంగా ఉపాధి కల్పించనుంది.
- రూ.290 కోట్లతో సమీకృత డెయిరీ, పశుమేత ప్లాంట్‌ను శ్రీజా డెయిరీ సంస్థ ఏర్పాటు చేయనుంది. ప్రత్యక్షంగా 850 మందికి, పరోక్షంగా 3,150 మందికి ఉపాధి దొరుకుతుంది.
- డెయిరీ ప్రోటీన్ తయారీ కోసం ఏసీఈ ఇంటర్నేషనల్ రూ.525 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 2వేల మందికి ప్రత్యక్షంగా, మరో 5వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.
- 2లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించేలా ఎస్వీఎఫ్ సోయా సంస్థ రూ.373 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటుచేయనుంది. ప్రత్యక్షంగా 1500 మంది, పరోక్షంగా వెయ్యిమందికి ఉపాధి కల్పిస్తుంది.
- పండ్లతోటల రైతులకు ప్రయోజనం కల్పించేందుకు మదర్ డెయిరీ రూ.260కోట్లతో జ్యూస్, జామ్, పల్ప్ యూనిట్‌ను ఏర్పాటుచేస్తుంది. ప్రత్యక్షంగా 850 మందికి, పరోక్షంగా 3,150 మందికి ఉపాధి లభిస్తుంది.
- ఎలక్ట్రిక్ ఆటోలు, ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఈ-రాయిస్ ఈవీ రూ.200కోట్లతో అడ్వాన్స్ ఎలక్ట్రిక్ వెహికిల్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తోంది. 280మందికి ప్రత్యక్షంగా, మరో 130మందికి పరోక్షంగా ఉపాధి కల్పించనుంది.
- స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలకు ఉపకరించేలా రూ.27కోట్లతో పారిశ్రామిక పార్కును ఎలీప్ సంస్థ ఏర్పాటుచేయనుంది. ఈ మహిళా శక్తి భవన్‌లో 4వేలమంది మహిళలకు ఉపాధి, శిక్షణ నిర్వహించే అవకాశం ఉంటుంది.

లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

"గ్రీన్ మొబిలిటీకి కేంద్రంగా కుప్పం మారుతుంది. పారిశ్రామికవేత్తలు లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు పూర్తిచేయాలి. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి పరిశ్రమ సౌర విద్యుత్తు రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకోవాలి. వందశాతం సౌర విద్యుత్తు వినియోగించుకునే నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తున్నాం. స్థానిక ఉత్పత్తులు, వనరులను వినియోగించుకునే అవకాశాలను పారిశ్రామికవేత్తలు పూర్తిస్థాయిలో పరిశీలించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి..

"కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను అమలు చేశాం. ప్రజల జీవన ప్రమాణాలను పెంచాం. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టిసారించాలి. కుప్పం పరిధిలో 400 ఈ-సైకిళ్లను స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇచ్చాం. స్వర్ణ కుప్పం సాధనలో భాగంగా చెత్త సేకరణకు 130కిపైగా ఎలక్ట్రిక్- సీఎన్జీ ఆటోలు వినియోగంలోకి తెచ్చాం. కుప్పం సెంట్రల్ పార్కు వచ్చే ఏడాదిలో డీకే పల్లి పార్కు, మోడల్ బస్ స్టేషన్, ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సిద్ధమవుతాయి. వచ్చే ఏడాది మార్చికల్లా రాష్ట్రంలోనే తొలి జీరో ల్యాండ్‌ఫిల్ నియోజకవర్గంగా కుప్పం నిలుస్తుంది" అని తెలిపారు.

న్యాయ పరిభాషను సరళీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్ని వర్గాలనూ కలుపుకొని పోవడానికి, సాధికారికత సాధించడానికి సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతోందని, దాని సాయంతో న్యాయం అందజేతకు ఈ-కోర్టుల ప్రాజెక్టు అద్భుతమైన ఉదాహరణ అని మోదీ పేర్కొన్నారు.

న్యాయం పొందడం అందరి హక్కు: సీజేఐ

సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ- న్యాయం ఏ కొందరికో పరిమితమయ్యే ప్రత్యేక గౌరవం కాదని, ఇది ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు. న్యాయం ప్రసరించే వెలుగులు చివరి వ్యక్తి వరకూ చేరేలా చూడటం న్యాయవాదులు, న్యాయమూర్తుల ధర్మమని చెప్పారు. కార్యక్రమానికి ప్రధాని హాజరు కావడం శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల సమష్టి బాధ్యతను సూచిస్తోందని అన్నారు. సంక్లిష్టమైన వ్యాజ్యాలను ఎంత అవలీలగా పరిష్కరించారన్న దానిపై న్యాయవ్యవస్థ సామర్థ్యం ఆధారపడదని, ప్రజల జీవితాలపై ప్రభావం చూపడమే సామర్థ్యానికి గీటురాయి అని.. కాబోయే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. ఉచిత న్యాయసేవ అందించాలని నిర్దేశించడం ద్వారా మన రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టిని చాటారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ అన్నారు. ప్రభుత్వం చేయాల్సిన పనిగా కాకుండా పౌరుని పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతగా న్యాయం అందజేతను భావించాలని చెప్పారు.



రేపటిలో ఆనందాన్ని వెతుక్కోవద్దు

చాలా మంది ఉదయం ఆఫీసుకు వెళ్లినప్పటి నుంచి సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఎదురుచూస్తుంటారు. వారాంతపు వినోదాల కోసం ఎదురుచూస్తూ వారమంతా గడుపుతుంటారు. కొత్త ఏడాదిలో అయినా తమ జీవితం మారుతుందేమో అని ఈ ఏడాదంతా కలలు కంటూ కాలం వెళ్లదీస్తుంటారు. ఇలా అందమైన రేపటి కోసం ఎదురుచూస్తూ ప్రస్తుత క్షణాలను ఆస్వాదించడం మర్చిపోకండి.

– లెవిస్ హోవెస్, రచయిత

మొదట్లోనే కంట్రోల్ చేయకపోతే కష్టం..

ఆ ఇద్దర్నీ పిలిచి మాట్లాడతా..!

- ఎమ్మెల్యే కొలికపూడి, ఎంపీ కేశినేని చిన్నిల మధ్య విభేదాలపై సీఎం వ్యాఖ్యలు
- చంద్రబాబుకు నివేదిక అందజేసిన క్రమశిక్షణ కమిటీ

ఈనాడు, అమరావతి: పార్టీ గీత దాటి పరస్పర ఆరోపణలతో రచ్చకెక్కిన ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)లను పిలిచి మాట్లాడతానని, ఇలాంటివి మొదట్లోనే కంట్రోల్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఏ స్థాయి నాయకులైనా పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. క్రమశిక్షణరాహిత్యాన్ని ఉపేక్షిస్తే... మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఇలాంటి సమస్యలు తలెత్తే అవకాశముందని ఆయన తెలిపారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడిల మధ్య వివాదంపై తెదేపా క్రమశిక్షణ కమిటీ శనివారం ముఖ్యమంత్రికి నివేదిక అందజేసింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబుతో క్రమశిక్షణ కమిటీ సభ్యులు వర్ల రామయ్య, కొనకళ్ల నారాయణ, పంచుమర్తి అనురాధ, పార్టీ జోనల్ ఇన్‌ఛార్జి మంతెన సత్యనారాయణరాజు భేటీ అయ్యారు. ఇటీవల ఎంపీ, ఎమ్మెల్యేలను పార్టీ కార్యాలయానికి పిలిచి వివరణ తీసుకున్న కమిటీ ఆ వివరాలతో పాటు, తమ దృష్టికి వచ్చిన అంశాల్ని, తిరువూరు నియోజకవర్గ పార్టీ నాయకులు, కేడర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నివేదికలో పొందుపరిచింది. ఎంపీపై ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యే పెట్టిన పోస్టులు, దానిపై ఎంపీ స్పందన, అనంతరం ఎమ్మెల్యే ఒక మీడియా ఛానల్‌తో మాట్లాడుతూ చేసిన ఆరోపణల వీడియోలను పెన్‌డ్రైవ్‌లో అందజేసింది. ఆ విషయాలు తన దృష్టిలోనూ ఉన్నాయని, నివేదిక పరిశీలించాక, ఆ ఇద్దర్నీ పిలిచి మాట్లాడతానని చంద్రబాబు చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

హైదరాబాద్, న్యూస్‌టుడే: మహిళలు స్వశక్తితో ఎదిగి అన్ని రంగాల్లో ధైర్యంగా ముందడుగు వేయాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన 'స్త్రీ శక్తి హస్తకళ స్టోర్'ను శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుప్పం ప్రాంతానికి చెందిన మహిళలు ఎన్టీఆర్ ట్రస్ట్ చేయూతతో సిల్క్ థ్రెడ్ బ్యాంగిల్స్, జూట్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ పొందారు. వారు తయారుచేసిన వస్తువులను ఈ స్టోర్ ద్వారా కొనుగోలుదారులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ..ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.

ముగ్గురి ప్రాణాలు తీసిన నిద్రమత్తు

- అదుపుతప్పి పలువురిపైకి దూసుకెళ్లిన కారు
- కాకినాడ జిల్లాలో ఘటన

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం, గండేపల్లి- న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలో ఓ కారు బీభత్సం సృష్టించింది. వాహనం నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులో రెప్పవాల్చడంతో రోడ్డు పక్కనున్నవారిపైకి దూసుకుపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన తెదేపా నాయకుడు వేములకొండ జోగారావు కుమారుడి వివాహం శుక్రవారం రాత్రి విశాఖపట్నంలో జరిగింది. అక్కడి నుంచి శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆయనే కారు నడుపుకొంటూ వస్తున్నారు. కిర్లంపూడి మండలం సోమవరం చేరుకోగానే జోగారావుకు నిద్రమత్తు రావడంతో కారు అదుపు తప్పింది. అదే వేగంతో హైవే పక్కన తొట్టి రిక్షాను తోసుకెళుతున్న ఇద్దరిని, ఓ బైకర్‌ను, బొప్పాయి అమ్ముతున్న మరో వ్యక్తితో పాటు బస్‌షెల్టర్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థినులను ఢీకొట్టింది. అనంతరం మూడు పల్టీలు కొట్టి నిలిచిపోయింది. ప్రమాదంలో మోర్త ఆనందరావు (70), మోర్త కొండయ్య (30), ఏలేశ్వరం వాసి కాకాడ రాజు(61) మృతిచెందారు. తీవ్రగాయాలపాలైన మరో వ్యక్తిని, జగ్గంపేట మండలం ఇర్రిపాకకు చెందిన విద్యార్థినులను కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో కారులో ఉన్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. కిర్లంపూడి ఇన్‌ఛార్జి ఎస్సై టి.రఘునాథరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, మాజీ మంత్రి తోట నరసింహం ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.



క్షతగాత్రుణ్ని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

ఆ 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నాయకుడు ప్రత్యేకంగా సమయం కేటాయించాలి. ఇకపై ప్రతి ప్రజాప్రతినిధి వారంలో ఒక రోజు కచ్చితంగా ప్రజావేదిక నిర్వహించి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించాలి. వాటి పరిష్కారాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. ఇన్‌ఛార్జి మంత్రులు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు వచ్చిన అర్జీల వివరాలు తెప్పించుకుని, వేగంగా పరిష్కారమయ్యేలా చూడాలి. పార్టీ నేతలు జవాబుదారీతనంతో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం రెట్టింపవుతుంది" అని చెప్పారు.

వారికి ప్రాధాన్యత సరికాదు

"తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న సీనియర్లను, పార్టీ శ్రేణుల్ని కొందరు ఎమ్మెల్యేలు పక్కనపెట్టి వైకాపా నుంచి కొత్తగా వచ్చినవారికి ప్రాధాన్యం ఇస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. అది సరికాదు. ఎవరేం చేస్తున్నారన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి తెప్పించుకుంటున్నా. ఎమ్మెల్యేలకు నచ్చినవారినే కాకుండా, పార్టీలోని సీనియర్లనూ కలుపుకొని వెళ్లాలి. రోజూ కార్యాచరణ, వారానికోసారి విశ్లేషణ, నెలకోసారి సమీక్షతో, ప్రజల అభిప్రాయాన్ని బట్టి నిర్ణయాలు తీసుకుంటున్నా. ప్రతి ఒక్కరి పనితీరుపై సమాచారం నా దగ్గర ఉంది" అని చంద్రబాబు తెలిపారు.

వైకాపా తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి

"వైకాపా నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ వాస్తవాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పీపీపీ విధానంలో వైద్యకళాశాలల నిర్మాణం వల్ల పేదలకు మెరుగైన వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య అందుతాయి. మెడికల్ కాలేజీలను శరవేగంగా పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. అసత్య ప్రచారాలతో అడ్డుకునేందుకు వైకాపా నేతలు కుట్రలు చేస్తున్నారు. మొంథా తుపాను సమయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు, ప్రజలకు అండగా నిలిస్తే, వైకాపా అధ్యక్షుడు జగన్ విషం చిమ్ముతున్నారు" అని సీఎం మండిపడ్డారు.

పార్టీ శ్రేణుల్ని చైతన్యం చేయాలి

"క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై నాయకులు దృష్టి సారించాలి. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ శ్రేణుల్ని చైతన్యం చేయాలి. కూటమి నాయకులతో సమన్వయం, పార్టీలో క్రమశిక్షణ, సేవాదృక్పథంతో వ్యవహరించడం ద్వారా ప్రజల్లో పార్టీపై నమ్మకాన్ని మరింత బలపరచాలి. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలి. ట్రస్ట్‌బోర్డు కమిటీలనూ కూడా వెంటనే పూర్తి చేయాలి"అని చంద్రబాబు ఆదేశించారు.

ఈనాడు

జననీ జన్మభూమిశ్చ...

వ్యక్తిత్వం అంటే మనిషి అలవాట్ల కూడిక. జీవితం అంటే అనుబంధాల మాలిక. మొదటిది పాశ్చాత్యుల నిర్వచనం, రెండోది పెద్దల హితవచనం. అనుబంధాలే లేకపోతే బతుకే అర్థం లేదు. అర్ధరాత్రి ఆకలేసి అమ్మ పాలిండ్లను తడిమే పసివాడు చెబుతాడు- అనుబంధంలోని తీయదనం. అమ్మ దేహాన్ని రైలుపట్టాల మీద నాణెంలా నలగ్గొట్టి పువ్వులా బయటపడ్డ నలుసు తగుదునమ్మా.. అని కెవ్వుమంటుంటే నవ్వే అమ్మ మోహంలోని అలసట చెబుతుంది- అనుబంధంలోని కమ్మదనం. పంట కళ్లాల్లోని పసిడి ధాన్యపురాశులను కళ్లారా చూస్తూ కన్నీరు ఒత్తుకుంటున్న రైతన్నను చూస్తే తెలుస్తుంది అనుబంధానికి అర్థం. ఎర్రతంగేడు(గుల్మొహర్) చెట్టుకింద రోజుల తరబడి గడిపిన రజనీష్ యోగి ఆశ్రమానికి దూరమయ్యాక- ఆ చెట్టు వసివాడిపోయిందట. విషయం తెలిసిన రజనీష్ తిరిగొచ్చి ఆర్ద్రతతో దాన్ని హత్తుకున్నారు. 'ఆ చెట్టు నా చేతుల్లోనే తుది నిట్టూర్పు విడిచింది' అని రాశారాయన. 'ప్రజాపతిని ఒంటరితనం ఆవరించింది' అంది ఓ సందర్భంలో బృహదారణ్యకం. ప్రజాపతి అంటే సృష్టిలోని సమస్త జీవరాశుల సమష్టి చైతన్యం. అనుబంధాలకు దూరమైనప్పుడు బెంగపడుతుంది.

'లంక నగరం మీదుగా వీచి, సీతను తాకి, నా దగ్గరికి రా' అని వాయుదేవుణ్ని శాసించాడు రాముడు. వేంగీ క్షేత్రాన వీచే గాలి స్పర్శలోని పురాతన లక్షణాన్ని గుర్తించి ముచ్చటపోయారు- తన ఆంధ్ర ప్రశస్తి కావ్యంలో విశ్వనాథ. సీత సనాతన ప్రణయ పరిమళం రాముడికి, ధరిత్రి పురాతన కళా సుగంధం కవిసమ్రాట్టుకు అనుభవం కనుకనే అవి మనుషుల మధ్యనే కాదు, మనసంటూ ఉంటే- పంచభూతాలతో, సమస్త ప్రకృతితో సైతం అనుబంధాలు ముడిపడతాయని అర్థం. కాశీని విడిచిరమ్మంటే- తల్లిగోవు నుంచి వేరుచేస్తున్న లేగలా విలవిల్లాడారు బిస్మిల్లాఖాన్. 'ఇతర క్షోణిని లక్ష్మీలిచ్చినను సైతం పుట్టను' అని ప్రతిజ్ఞ చేశారు మహాకవి మధునాపంతుల. అవి జన్మజన్మల అనుబంధాలు. అర్థాలు దొరకవు వాటికి. ఎదలో మెదిలే ఆ సొదలను అనుభవించాలంతే. ఆరాలు తీయకూడదు. తరతరాలుగా ఆశ్రయమిచ్చిన ఇంటిని వదలలేక వీధి అరుగు మీది స్తంభాన్ని పదే పదే హత్తుకుని ప్రాణాలు వదిలేస్తుంది 'నరసింహ' చిత్రంలో శివాజీగణేశన్ పాత్ర! ఎందుకంటే... అదంతే!

కవి నాయని సుబ్బారావు స్వగ్రామం పల్నాడులోని పొదిలి. వేరే ఊరెళ్లి- 'మరువమైన మేను మరచియైన- కన్నతల్లి పొదిలి యున్న దిక్కున కాళులించి ఎపుడు పవ్వళించలేదు' అన్నారాయన 'జన్మభూమి' కవితలో... అదంతే! పుట్టిపెరిగిన ఊరితో ఆయన పెంచుకున్న అనుబంధం అలాంటిది. విదేశాల్లో స్థిరపడి చాలా కాలానికి తమ జన్మభూమికి తిరిగొచ్చినవారి ఉద్వేగం చూస్తే మనకు అర్థం అవుతుంది. సొమ్మసిల్లిన మడికి, సొలిపోయిన ఎదకు అనుబంధాలే ఔషధాలు. 'తెలిసీ వలచీ విలపించుటలోని తీయదనాలు' తెలియాలంటే అనుబంధాలు అర్థం కావాలి. ఆత్మగతం కావాలి, అప్పుడుగాని- 'ఈ ఊరు రావాలని మనసెప్పుడూ తహతహలాడేది' అంటున్న రామ్రజ్ మాటల్లోని ఆంతర్యం బోధపడదు. ఒకటీ రెండూ కాదు, 150 ఏళ్ల క్రితం మారిషస్లో స్థిరపడిన ఒడియా కుటుంబానికి చెందిన ఆయుర్వేద వ్యక్తి ఆయన. ఈమధ్య తమ పూర్వికుల కర్మభూమి ఒడిశాకు వచ్చిన రామ్రజ్- 'ఈ నేలతోగల భావోద్వేగ అనుబంధం ఏదో నన్నిక్కడకు రప్పించింది. ఇక్కడి బైతరణి నదిలో మా పెద్దల అస్థికలు కలపాలనిపించింది' అన్నారు. కాళిదాసు చెప్పిన 'జననాంతర సౌహృదాలు' అంటే ఇవేనేమో!

ఏఐ భారత్‌కు భావి దిక్సూచి

విశాఖపట్నంలో రూ.1.25 లక్షల కోట్లతో ఏఐ హబ్‌తో పాటు డేటా సెంటర్‌ను నిర్మించేందుకు గూగుల్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టు వైజాగ్‌ను అంతర్జాతీయ టెక్నాలజీ కేంద్రంగా మార్చనుంది. సాంకేతిక పరిజ్ఞానపరంగా దేశ భవిష్యత్తుకు విశాఖ డేటా సెంటర్ అత్యంత కీలకమవుతుంది. అందుకే దీని నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన అంశాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.



ఇరవయ్యో శతాబ్దంలో ప్రగతి రథాన్ని ముందుకు నడిపినవి విద్యుచ్ఛక్తి, రహదారులైతే... 21వ శతాబ్దంలో మౌలిక వసతులకు డేటా కేంద్రాలే పునాది అవుతాయి. 2030కల్లా అంతర్జాతీయ క్లౌడ్ కంప్యూటింగ్ మార్కెట్ పరిమాణం లక్ష కోట్ల డాలర్లను మించనుంది. ఏఐ విప్లవానికి లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎం)లే ప్రధాన సారథులు. వీటిని నడపడానికి అవసరమైన విద్యుత్తు కొన్ని దేశాల విద్యుదుత్పాదనకన్నా ఎక్కువగా ఉంటుంది. నేడు ప్రపంచంలోనే అత్యధికంగా 5,400 డేటా కేంద్రాలు అమెరికాలో ఉన్నాయి. 2030కల్లా అవి 58-71 గిగావాట్ల విద్యుత్తును వినియోగిస్తాయని అంచనా. భారత్‌లో 197-269 డేటా కేంద్రాలు ఉండగా, వాటికి 2030కల్లా దాదాపు అయిదు గిగావాట్ల విద్యుత్తు అవసరపడుతుంది. ప్రస్తుతం మన ఉత్పత్తి సామర్థ్యం 1.3 గిగావాట్లే. ఇది మరెన్నో రెట్లు పెరగాల్సి ఉంది.

ఎకరాకు రూ.84 కోట్ల ఆదాయం!

దేశంలోని డేటా కేంద్రాలు కొన్ని రాష్ట్రాలకే పరిమితం. మహారాష్ట్ర(ముంబయి)లోని డేటా కేంద్రాలకు 400-500 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతోంది. కానీ, అక్కడ తరచూ కరెంట్ కోతలే! పైగా ముంబయిలో భూముల ధరలు ఆసియాలోనే అత్యధికం. గుజరాత్ డేటా కేంద్రాలు 150-200 మెగావాట్ల విద్యుత్తును ఉపయోగిస్తున్నాయి. అయితే, అక్కడ నీటి కొరత వేధిస్తోంది. పైగా వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మించిపోతాయి. తమిళనాడు డేటా కేంద్రాలు 200-250 మెగావాట్ల కరెంటును వాడుతున్నాయి. కానీ, నీటి ఎద్దడి, స్థలాల కొరత ప్రధాన అడ్డంకులుగా మారాయి. హైదరాబాద్‌లోని డేటా సెంటర్లు 150-200 మెగావాట్లతో నడుస్తున్నాయి. అయితే భాగ్యనగరికి సముద్రతీరం లేకపోవడం వల్ల అంతర్జాతీయ అనుసంధానతకు ప్రధాన అవరోధంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో గూగుల్ సంస్థ విశాఖపట్నంలో ఏఐ హబ్-డేటా సెంటర్ నిర్మాణాన్ని తలపెట్టింది. ఇందుకు ఒక గిగావాట్ (వెయ్యి మెగావాట్లు) విద్యుత్తు కావాలి. ఇందులో ఏఐ సాధనాల కోసం 917 మెగావాట్లు, శీతలీకరణకు 83 మెగావాట్లు అవసరమవుతాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం స్థాపిత విద్యుదుత్పాదన సామర్థ్యం 25 గిగావాట్లు. అందులో వేసవి తదితర సమయాల్లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 12,650 మెగావాట్లు. విశాఖ డేటా సెంటర్ మొత్తం విద్యుదుత్పాదన సామర్థ్యంలో నాలుగు శాతాన్నీ, గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌లో ఎనిమిది శాతాన్నీ వినియోగిస్తుంది. గూగుల్ చెప్పినట్లు డేటా సెంటర్‌కు 24 గంటలూ హరిత విద్యుత్తును సరఫరా చేయడానికి పవన, సౌర ఇంధన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. ఈ విద్యుత్తును బ్యాటరీల్లో నిల్వచేయాల్సి వస్తుంది కాబట్టి, అందుకు రూ.25,000-42,000 కోట్ల వరకు పెట్టుబడులు అవసరం. ఇది యావత్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది.

విశాఖ డేటా సెంటర్ శీతలీకరణకు కావాల్సిన నీటిని సముద్ర జలాలను నిర్లవణీకరించడం ద్వారా, పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేయడం ద్వారా పొందవచ్చు. ప్రస్తుతం విశాఖ ప్రజలకు రోజుకు 400-450 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అందులో రెండు శాతం నీటినే గూగుల్ డేటా కేంద్రం వినియోగించుకుంటుంది. మొత్తం 500 ఎకరాల్లో వెలిసే ఈ డేటా సెంటర్‌లో ఏటా ఎకరాకు రూ.84 కోట్ల ఆదాయం లభిస్తుంది. అదే పరిశ్రమలైతే రూ.40లక్షల నుంచి రూ.1.60 కోట్ల ఆదాయమే వస్తుంది.

తరానికి ఒకసారి...

గూగుల్ డేటా కేంద్రం నిర్మాణం ప్రారంభం కావడానికి ముందే రోజుకు 40-50 మిలియన్ లీటర్ల సాగర జలాలను నిర్లవణీకరించే కర్మాగారాన్ని నిర్మించాలి. మున్సిపల్ నీటిని ఉపయోగించుకోరాదు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా తొలిదశలో కనీసం 40 శాతం, మూడో ఏట 70శాతం, అయిదో ఏడాదికల్లా వంద శాతం విద్యుదుత్పాదన సాధించాలి. డేటా సెంటర్ నిర్మాణ పనుల్లో 60శాతాన్ని, నిర్వహణ పనుల్లో 40శాతాన్ని స్థానికులకు ఇవ్వడం సముచితం. సామగ్రి కొనుగోలులోనూ స్థానిక సరఫరాదారులకు ప్రాధాన్యమివ్వాలి. స్థానిక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, అంతర్జాతీయ సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహించాలి. వార్షిక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలకు ఇతోధికంగా నిధులు కేటాయించాలి. రకరకాల ఆందోళనలు, అనుమానాలతో విశాఖ డేటా కేంద్రాన్ని వదులుకోవడం- తరానికి ఒకసారి వచ్చే మహదవకాశాన్ని కాలదన్నుకోవడమే అవుతుంది. అనుకున్న ప్రాజెక్టులను పూర్తిచేయడంలో గూగుల్ రికార్డు అసమానమైనది. కాబట్టి, జాగ్రత్తగా అడుగులు వేస్తే భారత దేశ ఏఐ భవిష్యత్తుకు విశాఖ వారధి అవుతుంది.


మరిన్ని పెట్టుబడులు.. ఉపాధి అవకాశాలు



గూగుల్ సంస్థ అమెరికా తరవాత విశాఖలోనే అతి పెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. అక్కడి నుంచి సముద్రగర్భంలో కేబుల్ ద్వారా సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియాలకు అనుసంధానత ఏర్పడుతుంది. గూగుల్, అదానీ, భారతీ ఎయిర్‌టెల్ సంస్థలు చేపట్టిన డేటా సెంటర్ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు, ఏఐ స్టార్టప్‌లు, సెమీకండక్టర్ ప్యాకేజింగ్ సంస్థలు, శీతలీకరణ సంస్థల ద్వారా విశాఖలో అదనంగా రూ.40-50 వేల కోట్ల పెట్టుబడులు ప్రవహిస్తాయి. భవన నిర్మాణం, బట్వాడా వంటి సేవలతో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలోకి రూ.87,000 కోట్లు వస్తాయి. వార్షిక నిర్వహణ ద్వారా రూ.8,000-40,000 కోట్ల ఆదాయం ఉత్పన్నమవుతుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్, డేటా సెంటర్ నిపుణులు పెద్దసంఖ్యలో తయారై దేశవిదేశాల్లో ఉపాధి పొందుతారు.



నాగళ్ల శివప్రసాద్
విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ-మద్రాసు



ఈ క్షణమే నీది!

కాలం విలువ గురించి ఎంతోమంది ఎన్నోరకాలుగా చెప్పారు. వర్తమానంలో జీవించమని పెద్దలంతా చెబుతూనే ఉంటారు. కానీ ఎంతమంది అలా జీవించగలరు? గతంలోకీ భవిష్యత్తులోకీ పెండ్యులమ్‌లా ఊగుతూ ఉండే మనసు వర్తమానాన్ని అసలు ఆస్వాదించనిస్తుందా? అదలా ఊగకుండా ప్రస్తుతంలో స్థిరంగా నిలిచేలా చేయలేమా అన్న ప్రశ్నకు సమాధానం చెబుతుంది జర్మన్ రచయిత ఎకార్ట్ టాల్ రాసిన 'ద పవర్ ఆఫ్ నౌ' పుస్తకం. దీన్ని ఆధ్యాత్మిక జ్ఞానానికి సంబంధించినదిగా భావిస్తారు కానీ నిజానికి ఒత్తిడీ ఆందోళనలతో సతమతమయ్యేవారూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం.

ఆస్ట్రేలియాకి చెందిన బ్రానీవేర్ 'ద టాప్ ఫైవ్ రిగ్రెట్స్ ఆఫ్ ద డైయింగ్' అని ఒక పుస్తకం రాశారు. వృద్ధుల శరణాలయంలో నర్సుగా పనిచేసిన ఆమె చివరి రోజుల్లో అక్కడి వారి పశ్చాత్తాపాలన్నీ విని, చూసి, వాటిలో కామన్‌గా ఉన్న ముఖ్యమైన అయిదింటిని వివరిస్తూ ఈ పుస్తకం రాశారు. జీవితాన్ని నాకు నచ్చినట్లుగా జీవించలేకపోయాను, కుటుంబంతో ఎక్కువ సమయం గడపలేకపోయాను, మనసులో మాట చెప్పలేకపోయాను, స్నేహితులను వదులుకున్నాను, సంతోషంగా జీవించలేదు... ఇవీ ఆ పశ్చాత్తాపాలు. నెగెటివ్ థింకింగ్, ప్రతిదానికీ మనకు మనమే అర్థం లేని పరిమితులు పెట్టుకోవడం, మన ఇష్టాయిష్టాలను వదులుకుని కుటుంబానికి, సమాజానికి నచ్చేలా బతకడం... చివరి రోజుల్లో పశ్చాత్తాపాలకు కారణాలవుతాయంటారు బ్రానీ. ఎకార్ట్ రాసిన 'ద పవర్ ఆఫ్ నౌ' పుస్తకం చదివి అర్థం చేసుకున్నవాళ్లకి జీవితంలో ఇలాంటి రిగ్రెట్స్ ఏవీ ఉండవని కచ్చితంగా చెప్పవచ్చు.

రాస్తున్న కథ అయిపోయేదాకా అందులోని పాత్రలమధ్యే జీవిస్తాడు రచయిత. మొన్నటి కథ అలా రాయకుండా ఉండాల్సిందనో, రేపేం రాయాలీ అనో ఆలోచిస్తే చేతిలోని కథ ముందుకు కదలదు. అలాగే నటుడు నాటకం అయ్యేదాకా తాను ధరిస్తున్న పాత్రలోనే జీవిస్తాడు. దీని తరవాత మరో అవకాశం వస్తుందో రాదోనని ఆలోచిస్తే పాత్రకు న్యాయం చేయలేడు. మనం కూడా వాళ్లలాగే నడుస్తున్న క్షణంలో బతకాలి. చేస్తున్న పనిమీద దృష్టి పెట్టాలి. నూటికి నూరుపాళ్లు దాంట్లో లీనమైతే- పనిలో సామర్థ్యం పెరుగుతుంది, మనసుకు ప్రశాంతత లభిస్తుంది. అది నైపుణ్యాలను పెంచి ఆటోమేటిగ్గా రేపటిని మరింత ప్రొడక్టివ్‌గా గడపడానికి దోహదం చేస్తుంది. ఇక్కడ ఉండి, అక్కడెక్కడో ఉండాల్సిందని ఆలోచించడమే ఒత్తిడికి మూలకారణం... అంటారు రచయిత. వర్తమానంలో జీవించడం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనడానికి తోడ్పడుతుంది. నిన్నటి గురించి పశ్చాత్తాపం, రేపటి గురించి ఆందోళనా ఉండవు కాబట్టి ఆ క్షణాల్ని ఆనందంగా ఆస్వాదించవచ్చు.

గతంలోంచి పాఠాలు నేర్చుకోకుండా రేపటి గురించి ప్రణాళిక లేకుండా ఎలా అన్న సందేహం సహజం. పాఠాలూ ప్రణాళిక వరకూ సమస్య కాదు, పట్టుకువేళ్లాడటమే ఎన్నో బాధలకు కారణం. ఎకార్ట్ ఏమంటారంటే- జీవితం మనది. మనమే మనకి సబ్జెక్టు కావాలి. ఆ స్పృహ శరీరాన్ని, మనసును ఒక్కగాట కడుతుంది. అనుభవాలను, ఉద్వేగాలను ఆస్వాదించేలా చేస్తుంది. వ్యక్తి, మనసు, ఆలోచన, భయం, ఉద్వేగం, ఆధ్యాత్మికత... ఇలాంటి అంశాలన్నిటినీ ప్రశ్న జవాబుల రూపంలో వివరిస్తుంది 'ద పవర్ ఆఫ్ నౌ'. 1997లో ప్రచురితమై కొన్నేళ్ల పాటు న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్‌గా ఉన్న పుస్తకమిది. అరబిక్ సహా 33 భాషల్లోకి అనువాదమైంది.

– మిహిర



ఉత్పత్తిలోనైనా వినియోగంలోనైనా మనం అవసరానికి మించి తీసుకుంటున్నామంటే- ప్రకృతిని హింసిస్తున్నామన్న మాటే. వాతావరణ మార్పులకు ఏమాత్రం కారణం కానివాళ్లే వాటి ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు.

– వందనా శివ

ఒకరికొకరుగా...

సమ, మనస్ అనే రెండు సంస్కృత పదాల కలయిక నుంచి పుట్టిన 'సామనస్యం' అంటే ఏకాభిప్రాయం, ఐకమత్యం, పరస్పర సహకారం. సామూహికంగా ఒకే లక్ష్యం కోసం, ఒకే ఆలోచనలతో కలిసి పనిచేసే ఈ సామరస్య భావనను అథర్వ వేదంలో 'సామనస్యమ్' అనే సూక్తం ప్రస్తావిస్తుంది. వేదాలు చెప్పే మంచి విషయాల్లో ప్రత్యేకించి నిత్యజీవితానికి సంబంధించి ఇందులో ఎన్నో ఆచరణీయమైనవి ఉన్నాయి. ఒకరిపట్ల మరొకరు ప్రేమాభిమానాలతో క్రమశిక్షణ పాటిస్తూ జీవించమని ప్రబోధిస్తుంది 'సామనస్యమ్' సూక్తం. కక్షలూ కార్పణ్యాలతో కాలం వృథా చేసుకునే జనాలకు విద్వేష రహిత జీవిత ప్రాధాన్యాన్ని వివరిస్తుంది.



'సహృదయం సాంమనస్యమవిద్వేషం కృణోమివః' అనే శ్లోకపాదంతో ప్రారంభమయే ఈ సూక్తంలోని మొదటి రుక్కు సమాజానికి, కుటుంబానికి చక్కని సందేశాన్ని అందిస్తుంది. లేగదూడలు ఆవులను, తల్లులు బిడ్డలను ప్రేమించినట్లు ప్రతి ఒక్కరు ఇతరులను ప్రేమిస్తే సమాజంలో సుఖశాంతులు నెలకొంటాయని, తద్వారా వ్యక్తిగత సౌఖ్యం కూడా లభిస్తుందని ఈ రుక్కు వక్కాణిస్తుంది. రెండో రుక్కు కుటుంబ సభ్యుల ప్రవర్తనకు సంబంధించింది. కొడుకు- తండ్రికి అనుకూలంగా ఉండాలని, తల్లి- బిడ్డల పట్ల వాత్సల్యంతో మెలగాలని, భార్యాభర్తలు ఒకరికొకరు మనసెరిగి మంచి మాటలతో సేదతీర్చుకోవాలని హితవు చెబుతుంది. తోబుట్టువులు ఒకరి పట్ల ఒకరు ప్రవర్తించే విధానాన్ని మూడో రుక్కు తెలియజేస్తుంది. అన్నదమ్ములు కలిసిమెలసి మెలగాలి; ఆస్తి పంపకాల వంటి ఇంటి విషయాలు రచ్చకెక్కరాదు. అక్కచెల్లెళ్లు అసూయా ద్వేషాలను విడిచి ఒకరిపట్ల ఒకరు అనురాగంతో జీవించాలి. ఒక తల్లి కన్న సంతానం తమలో తాము కలహించుకునే ఇంట్లో లక్ష్మి క్షణమైనా ఉండదని హెచ్చరిస్తుందీ రుక్కు. బతుకుదెరువు కోసం ఒకే సమాజంలో కలిసి జీవించే వ్యక్తులు ఐకమత్యంతో మెలిగే పద్ధతులను నాలుగో రుక్కు సోదాహరణంగా వివరిస్తుంది. ఒకే వృత్తిలో ఉన్నవారు పరస్పరం సహకరించుకుంటూ ఒకే లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే వివాదాలకు తావు లేని జీవనభృతి లభిస్తుంది.

ఇంద్రాది దేవతలు తమకు లభించిన అమృతాన్ని ఐకమత్యంతోనే కాపాడుకున్నారు. ఈ విధమైన సామనస్య భావనే సమాజానికి హితవు చేకూరుస్తుంది. 'మానవ ప్రయత్నంలో లోపం లేకున్నా దైవానుగ్రహం దానికి తోడైనప్పుడే పని సానుకూలపడుతుంది' అని అయిదో రుక్కు కర్మఫల రహస్యాన్ని విప్పి చెబుతుంది. దైవసన్నిధికి దూరం కాకుండా ఆత్మీయభావన నెలకొని ఉండాలంటే నిజనివాసాలలో నిత్యం దేవతలను స్తుతిస్తూ పూజాదికాలు సాగుతుండాలని ఈ రుక్కు నిర్దేశిస్తుంది. సఖ్యత, సభ్యత వంటి సద్గుణాలు రాశి పోసిన ఉత్తములను ఉద్దేశించినది ఆరో రుక్కు. సజ్జనులు తమలో తాము కలహించుకోరాదు. పరస్పరం అనురాగబద్ధులై జీవించాలి. సుమధుర సంభాషణలతో బాంధవ్యాలను మెరుగు పరుచుకోవాలి. అప్పుడే సంఘంలో సమైక్యత వర్ధిల్లుతుంది. సమాజంలోని సభ్యులనుద్దేశించి సాగే ఈ ఆఖరి రుక్కు సత్సందేశంతో వేదం లక్షించిన సామాజిక ప్రయోజనాన్ని సమర్థంగా సాధించింది.

– కర్లపాలెం హనుమంతరావు

విషగాలుల్లో ప్రాణదీపాలు!



ఢిల్లీలో తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో ఒక రోగి డాక్టర్ దగ్గరికి వెళ్తాడు. 'పొగ తాగుతావా?' అని అడుగుతాడు వైద్యుడు. 'లేదండి! దిల్లీలో ఉంటున్నాను' అంటాడతను. రాజధాని నగరంలో నానాటికీ కట్టు తప్పుతున్న వాయుకాలుష్యం నేపథ్యంలో సోషల్ మీడియాలో పేలిన మీమ్ ఇది! హస్తిన విషగాలిలో ఒక్క పది నిమిషాలు విహరించినందుకు ఈజిప్ట్ 'మమ్మీ'లా మారిపోయి ముక్కుకు ఆక్సిజన్ మాస్క్ పెట్టుకుని బిక్కచూపులు చూస్తున్న సూపర్‌మ్యాన్ మీమ్ కూడా నవ్వించింది... అందరినీ తమ ఆరోగ్యం పట్ల ఒకింత ఆందోళనకు గురిచేసింది. ఒక్క దిల్లీ అనే ఏముంది... దేశవ్యాప్తంగా దాదాపు అన్ని నగరాల్లో రోజురోజుకూ దిగజారిపోతున్న వాయు నాణ్యత జనాన్ని బెంబేలెత్తిస్తోందిప్పుడు!

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం- ఘనపు మీటరు గాలిలో అతి సూక్ష్మ ధూళికణాల (పీఎం 2.5) వార్షిక సగటు సాంద్రత అయిదు మైక్రోగ్రాములకు, 24 గంటల వ్యవధిలో అయితే 15 మైక్రోగ్రాములు మించకూడదు. జాతీయ వాయునాణ్యతా ప్రమాణాల (ఎన్ఏఏక్యూఎస్) ప్రకారమైతే అవి 40, 60 మైక్రోగ్రాములు దాటకూడదు. ఫిన్లాండ్‌కు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) తాజా అధ్యయనం మేరకు మొన్న సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో ఇండియాలో చాలా నగరాల్లో వాయు నాణ్యత దిగనాసిల్లింది. హరియాణాలోని ధారూహేడాలో గత నెల పీఎం 2.5 అత్యధికంగా 123 మైక్రోగ్రాములకు చేరింది. పంట వ్యర్థాల దహనం సమస్య లేకపోయినా పీఎం 2.5. . 107 మైక్రోగ్రాములకు చేరి వాయు కాలుష్య పీడిత పట్టణాల పట్టికలో దిల్లీ ఆరో స్థానంలో నిలిచింది. నిన్న శనివారం అక్కడ పరిస్థితి మరింత ఘోరంగా తయారైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. మొత్తం 293 భారతీయ నగరాల్లో గాలి స్వచ్ఛతను సీఆర్ఈఏ తనిఖీ చేస్తే 255 చోట్ల సూక్ష్మధూళికణాలు డబ్ల్యూహెచ్‌వో నిర్దేశించిన దానికన్నా ఎక్కువగా పోగుపడ్డాయి. ఎన్ఏఏక్యూఎస్ ప్రకారం చూస్తే అలాంటి వాటి సంఖ్య 37 మాత్రమే. 'మనవైన లెక్కలు' అంటూ ప్రమాణాలను తగ్గించుకుంటే- అంతా బాగున్నట్లు కనపడుతుంది కానీ, ప్రాణాలే పోతాయి!

క్రమం తప్పకుండా వాకింగ్, జాగింగ్ చేసేసి.. మద్యపానం, ధూమపానం లాంటి చెడు అలవాట్లను వదిలేసి.. జంక్‌ఫుడ్‌ను మానేసి.. సమతులాహారం తీసుకుని.. వేళకు హాయిగా నిద్రపోయినా ఆరోగ్యంగా ఉంటామన్న నమ్మకం లేదు మన పుణ్యభూమిలో! ఇవన్నీ చేసి వందేళ్లు కాకపోయినా అంతకు ఓ ఇరవై తక్కువగా అయినా ఆనందంగా జీవిద్దామనుకుంటే అది అత్యాశే అవుతుంది.

పుణ్యభూమి

ఎందుకంటే.. చుట్టూ ఉండే గాలి మహిమ అలాంటిది మరి! ఇండియాలో ఇప్పటికే 140 కోట్ల మంది కలుషిత గాలులనే పీల్చుతూ జీవనాన్ని వెళ్లదీస్తున్నట్లు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. దాని మూలంగా వ్యాధులు ముప్పేట దాడిచేస్తున్నాయి. మలినమైన గాలి పుణ్యమా అని శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్లు, గుండె జబ్బులు దండెత్తుతున్నాయి. బ్రెయిన్ ట్యూమర్లకు అంటుకడుతున్న వాయు కాలుష్యం మధుమేహానికీ ఆహ్వానం పలుకుతోంది. చిన్నారుల ఏకాగ్రతను, జ్ఞాపకశక్తినీ దెబ్బతీస్తోంది. మహిళల్లో సంతానలేమికి, ఆకస్మిక గర్భస్రావాలకు, నెలలు నిండకుండానే శిశువుల జననాలకు కారణమవుతోంది. ఒక రకంగా చెప్పాలంటే ప్రజారోగ్యానికి అది ప్రబల శత్రువులా తయారైంది. మొత్తమ్మీద మన దేశంలో జీవించే హక్కు ఆ మలిన గాలిలోనే కలిసిపోతోంది!

కరోనా రక్కసి స్వైరవిహారం చేసినప్పుడు మొహానికి పెట్టుకున్న మాస్క్ తీస్తే ప్రాణాలకు గ్యారంటీ లేదన్న భయమొకటి అందరినీ వణికించేసింది. కొవిడ్ ఉత్పాతం తగ్గిపోయాక ఆ మాస్కులన్నీ మూలనపడ్డాయి కానీ, మరణ మృదంగాన్ని మోగించడంలో కరోనా మహమ్మారిని మించిపోతోంది వాయు కాలుష్యం! నిరుడు ప్రపంచ వాయునాణ్యతా స్థితిగతుల నివేదిక ప్రకారం విషపూరితమైన గాలి 2021లో విశ్వవ్యాప్తంగా 81 లక్షల మంది ఉసురు తీసేసింది. అందులో నాలుగోవంతు అభాగ్యులు భారతీయులే! హైదరాబాద్, దిల్లీ, ముంబయి తదితర పది నగరాల్లో నిత్యం సంభవించే అర్ధాంతర మరణాల్లో ఏడు శాతం వాటా కలుషిత వాయువుదే! ఏ మాత్రం నాణ్యత లేని గాలిని పీలుస్తున్నందువల్ల భారతీయుల సగటు ఆయుర్దాయం 5.3ఏళ్ల మేర తెగ్గోసుకుపోతోంది.

విశాఖ, విజయవాడ, గుంటూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు ఇలా ఏపీలోని 13 పట్టణాలు గతేడాది జాతీయ వాయు నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. తెలంగాణలోని రామగుండం, సంగారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం వంటి చోట్లా వాయు కాలుష్యం కోరలు చాస్తోంది.


నగరాలంటే నాగరికతకు నెలవులు. ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోవడంతో అవి ఉపాధి వేదికలుగా విరాజిల్లుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణాలు గ్యాస్ చాంబర్లుగా మారిపోతుండటం దేశ పురోగతికే విఘాతకరం కదా! మరి ఇదంతా ప్రభుత్వాలకు అర్థం కావట్లేదా అంటే- ఎన్నుకున్న ప్రజల గురించి అప్పుడప్పుడైనా ఆలోచిస్తూ కొన్ని నిర్ణయాలు తీసుకుంటుండటమే అదృష్టం. అవి సక్రమంగా అమలవుతున్నాయా అని ప్రశ్నించడం మాత్రం అవివేకం. జాతీయ వాయుశుద్ధి కార్యక్రమం (ఎన్‌క్యాప్) దానికి మంచి ఉదాహరణ. 2026 నాటికి దేశంలోని 131 నగరాల గాలిలోని సూక్ష్మ ధూళికణాలను 40శాతం మేర తగ్గించాలన్నది దాని ధ్యేయం. అది అమలవుతున్న 98 పట్టణాల్లో పరిస్థితులు నిరాశాజనకంగానే ఉన్నట్లు సీఆర్ఈఏ తాజా పరిశీలనల సారాంశం! ఎన్‌క్యాప్ కింద నిరుడు మే వరకు దాదాపు పదమూడు వేల కోట్ల రూపాయలు విడుదలైతే, అందులో 29శాతాన్ని యంత్రాంగం మురగబెట్టింది. కాలుష్యానికి మూలాలను గుర్తించి సరిదిద్దాల్సింది పోయి ఎక్కువ భాగం నిధులను రోడ్లపై దుమ్ము లేవకుండా నీళ్లు చల్లడానికి వెదజల్లింది. ఇలాంటి మహా గొప్ప పనులవల్లే హైదరాబాద్‌లో నాలుగేళ్లలో రూ.455 కోట్లు వెచ్చించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇంకో పక్క పరిశ్రమలు నిబంధనలను యథేచ్ఛగా తుంగలో తొక్కుతుంటే కాలుష్య నియంత్రణ మండళ్లు మొద్దు నిద్రలో, అవినీతి మత్తులో జోగుతున్నాయి. వాటిని ప్రక్షాళించడం, నిబంధనలకు సమాధికట్టే పరిశ్రమలపై ఉక్కుపాదం మోపడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమే కానీ ఎవరు పట్టించుకుంటున్నారు? ప్రజా రవాణాను విస్తృతం చేసి వ్యక్తిగత వాహన వినియోగం దిగివచ్చేలా చూడటం మీదా మాటలే తప్ప చేతలు కరవవుతున్నాయి. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి పునరుత్పాదక వనరులపై అధిక దృష్టి సారించాలి. ఇవన్నీ చేయకుండా తూతూ మంత్రంగా ఏదో మమ అనిపించి, కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్లొద్దని ప్రజలకు ఉచిత సలహాలు ఇచ్చినంత మాత్రాన జనభారతం ఆరోగ్యం బాగుపడదు!

– వేణుబాబు మన్నం

మన శరీరంలో పెద్ద పంపు!

నేస్తాలూ.. మన ఒంట్లోని గుండె గురించి మీకెంత తెలుసు! ఇదొక అద్భుతమైన అవయవం. శరీరంలో ఎడమవైపుగా ఉండే గుండె మనకు చాలా ముఖ్యమైన పనులు చేసి పెడుతుంది. ఇది ఒంట్లోని అన్ని భాగాలకూ రక్తాన్ని సరఫరా చేయడం ద్వారా మనకెంతో సాయం చేస్తుంది. గుండె కూడా ఇతర కండరాల్లా ఉండే కండర అవయవమే. శక్తిమంతమైన ప్రత్యేక కండరం అన్నమాట. ఇంత పెద్ద శరీరంలో గుండె ఎంత ఉంటుందనేది ఆసక్తికరం కదూ! పెద్దవాళ్లలో సుమారుగా పెద్ద పిడికిలి సైజులో ఉంటుంది. రోజుకు లక్షకన్నా ఎక్కువసార్లే కొట్టుకుంటుంది. రన్నింగ్, రేసింగ్ వంటివి చేసేటప్పుడు మరింత ఎక్కువగా పని చేస్తుంది.

ఇంతకీ శరీరంలో గుండె ఏం పని చేస్తుంది. ఎలా పని చేస్తుందనేదే కదా మీ అనుమానం!



ఇదొక మోటారు పంపులాంటిది. ఇది ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌తో నిండిన రక్తాన్ని తీసుకొచ్చి, శరీరానికంతా సప్లయ్ చేస్తుంది. అదేవిధంగా శరీరం నుంచి రక్తాన్ని ఊపిరితిత్తులకు పంపిస్తుంది. ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే, ఈ పంపులనే కుడి, ఎడమ భాగాలుగా అనుకోవచ్చు. కుడివైపు భాగం శరీరం నుంచి రక్తాన్ని తీసుకుని ఊపిరితిత్తులకు పంపుతుంది. ఎడమ భాగం ఊపిరితిత్తుల నుంచి రక్తాన్ని తీసుకుని శరీరానికి తరలిస్తుంది. గుండె నుంచి కాలి వేళ్ల దాకా రక్తం ప్రవహించి, తిరిగొచ్చేందుకు ఒక నిమిషం పడుతుందంతే!

హాయ్! బుజ్జీ!!

ఇలాంటి ముఖ్యమైన పనులు చేసే గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మంచి పోషకాహారాన్ని తీసుకోవాలి. రోజూ వ్యాయామాలు చేయాలి. చెడు అలవాట్ల జోలికే వెళ్లొద్దు. ఎవరన్నా ఆ పనిచేసినా వద్దని చెప్పాలి. నవ్వడం గుండె ఆరోగ్యానికి మంచిది. అందుకని హాయిగా నవ్వుతూ ఉందాం.. సరేనా!

– శ్రీజన్

నేనెవర్ని?

1. నేనో అయిదక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలోని 1, 4, 2, 5 అక్షరాలను కలిపితే.. 'విఫలం' అని, 3, 4, 2, 5 అక్షరాలను కలిపితే 'గోరు' అనే అర్థాన్నిస్తాను. నేనెవర్ని?

2. అయిదక్షరాల పదాన్ని నేను. నాలోని మొదటి నాలుగు అక్షరాలను కలిపితే 'ప్రణాళిక' అని, చివరి మూడు అక్షరాలను కలిపితే 'చీమ' అనే అర్థాన్నిస్తాను. నేనెవరినో తెలిసిందా?

జవాబు: 1.FINAL 2.PLANT


విజేతలకు బహుమతులు అందజేసిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ షణ్ముఖ కుమార్, ప్రవేశాల డైరెక్టర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బొబ్బిలి మూర్తి, శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపల్ వెంకయ్య తదితరులు

ఆసక్తి.. పట్టుదలతోనే విజయం

మారుతున్న ప్రపంచానికి తగ్గట్టుగా విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న అంశాలపై పట్టు సాధించడంతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటే విజయాలు అందుకోగలరని వక్తలు సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గూడవల్లి శ్రీచైతన్య కళాశాల రామన్‌భవన్-5 బాలికల ప్రాంగణంలో శనివారం 'ఈనాడు-కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' సంయుక్తంగా దశ-దిశ పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రవేశాల డైరెక్టర్ డా. జె. శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బొబ్బిలి మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జేవీ షణ్ముఖ కుమార్, శ్రీచైతన్య కళాశాలల డీన్ పి.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ వెంకయ్య, ఈనాడు విజయవాడ యూనిట్ మేనేజరు సీహెచ్ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

కడలికి 53,460 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు 5 గేట్లను రెండు అడుగులు, మిగతా 64 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. 53,460 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 7,546 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 2,311, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్‌కు 1,000, ఏలూరు 511, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

ఆదిదేవాయ.. అఖండ దీపాయ

వైభవంగా 'ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ' కార్తిక దీపోత్సవం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కృష్ణా నదీ తీరం దీపకాంతులతో ధగధగ మెరిసింది. ఓంకార నాదాలు, వేదమంత్రాలతో ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిశాయి. 'ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో విజయవాడలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి కార్తిక దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వందల మంది మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో తరలివచ్చారు. తొలుత వైదిక నిర్వహణకర్త బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణికుమారశర్మ బృందం గణపతి పూజ నిర్వహించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన, కలువ పూలతో లక్ష్మీ పూజ, వేద స్వస్తి కార్యక్రమాలు జరిగాయి. శాస్త్రబద్ధంగా దీపారాధన చేయించి ఆ కాంతుల్లో లక్ష్మీపూజ చేశారు. ప్రవచనకర్త దెందులూరి సీతారామశర్మ ప్రవచనాలు భక్తులను పరవశింపజేశాయి. మహిళలందరూ ఒకే సమయంలో దీపాలను వెలిగించడంతో దీపోత్సవం కోటి కాంతులతో కళకళలాడింది. మహాలక్ష్మీ నమామ్యహం, కార్తిక దామోదరా నమోనమః, తదితర నామస్మరణలతో ప్రాంగణం మార్మోగింది. తొలుత కొత్తూరు తాడేపల్లికి చెందిన కప్పగంతు జానకిరామావధాని శిష్య బృందం వేద పారాయణం చేసింది.


దీప వైభవం.. శోభాయమానం..


హరహర మహాదేవ..


దీప లక్ష్మీ.. నమోస్తుతే..

కైలాస నాథుడి స్మరణలో.. శంభోశంకర.. హరహర మహాదేవ.. అని భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. సామూహికంగా మహిళలంతా కలిసి దీపోత్సవ పూజ నిర్వహించారు. సుమారు రెండు గంటల క్రతువులో మహిళలు భక్తిప్రపత్తులతో దీపాలు వెలిగించి కైలాస నాథుడిని ప్రార్థించారు. మహా హారతితో దీపోత్సవం ముగిసింది.


అలరించిన వేదపారాయణం


జ్యోతి వెలిగిస్తున్న మంత్రి వంగలపూడి అనిత. వేదికపై మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ, కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, విజయవాడ 'ఈనాడు' యూనిట్ ఇన్‌ఛార్జి కిశోర్‌కుమార్



దశావతారాల విశిష్టత.. శ్రీమహావిష్ణువు దశావతారాల విశిష్టత, కల్కి అవతారం ఎలా వచ్చింది?, కలియుగంలో దాన్ని ఎలా గుర్తిస్తారనే.. విషయాలను ప్రవచనకర్త దెందులూరి సీతారామశర్మ వివరించారు. త్రిమూర్తులకు శక్తి స్వరూపిణి ఆధారమని తెలియజేశారు. కార్తిక దీపోత్సవం విశిష్టత వివరించారు.

ప్రకటనకర్తలకు జ్ఞాపికల అందజేత.. ఈటీవీ కార్తిక దీపోత్సవ కార్యక్రమానికి సహకారం అందించిన ప్రకటనకర్తలైన.. పలు వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సి. హెచ్. కే. కిశోర్ చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు. ★ శ్రీభ్రమర టౌన్‌షిప్స్ - మారం రోజారాణి, ఎస్. ఎల్. వి. గ్రూప్ - పెన్మత్స శ్రీనివాసరాజు, లక్కీ షాపింగ్‌మాల్ - రాజేశ్, సాయిభాస్కర హాస్పిటల్స్ - శివ గాయత్రి, అనూస్ మైబేబీ - డాక్టర్ కె.శ్రీదేవి, వి.వి.ఐ.టి. యూనివర్సిటీ - డాక్టర్ ఉదయ్‌కుమార్, సంగం డెయిరీ - మోహన్ మురళి, గ్లోబల్ డిగ్రీస్ - జాస్తి మీనా కుమార్, బ్లాజమ్స్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ - పట్టాభి రామారావు, బాంబే జ్యూయలర్స్ - యష్‌కుమార్ చౌహాన్, ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్ - శేషావలి, జె.లగ్జరీ - శ్రీకాంత్, రూబీ రోటీ - సీహెచ్ కుటుంబరావు, పూజ ఆయిల్స్ - గర్రె మదన్ కుమార్‌లకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని ఈటీవీ డిప్యూటీ న్యూస్ కోఆర్డినేటర్ జి. అమరేశ్వరరావు పర్యవేక్షించారు.



పల్లవించె ఇళ.. పరవశించె ఇల!

కృష్ణా తీరాన ఇళయరాజా సంగీత స్వర నీరాజనం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - విజయవాడ సిటీ

ఇళయ గానం.. మలయమారుతమై మాయ చేసింది. ఆ సంగీతామృత ఝరి శ్రోతలను ముంచెత్తింది. మృదు మధుర పల్లవుల పల్లకి ఆపాత మధుర జ్ఞాపకాల్లోకి మోసుకెళ్లింది. ఓణీ కట్టిన పడుచుల్లాంటి బాణీలు యువతను కేరింతలు కొట్టించాయి. సుమధుర గీతమాలికలు జోలపాటలుగా మారి చిన్నారులను హాయి ఊయలలో నిద్రపుచ్చాయి. బాలసుబ్రహ్మణ్యం తనయుడు చరణ్ ఆలపించిన చరణాలు గాన గంధర్వుడి సంగీత ప్రస్థానానికి నివాళిగా నిలిచాయి. ఆయన బృందంలోని ప్రముఖ గాయకుల గాన మాధురి మనసును మీటింది. మొత్తంగా మ్యాస్ట్రో ఇళయరాజా విజయవాడ సంగీత కచేరీ సుమధుర గీతాలతో ఆబాలగోపాలాన్ని అలరించింది. ప్రతి పాట మనసుని మీటుతూ ప్రేక్షకులతో కూనిరాగాలు తీయించింది. హార్మోనియం వాయిస్తూ.. పాడిన గీతాలు సంగీత ప్రియులను ఓలలాడించాయి. ప్రేక్షకులతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. సినీ, రాజకీయ ప్రముఖులు తరలి రాగా... విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సందడి మిన్నంటింది.



ఇళయరాజా గానామృతంతో అభిమానుల తన్మయత్వం


హాజరైన మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని, విప్ బొండా ఉమా


ఎస్పీ చరణ్, అనిత


విభావరి, మధుబాలకృష్ణన్

భవానీ దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు

విజయవాడ నేరవార్తలు: భవానీదీక్షల విరమణకు విచ్చేసే భక్తుల కోసం గత ఏడాది రూపొందించిన యాప్‌ను మరింతగా ఆధునికీకరించి.. ముందస్తు సమాచారం, అమ్మవారి దర్శనం వివరాలు అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. శనివారం భవానీదీక్షల విరమణ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, గిరి ప్రదక్షిణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 11 నుంచి 15 వరకు జరిగే దీక్షల విరమణ జాగ్రత్తలపై అధికారులకు ఆయన సూచనలు చేశారు. ప్రసాదాలు త్వరితగతిన అందేలా చూడాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు, వైద్య శిబిరాలు, తాగునీరు, సమాచార కేంద్రం, గిరి ప్రదక్షిణ, దర్శన సమయాలు, పూజా విధానం తదితరాలన్నీ యాప్‌లో ఉండేలా చూసుకోవాలని సూచించారు. భక్తులు త్వరితగతిన క్యూలైన్లలో కలిసేలా అవసరమైన ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, దుర్గగుడి ఈవో శీనానాయక్, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న సీపీ రాజశేఖరబాబు

ఆదర్శ బాల.. అందుకో రోజా..!



ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. కొందరు తలకెక్కించుకోవడం లేదు. అయితే.. తల్లితో పాటు ప్రయాణిస్తున్న ఓ చిన్నారి శిరస్త్రాణం ధరించి అందరినీ ఆకర్షించాడు. ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం రోజా పువ్వు ఇచ్చి అభినందించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఆమె ఆధ్వర్యంలో శనివారం ట్రాఫిక్ పోలీసులు విజయవాడలోని ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శిరస్త్రాణం ధరించి వాహనాలు నడిపిన వారికి ఇలా రోజా పువ్వులు అందించి అభినందించారు. - **విజయవాడ నేరవార్తలు**

జనార్దనరావుకు జోగి అండదండలు!

రెండోరోజు ఏడుగురు నిందితుల విచారణ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం వ్యవహారంలో జనార్దనరావు (ఏ1)కు వైకాపా నేత జోగి రమేష్ అండదండలు ఉన్నాయని నిందితుడు రవి వెల్లడించాడు. రెండో రోజు కస్టడీలో భాగంగా శనివారం సిట్, ఎక్సైజ్ పోలీసుల విచారణలో... తనతో ఏ1 పలుసార్లు జోగితో బంధాన్ని చెప్పినట్లు రవి వివరించాడు. ఆయన ప్రోద్బలంతోనే ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ చేపట్టాడనీ.. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించాడని వివరించాడు. జోగి మంత్రిగా ఉన్నప్పుడు 2023లోనే తయారీ చేపట్టాడన్నారు.

యూపీఐ లావాదేవీలపై ఆరా...

శనివారం ఏడుగురు నిందితులను వేర్వేరుగా సాయంత్రం వరకు ప్రశ్నించి పోలీసులు వివరాలు రాబట్టారు. ఏయే బ్రాండ్లకు నకిలీ లేబుళ్లను సరఫరా చేశారని ప్రశ్నించగా.. కేరళ మాల్ట్ విస్కీ, బెంగళూరు బ్రాండీకి లేబుల్స్‌ను తయారు చేయించి సరఫరా చేశానని అంగీకరించాడు. రవి ఖాతాల నుంచి ఏ1, ఇతరుల ఖాతాలకు లావాదేవీలు జరిగాయి. రాజు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జనార్దనరావులతో యూపీఐ లావాదేవీలు గుర్తించి.. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి కోసం వచ్చి కటకటాలపాలు

ఒడిశా నుంచి ఇబ్రహీంపట్నంకు ఉపాధి నిమిత్తం వచ్చిన బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌లను పోలీసులు ప్రశ్నించారు. ఎంత కాలం నుంచి జనార్దనరావుతో పరిచయం ఉంది? ఆయన వద్ద ఏ పని చేసేవారు? అని ప్రశ్నలు సంధించారు. తాము నాలుగేళ్ల నుంచి ఏఎన్ఆర్ బార్, కిరాణా దుకాణంలో పనిచేసే వారమన్నారు. ఆతర్వాత నకిలీ మద్యాన్ని సీసాల్లోకి నింపేవారమని చెప్పారు. వేతనాలు రెట్టింపు చేస్తామని జనార్దనరావు ఆశ చూపించాడని చెప్పాడు. తాము ఉపాధి కోసం వచ్చి ఈ కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లాల్సి వచ్చిందని వాపోయినట్లు తెలిసింది.

అధిక ధరకు ఆశపడి...

సీసాలు సరఫరా చేస్తే అధిక ధర ఇస్తానని జగన్మోన్‌రావు (ఏ2) ఆశ చూపించడంతో అంగీకరించానని శ్రీనివాసరెడ్డి (ఏ11) విచారణలో చెప్పాడు. తొలుత సీసాల తయారీకి అంగీకరించలేదనీ, ఒక్కోదానికి 30 పైసలు ఎక్కువ ఇస్తానని చెప్పేసరికి ఒప్పుకొన్నానని వివరించాడు. ఎన్ని రకాల సీసాలు సరఫరా చేశావని పోలీసులు ప్రశ్నించారు. రెండు రకాల సీసాలు తయారు చేసి ఇచ్చానని చెప్పాడు. శ్రీనివాస వైన్స్‌కు జగన్మోహన్‌రావు (ఏ2) ఇబ్రహీంపట్నం నుంచి నకిలీ మద్యం సీసాలను పంపేవాడని చెప్పాడు. సరకు అందుకున్న తర్వాత లెక్కలు చూసి చెల్లింపులు చేసేవాడినని వివరించాడు. ఒకవేళ డబ్బు తక్కువగా ఉంటే.. మరుసటి రోజు ఇచ్చేవాడినని అన్నాడు.

నమూనాల మేరకు లేబుళ్లు...

షాప్ లైసెన్సు ఎవరి పేరున ఉందని పోలీసులు ప్రశ్నించగా.. నందిగామవాసి పూర్ణచంద్రరావు పేరుతో ఉందన్నారు. తానే దుకాణం నిర్వహిస్తానని చెప్పాడు. నకిలీ లేబుళ్లను తయారు చేసి ఇవ్వమని.. తిరుమలశెట్టి శ్రీనివాసరావు కోరాడని నిందితుడు అల్లాభక్ష్ వెల్లడించాడు. తనకు కొన్ని నమూనాలను ఇచ్చాడనీ.. వాటిని చూసి కంపెనీ నుంచి లేఖ ఇస్తేనే చేస్తానని స్పష్టం చేసినట్లు చెప్పాడు. లేఖ ఇవ్వడంతో లేబుళ్లను డిజైన్ చేసి, ముద్రించి అందజేసినట్లు చెప్పాడు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2021 July Model, Mahindra Thar M.T-Maroon Colour, 60,000 Km, is for Sale ✆ 98482 42831.

2020 మోడల్ లీలాండ్ మరియు టాటా 14 టైర్స్ వెహికల్స్ మంచి కండిషన్‌లో ఉన్నవి అమ్మబడును. (తెలంగాణ రిజిస్ట్రేషన్) సంప్రదించండి. ✆7331191175

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

Wanted_Dealer (Hospital Software). Reasonable Investment. Good Annual Returns Call 7207801864. WWW.BRILLIAT.COM

BUSINESS OFFER

అమరావతి CRDA పరిధిలో రానున్న జింఖానా క్లబ్ కొరకు పార్టనర్స్ & ఇన్వెస్టర్స్ కావలెను. ✆ 62817 64753.

IndiaStudent.Com AI EdTech Pvt Ltd, Franchise Offer: @5L/Dist & We need Invstmnt 5L-5Cr. Good Returns. Ph: 99089 81464

Good Running Car Wash & Detailing Studio for sale in Vijayawada. Contact ✆ 92679 23927.

నో పెట్టుబడి. మీ ఇంటి వద్ద నుండే టీం లీడర్‌గా బిజినెస్ చేయించుచు ఆదాయం పొందండి. డోర్ టు డోర్ మార్కెటింగ్ చేయుటకు, చేయించుటకు. 83175 28192

విజయవాడ కేదారేశ్వరపేట 1వ లైన్‌లో ఫ్యాన్సీ షాపులోని ఐటమ్స్ & లేడీస్‌వేర్ ఐటమ్స్ అమ్మకమునకు కలవు. ఆసక్తి గల షాపువారు సంప్ర. ✆ 81422 30060

FOR SALE

కృష్ణా జిల్లా పామర్రు, గపార్‌సెంటర్లో హాస్పిటల్స్‌కు, ఫంక్షన్ హాల్స్‌కు అనుకూలమైన G+3 బిల్డింగ్ అమ్మకం. ✆ 94400 36242, 73374 41975.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified CO. House Hold Goods Shifting any Time any Where. ✆ 97043 64389.

SOLAR PRODUCTS

PM సూర్యఘర్ 3KW సోలార్ 1,98వేలు బ్యాంక్‌లోన్ 90% - 100% Govt సబ్సిడీ 78 వేలు మిగిలిన 1,20వేలుకి 120 నెలలు EMI 97004 29623

BUILDING CONSTRUCTION

Raghava Associates We Do VMC/ APCRDA/ LRS/ BPS Approvals, Elevations & Structural Designs, Building Contracts. ✆ 98851 12999.

V.S. కన్‌స్ట్రక్షన్స్ ★ కాంట్రాక్టు పద్ధతిన అన్నిరకాల బిల్డింగ్‌లు మెటీరియల్స్‌తో మీరు కోరుకున్న విధముగా కట్టించబడును. అన్ని సివిల్ పనులకు. ✆ 95818 26633

WATER PROOFING

Tarun Slab Leakage works ★ 25y exp. ★ 5yrs warranty ★ Bathroom Leakage Grouting Epoxy works. ✆ 94940 02285, 99516 07504

EDUCATION

COACHING CENTRES

Wisdom Academy Coaching for JEE-Mains, NEET @ S.N.Puram, Vijayawada. Cont. 81257 12665.

HOME TUITIONS

Navabharath Maths Home Tuitions. IX, X, +1, +2, Inter, EAMCET, JEE, IIT, B.Tech. ✆ 63010 48806.

Priya Home Tutions: 6th to 10th (State & Central) and Inter Maths. Specialization in Maths 100% Result. ✆ 93479 28272.

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG, All Objective సబ్జెక్ట్స్ ట్యూటర్స్‌కు. ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్, సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ. ✆ 93969 99669.

ఆస్తి/ వ్యాపారం/ ఆచరణీయ ప్రాజెక్టులు/ NPA విడుదల/ అనారోగ్య యూనిట్లు & టేకోవర్ ROI 1 Cr. ఆపైన ఫ్లెక్సి రుణాలు పొందండి. షరతులు వర్తించే ముందు చెల్లింపులు లేవు. 81110 75733

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్, కప్‌బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్, ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గా ప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★25y exp 5yrs Warranty ★ SmellLess ★ Bayers Chemicals(Pest & Other Insects Control) 94940 02285, 9951607504

ప్రియాంక పెస్ట్ & వాటర్ ప్రూఫింగ్ వర్క్స్ 30 సం|| అనుభవం, 5 సం|| గ్యారెంటీ, వాసనలేని మరకలు పడని బేయర్ కెమికల్స్‌తో చెదలు నివారణ. బాత్‌రూమ్ లీకేజికి ఎపాక్సి గ్రౌటింగ్ పెట్టబడును. ✆ 93932 30136

INDUSTRY

Wanted: Steel Ramp for Puzzolana 200 TPH Stone Crusher Contact: 94907 94677/ 76608 86583.

భారీపరిశ్రమలోని ఉపయోగించని/ పనికిరాని యంత్ర పరికరాలు కొనబడును. ఏదైనా పరిశ్రమ అమ్మాలని/ కొనాలని ఉన్నా సంప్ర|| amaravati.hyd26@gmail.com ✆ 94403 78266.

INDUSTRIAL SHED

1828 Sq.yds Industrial Land @ APIIC Kondapalli, Amaravati, AP with compound wall, 25hp power, 5000 sft shed. Cont: 97046 35917

PEOPLE CARE

OLD AGE HOME

విశ్వశాంతి గ్రూపు VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 99517 51166, 95052 76677

REAL ESTATE

మంచి Investment చేయాలి అనుకుంటున్నారా! అయితే తక్కువ టైంలో ఎక్కువ returns వచ్చే మా రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కంచికచర్ల వెస్ట్ బైపాస్ హైవేను ఆనుకుని 55 ఎకరాల Residential ప్లాట్స్‌నందు invest చేసుకోగలరు. Pre Launching ఆఫర్ కలదు. ఫ్యామిలీతో సైట్ విజిట్ ఫ్రీ. ✆ 81848 96999.

NTR మరియు కృష్ణా జిల్లాల్లో రెసిడెన్సీ, కమర్షియల్ ప్రాపర్టీస్ అమ్మాలన్నా, కొనాలన్నా. ✆ 98484 88999. వెబ్‌సైట్: propertyguru.site.

కృష్ణా జిల్లా ఉయ్యూరు మం. చిన ఓగిరాల గ్రామంలో 9&35 సెంట్లు ఇళ్ళ స్థలాలు, 50&60 సెంట్లు పొలాలు అమ్మకానికి కలవు. (Owner) ✆ 98483 05991.

గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKCరోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచినవారు. 93999 55545.

గుంటూరు సిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అ/కొ. సంప్ర|| 89195 62183.

FLAT FOR SALE

Premium 3BHK Flat 2360 Sq.Ft., Fully Furnished & Ready to Occupy. 2 Car Parkings, Loyola College Road, VJA. ✆ 80999 56788.

Gannavaram 3BHK Flat for sale. 85Lacs 98666 69123, 2BHK 4Flours Building for Sale. 3.5Cr (Under Construction). 76748 19123

VJA, New RTC Colony, E/F, New 2BHK (1400 S.Ft.) Individual Floor & Ayyappa Nagar, E/F & W/F, 2BHK (1100 S.Ft.), Semi Furnished, 100% Loan Approval. 90144 47273

కానూరు మహదేవపురం కాలనీ వద్ద 1400 S.Ft. గల 3BHK డీలక్స్ ఫ్లాట్స్ గృహ ప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 98493 11499, 70328 58359.

విజయవాడ నక్కలరోడ్డు ఆంధ్రహాస్పిటల్ ఆనుకొని 6 ఫ్లోర్ల న్యూకమర్షియల్ బిల్డింగ్ (2024 ప్లాన్), 1 ఫ్లాట్ 2670 Sft. మొత్తం 12 ఫ్లాట్లు అమ్మకము. ✆ 88856 64444, 92479 86114.

విజయవాడ, NTR కాలనీలో అన్ని సౌ||తో గృహప్రవేశంకు సిద్ధముగా ఉన్న ఈస్ట్ ఫేసింగ్ 3 BHK ఫ్లాట్స్ ✆ 93946 26067/ 94903 53541.

VJA రామవరప్పాడు తూర్పు/ పడమర రోడ్లుతో ఫ్లోర్‌కి ఒక్క ఫ్లాట్ చొప్పున నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహ ప్రవేశమునకు సిద్ధముగా కలదు. ✆ 98485 98331

FLAT FOR SALE: West Facing, Fully Furnished 3 BHK New Flat, 1925 Sft, Beside Slate International School, Poranki. Car parking 100 Sft. ✆ 81065 49293.

గన్నవరం సెయింట్స్ జాన్స్ స్కూల్ శ్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన భాను ఎంపైర్ నందు 2BHK ఫ్లాట్స్ రెడీటూ ఆక్యుపై అమ్మకం. ✆ 98481 47485.

టైం హాస్పిటల్‌కి ఎదురుగా బందరురోడ్డుకి అతిసమీపమున అశోక్ నగర్ నందు 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 76800 70510.

మొగల్రాజపురం జమ్మిచెట్టు ప్లాట్ 302 శ్రీరామ్ ప్రియా రెసిడెన్సీ 3 BHK ఈస్ట్ ఫేస్. ✆ 94910 40015

పోరంకి, సాయినగర్‌లో 2500 SFT గల ఫుల్లీ ఫర్నిష్డ్ 1st ఫ్లోర్ ఫ్లాట్ (ఫ్లోర్‌కి ఒకటి మాత్రమే) అమ్మబడును ✆ 94908 67888.

బ్యాంక్ ఆక్షన్‌లో విజయవాడ, గొల్లపూడి, దేవీనగర్, సింగ్‌నగర్, యనమలకుదురు, వెటర్నరీ కాలనీ, తాడిగడపలో అమ్మకమునకు కలవు. ✆ 70134 39314.

సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ,నందమూరి నగర్ మారుతి కార్ల షోరూం వెనుక షిర్డీసాయి హైట్స్‌లో ఫర్నిష్డ్ 3BHK ఫ్లాట్స్ టోటల్‌ప్లింత్ 1,431SFt, 4th ఫ్లోర్, W/F రెడీటుఆక్యుపై @ 53ల బ్యాంక్ లోన్ తో. ✆ 98492 42413

ముత్యాలంపాడు శ్రీనగరకాలనీ, శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ వారి జంపాని హైట్స్‌లో న్యూ 3BHK డీలక్స్ ఫ్లాట్స్ సేల్. రెడీటు ఆక్యుపై ✆ 90520 66846, 80748 15982

పోరంకి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులో కబోర్డ్ వర్క్, కార్ పార్కింగ్, CRDA అప్రూవల్‌తో 2 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 92464 75466.

VJA కొత్త Govt. హాస్పిటల్ దగ్గర, NTR కాలనీలో న్యూ 4 BHK ప్రీమియం ఫ్లాట్ (3200 S.Ft) ఫ్లోర్‌కి 1 ఫ్లాట్ అమ్మబడును. ✆ 79957 29464.

మొఘల్‌రాజపురం వద్ద -2,3 BHK, బృందావన్ కాలనీలో -2, 3BHK, పటమట వద్ద-3, 4BHK, పటమటలో -277 గ|| స్థలం (నో బ్రోకర్స్). ✆ 92999 99714.

విజయవాడ, సింగినగర్, తోటవారి వీధి, ఆంధ్రప్రభకాలనీ చంద్రహాస అపార్ట్మెంట్ 4వ ఫ్లోర్, D2, 2BHK, 1200 Sft ఫ్లాట్ అమ్మకానికి కలదు. 89853 17009.

VJA నిడమానూరులో 2BHK ఫ్లాట్ 30 లక్షలకే, 3BHK ఫ్లాట్ 55 లక్షలకే అమ్మకం ★ ఇంటీరియర్ 1,50,000/- నుండి ప్రారంభం. 91822 43342.

సీతారాంపురంలో 3BHK 89 లక్షలకే సన్‌రైజ్ హాస్పిటల్ ప్రక్క సందులో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న N/F 1350 S.Ft. అమ్మకం. ✆ 98483 48759

2 B/R తూర్పుఫేస్ ఫ్లాట్ అమ్మకం. మిల్క్ ప్రాజెక్ట్, చనుమోలు వెంకటరత్నం బ్రిడ్జ్ దగ్గర, ఇన్నర్‌రింగ్ రోడ్, విజయవాడ. ✆ 81422 45999.

2 BHK వెస్ట్ ఫేస్ 1100 S.Ft. కమర్షియల్ ఫ్లాట్ అమ్మకం. కావూరి టవర్స్, Axis బ్యాంక్ బిల్డింగ్, కామయ్యతోపు సెంటర్. ✆ 81422 45999.

విజయవాడ భారతీనగర్ నందు గృహప్రవేశమునకు సిద్ధముగా 3BHK (3100 SF.t) సెంట్రల్ A/C, 3కార్ల పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 99497 46789.

LIC కాలనీ 3BR E/F 1400S, 72లక్షలు మధురాగార్డెన్స్ 3BR W/F 1100S, 64లక్షలు గుణదల 200చ.గ 1Cr. రెంట్ 12వేలు 98661 38032

కానూరు నవతా ట్రాన్స్‌పోర్టు రోడ్డు ఈస్ట్‌ఫేస్ 3BHK సాయినగర్ క్యాపిటల్ ఎమ్పైర్ ఎదురుగా శ్రీ సాయి రెసిడెన్సీ నందు 2 ఫ్లోర్ 100% వాస్తు, కార్‌పార్కింగ్‌తో ఫ్లాట్లు అమ్మకం. 97016 99983

KANURU

కానూరు, మురళీనగర్, బల్లెంవారి వీధిలో, E/W,న్యూ 3BHK (1400 S.ft) ఫ్లాట్స్ కబోర్డ్స్, కారుపార్కింగ్. 56 లక్షలు. ✆ 89195 70872/ 96428 47736

Sri Lakshmi Nilayam, NTR Marg, Siri Nagar (Opp.Ria Orthopedic Hospital) Just 10 mins from Benz Circle 2BHK 1100 Sq.ft E/F, Car Parking Living: 950 Sq.ft, Site: 48 Sq.Yds Price: 65Lakhs WhatsApp Only: 76720 96106

బందరు రోడ్‌కి దగ్గర్లో కానూరు రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రక్కన 2400SFt గల న్యూ 3BH డీలక్స్ ఫ్లాట్స్ గలవు. 89196 79256, 99898 55219

3BH తూర్పు ఫేస్ డీలక్స్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకానికి కలవు. ★ బల్లెంవారి వీధి, గౌరిశంకర్ నగర్, కానూరు 97017 98726, 89196 79256

TADIGADAPA

బందరు రోడ్డు సిద్ధార్థ Eng. కాలేజి ఎదురు తాడిగడప పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK (1800 S.Ft.) అమ్మకం. (ఫ్లోర్‌కి 1 ఫ్లాట్) ✆ 94400 31268

పోరంకి, నిడమానూరు రోడ్డులో 2BHK (1300 SFt) ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగాకలవు. Car పార్కింగ్, జనరేటర్ 84989 17779, 91691 75959

CURRENCY NAGAR

VJA, కరెన్సీనగర్, డైమండ్ వ్యాలీ లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్లో 2&3&4 BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మబడును. ఏసీలు ఫ్రీ ఆఫర్. ✆ 86884 66789.

RAMAVARAPPADU

2BHK ఫ్లాట్ అమ్మకం 1100SFt, 2nd ఫ్లోరు లిఫ్టు కార్ పార్కింగ్ సౌ||లతో మనస్వినిహైట్స్, చిన్మయి జ్ఞాన మందిరం దగ్గర రామవరప్పాడు. ✆ 83743 34268

2BHK ఫ్లాట్స్ బల్లెం వారి St Medplus GF 800 plinth ఉత్తరం 22L SF 850 plinth West 25L. ✆ 79957 69538, 92464 93458.

TADEPALLI

విజయవాడ తాడేపల్లిలో 300 గ|| లలో 4ఫ్లోర్స్ బిల్డింగ్‌లో 1st ఫ్లోర్ 3BHK రెడీటు ఆక్యూపై RS. 1.62 CR Negotiable ✆ 98480 82879.

GOLLAPUDI

గొల్లపూడి వస్త్రలత కాలనీ, వెస్ట్ బైపాస్ దగ్గర, గేటెడ్ కమ్యూనిటీలో 2&3 BHK ఫ్లాట్స్ జిమ్, స్విమ్మింగ్ పూల్ సౌకర్యంతో అమ్మకంనకు కలదు. ✆ 92464 72524

SATYANARAYANAPURAM

VJA , సత్యనారాయణపురం, మాచే నూతనంగా నిర్మించిన 2 BHK డీలక్స్ ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధముగా కలవు. ✆ 94403 57164, 98666 01999.

VJA సత్యనారాయణపురం BRTS రోడ్ దగ్గరలో 1,200 S.ft న్యూ 2BHK ఫ్లాట్స్ 90% బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకంనకు కలవు. ✆ 91338 15555

HOUSE FOR SALE

Independent House for sale. Nethaji Street, Sitharampuram, VZA. Near Anil estate. E/F, 279 Sq.Yd. Suitable for both resi & comm purpose. Prime location. Clear title. Ph: 8790277465

VJA, బందరురోడ్డుకి దగ్గరలో అశోక్‌నగర్‌లోని కాకతీయ బజారు నందు 242 గజాలలో G+1 ఇల్లు అమ్మకం. ✆ 83416 37777, 77027 74977

కృష్ణలంక, నెహ్రూనగర్, పోస్టాఫీస్ వీధిలో 227 చ||గ||లో 2 అంతస్తుల భవనం అమ్మకమునకు కలదు నోబ్రోకర్స్. ✆ 94408 01891,93984 19309

మొగల్‌రాజపురం, అమ్మ కళ్యాణ మండపం దగ్గర, సయ్యద్ బిర్యానీ వెనుక E/F, 72 గ.లలో G+1, పెంట్ హౌస్ బిల్డింగ్స్-2 అమ్మబడును. ✆ 92907 04186.

VJA భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో 2019 కన్‌స్ట్రక్షన్ G+1; HIG: 207 సౌత్ ఫేస్ హౌస్ అమ్మకంనకు కలదు. ✆ 88975 63506.

VJA చిట్టినగర్ Frizerpet Dr. No:5-7-13 నందు 112 చ.గ.లలో G+1 ఇండివిడ్యువల్ బిల్డింగ్ 70 లక్షలకే అమ్మకం. ✆ 98662 52947

3BHK 153 చ.గ. (25x55) W/F CRDA అప్రూవ్డ్ (G+1) 30 Ft. రోడ్ కబోర్డ్స్ సౌ.లతో అమ్మకం. కోడూరు కాలనీ, యనమలకుదురు. ✆ 82478 16275.

చిన్న అవుటపల్లి పిన్నమనేని మెడికల్ కాలేజ్ ఎదురు రోడ్లో 330 చ||గ|| G+4 నార్త్ ఈస్ట్ కార్నర్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. ✆ 93472 52488.

VJA పెదపులిపాక రోడ్డు యనమలకుదురులో 96 గ||లలో 2B/R న్యూ G+1 బిల్డింగ్ గృహప్రవేశానికి సిద్ధంగా గలది అమ్మబడును. ✆ 92471 78887.

250గ||లలో డాబాఇల్లు 2 పోర్షన్స్ క్రింద. పైన 1 పోర్షన్ రేకుల షెడ్ గజం 25 వేలు మచిలీపట్నం నేషనల్ కాలేజ్ దగ్గర అమ్మకం ✆ 89785 42665

107.5 చ||గ||లలో పడమర 2BHK గ్రౌండ్‌ఫ్లోర్ RCC ఇల్లు దేవినగర్ ఆరవలైనులో అమ్మకము. కొనుగోలు దారులు మాత్రమే సంప్ర ✆ 90300 27833.

కుమ్మరిపాలెం, గుప్తా సెంటర్, బస్టాపు ప్రక్కన స్థలం రేటుకే G+2 బిల్డింగ్ (72 వేలు అద్దెలు) విడిగా / మొత్తంగా అమ్మకం. 1, 2 ఫ్లోర్లు 65 ల. ✆ 98498 31931

విజయవాడ ప్రసాదంపాడు బల్లెం వారి వీధిలో పెట్రోల్‌బంక్ దగ్గరలో 135 చ.గ.ల్లో G+2 బిల్డింగ్ ఒకొక్క ఫ్లోర్‌కి 2BHK అమ్మకం. 80740 23492.

CURRENCY NAGAR

VJA, Ramavarappadu Ring: E/F G+1+1 House in 214 Sq.Yards & 190 Sq.Yards Open Plot for Sale. ✆ 98800 79199, 97406 05740.

LAND FOR SALE

1100 Sq.Yds VUDA Plot 50% for Joint Development & 50% for Sale in Guntupalli Vijayawada. Ph: 7075749377

మెగా అవకాడో ఫామ్‌ల్యాండ్ 11సెంట్లు 6లక్షలు. 5వ సం- 40 సం||వరకు ఏటా 2-5 లక్షల ఆదాయం. 5ఎకరాల క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్ ✆ 9398621767.

1Acr Farm Land with N/E Facin 1000 Sft. House Nr. Pusapatirega 4KM from NH-5 Nr. Bhogapuram Airport. 8125499995/ 8499961919

Land for Development/outright sale for apartments only in Kankipadu Town , Just 750 meters from RTC Bus Stand, Godavarru Main Road Area: 60 Cents/2831 Sq.Yards, Call for More Details: Mr. Srikanth Hyderabad Ph: 7661977789

Machilipatnam Sale of Land 1725 Sq.Yds with builidgs old & New, Rd -2, Bhaskarpurm. Price Rs 35000/- Per Sq yd Direct party.Contact- 7780715986, 9246545366.

450ఎకరాల్లో ★ అవకాడో ★ ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 6 లక్షలకే ★ 5వసంవత్సరం నుండి సంవత్సరానికి 2 లక్షలు ఆదాయం పొందండి ✆ 9133574455

గుడివాడ మండలం కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 20 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. ✆ 93462 81147, 83676 38755.

తూర్పు గోదావరి జిల్లా లింగంపర్తిలో గల వైఆర్‌సి కాలువ అనుకుని 52 ఎకరాల వ్యవసాయ భూమి ఎకరం 35 లక్షలకు అమ్మకానికి కలదు. (నదిపాటి గోశాలకు 2 కి.మీ. దూరం) ✆ 93909 91555

NTR జిల్లా, గంపలగూడెం మం|| గోసవీడులో 4 1/2 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకము. బావి, కరెంట్ సౌకర్యం. రోడ్డు ప్రక్కన పొలం. Ph: 95603 06359.

RAMAVARAPPADU

రామవరప్పాడు ఇన్నర్ రింగ్ రోడ్ దగ్గర లేఅవుట్లకు అనుకూలమైన ఎకరం భూమి అమ్మకానికి కలదు. కాల్ : 7288861234.

PLOT FOR SALE

Gunadala, Near Prime Avenue Jewel City, HP Petrol Bunk, Layout East & West 200, 400 Sq.Yards Plots. ✆ 88825 79999.

Site for Sale, 65 Cents doctor own land near Kothavalasa, Visakhapatnam ✆ 9440239894, 9108685818.

గన్నవరంలో పాలిటెక్నిక్ నుండి హైవేకి వెళ్లే ఉత్తరం రోడ్డులో 5 ప్లాట్ల తరువాత 3 సెంట్స్ అమ్మకమునకు కలదు. ✆ 73829 02887, 96404 41792

హైదరాబాద్: పటాన్‌చెరు, ఇంద్రేశం, వికాస్ సొసైటీ, రామేశ్వరబండ, ఐనోలు, ఈదుల నాగులపల్లి, గౌతమినగర్, కొల్లూరులో ప్లాట్లు అమ్మదలచినవారు సంప్ర: 8555863999.

పునాదిపాడు మద్దాలి తిరుమలరావు గారి వెంచర్‌లో ప్లాటు నెం: 29Bలో 400 చ||గ||ల వెస్ట్ ఫేస్ స్థలము (కాలేజ్ గోడని ఆనుకుని) అమ్మకం ✆ 98487 14252

హరివిల్లు గేటెడ్ కమ్యూనిటీలో క్లబ్ హౌస్,CCరోడ్స్‌తో విల్లాస్ & విల్లా ప్లాట్స్ పెనమలూరు, గన్నవరం, గండిగుంట, మచిలీపట్నం, ఆగిరిపల్లి, పరిటాలలో ✆ 99633 28823

విజయవాడసిటీ రామవరప్పాడులో 350 ఎకరాల మెగా టౌన్‌షిప్ ఇంటర్‌నేషనల్ స్కూల్ స్టార్‌హోటల్ సౌకర్యాలతో CRDA ప్లాట్స్ అమ్మకంనకు కలవు. ✆ 77888 99999

హరివిల్లు ప్రీమియం Gatedలో హై రిటర్న్స్ ప్లాట్స్ @ పరిటాల, గన్నవరం, అంబాపురం, పెనమలూరు, ఆకునూరు పోర్ట్ మచిలీపట్నంలో ప్లాట్స్ డైరెక్ట్ ✆ 78937 66996

పొట్టిపాడు టోల్‌గేట్‌కి 1/2 Km తారు రోడ్డు ప్రక్కన సెంటు 1,95,000, మామిడి తోట సెంటు 65,000, ఇళ్ళ ప్రక్కన సెంటు 1,60,000/- ✆ 93903 15739

VJA ORR దగ్గర, ఆకునూరులో బందరురోడ్డు 700 మీ.లో, CRDA లేఔట్ సిగ్నేచర్ Park హైరిటర్న్స్ ప్లాట్స్ గ.12,999. లోన్ సౌ ✆ 9160312999

VJA పటమటలంక SBI ప్రక్కరోడ్డు నందు 67 X 41 కొ||తో పడమర ఫేస్ 307 చ||గ||ల స్థలము అమ్మబడును. సంప్ర: 98487 14252

AP రాజధాని అమరావతిలో SRM&VIT & హైకోర్ట్ వద్ద &TTD & మంతెన సత్యనారాయణ ఆశ్రమం ఎదురు న్యూ సీడ్ ఆక్సిస్ రోడ్‌కి దగ్గరగా 210, 360, 600,1000Sq. ప్లాట్లు రిజనబుల్ ధరకే. ✆ 92907 63488

2700yds p/yd: 50,000 Eluru main road Before Kamineni Hospital & Guntur Main rd Highway 1200sq.yd P/yd: 40000/-. Ph: 984905 5557

Site about 410.22 Sq.yds. Facing Main Road, In prime Location, Vijayawada, Capital City. Machavaram Carl Marx Road (Eluru Road), Near Anjaneya Swamy Temple, Genuine Buyers only. Contact Ph: 9448750674. Brokers Excuse.

బందరురోడ్డు, పోరంకి, ఈడుపుగల్లు, ఆకునూరు, పామర్రు (హైవేఫేస్) ఏలూరు రోడ్డు, గూడవల్లిలో ఓపెన్ ప్లాట్స్, విల్లాలు అమ్మకానికి కలవు ✆ 97012 84449.

బందరురోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్ సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ||గ|| ప్లాట్ అమ్మకమునకు కలదు సంప్ర : 98483 43355.

విజయవాడ మధురానగర్ పప్పులమిల్లు ఎదురు రోడ్డులో 140 గజాల రేకులషెడ్ ఉత్తరం రోడ్డు21×60 కొలతలు గల స్థలం అమ్మకం.సంప్ర ✆ 9866121779

VJA, పెనమలూరు CRDA LP No.104/25 ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 94404 83810.

మచిలీపట్నం ఆటోనగర్ ప్రక్కన పోతేపల్లిలో మెయిన్‌రోడ్ ప్రక్కన రైల్వేగేటుకు దగ్గరలో తూర్పు ఉత్తరం ఫేసింగ్‌తో 440చ||గ|| స్థలం అమ్మబడును. ✆ 90301 62444

VJA పోరంకి 40 అ. రోడ్స్ CRDA గేటెడ్ కమ్యూనిటీలో 174, 220, 330, 500 గ. ప్లాట్లు చ.గ. 28,500/- స్పాట్ Reg. బ్యాంక్‌లోన్‌తో ✆ 98498 65959

అమరావతి రాజధానిలో 200 అ. ORRకి దగ్గరగా మరియు హరివిల్లువారి అన్ని CRDA వెంచర్లలో 200, 300, 400 గ. డైరెక్ట్‌సేల్. ✆ 92464 73929

మచిలీపట్నం పోర్ట్ రోడ్ సర్కిల్ పేటలో 7 సెంట్స్ స్థలము అమ్మకానికి కలదు. సెల్ నెం: 9494031133

మంగళగిరి దగ్గర నవులూరు నందు CRDA Layout (MIG Layout)లో 200 Sq. Yards అమ్మకంనకు కలదు. ✆ 99087 39516.

VJA హరివిల్లు క్వాలిటీ డెవలప్‌మెంట్స్ గల అప్రూవ్డ్ ప్లాట్స్ మచిలీపట్నం, గన్నవరం, అంబాపురం, పరిటాలలో ప్లాట్స్ కంపెనీ సేల్ ✆ 95427 56666.

హరివిల్లువారి మెగా గేటెడ్ కమ్యూనిటీ గండిగుంట, గన్నవరం, ఆగిరిపల్లి, పరిటాల, మచిలీపట్నం వెంచర్లలో కంపెనీ డైరెక్ట్ సేల్. ✆ 70368 25555.

విజయవాడ-అంబాపురం జగన్మాత ఇండస్ట్రీస్ ప్రక్కన R.S.No.104/2 నందు తూర్పుఫేస్ 336 చ||గ|ల స్థలం అమ్మకం. సంప్ర. ✆ 79894 66969.

విజయవాడ పాయకపురం డాక్టర్స్ కాలనీ నందు Dr. S.V.K. సత్యనారాయణమూర్తి గారి పేరున ఉన్న ప్లాట్ నెంబర్: 35, తూర్పు ఫేసింగ్ 54'X80' కొలతలు అనగా 480 చ||గ||ల స్థలము అమ్మకమునకు కలదు. కావలసిన వారు సంప్రదించండి. S.G.S సూర్యకుమార్ పాలకొల్లు, Cell: 94405 72380.

2.5/ 3.5 లక్షలకే 1 సెంటు వెస్ట్‌బైపాస్‌కి 3KM నున్న గన్నవరం, మల్లవల్లి, నందిగామ, కంకిపాడు, తాడేపల్లిలలో 2/3 BHK విల్లాస్ ✆ 83749 36634

పోరంకి బందరు రోడ్డు పద్మావతి గార్డెన్స్‌లో తూర్పుఫేస్ 38x63 కొ||తో 270 చ||గ||లు అమ్మకం. చ||గ|| 42,000/- (నో బ్రోకర్స్) ✆ 93462 22427.

గురునానక్‌కాలనీలో 282చ|| బెంజ్‌కంపెనీ దగ్గర 175 గ|| ఇల్లు, మధురానగర్‌లో 740 గ|| కంచికచర్లలో 6ఎ, 3ఎకరాలు, 15సెంట్లు. ✆ 9848088338

విజయవాడ గుణదల VMC లేఅవుట్‌నందు, ప్లాట్ నెం.254, తూర్పుఫేస్, 40 అ||రోడ్డు, 120 చ||గ|| ప్లాటు అమ్మబడును. ★ చ||గ|| 35,000/- ✆ 94406 61789

పెనమలూరు కమర్షియల్ ల్యాండ్ 275 చ||గ|| పోరంకి సీతాపురం కాలనీ 165 చ||గ|| అయ్యప్పనగర్ 192 చ||గ|| పటమట 282 చ||గ|| ప్లాట్లు. ✆ 9396203890

లైరా కన్సల్టెన్సీ, గురునానక్ కాలనీలో 390, 530, 315 గ., పటమటలో 290 గ., LIC కాలనీలో 315 గ., లబ్బీపేటలో 311 గ. ✆ 94919 57844

కంచికచర్ల మం. గొట్టుముక్కల గ్రామ మెయిన్‌రోడ్ పంచాయితీ ఆఫీసు ఎదురుగా కమర్షియల్ రెసిడెన్సీకు అనువైన 512.5 చ.గ. స్థలం అమ్మకం. 94404 88334

కార్తీకమాస స్పెషల్ ఆఫర్ చ||గ|| 3900/- ORR ప్రక్కన VJAకు అతిదగ్గరలో (కంచికచర్ల) వెంటనే గృహ నిర్మాణం. ఆఫర్ కొద్ది రోజులు. ✆ 93816 91391

133.33 Sq.Yds కేవలం 1,00,000/- మాత్రమే వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

పెనమలూరు ఫైస్కూల్ దగ్గర Eఫేస్ 246 చ||గ|| కంకిపాడు PLR N ఫేస్ 266 చ||గ|| ఆకునూరులో 205, 216, 275 చ||గ|| ప్లాట్లు అమ్మకం ✆ 99898 47919.

కంకిపాడు- ఉయ్యూరు CRDA గ || 10,000,Non- CRDA గ|| 5700/- కంచికచర్లలో గ|| 4500, 6499, CRDA 9499/- ✆ 72073 17577.

TADIGADAPA

VJA జనచైతన్య వెంచర్స్‌లో రీసేల్ ప్లాట్లు అమ్మకం. తాడిగడప 100Ft. రోడ్డు & పోరంకి నిడమానూరు రోడ్డులో సాయిలక్ష్మి, సాయివిజయ వెంచర్స్‌లో 200, 400, 600 గ|| ప్లాట్లు అం., గంగూరు చేపలకుంటల 200 అ|| రోడ్డుకి 6వ ప్లాటు గ|| 25,000. ✆ 9290763488.

GANNAVARAM

NH-5 టోల్‌గేట్ దగ్గరలో గన్నవరంకి 4km దూరంలో పొట్టిపాడు గ్రామంలో అమృతగార్డెన్స్ నందు 234 గజముల లేఅవుట్ ప్లాట్ అమ్మకం. ✆ 88856 12593

GOLLAPUDI

విజయవాడ గొల్లపూడిలో జనచైతన్య వెంచర్స్‌లో రీసేల్ ప్లాట్లు అం. వస్త్రలత కాలనీ & వెస్ట్ బైపాస్ వద్ద గల సాయిశక్తి, సాయిశంకర్ కాలనీలలో 200,400 గ. ప్లాట్లు అం & ఎండోమెంట్ ఆఫీస్ వెనుక కల్పతరువు, RTC కాలనీలలో 200, 400గ.& ఎటికిన్సన్ స్కూల్ వద్ద సీతారామ సొసైటీ, నందిని, సాయిప్రగతిలలో 200, 360, 600 గ. అం. ✆ 92907 63488

NUNNA ROAD

256 చ||గ|| స్థలం తూర్పు (East) సింగ్‌నగర్ మెయిన్ రోడ్డుకి 130 మీటర్ల దూరంలో విజయవాడ NTR. Ph.: 9063781000, 9154542000.

COMMERCIAL SPACE FOR SALE

నందిగామ, చందాపురం బైపాస్ రోడ్‌కి కమర్షియల్ బిట్ 1000 చ||గ|| అమ్మకానికి లేదా డెవలప్‌మెంట్‌కు కలదు. సం||ప్ర|| ✆ 9849546408.

విజయవాడ ఆటోనగర్ 100 అ|| రోడ్డు (వెస్ట్) ఫేసింగ్‌తో 450 చ||గ||ల కమర్షియల్ స్పేస్ (నెలకు 60,000 అద్దెలతో) అమ్మకం. ✆ 70750 66789.

Above 10,000 S.Ft. Plus House Built in 428 Sq. Y in Commercial Area Close to Bundar Rd & Pantakaluva Rd, P&T Colony-3 Suitable for Commercial Purpose. ✆ 94915 44908

విజయవాడ గొల్లపూడి మార్కెట్ యార్డ్ దగ్గర నూతనముగా నిర్మించిన కమర్షియల్ షాప్స్ 35 లక్షలకే అమ్మకం. Ready to Occupy. ✆ 99851 51976.

గన్నవరం దగ్గర వీరపనేని గూడెంలో 1 ఎకరం 33 సెంట్లు స్థలంలో గల ఇండస్ట్రియల్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. ✆ 93472 52458.

SHOP FOR SALE

Shop For Sale: Gummadi Complex Shop No: 3, 160 Sqft Besant Road. VJA (No Brokers) ✆ 98481 54312.

LEASE/ RENT

WANTED

విజయవాడ కానూరు, పోరంకి, తాడేపల్లి, కుంచనపల్లి ఏరియాలలో 200 గ|| నుండి 600 గ||ల డెవలప్‌మెంట్‌కి స్థలము కావలెను. ✆ 79937 96999.

LEASE/ SALE

చిట్టినగర్ వైశ్యాకాలనీలో 3 అంతస్తుల బిల్డింగ్‌లో 3 పోర్షన్లుగా అమ్మకం లేదా అద్దెకు. కృష్ణలంక శంకరమఠంవీధిలో గ్రౌండ్ & ఫస్ట్‌ఫ్లోర్లు అద్దెకు ✆ 98481 10301, 9246375420

TO LET

అశోక్‌నగర్ టైం హాస్పిటల్ ఎదురు ధనేకుల మేలిమి వారి వీధిలో 1st ఫ్లోర్ నందు 3 BHK ఇండిపెండెంట్ హౌస్ అద్దెకు కలదు. ✆ 95153 32780.

VJA S.N పురం ఓల్డ్ CID ఆఫీస్ రోడ్డులో ఇండిపెండెంట్‌హౌస్ (3 BHK 1, 2 ఫ్లోర్లు Each 2,300 SFT) రెసిడెన్సీ/ కమర్షియల్స్‌కు అద్దెకు ✆ 99594 41358, 95020 86956.

గుణదల ఫ్లైఓవర్ నుండి ముస్తాబాద్ వెళ్ళు రోడ్డులో అర ఎకరం ఖాళీస్థలం గోడౌన్, వేర్‌హౌస్, ఇండస్ట్రియల్ పనులకు అద్దెకు ఇవ్వబడును. ✆ 94410 86870/ 91009 93761.

Flat 4th Floor, Plot No.158-159, Varalakshmi Nilayam, Trendset Medows, Devi Nagar, 8th Line, Vijayawada. ✆ 98480 68666.

3bhk flat with car parking at Maruthinagar. Employees with small families preferred. ✆ 9948789554

మచిలీపట్నం ముస్తాకాన్‌పేటలో న్యూ ఇండిపెండెంట్ బిల్డింగ్ 2 BHK గ్రౌండ్ ఫ్లోర్ అద్దె/లీజు కలదు. 9,500/- ✆ 94412 50042, 98491 67170.

కానూరు KCP కాలనీ నియర్ సిద్ధార్థ ఇంజినీర్ కాలేజి హౌస్‌నెం28, 1300 SF.t ఫస్ట్‌ఫ్లోర్ 2BHK ఫ్లాట్ ఎంప్లాయిస్‌కు అద్దెకు కలదు. ✆ 98663 36928

Old 5 బస్సు రూట్ 2nd క్రాస్ రోడ్ ITI కాలేజ్ బస్ స్టాప్ 2nd లెఫ్ట్ G/F 3B/R హౌస్ అద్దెకు ✆ 94409 96750, 92464 77680.

3BHK ఫ్లాట్ 2nd ఫ్లోర్ సాయిప్రేమ రెసిడెన్సీ సూర్యారావుపేట ప్రకాశం రోడ్డు విజయవాడ కార్ పార్కింగ్, లిఫ్ట్, కప్‌బోర్డ్స్ సౌకర్యంతో అద్దెకు కలదు. ✆ 98661 47977.

పోరంకి సాలిపేట రోడ్డులో పద్మావతి గార్డెన్స్ సమీపంలో SGR టవర్స్ నందు ఫుల్లీ ఫర్నిష్డ్ 3BHK ఫ్లాట్ అద్దెకు కలదు. ఫోన్: 90104 21505.

COMMERCIAL

42000 Sq.Ft Godown available for Rent in Telaprolu, 10kms from Vijayawada Airport Rs: 12 Per Sq.Ft. ✆ 63013 39091.

Srinagar Colony-Hyderabad behind Big Bazar Office space 800 Sft on 2nd Floor with Stilt Parking only for 2 Wheeler for long term Rental. Well Designed, Good Quality, Teakwood Doors, Marble Floored with Good Fittings. BCB Reddy. 9444391787.

కొత్తపేట బ్రాహ్మణవీధి నందు మెయిన్ రోడ్డులో సుమారు 1000 చ.అ. విస్తీర్ణముగల బిల్డింగ్ గ్రౌండ్‌ఫ్లోర్ ఆఫీస్/గోడౌన్ కొరకు అద్దెకు కలదు. ✆ 94495 99028.

గోడౌను అద్దెకు 1300 SF.tగల PACS గోడౌన్ తోట్లవల్లూరులో అద్దెకుకలదు VJA, బెంజిసర్కిల్ నుండి 23km ఉయ్యూరు నుండి 8km. ✆ 94901 79306

గాంధీనగర్ డి- మార్ట్ ప్రక్కన అద్దెకు. (27 54) 1,458 Sft ఆఫీస్, C&F, డిస్ట్రిబ్యూటర్స్, ప్రింటింగ్ ప్రెస్ , గోడౌన్‌లకు అనుకూలం ✆ 98487 74420

VJA గాంధీనగర్ స్వామివీధి, రాజ్‌యువరాజు థియేటర్ దగ్గర 1,500 S.ft & 800 S.ft గ్రౌండ్‌ఫ్లోర్ C&F గోడౌన్/షాప్స్‌కు అద్దెకు కలవు. ✆92464 72524.

WANTED

విజయవాడలో ప్రముఖ ప్లే స్కూల్ కోసం 450-500 గజాల Independent House లేదా డూప్లెక్స్ హౌస్ కావలెను. Contact: 9667899196.

JOBS

Wanted Faculty Social, English, Maths for 6th to 10th Classes ✆ 90101 60282. Interview Dates 10th NOV to 15 NOV. 10AM to 3PM. @ THE BRILLIANTS E.M. HIGH SCHOOL, Road No.2, Veterinary Colony, Vijayawada.

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama (Freshers) Contact: ✆ 94324 54545.

డెంటల్ డాక్టర్లు కావలెను. త్వరలో ప్రారంభం కాబోతున్న డెంటల్ క్లినిక్ గ్రూప్‌నకు MDS (Endodontist), BDS, ఫ్రెషర్స్ 20 Nos కావలెను. ✆ 83090 87864.

ప్రముఖ వెండి సంస్థలో అకౌంటెంట్ కావలెను. Tally, డేటా ఎంట్రీ నందు అనుభవం వుండవలెను వెండిసంస్థలో పనిచేసేవారికి ప్రాధాన్యత. ✆ 90304 84545, 91338 42592.

విజయవాడలో కరెంటు మీటర్లు మార్చుటకు అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్స్ కావలెను. వీక్లీ పేమెంట్స్ ✆ 97035 51122, 94929 40505.

విజయవాడ & మచిలీపట్నం ప్రముఖ రియల్ ఎస్టేట్‌లో రిసెప్షనిస్ట్ (F) సిస్టమ్ ఆపరేటర్ (F) అకౌంటెంట్ (F) టెలికాలర్స్ (F) కావలెను. ఆకర్షణీయమైన జీతము + ఇన్సెంటివ్. సంప్ర: ✆ 88852 92227.

MORE CLASSIFIEDS ON PAGES 8

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? స్థానిక చెరువు బజారు, గుడి సెంటర్‌లో మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దోమలతో అవస్థలు పడుతున్నాం. - నాగేశ్వరరావు, గ్రామస్థుడు

✔ సమస్య తెలిసింది. సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. -బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం

★ స్థానిక పంచాయతీలోని 13 వార్డులో సిమెంట్ రహదారి వెంట ఉన్న డ్రెయినేజీలో పూడిక పేరుకుపోయి మురుగు పారడంలేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు తెలిపిన సమస్యను కార్యదర్శి ఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. శనివారం పంచాయతీ సిబ్బంది పంపి శుభ్రం చేయించారు.



★ పట్టణంలోని 5వ వార్డులోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి దోమలు వృద్ధి చెంది ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ... టౌన్ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి మురుగు నీటిలో దోమల నివారణ మందు చల్లించారు.

★ విస్సన్నపేట కుక్కడపు వారి వీధి ముఖ ద్వారం వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపిన సమస్యను ఈవో కేశవ హరికృష్ణ కుమార్‌కు వివరించగా స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం, తిరువూరు టౌన్, విస్సన్నపేట

ఆలయంలో హుండీల చోరీ

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పొందుగల సమీపంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీలను ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఆలయ తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపల పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో సుమారు రూ.4000 కానుకలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆలయానికి సమీపంలో ఒక తోటలో నివాసం ఉంటున్న వ్యక్తి ఇంట్లోనూ రూ.5000 నగదు అపహరించినట్లు బాధితులు చెప్పారు. సంఘటనా స్థలాలను ఎస్సై కే సుధాకర్ పరిశీలించి నిందితుల కోసం సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

జి.కొండూరు, న్యూస్‌టుడే: ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కవులూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జవ్వా వెంకటేశ్వరరావు తెలిపారు. మధుమేహం, రక్తపోటు, సాధారణ జబ్బులకు పరీక్షలు చేసి నెలరోజులకు ఉచితంగా మందులు అందిస్తామని, మండల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అన్నేరావుపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 60 పశువులకు వైద్యసేవలు అందజేసినట్లు రెడ్డిగూడెం పశువైద్యాధికారి డాక్టర్.తులసి తెలిపారు. ఎ.కొండూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్.కె.రామారావు, డీఎల్‌డీపీ ఏడీఏలు డాక్టర్.కె.సునంద, డాక్టర్.కె.రాధిక, సర్పంచి బి.ప్రశాంతి, తెదేపా నాయకులు బి.రమేష్, డి.వేణు పాల్గొన్నారు.

సొంతింటి కల.. సాకారమిలా

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న పేదల సొంతింటి కల సాకారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. వీరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై-2.0) పథకం ద్వారా ప్రభుత్వం గృహాలు మంజూరు చేయనుంది. లబ్ధిదారుల నమోదు గడువు ఈ నెల 5 తో ముగిసినా నెలాఖరు వరకు పొడిగించాయి. ఇంకా ఎవరైనా నమోదు కావాలంటే వెంటనే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని అధికారులు సూచిస్తున్నారు.


మూలపాడులో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

...న్నారు. సర్వేలో గుర్తించిన అర్హులను సంబంధించిన ఆధార్, కుల ధ్రువపత్రాలతో పాటు బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలతో పీఎంఏవై-2.0 పోర్టల్ నమోదు చేస్తున్నారు. ఇలా నమోదైన వారిని గృహాలు మంజూరు కేంద్రస్థాయిలో పర్యవేక్షణ కమిటీ సమీక్షిస్తుంది. తల్లి భాగస్వామ్యంతో ఆర్థిక చేయూత అందించి గృహాలను కట్టించేందుకు చర్యలు చేపట్టింది.

ప్రత్యేక సర్వేలు చేసి..

గ్రామాల్లో సొంతిల్లు లేని వారిని గుర్తించేందుకు అధికారులు రెండు నెలల కిందట సర్వే చేపట్టారు. ఇందులో ఎక్కువ మంది పేదలకు ఇల్లు లేదని తెలిసింది. తదనుగుణంగా మరిన్ని గృహాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయగా అందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. పీఎంఏవైజీ 2.0 కింద గృహ నిర్మాణ అధికారులు మరో మారు ప్రత్యేక సర్వే చేశారు. దీని ద్వారా అర్హులైన కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభు...

208 మంది నమోదు

ఇప్పటికే ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంతో పాటు కొండపల్లి పురపాలికలో ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేపట్టి అర్హులను గుర్తించారు. అందులో సొంత ఖాళీ స్థలం ఉండి గృహనిర్మాణానికి ఆసక్తి చూపే కుటుంబాలను ఎంపిక చేసిన వారిని అర్హులుగా నమోదు చేశారు. వీరిలో పీఎంఏవై-2.0(అర్బన్) పథకం ద్వారా ఇళ్ల మంజూరుకు 92 మందిని పీఎంఏవై-2.0(గ్రామీణ్) కింద 116 మందిని గుర్తించగా విడతలవారీగా వీరికి ప్రభుత్వ గృహాలు మంజూరు చేస్తారని గృహనిర్మాణ సంస్థ అధికారులు చెబుతు...

ఇలా చేయండి: సీహెచ్ నాగరాజు, పీఈ, గృహనిర్మాణ సంస్థ, ఇబ్రహీంపట్నం

సర్వేల్లో పేర్కొన్న ఇల్లు కావాల్సిన వారు సమీప సచివాలయాల్లో ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించాలి. వారు ముఖాముఖంతో లబ్ధిదారుడి వివరాలు నిక్షిప్తం చేశారు. ఈ పథకంలో సొంత స్థలంలో గృహనిర్మాణం కోసం పట్టణ ప్రాంతంలో ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.2.50 లక్షలు చొప్పున, గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయనుంది.

10న కౌన్సిల్ అత్యవసర సమావేశం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మున్సిపాలిటీ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఛైర్‌పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ కె.మనోజ శనివారం తెలిపారు. సాధారణ పరిపాలన, పట్టణాభివృద్ధి, పలు వార్డుల్లో నెలకొన్న తాగునీరు, వీధిదీపాలు, మురుగునీటి వంటి సమస్యలపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొంటారని వివరించారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


కాలువలో నిలిచిపోయిన లారీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. పోలీసుల సమాచారం మేరకు.. ఇబ్రహీంపట్నం వైపు నుంచి విజయవాడ వస్తున్న మినీ లారీ డాన్‌బాస్కో పాఠశాల వద్ద వేగంగా డివైడరును ఢీకొట్టి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లి రహదారి పక్కనున్న మురుగు కాలువలోకి వెళ్లి నిలిచిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇబ్రహీంపట్నం ఎస్సై విజయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం..

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరులోని ప్రముఖ ఆలయాలైన వెంకటేశ్వర, రామలింగేశ్వర స్వామి దేవాలయాలకు ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ శావల దేవదత్ హాజరయ్యారు. వెంకటేశ్వరస్వామి దేవాలయ ఛైర్మన్‌గా పర్వతం శ్రీను, కమిటీ సభ్యులు, రామలింగేశ్వర స్వామి దేవాలయ ఛైర్మన్‌గా జంగాల మురళీ కృష్ణా, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నిబంధనలకు కట్టుబడి ఉంటామన్నారు.

తెదేపా నాయకుల నివాళి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మాజీ హెడ్ కానిస్టేబుల్ (ఇంటిలిజెన్స్ విభాగం) చెడుగోండి శ్రీనివాసరావు (60) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య సరస్వతి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, ప్రస్తుతం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా ఉన్నారు. శ్రీనివాసరావు తెదేపాలో సీనియర్ నాయకుడు కావడంతో పలువురు నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరులోని తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మందికి రూ.15.44 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 19 విడతలుగా తిరువూరు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్, ఎల్వోసీల ద్వారా పేదలకు వైద్య సదుపాయం కోసం రూ. 4,78,80,243 అందించినట్లు తెలిపారు. పురపాలిక ఛైర్‌పర్సన్ కె.నిర్మల, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య, తెదేపా నాయకులు బి.ఉమామహేష్, సింధు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని గంగినేని గ్రామానికి చెందిన కొమ్మినబోయిన సైదులుకు రూ. 23,400 సీఎం సహాయనిధి చెక్కు మంజూరు కాగా మండల అధ్యక్ష, కార్యదర్శులు వేముల కొండ వెంకటేశ్వరరావు, లంకా నాగేశ్వరరావులు శనివారం అందజేశారు. గంగినేని పీఏసీఎస్ అధ్యక్షుడు మంగలంపాటి వెంకటేశ్వర రావు, శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

అన్నదాన ప్రభువే.. శరణం అయ్యప్ప


జి.కొండూరులో ప్రత్యేక అలంకరణలో వేదిక


తిరువూరు అయ్యప్పస్వామి గుడి వద్ద మహా పడిపూజలో భక్తులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక పార్వతీ సమేత అమృత లింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శనివారం అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. మండలంలోని అయ్యప్ప మాలధారులు, మహిళలు గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపిస్తూ భజన చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు సద్ది ఏర్పాటు చేశారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి గుడి 28వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. తిరువూరు పరిసర గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షధారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణ, పాటలతో ఆ ప్రాంతం మార్మోగింది. గుడి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజారావు, కె.సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

◆ ఎవరికి వారే యమునా తీరే

కేతనకొండ మండల పరిషత్తు పాఠశాల ప్రహరీ పక్కనున్న జాతీయ రహదారి మురుగు కాలువలో పూడికలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని విద్యార్థులు ఉపాధ్యాయులు వాపోతున్నారు. పూడికలు తొలగించే పనులు తమ తమ పరిధిలో లేవంటూ జాతీయరహదారుల సంస్థ, గ్రామ పంచాయతీలు పట్టించుకోవడంలేదు. చెత్తా చెదారంతో పాటు గ్రామంలో చనిపోయిన జంతువుల కళేబరాలను కూడా పడేస్తుండడంతో వచ్చే దుర్గంధంతో ఉండలేకపోతున్నామని పాఠశాల సిబ్బంది వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నంగ్రామీణం



◆ ఈ కాలువకు నామరూపాల్లేవ్



మండల కేంద్రమైన జి.కొండూరులో మైలవరం రోడ్డులోని పాత ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్మించిన పక్కా మురుగుకాలువ ధ్వంసమై మురుగు ప్రవాహానికి అంతరాయమేర్పడింది. దాదాపు రెండు దశాబ్దాల కిందట అప్పటి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు సహకారంతో ర.భ రహదారి పక్కనే పక్కా మురుగుకాలువను పులివాగు వరకు ఏర్పాటు చేసి మురుగును వాగులో కలిపారు. కొన్నేళ్ల పాటు మురుగు సక్రమంగా ప్రవహించిన తర్వాత కాలువ కొంతమేర ధ్వంసమైంది. ఆ ప్రాంతంలో రహదారి పక్కనే లారీ స్టాండ్ ఏర్పాటు చేయడంతో భారీ లారీల రాకపోకలతో దాదాపు 100 మీటర్ల మేర ధ్వంసమై మట్టి కాలువగా మారి గడ్డి పెరిగిపోయింది.

- న్యూస్‌టుడే, జి.కొండూరు

సైనిక స్కూల్‌ను సందర్శించిన దగ్గుబాటి


సైనిక స్కూల్ ప్రతినిధులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు శనివారం ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కేతనకొండలోని నేతాజీ సైనిక్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఇస్తున్న శిక్షణ తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో యాజమాన్యం ప్రతినిధులతోపాటు డాక్టర్ సీఎల్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

9 నామినేషన్ల దాఖలు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక కో-ఆప్షన్ పదవులకు తొమ్మిది నామినేషన్లు దాఖలు అయ్యాయని కమిషనర్ రమ్యకీర్తన తెలిపారు. ఎక్స్‌పీరియన్స్, స్పెషల్ నాలెడ్జ్ కో-ఆప్షన్ పదవికి నాలుగు, మైనార్టీ జనరల్‌కు మూడు, మైనార్టీ కో-ఆప్షన్‌కు నాలుగు దాఖలయ్యాయి. పదో తేదీ వరకూ నామినేషన్ల పరిశీలన ఉంటుందని, అనంతరం బరిలో ఉన్న వారి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం


శంకుస్థాపనలో నాయకులు, స్థానికులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కొండపల్లి ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదు సెంటర్ వద్ద సిమెంటు రహదారికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.16లక్షలతో రహదారిని నిర్మిస్తున్నామన్నారు. రహదారి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు పడుతున్న స్థానికుల వినతిని కౌన్సిలర్ రావి అనూష ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన కృషితో నేడు రహదారి నిర్మాణం ఆచరణలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అరెస్టులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే అక్రమ కేసులు, అరెస్టులు జరుగుతున్నాయని వైకాపా నాయకులు ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులను వైకాపా నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యంపై ప్రభుత్వ వైఫల్యాలను జోగి ఎండగడుతున్నందు వల్లే ఆయనను అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, జిల్లా పార్టీ అధ్యక్షుడు అవినాష్, మాజీ ఎమ్మెల్యేలు జగన్మోహనరావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల శ్రమదానం.. తీరిన సమస్య

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలం కలగరలో ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యను రైతులంతా కలిసి పరిష్కరించుకున్నారు. కలగరలో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు గ్రామం నుంచి కి.మీ మేర 12 మీటర్ల వెడల్పుతో డొంక రహదారి ఉంది. గతంలో నాటిన మొక్కలు దట్టంగా పెరిగి రహదారిని ఆక్రమించడంతో రైతులు, కూలీలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామ రైతులు ముందుకు వచ్చి శనివారం వాటిని తొలగించారు. పలుశాఖల అధికారులతో పాటు, సమీప గ్రామ ప్రజలు వీరిని ప్రశంసిస్తున్నారు. కార్యక్రమంలో అన్నదాతలు భాస్కరరావు, వెంకటేశ్వరరావు, చెన్నారావు, సత్యనారాయణరెడ్డి, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మైలవరం : విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని చిలుకూరివారిగూడెం (పుల్లూరు) హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.కుసుమకుమారి తెలిపారు. అండర్ 17 విభాగంలో చల్లా స్వాతి, సగ్గుర్తి సాక్షి, అండర్ 14 విభాగంలో స్టాండ్‌బైగా చింతా సుప్రియ, దుర్గం మధు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వారిని, వ్యాయామోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, పల్లపు శ్రీనివాసరావులను అభినందించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు కొండపల్లి డీపీ పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్మోహన్ తెలిపారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారన్నారు. వారిని పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్టీటీపీఎస్ అధికారులు అభినందించారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఖోఖో, కబడ్డీ పోటీల్లో తిరువూరు మండలం మల్లేల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంఆర్.శేషంరాజు, పీడీ అనిత శనివారం తెలిపారు. శుక్రవారం గుడివాడలో జరిగిన అండర్-14 ఖోఖో జిల్లా స్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థి జి.జ్ఞానేశ్వర్, గూడూరులో జరిగిన అండర్-17 కబడ్డీ జిల్లా స్థాయి పోటీల్లో 10వ తరగతి విద్యార్థి జి.చైతన్య సత్తాచాటారన్నారు. విశాఖపట్నం, కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. తిరువూరు పట్టణంలోని సెయింట్ ఆన్స్ విద్యాలయానికి చెందిన వి.సాత్విక్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సిస్టర్ ప్రీతివిన్సెంట్, వ్యాయామోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు.


తిరువూరు: విద్యార్థులతో హెచ్ఎం శేషంరాజు, పీడీ

దశ మారాలంటే.. నిర్దిష్ట దిశ అవసరం

'ఈనాడు-కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' అవగాహన సదస్సులో వక్తలు


సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మారుతున్న ప్రపంచానికి తగ్గట్టుగా విద్యార్థులు ముందుకెళితేనే విజయాలు అందుకోగలరని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గూడవల్లి శ్రీచైతన్య జూనియర్ కళాశాల రామన్‌భవన్-5లో శనివారం 'ఈనాడు-కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' సంయుక్తంగా దశ-దిశ పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యా నిపుణులు.. ఇంటర్ తర్వాత జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు సరైన నిర్ణయం తీసుకోవాలని.. పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా నైపుణ్యాలు పెంచుకొని, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటూ విద్యార్థులకు పలు సూచనలు చేసి, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు యూనివర్సిటీ కిట్లు, కూపన్లు అందజేశారు. లక్కీడిప్‌లో ఎంపికైన విజేతలు సాత్విక, పూజశ్రీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 'ఈనాడు' విజయవాడ యూనిట్ మేనేజరు సీహెచ్ కిశోర్, శ్రీచైతన్య కళాశాలల డీన్ పి.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు, ఉపాధి కల్పనే లక్ష్యం



యువతలో నైపుణ్యాల పెంపు, పరిశోధనలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యం. అందుకు కేఎల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోనే పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాం. చదివింది ఇంజినీరింగ్ అయితే వేతనాల్లో ఎందుకు వ్యత్యాసాలు ఉంటున్నాయో గమనించాలి. కాలానికి అనుగుణంగా పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాల ఆధారంగా వ్యత్యాసం ఉంటుందని విద్యార్థులు తెలుసుకోవాలి. ఇంటర్ తర్వాత ఎంచుకునే కోర్సుపై పూర్తిస్థాయి అవగాహన లేకనే చాలా మంది ఉన్న చోటనే ఆగిపోతున్నారు. ఇంజినీరింగ్ చదువుతూనే డ్యూయల్ డిగ్రీ కోర్సులపై పట్టు సాధించవచ్చు. జాతీయ స్థాయి ర్యాంకుల్లో 26వ స్థానంలో నిలిచిన కేఎల్ విశ్వవిద్యాలయం ఒక గొప్ప అవకాశం లాంటిది. ఏఐ(కృత్రిమమేధ) పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే అవకాశాలు ఉంటాయి.

-డా.జె.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



విద్య ద్వారా విజ్ఞానంతో పాటు నగదు కూడా వస్తుంది. ఏటా ఇంటర్ తర్వాత విద్యార్థుల దశ మార్చే దిశను చూపేందుకు 'ఈనాడు-కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఉపకార వేతనాలు మంజూరు చేస్తూ ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించే కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. వంద శాతం ప్లేస్‌మెంట్స్‌తో ముందుకెళ్తోంది. విశ్వవిద్యాలయం నిర్వహించే పరీక్షలో మెరిట్ సాధిస్తే రాయితీ ఇస్తున్నాం. గత 16 ఏళ్లుగా లక్షలాది మంది యువతకు ఇంటర్ తర్వాత అవకాశాలపై అవగాహన కల్పించాం.

-బొబ్బిలి మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్, కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

శరవేగంగా మారుతున్న నేటి ప్రపంచంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి. మనం ఉండే వాతావరణ పరిస్థితులపై ఆధారపడి జీవితం ఉంటుంది. నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే పోటీ ప్రపంచంలో రాణించగలం. విద్యార్థుల ఆలోచన విధానం మారాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తు ఏఐ(కృత్రిమమేధ), ప్రాంప్ట్ పరిజ్ఞానానిదే. ప్రతిఒక్కరూ ఆయా కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి. ఒక్క సీఎస్ఈ విభాగమే కాదు.. ఇతర కోర్ కోర్సుల్లో కూడా ఎన్నో అవకాశాలున్నాయని గ్రహించాలి.



-కేవీ షణ్ముఖ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం

విద్యార్థి దశ కీలకం



విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటికి అనుగుణంగా కష్టపడితే విజయం సాధించగలరు. ఇంటర్ తర్వాత సరైన నిర్ణయం తీసుకోవాలి. జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు, ప్రొఫెషనల్ కోర్సులు చదివేందుకు.. మంచి మార్గాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలి. అందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.

-వెంకయ్య, ప్రిన్సిపల్, శ్రీచైతన్య జూనియర్ కళాశాల

పథకాల లక్ష్యాలు సాధిద్దాం


అధికారులతో సమావేశమైన దినకర్, కలెక్టర్ లక్ష్మీశ

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాల లక్ష్యాలను అర్థం చేసుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని 20 సూత్రాల పథకం అమలు ఛైర్మన్ లంక దినకర్, కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. జననీ శిశు సంరక్షా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన తదితర పథకాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే జల్‌జీవన్ అమృత్ పథకాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 100 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని వివరించారు. జననీ సురక్షా యోజన ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 1685 మందికి, పట్టణ ప్రాంతాల్లో 924 మందికి లబ్ధి చేకూరిందని వివరించారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలిపారు. మాతాశిశు మరణాల రేటు తగ్గించాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద జగ్గయ్యపేట, ఎ.కొండూరు, తిరువూరులలో డయాలసిస్ సేవలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎ.విద్యాసాగర్, విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయ అధికారి జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వ సహకారం


హ్యాండ్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా పథకాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగే 69వ రాష్ట్ర స్థాయి అండర్- 17 బాలికల హ్యాండ్‌బాల్, అండర్- 17 బాల, బాలికల నెట్‌బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందని చెప్పారు. సీఎం చంద్రబాబు క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటుచేసిన హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ కోర్టులను ప్రారంభించారు. తొలుత బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ, ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జట్లు విజయం సాధించాయి. బాలికల నెట్‌బాల్ పోటీల్లో నెల్లూరు, కడప, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు, తూర్పు గోదావరి, బాలుర విభాగంలో కర్నూలు, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, అనంతపురం జట్లు లీగ్ దశలో తమ సమీప ప్రత్యర్థులపై విజయం సాధించాయి. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ స్పోర్ట్స్ ఫర్ ఛేంజ్ సమన్వయకర్త వి.సత్యనారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనేరు రాజేష్ తదితరులు హాజరయ్యారు.

పారిశ్రామికవేత్త సురేంద్రబాబు జీవితం ఆదర్శప్రాయం


సురేంద్రబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్, కుమార్తెలు, అల్లుళ్లు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం చిక్కవరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ముక్కామల సురేంద్రబాబు జీవితం ఆదర్శనీయమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గన్నవరం పట్టణ శివారులోని ఏబీ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన ముక్కామల సురేంద్రబాబు సంస్మరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. శ్రీవిద్యా పాలిమర్స్, పీపీ పాలిమర్స్, జయశ్రీ పాలిమర్స్ కంపెనీలను ఏర్పాటు చేసి.. నేటి యువతకు ఆదర్శ పారిశ్రామికవేత్తగా నిలిచారని పేర్కొన్నారు. తొలుత సురేంద్రబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహనరావు, యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకరరావు, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, అదనపు ఎస్పీ మురళీ, సురేంద్రబాబు కుమార్తెలు పొట్లూరి పూజిత, నాగభైరవ పూర్ణిమ, అల్లుళ్లు శ్రీనివాస్, కృష్ణఫణీందర్ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరంపై చంద్రబాబుకు శ్రద్ధ లేదు'

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : పోలవరంతో పాటు 56 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు.. వాటిని వదిలేసి లింక్ ప్రాజెక్టు అని అంటున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. డీపీఆర్‌లు, నిధుల సమీకరణపై పెట్టే దృష్టి.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంపై లేదన్నారు. జల యజ్ఞానికి నిధులు లేవు కానీ.. రూ.58వేల కోట్లతో పోలవరం-నల్లమల సాగర లింక్ కడతాననడం తగదన్నారు. రూ.25వేల ఆర్‌అండ్‌ఆర్ మిగులు కోసం పోలవరం ప్రాజెక్టును డ్యామ్‌గా మార్చి ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. గోదావరి లింక్ ప్రాజెక్టుకు పెట్టే నిధులతో జల యజ్ఞం పూర్తి చేస్తే.. 30 లక్షల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుందని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా యేసుక్రీస్తు జయంతి జూబ్లీ


వేడుకలు ప్రారంభిస్తున్న బిషప్‌లు బాల, రాజారావు తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : తెలుగు నేలపై యేసుక్రీస్తు జయంతి- 2025 జూబ్లీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కథోళిక శ్రీసభ నూతన ఒరవడి దిశగా అడుగులు వేయనుందని విశాఖపట్నం అగ్రపీఠాధిపతి (ఆర్చి బిషప్) ఉడుమల బాల అన్నారు. ఆంధ్ర లయోల కళాశాల దేవయ్య ఆడిటోరియంలో శనివారం ఆర్చి బిషప్ బాల, విజయవాడ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన బిషప్‌లు జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. తొలుత జెండాను బాల ఆవిష్కరించి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు క్రీస్తు జూబ్లీ మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. కథోళిక విశ్వాసమనే లంగరిని ఏ దుష్టశక్తులు తుడిచి వేయలేవని స్పష్టం చేశారు. విజయవాడ కథోళిక పీఠం, వేడుకల కన్వీనర్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ దివంగత పోప్ ఫ్రాన్సిస్ ఈ ఏడాదిని ఏసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని గుర్తు చేశారు. అనంతరం ఆర్చిబిషప్‌లు ఉడుముల బాల, ఏలూరు బిషప్ పొలిమేర జయరాము, నెల్లూరు బిషప్ ఎం.డి.ప్రకాశం, గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగయ్య, విజయవాడ బిషప్ రాజారావు, శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయ్ కుమార్, కర్నూలు బిషప్ గోరంట్ల జాన్ ఏసు, ఖమ్మ బిషప్ సగిలి ప్రకాష్, నల్గొండ బిషప్ కరణం ధమన్ కుమార్, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, సెయింట్ జాన్స్ ఆచార్యులు ఫాదర్ వల్లె విజయ జోజిబాబు తదితరులు ఆయా మేత్రాసనాలల్లో శ్రీసభ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. సాయంత్రం బిషప్‌లంతా కలసి సమష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. గుణదల పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజు, ఫాదర్ వల్లె జోజిబాబు, ఎడ్యుకేషనల్ డెస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ప్రోక్రెయిటర్ ఫాదర్ కిరణ్, తోట సునీల్ రాజు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఫాదర్లు, సిస్టర్లు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న రాధాకృష్ణ, శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అభివృద్ధికి విజయవాడలోని గవర్నరుపేటకు చెందిన ప్రకాష్ ఆర్ట్స్ నిర్వాహకులు సి.డి.వి. సుబ్బారావు దంపతులు రూ.10 లక్షలు విరాళం శనివారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజ చేయించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా వెటరన్ క్రికెట్ టోర్నీ


జట్ల సారథులకు జెర్సీలు అందిస్తున్న రవీంద్ర చౌదరి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : నున్నలోని గ్రీన్ హిల్స్ క్రికెట్ మైదానంలో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి 'చుక్కపల్లి పిచ్చయ్య స్మారక వెటరన్ క్రికెట్ టోర్నీ'ని జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి ఎం.రవీంద్ర చౌదరి, పీపుల్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో- ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ ఎ.యల్లారావు అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ఉత్సాహంగా ఈ టోర్నీలో పాల్గొనడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన పాపులర్ షూ మార్ట్ ఎండీ చుక్కపల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఏటా వెటరన్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని, గత ఏడాది అనివార్య కారణాలతో నిర్వహించలేదని చెప్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు జట్లు తలపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అతిథులు జట్లకు జెర్సీలను అందజేశారు. టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాపులర్ షూ మార్ట్ మేనేజింగ్ పార్టనర్ సీహెచ్ విజయకుమార్, సీహెచ్ అవినాష్, రంజీ జట్టు మాజీ కెప్టెన్ విజయసారథి, జిల్లా క్రికెట్ సంఘం మాజీ సంయుక్త కార్యదర్శులు ఐ.పెంచలయ్య, కె.శ్రీనివాస్, రంజీ మాజీ క్రికెటర్లు వి.లెనిన్, జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు. ☛ తొలి మ్యాచ్‌లో విజయవాడ సెక్రటరీస్ ఎలెవన్ జట్టు 97 పరుగుల ఆధిక్యంతో రాజమండ్రి ఎలెవన్ జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో గుంటూరు ఎలెవన్ జట్టు అయిదు వికెట్ల తేడాతో వీసీఏహెచ్ హైదరాబాద్ జట్టుపై విజయం సాధించింది.

చిన్నారులకు అరుదైన గుండె శస్త్రచికిత్సలు


చిన్నారులతో విదేశీ వైద్యులు, ఆంధ్రా ఆసుపత్రి హార్ట్ కేర్ బృందం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఆంధ్రా ఆసుపత్రి హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటరులో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే ఛారిటీ సౌజన్యంతో 9 మంది చిన్నారులకు ఉచితంగా అరుదైన గుండె శస్త్రచికిత్సలు చేశారు. స్పెయిన్, ఇంగ్లండ్ నుంచి వచ్చిన గుండె వైద్య నిపుణులు నవంబరు 2 నుంచి 8వ తేదీ వరకు ఈ శస్త్రచికిత్సలు చేసినట్లు ఆంధ్రా ఆసుపత్రి చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా విదేశీ నిపుణులు, ఆంధ్రా ఆసుపత్రి వైద్యులు పిల్లలకు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది 36వ శిబిరమని వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులకు ఆంధ్రా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా పిల్లలను తీసుకువస్తున్నారని వివరించారు. డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలోని పీడియాట్రిక్ కార్డియాలజీ టీం, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ టీమ్స్ కలిసి పని చేయటం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఆంధ్రా ఆసుపత్రి మదర్ అండ్ ఛైల్డ్ ఫౌండేషన్, మహేష్‌బాబు ఫౌండేషన్, ఎన్టీఆర్ వైద్యసేవ సహకారంతో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు బోస్కో మోస్కోనో, ఐదఫిలిప్, ఐతోర్ లోపెజ్, నటాలియా సొరొళ, లారా, చిస్టి, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)


వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర


ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మీ పిల్లలకు పాస్‌పోర్ట్ ఉందా..!



గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

పాస్‌పోర్ట్ అనేది విదేశాలకు వెళ్లడానికే కాదు.. దేశంలో చెల్లుబాటయ్యే అన్ని రకాల గుర్తింపు పత్రాల్లో అత్యంత కీలకమైంది. చిరునామా, పుట్టిన తేదీ, వ్యక్తి గుర్తింపునకు పాస్‌పోర్ట్‌ను మించిన పత్రం మరొకటి లేదు. ఇది ప్రధానంగా ఇంజినీరింగ్, డాక్టర్ వంటి వృత్తివిద్యా కోర్సులు చదువుకునే పిల్లలకు అత్యంత అవసరం. మధ్యవర్తులను ఆశ్రయించకుండా మీరే.. ఆన్‌లైన్లో సులువుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా చిరునామా గుర్తింపు పత్రం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం సిద్ధం చేసుకోవాలి. https://www.passportindia.gov.in అనే వెబ్‌సైట్లోకి వెళ్లాలి. మెయిల్ ఐడీ లేదా ఫోన్ నంబరుతో రిజిస్టర్ చేసుకుని, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. వాటి ద్వారా లాగిన్ అయి దరఖాస్తు పూర్తి చేయాలి.



వ్యక్తిగత వివరాల నమోదు

✦ కొత్తగా దరఖాస్తు చేసేవారు 'ఫ్రెష్' పాస్‌పోర్ట్ ఎంపిక చేసుకోవాలి. గడువు తీరిన పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేసుకునే వారు 'రెన్యువల్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. ✦ ఇంటి పేరు, వ్యక్తి పేరు పూరించాలి. పేరులో ఉన్న ఖాళీలను గమనించి పూరించండి. ✦ కుటుంబ సభ్యులు, చిరునామా, అత్యవసర పరిస్థితిలో కాంటాక్ట్ చేయాల్సిన వారి వివరాలు, చరవాణి నంబర్లు నమోదు చేయాలి. ✦ రెన్యువల్ చేసుకునే వారికి పాత పాస్‌పోర్ట్ నంబరు, ఇతర వివరాలు నమోదు చేయాలి. ✦ తర్వాత పాస్‌పోర్ట్ ప్రివ్యూ వస్తుంది. మీ వివరాలను సరి చూసుకోవాలి. మార్పులు చేయాల్సి వస్తే వెనక్కి వచ్చి మార్పులు చేసుకోవచ్చు. ✦ దరఖాస్తును సబ్మిట్ చేసిన తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు. ✦ సబ్మిట్ చేయగానే ఒక రిఫరెన్స్ నంబరు (ఏఆర్ఎన్) వస్తుంది. ✦ తాజా పాస్‌పోర్ట్ పెద్దలకు రూ.1500లు, పిల్లలకు రూ.1000 చొప్పున రుసుము చెల్లించాలి. ✦ మీకు అపాయింట్‌మెంట్ ఇస్తారు. ఏ రోజు, ఎన్ని గంటలకు, ఎక్కడకు రావాలో ఉంటుంది. ■ విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో రేడియోస్టేషన్ ఎదురుగా పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఉంది. ఇవి కాక జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోస్టాఫీస్‌ల్లోనూ పాస్‌పోర్ట్ సేవలు లభిస్తాయి. ఎక్కడ కావాలో ముందుగానే అపాయింట్‌మెంట్‌లో మీరు నమోదు చేసుకుంటే సరిపోతుంది.

ఇలా దరఖాస్తు చేసుకోండి..

గుర్తింపు పత్రాలు..

☆ చిరునామా గుర్తింపు పత్రం, పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం ఒరిజినల్ తీసుకువెళ్లాలి. ☆ **చిరునామా గుర్తింపు పత్రాల్లో** 12 రకాల పత్రాలను అనుమతిస్తారు. దరఖాస్తుదారుని పేరు మీద వాటర్ బిల్, టెలిఫోన్ ల్యాండ్‌లైన్ బిల్, పోస్ట్‌పెయిడ్ బిల్, విద్యుత్తు బిల్లు, ఆదాయపు పన్ను అసెస్‌మెంట్ ఆర్డర్, ఓటరు గుర్తింపు కార్డు, గ్యాస్ కనెక్షన్, జీవిత భాగస్వామి పాస్‌పోర్ట్, పిల్లలకు అయితే తల్లిదండ్రుల పాస్‌పోర్ట్‌లు, ఆధార్ కార్డు, రెంట్ ఎగ్రిమెంట్ ☆ **పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం :** 2023, అక్టోబరు 1 ముందు పుట్టిన వారు మున్సిపల్ శాఖ జారీ చేసిన పుట్టిన తేదీ పత్రం, పదో తరగతి టీసీ, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు కార్డ్, ఎల్ఐసీ బాండ్. 2023, అక్టోబరు 1 తర్వాత పుట్టిన వారు అయితే.. మున్సిపల్ శాఖ జారీ చేసిన పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాన్నే అనుమతిస్తారు.

ధ్రువీకరణాలు, నకళ్లతో హాజరు కావాలి

✦ దరఖాస్తు, ఫీజు చెల్లించిన పత్రం ప్రింట్ అవుట్ తీసుకోవాలి. ✦ చిరునామా గుర్తింపు పత్రం, పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం ఒరిజనల్స్, జిరాక్సు కాపీలు తీసుకుని మీకు కేటాయించిన సమయానికి అరగంట ముందు పాస్‌పోర్ట్ సేవా కేంద్రానికి చేరుకోవాలి. ✦ ఒరిజినల్ పత్రాలు చూసి మీకు ఒక సీరియల్ నంబరు ఇస్తారు. ✦ మూడు కౌంటర్లకు పంపుతారు. 1. ఫొటో, వేలిముద్రలు సేకరిస్తారు. 2. దరఖాస్తు పరిశీలన. 3. మీకు ఒక పత్రం ఇస్తారు. ఇవన్నీ అయిన వెంటనే మీ చరవాణికి ఒక నంబరు వస్తుంది. ఆ నంబరుతో మీ దరఖాస్తు స్టేటస్ తెలుసుకోవచ్చు.






పోలీస్ విచారణ..

చివరగా పోలీసు విచారణ ఉంటుంది. మీపై సివిల్/ క్రిమినల్ కేసులు ఉన్నాయేమో అని స్పెషల్‌బ్రాంచ్ వారు విచారిస్తారు. దరఖాస్తు పూర్తి చేసే సమయంలోనే ఏమైనా కేసులు ఉన్నాయా? అని అడుగుతుంది. కేసులు దాచి పెడితే విచారణలో దొరికిపోతారు. అలా జరిగితే.. మీ దరఖాస్తును తిరస్కరిస్తారు. మీకు పాస్‌పోర్ట్ ఆగిపోతుంది. అన్నీ సక్రమంగా ఉంటే పోలీసులు నివేదికను పై అధికారులకు పంపిస్తారు. ఆ తర్వాత మీకు ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన పాస్‌పోర్ట్ వస్తుంది.

పండుటాకు కాదు.. పహిల్వాన్

86 ఏళ్ల వయసులో తరగని ఉత్సాహం



న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

ఎనిమిది పదుల వయసు పైబడినా తరగని ఉత్సాహం ఆయన సొంతం. ఆయనే కంది గంగాధరరావు (86). 16 ఏళ్ల వయసులో కుస్తీలో సాధన ప్రారంభించిన ఆయన పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఎన్నో పతకాలు సాధించారు. 1960 దిల్లీలో జరిగిన జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని సాధించి, 1961లో చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న సదరన్ రైల్వేలో స్పోర్ట్స్ కోటాలో లోకో ఫైర్‌మెన్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏడేళ్ల పాటు రాష్ట్ర ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా నాలుగేళ్లు బెజవాడ డివిజన్ కుస్తీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి వ్యక్తిగత, టీమ్ ఛాంపియన్‌షిప్‌ను డివిజన్‌కు అందించారు. 1963లో నగరానికే చెందిన సిరిపురపు దుర్గాంబతో వివాహం జరిగింది. ఓ వైపు కుస్తీలో రాణించడమే కాకుండా బాలగంగాధర్ తిలక్ (బీజీ తిలక్) ఆర్ట్ థియేటర్‌ను స్థాపించి ఎంతోమంది కళాకారులను సమాజానికి పరిచయం చేశారు. 1988లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ★ విజయవాడ రైల్వే ఇనిస్టిట్యూట్ కార్యదర్శిగా పని చేసి ఎంతో మంది క్రీడాకారులను, కళాకారులను ప్రోత్సహించారు. ప్రస్తుతం మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సాధన చేసి పతకాలు కొల్లగొడుతున్నారు. ఆయనకు నలుగురు ఆడ, ఇద్దరు మగ సంతానం. అందరూ స్థిరపడ్డారు. భార్య మరణించగా ఒంటరిగా ఉంటూ నిత్యం అథ్లెటిక్స్, కుస్తీ సాధన చేస్తూ పలువురిని ప్రోత్సహిస్తుంటారు. ప్రస్తుతం అఖిల భారత రైల్వే పింఛనుదారుల సంక్షేమ సంఘ బెజవాడ డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

శ్రమైక తరుణి.. పులకించె ధరణి..

మైలవరం, న్యూస్‌టుడే

'పిల్లలు పెరుగుతున్నారు.. చదువులకు ఖర్చులూ భారమవుతున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్‌గా వచ్చే జీతంతో సరిపెట్టుకోవడం ఎలా, అని తర్జన భర్జన. ఈ తరుణంలో ఉన్న రెండెకరాల్లో పంటల సాగు నేను చూసుకుంటాను, సొంతగా ట్రాక్టర్ కొని నడుపుకొంటే ఆదాయం పెరుగుతుంది కదండీ..అని ఆమెకు వచ్చిన ఆలోచన వారి జీవితాన్ని మార్చేసింది. కూరగాయల సాగుతో ప్రారంభించిన వ్యవసాయాన్ని, ప్రకృతి సేద్యం దిశగా మార్చి కుటుంబానికి ఆసరాగా ఉండటమే గాక, దిల్లీలో నిర్వహించిన పీఎం ధన ధాన్య కృషి యోజన కార్యక్రమంలో పాల్గొన్న అతి కొద్దిమందిలో ఒక గ్రామీణ ప్రాంత మహిళగా అవకాశం అందుకున్నారీ ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరు మండలం చెవుటూరుకు చెందిన 'కంభంపాటి రమాదేవి'. ఇంటర్ వరకే చదివినా.. ప్రకృతి సేద్యం ద్వారా ఆమె సాధించిన అనుభవాలను, విజయాలు, సంపాదన వివరాలను న్యూస్‌టుడేతో పంచుకున్నారిలా..



దిల్లీ సదస్సులో

ఒడిదుడుకులు ఎదురైనా..

సాధారణంగా రైతు కుటుంబాల్లో మహిళలు భర్త చాటు భార్యగానే పొలం పనులకు వెళ్తుంటారు. కానీ కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు సొంతగా వ్యవసాయ పనులు ప్రారంభించారు రమాదేవి. చెవుటూరులో పూర్వార్జితంగా వచ్చిన రెండెకరాల భూమిలో 15 ఏళ్ల కిందటి నుంచి మామిడి తోట ఉంది. ప్రకృతి సేద్యానికి అదే భూమి ఆదరువుగా, 2018లో భర్త శ్రీనివాసరావు సహకారంతో, కూరగాయల సాగుకు ఉపక్రమించారు. దాంతో పూర్తిస్థాయిలో కూరగాయలు, స్వల్ప కాలిక పంటలను ప్రకృతి సేద్యం ద్వారా చేపట్టాలని రైతు సాధికార సంస్థ ద్వారా సలహా వచ్చింది. అప్పటి నుంచి, తొలి రెండేళ్లు కొంత ఒడిదుడుకులు ఎదురైనా..ఆదాయాన్ని పెంచుకోవాలన్న ఆలోచనతో సాగు కొనసాగిస్తున్నారు.



సాగు చేస్తున్న బెండ తోటలో రమాదేవి

కొత్త ట్రాక్టర్ సైతం కొనేశారు..

రెండెకరాల్లో మామిడి చెట్లకు పోనూ మిగిలిన భూమిలోనే అంతర పంటలుగా దాదాపు 10 రకాల పంటలు ఏడాది పొడవునా సాగుచేసేలా ముందుకెళ్తున్నారు. గోంగూర మొదలు, వివిధ రకాల కూరగాయలు, కంది, సజ్జ వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేశారు. ఈ క్రమంలో ఆదాయం సంపాదిస్తుండడంతో భర్త శ్రీనివాసరావు కొత్త ట్రాక్టర్‌ను కొనుక్కుని ఆ పనుల్లోనే స్థిరపడ్డారు. రమాదేవి పూర్తిస్థాయిలో రైతుగా మారిపోయారు. ఒకప్పుడు ఏడాదికి రూ.20 వేల ఆదాయం వస్తే గొప్ప అనే స్థితి నుంచి ఏడాదికి రూ.1.50 లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు ఆమె ఆనందం వ్యక్తపరిచారు.

సిరుల తల్లి.. సత్యమ్మ



నందిగామ మండలం అంబారుపేట గ్రామం వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొలువై ఉన్న సత్యమ్మతల్లి.. తెలుగు రాష్ట్రాల భక్తులకు ఇలవేల్పుగా నిలుస్తోంది. ఈ రహదారి మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు తమ ప్రయాణం ఆటంకాలు లేకుండా సాఫీగా సాగాలని ఆలయం వద్ద ఆగి వాహనాలకు పూజలు చేస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుంటే కోరికలు తీరతాయని పూర్వం నుంచి భక్తులకు ఎంతో నమ్మకం. గతంలో జాతీయ రహదారి విస్తరణలో దేవాలయాన్ని తొలగించకుండా ఆలయం వెనుక నుంచి జాతీయ రహదారిని రెండు వరుసలుగా అభివృద్ధి చేశారు. ఏటా దసరా రోజు అమ్మవారికి రథోత్సవం నిర్వహిస్తారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయానికి ఏటా సుమారు రూ.50 లక్షల ఆదాయం వస్తోంది. భక్తుల కోసం సత్రాలు నిర్మించారు.

- అంబారుపేట(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే

పుష్కర తీర్థం.. పుణ్యప్రదం

12 బావులు.. 12 రకాలుగా నీళ్లు
దత్తరామేశ్వర ఆలయ ప్రత్యేకత

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరం వద్దకు వెళ్లే మార్గంలో దత్తరామేశ్వరం ఆలయంలో 12 బావులు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. సముద్ర స్నానం చేశాక ఈ బావుల్లోని నీటితో స్నానం చేయడం ఇక్కడ ఆనవాయితీ.. ఈ నీటితో స్నానం చేయడం తమిళనాడులోని రామేశ్వరం ఆలయంలోని 22 తీర్థాల నీటితో స్నానం చేసినట్టు భక్తులు భావిస్తారు. రామేశ్వరంలోని తీర్థాల మాదిరిగానే ఇక్కడి 12 తీర్థాల్లో 12 రకాలుగా నీళ్ల రుచి ఉంటుంది. ఒక బావిలో తియ్యగా.. ఉప్పగా.. చప్పగా.. కొద్ది కొద్ది మార్పులతో నీళ్లు ఉంటాయి. సముద్రం అతి సమీపంలోనే ఉన్నా నీరు అంత ఉప్పగా ఉండవు. కార్తీక మాసంలో ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. వారాంతాల్లోనూ రద్దీగా మారుతుంది. సముద్ర స్నానాలకు వచ్చే వారు తప్పని సరిగా ఈ బావుల నీటితో స్నానం చేసి వెళ్తారు. ఇలా చేస్తే తమ పాపాలు తొలగిపోతాయని.. శరీరంలోని అంటు వ్యాధులు దూరమవుతాయని నమ్ముతారు..



ఒక్కో తీర్థానికి ఒక్కో పేరు

వివిధ నదుల నుంచి సేకరించిన నీటిని ఈ బావులు తవ్వేటప్పుడు ఇక్కడ నిక్షేపించారని ఆలయ అధికారులు చెబుతున్నారు. అందుకే సముద్రం దగ్గరలో ఉన్నా నీరు ఉప్పగా ఉండదని.. వేరు వేరు రుచులు ఉంటాయని చెబుతారు. 1994లో వీటిని నక్షత్ర ఆకారంలో 1 నుంచి 12 బావులు తవ్వించారు. ఈ బావులను తీర్థాలుగా పిలుస్తారు. 1) ఔదుంబర 2) ఆమలక 3) నిర్మింధ్యా 4) పద్మ 5) సర్వ 6) ఉన్మోచన 7) పంపా 8) మతాజయలక్ష్మీ 9) నరహరి 10) గణపతి సచ్చిదానంద 11) దత్త 12) అనఘా అని నామకరణం చేశారు. ఒక్కో బావి నుంచి ఒక్కో బకెట్ నీరు శరీరంపై పోసుకుంటే 12 నదుల్లో పుష్కరస్నానం చేసినంత ఫలితం పొందుతారని భక్తులు.. ఆలయ సిబ్బంది నమ్మకం. స్నానానంతరం ఆలయంలోని మొదట దత్తాత్రేయ తర్వాత నగరేశ్వర స్వామి దర్శనం చేసుకోవడం ఆనవాయితీ భావిస్తున్నారు.



ఐదో బావి సర్వతీర్థం



అటు 16.. ఇటు 15

ఒకే గదిలో రెండు ఇంటర్ తరగతులు

నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో (హైస్కూల్ ప్లస్) ఇంటర్ విద్యార్థినులకు తరగతి గదులు సరిపడక అసౌకర్యానికి గురవుతున్నారు. ఒకే గదిలో ఒక వైపు ప్రథమ ఇంటర్, మరో వైపు ద్వితీయ ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రథమ ఇంటర్ విద్యార్థినులు 16 మంది, ద్వితీయ ఇంటర్ 15 మంది ఉన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఇద్దరు అధ్యాపకులు చెరోవైపు బోధించడం వల్ల పాఠాలు వినేందుకు అసౌకర్యంగా ఉందని విద్యార్థినులు తెలిపారు. వీరికి వృక్ష, జంతు శాస్త్రాలు బోధించడానికి ఉపాధ్యాయులు లేరు. సైన్స్ ల్యాబ్ లేక ప్రయోగాలు చేయించడానికి వీలు పడటం లేదు.

– నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ఇంటికో ఇంకుడుగుంత.. నీటికి లేదోయ్ చింత!

వేసవిలోనూ ఆ ఊరిలో బోర్లలో సమృద్ధిగా నీళ్లొస్తాయి. చుట్టుపక్కల గ్రామాల్లో నీటి కోసం నానా పాట్లు పడుతుంటే.. వీళ్లకు మాత్రం ఆ ఇబ్బందే లేదు. ఆ ఊరిలో మురుగు నీటి కాలువలు కూడా కనిపించవు. దీంతో దోమల ఊసే లేదిక్కడ. పాతికేళ్ల కిందట చేసిన ఓ యజ్ఞం ఫలితమే ఇది. ఊరంతా కలిసి తీసుకున్న ఓ నిర్ణయం.. ఇప్పుడు ఆ ఊరికి శ్రీరామ రక్షగా మారింది. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని ప్రొద్దుటూరు వాసులు ప్రస్తుతం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎప్పుడో ఆ ఊరికి చెందిన ఓ సర్పంచి ఆరంభించిన జలయజ్ఞాన్ని ఇప్పటికీ ప్రతి ఒక్కరూ తూచ తప్పక ఆచరిస్తున్నారు. అదే వారికి నీటి కష్టాలు లేకుండా కాపాడుతోందిప్పుడు. -ఈనాడు, కృష్ణా



కొత్తగా నిర్మిస్తున్న ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత

రాష్ట్రంలోనే నీటితో కళకళలాడే అతి కొద్ది ఊర్లలో ప్రొద్దుటూరు కూడా ఒకటి. ఎప్పుడో దశాబ్దాల కిందట ఆ ఊరికి చెందిన భీమవరపు వీరారెడ్డి, వెంకటరెడ్డి అనే ఇద్దరు ఇంకుడు గుంతలను తొలిసారి తవ్వించారు. ఆ తర్వాత 2000 ఏడాదిలో ప్రొద్దుటూరు సర్పంచిగా ఉన్న భీమవరపు గురవారెడ్డి.. ఈ ఇంకుడు గుంతలను ఉద్యమంలా ఆరంభించారు. ప్రతి ఇంటికీ కచ్చితంగా ఓ ఇంకుడుగుంత ఉండాల్సిందేనంటూ గ్రామస్థుల్లో చైతన్యం తీసుకొచ్చారు. దీంతో ఆ మరుసటి ఏడాది నుంచే వీరి ఊరిలో నీటి కష్టాలు పూర్తిగా దూరమయ్యాయి.

ఓ నూతినే ఇంకుడు గుంతగా..

గ్రామంలోని బీసీ కాలనీకి సమీపంలో ఉండే ఓ పాడుబడిన నేల బావి మొత్తాన్ని ఓ పెద్ద ఇంకుడు గుంతలా మార్చేశారు. ఊరిలో వర్షాకాలంలో వచ్చే వరద నీరంతా ఈ బావిలోకి వెళ్లిపోయేలా నాలుగు వైపులా ఏర్పాట్లు చేశారు. ఎంత నీటినైనా ఇంకించుకునేలా నేలబావిని మార్చేశారు.

✪ ఊరిలో ఎక్కడ నీటి వాడకం ఉంటే ఆ పక్కనే ఓ ఇంకుడుగుంతను ఏర్పాటు చేశారు. ఇలా గుడి, బడి, పంచాయతీ కార్యాలయం, కమ్యూనిటీ హాలు.. దేన్నీ విడిచిపెట్టలేదు. చివరికి చేతిబోర్ల వద్ద వృథాగా పోయే నీటిని సైతం భూమిలోకి ఇంకించేలా అక్కడో గుంతను ఏర్పాటు చేశారు



2000లో నేల బావి వద్ద తవ్విస్తున్న ఇంకుడు గుంత

మురుగు కాల్వల అవసరమే లేదు..

ఊరిలో వాడుక నీరంతా ఎక్కడిదక్కడే.. భూమిలోకి వెళ్లిపోయే ఏర్పాటు చేయడంతో ఇక మురుగు కాల్వల అవసరమే ఆ ఊరికి లేకుండాపోయింది. ఏ ఇంటిలో వాడిన నీళ్లు వాళ్ల పెరటిలోనే ఇంకిపోయేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంటిముందు కాల్వలా తీసి.. దానిని సైతం ఇంకుడు గుంతలా ఇసుక, బొగ్గు, రాళ్లు, ఇటుకలు వేసి మార్చేశారు. వాడిన నీరు నేరుగా వచ్చి దానిలో పడే ఏర్పాటు చేసుకున్నారు. ఒక్క బకెట్ నీళ్లు వాడితే.. అవన్నీ అలాగే తిరిగి నేలలోకి వెళ్లిపోతాయి.


నైపుణ్య యోగం..
ఉద్యోగ భాగ్యం..

కానూరు, పోరంకి, తాడిగడప, న్యూస్‌టుడే

ఐటీ రంగంలో సంక్షోభం.. ఆర్థిక మాంద్యం, వీటికి మించి కృత్రిమ మేధ ప్రభావం.. గత కొన్నేళ్లుగా ప్రాంగణ ఎంపికలపై పడింది. ఈ కారణంగా ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారికి కెరీర్ గ్యాప్ వస్తోంది. వారు ఆశించిన ఉద్యోగం కోసం ఏడాది నుంచి రెండేళ్ల వరకు వేచి చూడాల్సి వస్తోంది. ఈ సమయంలో వారు నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే అది తప్పనిసరి అంటున్నారు. లేకుంటే పోటీలో వెనుకబడే పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు.



ప్రొఫైల్‌ను నవీకరించుకోవాలి



పూర్తి చేసిన ప్రాజెక్టులను నెలకోసారైనా ఆన్‌లైన్ పోర్టుఫోలియోలో లేదా ప్రాజెక్టు సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. కెరీర్ గ్యాప్‌లో నేర్చుకున్న చిన్న చిన్న విషయాలను కూడ రెజ్యూమ్‌లో పొందుపరచాలి. లింక్డ్ ఇన్‌లో ఉద్యోగ అవకాశాలకు సిద్ధంగా ఉన్నాననే గుర్తు ఉంచడం మంచిది. ఇంటర్వ్యూ సమయంలో నిజాయతీగా ఎందుకు గ్యాప్ వచ్చిందన్న విషయం తెలియజేయాలి.

-యు.సాయిరాం, కోడ్ జ్ఞాన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత

ప్రస్తుతం మార్కెట్‌లో ఏ కోర్సుకు డిమాండ్ ఉందో విద్యార్థులు తెలుసుకోవాలి. ఆసక్తి ఉన్న రంగంలోనే కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి. వాస్తవ అనుభవం నిమిత్తం ప్రాక్టికల్ ప్రాజెక్టులు, ఉచిత శిక్షణలు, లేదా సాధన చేయడం వంటివి చేయాలి.

ఉమ్మడి కృష్ణాలో..

ఏటా ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు: 18000

ఉద్యోగం కోసం ప్రయత్నించే వారు: 7000 (సుమారు)

ఉన్నత చదువులు, విదేశీ విద్యకు వెళ్లే వారు: 2500


పరిచయాలు ముఖ్యం



పరిచయాలు కొత్త జీవన చరిత్ర లాంటివని నిపుణులు చెబుతున్నారు. లింక్డ్ ఇన్ ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా ప్రతి వారం కనీసం ఐదుగురు వృత్తిదారులతో పరిచయాలు పెంచుకోవాలి. స్నేహితులు, ఇతరులకు నేను నా నైపుణ్యాలను మెరుగుపరచుకున్నానని తెలియజేయాలి. ఉద్యోగ మేళాలు, వెబినార్లు, వృత్తి సమావేశాలు వంటి వాటిలో పాల్గొని, పోటీలో ఉన్నానని తెలియజేయాలి.

-ఎన్వీ సురేంద్రబాబు, రాష్ట్ర ప్రాంగణ ఉపాధి అధికారుల సంఘం అధ్యక్షుడు

ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి




మీరు పాతబడిపోయారని, వెనుకబడ్డారని ఎవరికీ అనిపించకూడదు. ఇంటర్వ్యూలలో సమాధానం ఇచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ సమయంలో నేర్చుకున్న కోర్సులు, ప్రాజెక్టులను వారికి చూపాలి. ఆఫ్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు తరుచూ హాజరుకావాలి. ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి.

-కె.వేణుగోపాల్, ఛైర్మన్, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల

చిట్టినగర్ వెలిసిందిలా..

జాతీయోద్యమ ప్రముఖుల్లో కాంగ్రెస్ నాయకులు మరుపిళ్ల చిట్టి ఒకరు. ఆయన పేరుతో 1937లో ఏర్పడిందే చిట్టినగర్. ఒకప్పుడు ఆ ప్రాంతం చిట్టడవి. చూద్దామన్నా జనసంచారం కనిపించని ప్రాంతం.. నగరానికి పొలిమేరగా స్థానికులు చెబుతారు. అప్పటి మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం పట్టణంలోని మరుగుదొడ్ల వ్యర్థాలను ఎడ్ల బండ్ల మీద తీసుకొచ్చి చిట్టినగర్ కూడలిగా పిలబడే ప్రాంతంలో గోతులు తవ్వి పూడ్చే వారు. అయితే ఆ ప్రాంతంలో గడ్డి పెరగడంతో దాన్ని ఎద్దులకు పెట్టేవారు. ఎడ్ల బండ్లు తోలేవారు బండి తొట్టిలో కూర్చోకుండా నడుస్తూ వెళ్లాలని 1937 పూర్వం అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు హుకుం జారీ చేశారు. నిబంధనలు పాటించని కార్మికులను తీవ్రంగా కొట్టేవాడు. అతని దాష్టీకాన్ని తట్టుకోలేక కార్మికులు తిరుగుబాటు చేశారు. దిబ్బలపై పాకలు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. సమయంలో మరుపిళ్ల చిట్టి వారికి అండగా నిలిచి సుదీర్ఘ కాలం ఉద్యమానికి నాయకత్వం వహించారు. చిట్టడవిగా ఉన్న ప్రాంతం నేడు మహానగరంగా రూపాంతరం చెంది ప్రధాన కూడలిగా మారింది. కాలక్రమంలో మరుపిళ్ల చిట్టి రెండు మార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఎడ్లబండ్ల కార్మికులకు అండగా నిలిచిన ఆయన పేరుతోనే ఆ ప్రాంతం చిట్టినగర్‌గా స్థిరపడింది.



– చిట్టినగర్, న్యూస్‌టుడే



వ్యర్థానికి అర్థం.. హరితమే పరమార్థం!

ప్లాస్టిక్ కూల్‌డ్రింక్ సీసాలను రహదారులపై పడేసి పర్యావరణానికి హాని చేసే కన్నా.. వాటిని ఉపయోగించుకుని మొక్కలు పెంచి అందంగా రూపొందిస్తే వ్యర్థానికి అర్థం వస్తుంది. కేబీఎన్ కళాశాలలో బోటనీ విభాగం ముందున్న గ్రిల్స్‌కు కూల్‌డ్రింక్ బాటిల్స్ కట్ చేసి వరసలో పేర్చి మొక్కలు పెంచుతున్నారు. దీంతో కళాశాల భవనంలోకి అడుగుపెడుతుండగానే మొక్కలు అందంగా, ఆహ్లాదంగా దర్శనమిస్తూ స్వాగతిస్తున్నాయి.

ఈనాడు, అమరావతి– న్యూస్‌టుడే, చిట్టినగర్

సుకవి జీవించు.. చరితయందు

దేశ భాషలందు తెలుగు లెస్స అన్నట్లు..ఇతర భాషల్లో కంటే తెలుగు కవులే ప్రసిద్ధి. దేశ స్వాతంత్ర్యోద్యమం నుంచి తెలుగు వైభవాన్ని, పౌరుషాన్ని చాటి చెప్పిన కవులు ఎందరో.. ఉద్యమాల్లో తమ రచనలతో ప్రజలను చైతన్యపరిచి దేశం కోసం పోరాటానికి ఉత్తేజపరిచారు. సమాజ రుగ్మతలను ఎత్తిచూపుతూ, రూపుమాపేందుకు రచనలు, గేయాలు, పాటలు, నాటకాలు, నాటికలు రచించిన రచయితలు కోకొల్లలు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కొందరు కవులు గతించి శతాబ్దాలు గడిచినా తమ సాహిత్యంతో ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచారు. సుకవి జీవించే ప్రజల నాల్కల యందు అంటూ గుర్రం జాషువా చెప్పినట్లు... ఇప్పటి తరం విద్యార్థులకు ఆనాటి కవులు పేర్లు వారి రూపురేఖలు ఎలా ఉంటాయో తెలియజేసేందుకు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలనుకు చెందిన ఊటుకూరు నారాయణరావు 111 మంది ప్రసిద్ధ తెలుగు కవుల చిత్రాలను సేకరించారు. నేటి తరం విద్యార్థులకు తెలుగు వైభవాన్ని, కవులు జీవిత విశేషాలను తెలిపేందుకు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఏటా మాతృభాషా దినోత్సవం సందర్భంగా (ఆగస్టు 29) ఆ కవుల చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. ప్రతి చిత్రంలో పేరు, జనన, మరణ తేదీలు వివరాలు ప్రచురిస్తారు. ఆయా తేదీల్లో వారి జయంతి, వర్ధంతి కూడా నిర్వహిస్తూ సమాజానికి తమ రచనలతో సేవలు అందించిన కవులను విస్మరించకుండా సేవ చేస్తుంటారు. తెలుగు సాహిత్యం, కళా వైభవాన్ని ప్రజలకు తెలియజేస్తున్న ప్రస్తుత తరం నాటకరంగ కళాకారులు, గాయకులు, కవులను కూడా సత్కరిస్తున్నారు.



– న్యూస్‌టుడే, గంపలగూడెం

అందం.. అబ్బాయిదైతే..!

'ఏమోయ్ ఇంకా ఎంతసేపు ఆ తయారవడం. త్వరగా తెములు... అవతల ఫంక్షన్‌కు టైమైపోతోంది!' ...భార్యనుద్దేశించి భర్త! ఇది పాత పాట..

'ఏమండీ... ఇంకా ఎంతసేపు ఆ అద్దం ముందు కూర్చుంటారు. మాకంటే ఎక్కువైంది మీకు! త్వరగా రండి... సినిమాకు టైమైపోతోంది! ఇది కొత్త కూత..!

ఈమధ్యకాలంలో అందం విషయంలో.. అమ్మాయిలతో పోటీపడుతున్నారు అబ్బాయిలు! పురుషుల్లో గ్రూమింగ్ ట్రెండ్ విపరీతంగా పెరిగింది. అందం మగువలకేనా.. మాకేం తక్కువ అనేలా పురుషులు సెలూన్లబాట పడుతున్నారు. మహిళలకే ఇప్పటివరకు ప్రత్యేక బ్యూటీ పార్లర్‌లు ఉన్నా.. ప్రస్తుతం గ్రూమింగ్ పట్ల పురుషుల్లో పెరిగిన ఆసక్తితో చిన్న చిన్న పట్టణాల వరకూ 'మెన్స్ బ్యూటీ సెలూన్లు' విస్తరిస్తున్నాయి.

గ్రూమింగ్‌తో ఆత్మవిశ్వాసం...

గ్రూమింగ్‌లో జుట్టు, చర్మ సంరక్షణ, ఇతర వ్యక్తిగత పరిశుభ్రత పద్ధతులుంటాయి. పురుషుల గ్రూమింగ్‌లో గడ్డం షేవ్ చేయడం, ముఖానికి స్క్రబ్ ఉపయోగించడంతో పాటు విభిన్నాంశాలున్నాయి. పరిపూర్ణంగా కనిపించడమే కాదు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం. క్రమశిక్షణ, స్వీయ-గౌరవాన్ని అలవరుచుకునేలా ప్రోత్సహించడం దీని లక్ష్యం.



ఎంత సమయమైనా.. ఖర్చయినా...

గ్రూమింగ్ కోసం సమయాన్ని, సొమ్మునూ వెచ్చించేందుకు పురుషులు వెనకాడడం లేదు.. నఖశిఖ పర్యంతం(తల వెంట్రుకల నుంచి కాలి గోరు వరకు) ట్రీట్మెంట్ కోసం రోజులో సగంపైనే సెలూన్‌లో గడుపుతున్నారు. హెయిర్ స్పాలో ప్రొటీన్ ట్రీట్‌మెంట్ చేస్తే 6 నెలలపాటు ఉంటుంది. దీనికి రూ. 8వేల నుంచి రూ.10వేల వరకు వెచ్చిస్తున్నారు. ఫేషియల్‌కు రూ.5 వేలు, తలమర్దనకు రూ.600, మానిక్యూర్‌కు రూ. 1,000-1,500, ఫేస్ మసాజ్‌కు రూ.500-800, జుట్టుకు రంగు కోసం రూ.1,000-2,500, హెయిర్ ట్రీట్మెంట్ రకాన్ని బట్టి రూ.1,000-4,000 దాకా, గడ్డం ట్రిమ్మింగ్‌కు గరిష్ఠంగా రూ.500 వరకూ ఖర్చు చేస్తున్నారు.



కొన్ని చిట్కాలు

మంచి, తీరైన కనుబొమ్మలతో ముఖం తీర్చిదిద్దినట్టు కనిపిస్తుంది. అందువల్ల కనుబొమ్మలను ట్వీజ్ చేయండి. గ్రూమింగ్ కత్తెర లేదా ట్రిమ్మర్లను ఉపయోగించవచ్చు.

చర్మం ఆరోగ్యంగా ఉండేందుకు తగినంత నీరు తాగాలి. చల్లగా ఉండని నీరు తాగడం తగ్గించకూడదు. స్నానం తర్వాత మాయిశ్చరైజర్ రాసుకోవడం, బయటికి వెళ్లేముందు సన్‌స్క్రీన్ వాడడం అవసరం.

బహుళ గార్డులతో కూడిన బియర్డ్ ట్రిమ్మర్‌ను ఉపయోగించడం మంచిది. గడ్డం మృదువుగా ఉండటానికి, దురదను తగ్గించడానికి బియర్డ్ ఆయిల్ వాడాలి. నిర్వహణ ఇబ్బందిగా ఉంటే, శుభ్రంగా షేవ్ చేయడం ఉత్తమం.

రోజుకు రెండు సార్లు పళ్లు తోమడం, మౌత్ వాష్‌ను వినియోగించడం, వైటనింగ్ స్ట్రిప్స్ లేదా ప్రొఫెషనల్ క్లీనింగ్‌ను పరిశీలించడం ద్వారా నోటిని శుభ్రంగా ఉంచుకోవచ్చు.

కరచాలనం చేసినప్పుడు ఎదుటివారికి మొదటగా కనిపించేది మన గోళ్లే. అందుకు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటూ వారానికోసారి గోళ్లు కత్తిరించుకోవాలి.

వారానికి ఒకసారి కాళ్లను ఎక్స్‌ఫోలియేట్ చేయడం, నిద్రకు ఉపక్రమించేటప్పుడు పాదాలకు క్రీమ్ రాయడంతో పాటు తరచూ కాలి గోళ్లను కత్తిరించుకోవాలి.

ఏ వయసుకు అందం...



20+

- 20-30 మధ్య వయసున్న యువకులు హెయిర్ స్టైల్, గడ్డం ట్రిమ్మింగ్, షేవింగ్ వంటి స్టైలింగ్ పట్ల ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు.
- ఎండలో తిరిగి ముఖం నల్లబడినా, నల్లటి మచ్చలు వచ్చినా సహజ పద్ధతుల్లో డీ-ట్యాన్, ఓ కొన్ని రకాల ట్రీట్‌మెంట్లు చేయించుకుంటున్నారు.
- సహజ 'ఫేషియల్' రకాలను ఎక్కువగా ప్రయత్నిస్తూ, సేంద్రియ ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు.
- కొందరు స్వయంగా సేంద్రియ వ్యవసాయంతో పెంచిన మొక్కలు, పూల నుంచి ఈ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.



40+

- 40 ఏళ్లు పైబడిన పురుషులు గ్రూమింగ్‌పై అమితాసక్తిని కనబరుస్తున్నారు.
- ట్రెండ్స్ తగ్గట్టు డక్ టెయిల్ హెయిర్ స్టైల్స్, సాల్ట్-పెప్పర్ బియర్డ్‌లూ ట్రై చేస్తున్నారు.
- ఫేషియల్, హెయిర్ కట్, బియర్డ్ ట్రెండ్, హెయిర్ స్టైల్, ఫేస్ కేర్, మానిక్యూర్, పెడిక్యూర్ వంటి వాటిపై శ్రద్ధ చూపుతున్నారు.
- చర్మంపై ముడతలు తొలగించడం కోసం ప్రయత్నిస్తున్నారు. హెయిర్ స్పా కోసం 15 రోజులకోసారి సెలూన్‌కు వెళ్తున్నవారూ ఉన్నారు.

- ఈనాడు, అమరావతి

గదిలో పూసింది.. మదిని దోచింది

మట్టి, నీరు లేకుండానే కుంకుమ పూల సాగు





సైదయ్య

అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో ఒకటైన కుంకుమ పువ్వును ఏరోపోనిక్ విధానంలో మట్టి, నీరు లేకుండానే ప్రయోగాత్మకంగా పండించారు తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. నాబార్డు ఆర్థిక సహకారంతో ఉద్యాన వర్సిటీ అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు కుంకుమ పువ్వు సాగు ప్రాజెక్టును చేపట్టారు. తొలుత కశ్మీర్‌కు వెళ్లి అధ్యయనం చేశారు. వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల అక్కడ సంప్రదాయ సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతున్నట్లు గుర్తించి ఇక్కడ ఆధునిక ఏరోపోనిక్ వైపు మొగ్గారు. విశ్వవిద్యాలయం పరిధిలోని వనపర్తి జిల్లా మోజర్ల ఉద్యాన కళాశాలలో రెండు నెలల క్రితం సాగు ప్రారంభించారు. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోని గదిలో రేక్‌లు, పంపులు, మిస్టింగ్ నాజిల్స్, టైమర్లు, దీపాలు అమర్చారు. గదిని పొగమంచుతో నింపి... కశ్మీర్‌లోని పంపోర్ నుంచి తెచ్చిన కుంకుమ పూల కాండాలను గాలిలో వేలాడదీశారు. మొక్కలకు అవసరమైన పోషకాలను నీటిలో కలిపి, పొగమంచు రూపంలో అధిక పీడనం ద్వారా నేరుగా వేర్లపైకి స్ప్రే చేశారు. మొలకలు రావడానికి ముందు, పూత దశలో వేర్వేరు ఉష్ణోగ్రతలు ఉండేలా చూశారు. ఉష్ణోగ్రత, తేమ, వెలుతురు నియంత్రణ వ్యవస్థ, సంప్రదాయ వేర్లకు నేరుగా పోషకాలు, ఆక్సిజన్ సమృద్ధిగా లభించడం వల్ల మొక్కలు వేగంగా పెరిగి పూలు పూచాయి. మట్టితో సంబంధం లేనందువల్ల తెగుళ్లు, చీడపీడలు, ఎలుకల బెడద ఎదురుకాలేదని ప్రాజెక్టు ప్రధాన పరిశోధకుడిగా వ్యవహరించిన పిడిగం సైదయ్య తెలిపారు. అన్ని ఉద్యాన కళాశాలలు, పరిశోధన సంస్థల్లో ప్రయోగశాలలు ఏర్పాటు చేసి... కుంకుమ పూల పెంపకంపై శిక్షణ ఇస్తామని ఉద్యాన వర్సిటీ వీసీ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు.

- కుంకుమ పువ్వు (క్రోకస్ సాటివస్) పూలలోని కేసరాలను రంగు, రుచి, సువాసన, ఆరోగ్యం కోసం వంటల్లో, ఔషధాలలో, సౌందర్య ఉత్పత్తుల్లో వినియోగిస్తుంటారు. సాధారణ పువ్వు కిలో ధర రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంది. ఔషధ గుణాలు అధికంగా ఉండే రకం రూ.8 లక్షల వరకు పలుకుతుంది. -ఈనాడు, హైదరాబాద్



ప్రేమానురాగాలు 'చిలక'గా!

పక్షి ఏదైనా గూట్లోనో.. చెట్టుపైనో ఉంటుంది. ఇదేంటీ..? ఈ చిత్రంలో మహిళ భుజంపై ఉందీ అనుకుంటున్నారా! విశాఖ నగరంలోని కొత్తపాలెం ప్రాంతానికి చెందిన శాంతి శనివారం ద్విచక్రవాహనంపై కరాస ప్రాంతానికి వచ్చారు. చుట్టూ ట్రాఫిక్ ఉన్నా.. వాహనాలు వేగంగా సమీపం నుంచే వెళ్తున్నా ఆమె భుజంపై ఉన్న చిలుక ఏమాత్రం బెదరలేదు. ధైర్యంగా కూర్చొని అన్నివైపులా చూస్తుంటే.. ఆ పక్షిని జనం ఆసక్తిగా చూశారు. తాను అపురూపంగా పెంచుతున్న చిలుకను ఎక్కడికి వెళ్లినా ఇలా తీసుకువెళ్తానని శాంతి చెప్పారు.

– ఈనాడు, విశాఖపట్నం

అత్యుత్తమ సహజ గాలిశుద్ధి సాధనం.. సాల్ వృక్షం



ఆధునిక కాలంలో కాలుష్యం.. ప్రపంచ వెను సవాళ్లలో ఒకటిగా ఉంది. పెద్ద నగరాల నుంచి చిన్న పట్టణాల వరకూ ఇదే పరిస్థితి. శుద్ధమైన గాలి క్రమంగా మృగ్యమవుతోంది. ఈ నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్ విశ్వవిద్యాలయ పరిశోధకుల తాజా అధ్యయనం ఆశలు రేకెత్తిస్తోంది. వాయు కాలుష్యాన్ని కట్టడి చేసే సామర్థ్యం గుగ్గిలం వృక్షాని(సాల్ ట్రీ)కి భారీగా ఉందని వారు తేల్చారు. ఇది అత్యంత సమర్థ సహజసిద్ధ గాలి శుద్ధి సాధనమని గుర్తించారు. ధూళి, పొగ, వాహన కాలుష్యాన్ని ఎదుర్కొనే సత్తా దీనికి ఉందని చెప్పారు. వాహనాల నుంచి వెలువడే హానికరరేణువులను అత్యధిక స్థాయిలో ఇది శోషించుకోగలదని ఇందులో వెల్లడైంది.

సాల్ వృక్షం.. కాలుష్యాన్ని తట్టుకోవడమే కాకుండా పారిశ్రామిక, వాహన రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ మనుగడ సాగించగలదని తేల్చారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారుల వెంబడి ఈ చెట్లతో హరితహారాన్ని ఏర్పాటు చేయాలని పరిశోధకులు సూచిస్తున్నారు. దీనివల్ల గాల్లోని హానికర పీఎం 2.5, పీఎం10 రేణువులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. స్థానిక ఉష్ణోగ్రతలూ నియంత్రణలో ఉంటాయని తెలిపారు.

ఇవీ సానుకూలతలు..

- సాల్ వృక్ష ఆకులు. . ధూళి, కర్బన రేణువులను ఒడిసిపట్టేలా దళసరిగా ఉంటాయి.
- ఈ ఆకుల్లో క్లోరోఫిల్ కూడా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పరిసరాల్లోని కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డైఆక్సైడ్ వంటి హానికర వాయువులను ఎక్కువగా అవి గ్రహించగలుగుతాయి.
- ఈ చెట్టు పైభాగం దట్టంగా ఉంటుంది. అందువల్ల అది సహజసిద్ధ వాయు ఫిల్టర్‌గా అక్కరకొస్తుంది.
- ఇది వందేళ్ల వరకూ జీవించడం మరో సానుకూల అంశం. వీటి నిర్వహణకు పెద్దగా శ్రమ అవసరంలేదు. -ఈటీవీ భారత్



లాంచీ ఎక్కేద్దామా.. శ్రీశైలం వెళ్లొద్దామా..

కృష్ణానదిపై నల్లమల అందాలను తిలకిస్తూ.. ప్రకృతికి పరవశిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల నుంచి శ్రీశైలానికి సాగే లాంచీ ప్రయాణం శనివారం పునఃప్రారంభమైంది. వారానికి మూడుసార్లు మంగళవారం, గురువారం, శనివారాల్లో ఉదయం 9 గంటలకు లాంచీ సోమశిల నుంచి ప్రారంభమవుతుంది. ఒకవైపు ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1600 వసూలు చేస్తున్నారు. సోమశిల నుంచి శ్రీశైలానికి ఆరు గంటలు పడుతుంది. నిర్వాహకులు పర్యాటకులకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్ ఇస్తారు. తొలిరోజు 65 మంది పర్యాటకులు బయల్దేరారు. ముందుగా పూజలు నిర్వహించి ప్రయాణాన్ని పర్యాటక శాఖ అధికారి నరసింహ తదితరులు ప్రారంభించారు. శ్రీశైలం నుంచి ఆదివారం ఉదయం 9 గంటలకు తిరుగు ప్రయాణం ఉంటుంది. వివరాలకు www.tgtdc.inలో సంప్రదించవచ్చు.

-న్యూస్‌టుడే, కొల్లాపూర్ పట్టణం



కన్నవారి గుండె గుడి

పిల్లలు దూరమైతే తల్లిదండ్రులకు కలిగే కడుపు కోత వర్ణనాతీతం. కన్నీటిని దిగమింగుకుంటూ వారి జ్ఞాపకాల్లోనే జీవిస్తుంటారు. అలాంటి కష్టమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాతసూరారం గ్రామానికి చెందిన జక్కుల శేఖర్, నాగలక్ష్మి దంపతులది. వారి 15 ఏళ్ల కుమారుడు సంపత్‌కు మార్ 2024 మార్చి 24 కిన్నెరసాని వాగులో ఈతకు వెళ్లి మృతి చెందాడు. దీన్ని జీర్ణించుకోలేని వారు సంపత్ విగ్రహం తయారు చేయించి సొంత పొలంలో ఆలయం నిర్మించారు. నాగలక్ష్మి నిత్యం ఉదయాన్నే శుభ్రం చేసి కల్లాపి చల్లి ముగ్గు వేసి దీపారాధన చేస్తారు. ప్రతి ఆదివారం కుటుంబసభ్యులు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు.

–న్యూస్‌టుడే, పాల్వంచ గ్రామీణం

స్నేహమంటే ఇదేరా!




పొట్టేలు, వానరం జాతులు వేరైనా ఏడేళ్లుగా వీటిమధ్య విడదీయలేని స్నేహబంధం కొనసాగుతోంది. పగలూ రాత్రీ అనే తేడా లేకుండా ఈ రెండూ ఒకే చోట ఉంటున్నాయి. పొట్టేలు మేతకు వెళ్తే వానరం ఇలా దానిపై కూర్చొని, అలసట వస్తే పడుకొని ఎంత దూరమైనా వెళ్తోంది. సాయంత్రం అలాగే ఇంటికి చేరుకొని రాత్రి దానివద్దే ఉంటోంది. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం గ్రామీణ మండలం రొప్పాలకు చెందిన గొర్రెల కాపరి అశ్వత్థ నారాయణ ఏడేళ్ల క్రితం గొర్రెలను మేతకు తీసుకెళ్లగా చిన్న కోతిపిల్ల దొరికింది. ఆయన దాని తల్లి కోసం ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఇంటికి తీసుకొచ్చి పాలు పోసి పెంచాడు. కొన్నిరోజులకు వానరం గొర్రెల వెంట వెళ్లటం తిరిగి రావటం అలవాటుగా మారింది. మందలో దాదాపు 100 గొర్రెలు ఉన్నప్పటికీ ఒకే ఒక్క పొట్టేలుపైనే వానరం కూర్చోవడం విశేషం. –న్యూస్‌టుడే, హిందూపురం

దాచారు.. సరే... ఎవరికైనా చెప్పారా?

ఒకటికి మించి బ్యాంకు ఖాతాలు, అక్కడక్కడా స్థిరాస్తులు, మ్యూచువల్ ఫండ్లు, సేవింగ్ బాండ్లు, అవసరానికి ఆదుకునే పాలసీలు, అద్భుతమైన ఆర్థిక క్రమశిక్షణ అన్నీ ఉన్నా... ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేని పరిస్థితుల్లో ప్రాప్త కాలజ్ఞత చాలా ముఖ్యం. అదెలాగంటే...

ఈ వివరాలన్నీ పొందుపరిస్తే మేలు...



ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. అనుకోని పరిస్థితుల్లో కుటుంబ పెద్ద భౌతికంగా దూరమైనప్పుడు ఆ బాధ చెప్పలేనిది. ఎవరూ తీర్చలేనిది. ప్రతి వ్యక్తీ తన కుటుంబ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సంపాదించిన ఆస్తులను తన తదనంతరం వాటి పత్రాలు, ఇతర డిజిటల్ ఎకౌంట్లు ఎవరు చూసుకోవాలో ముందే స్పష్టంగా చెప్పాలి. దీనివల్ల కుటుంబానికి పెద్ద ఉపశమనం లభిస్తుంది. దీనికోసం ప్రతి వ్యక్తీ తన కంప్యూటర్లో ఒక ఫోల్డర్ ఏర్పాటు చేసుకోవాలి. లేదా అన్ని పత్రాల వివరాలను క్రమపద్ధతిలో రాసిపెట్టి, వాటికి సంబంధించిన నకళ్లను అందుబాటులో ఉంచాలి. వాటి అసలు పత్రాలు ఎక్కడున్నాయో కుటుంబ సభ్యులకు తెలియజేయాలి. దీనివల్ల వారికి కష్టకాలంలో ఎంతో ఉపశమనం లభిస్తుంది. దానికి ఏం పేరు పెట్టాలన్నది మీరే నిర్ణయించుకోండి.

పాస్‌వర్డ్‌లు జాగ్రత్తగా...

అన్ని పాస్‌వర్డ్‌లను ఒక మేనేజర్ యాప్‌లో భద్రపర్చేందుకు ప్రయత్నించండి. నిర్ణీత కాలంపాటు మీ ఫోన్ యాక్టివ్‌గా లేకపోతే, మీరు పేర్కొన్న ఫోన్ నంబరుకు ఆ యాప్ వివరాలను పంపిస్తుంది. జీవితం ఎంతో అమూల్యం. మన అనుకున్న వారికోసం ఎంత చేసినా, దురదృష్టకరమైన పరిస్థితుల్లో వారికి అవన్నీ భరోసాగా నిలిచే ఏర్పాటు తప్పనిసరిగా చేసినప్పుడే మన బాధ్యత పూర్తవుతుందని మర్చిపోవద్దు.

1) వ్యక్తిగత పత్రాలు

- జనన ధ్రువీకరణ.
- వివాహ ధ్రువీకరణ.
- ఆధార్, పాన్, పాస్‌పోర్ట్.
- మీ వ్యక్తిగత వివరాలకు సంబంధించిన అఫిడవిట్‌లు ఏమైనా ఉంటే ఆ వివరాలు...

2) వీలునామా

- చెల్లుబాటు అయ్యే విధంగా వీలునామా.
- మీకు వారసత్వంగా వచ్చిన ఆస్తులకు సంబంధించిన ఆస్తుల పత్రాలు, అందుకు సంబంధించిన ధ్రువీకరణలు.
- చిన్న పిల్లల సంరక్షణకు సంబంధించిన వివరాలు.
- మీరు వ్యక్తిగతంగా సంపాదించిన ఆస్తులు, వాటి వివరాలు, ఎవరికి ఏవి చెందాలో వీలునామాలో పేర్కొనట్లుగా రాసి పెట్టిన పత్రం.

3) ఆర్థిక వివరాలు

- బ్యాంకు ఖాతాల వివరాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు.
- డీమ్యాట్ ఖాతా, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బాండ్ల వివరాలు.
- బీమా పాలసీలు, వాటికి నామినీగా ఎవరు ఉన్నారనే వివరాలు.
- రుణ పత్రాలు, ఇంటి రుణం, వాహన రుణం, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు, వాటికి అనుబంధంగా తీసుకున్న లోన్ కవర్ టర్మ్ పాలసీల వివరాలు.
- బ్యాంకులో ఉన్న లాకర్లు, వాటికి సంబంధించిన తాళాలు, ఇతర సమాచారం.

4) ఆస్తి, వ్యాపార సమాచారం

- స్థలాలు, ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు.
- తనఖాలో ఉన్న ఆస్తుల వివరాలు.
- అద్దె ఒప్పందాలు.
- వ్యాపారానికి సంబంధించిన పత్రాలు, వారసత్వ ప్రణాళిక.

5) డిజిటల్ ఖాతాలు

- ఇ-మెయిల్ రికవరీ వివరాలు.
- సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, క్లౌడ్ స్టోరేజ్ ఖాతాలు.
- విలువైన డిజిటల్ ఖాతాల చందాల వివరాలు.

- ఈనాడు, హైదరాబాద్

చూపు లేకున్నా.. విద్యార్థులకు వెలుగై



వైకల్యంతో ప్రపంచాన్ని చూడలేకపోయినా.. సాంకేతిక సాయంతో పాఠాలు చెబుతున్నారు అనంతపురం జిల్లాకు చెందిన కనేకల్లు శ్రీరాములు(36). గుమ్మఘట్ట మండలంలోని భైరవానితిప్పం గ్రామానికి చెందిన ఆయన పుట్టుకతోనే అంధుడు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆయన బెంగళూరులో బీకాం కంప్యూటర్స్ పూర్తిచేశారు. అంధుడు కావడంతో ఉద్యోగం రాకపోయేసరికి కొన్నిరోజులు దిగులు పడ్డారు. తర్వాత తన చదువు వృథా కావొద్దని. . పది మందికైనా ఉపయోగపడాలని భావించారు. ఇందుకోసం గ్రామంలోని విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు చెబితే.. 'నీవే అంధుడివి, పిల్లలకు ఎలా చెబుతావు' అని సందేహం వ్యక్తం చేశారు. దీంతో శ్రీరాములు ఇంటింటికి వెళ్లి 'వారంపాటు పిల్లలను ట్యూషన్‌కు పంపాలని.. తర్వాత నచ్చితేనే కొనసాగించాలి' అని నచ్చజెప్పడంతో విద్యార్థుల రాక మొదలైంది. బెంగళూరు నుంచి బ్రెయిలీ లిపిలోని పాఠ్య పుస్తకాలు తెప్పించుకుని వాటి ఆధారంగా బోధిస్తున్నారు. విద్యార్థులు రాసిన హోంవర్కు, సమాధాన పత్రాలను మొబైల్‌లోని 'ఎన్ విజన్ ఏఐ' యాప్ సాయంతో ఫొటో తీసి అప్‌లోడ్ చేయగానే అందులోని పదాలు పైకి చదవడంతోపాటు అక్షర దోషాలను గుర్తిస్తుంది. ఇలా పిల్లలు వెనుకబడిన పాఠ్యాంశాలను మళ్లీ చెబుతున్నారు. విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకొంటుండటంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాములుకు ఓ అంధురాలితో వివాహం కాగా ఇటీవల కూతురు జన్మించింది. నెలవారీగా వచ్చే రూ.6 వేల పింఛన్‌తోనే జీవితం నెట్టుకొస్తున్నట్లు ఆయన తెలిపారు.

– ఈనాడు, అనంతపురం; న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం

పుట్టెడు కష్టాలు దాటి.. పుట్టగొడుగులతో కోటీశ్వరుడై





హరియాణాలోని కురుక్షేత్ర జిల్లా తల్వేరి గ్రామ రైతు యద్వీందర్ సింగ్ పుట్టగొడుగుల సాగుతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఎనిమిదో తరగతి వరకే చదివిన ఆయన 2006లో బతుకుతెరువు కోసం డంకీ (అక్రమ) మార్గంలో దక్షిణ కొరియా వెళ్లేందుకు ప్రయత్నించి నానా కష్టాలు పడి విఫలమయ్యారు. దీంతో స్థానికంగా పుట్టగొడుగులు సాగుచేసే ఓ రైతు వద్ద రూ.3,200 నెలజీతానికి చేరారు. అక్కడ మెలకువలు నేర్చుకొన్నాక సొంతంగా సాగు ప్రారంభించాలన్న నిర్ణయానికి వచ్చారు. మూతపడి ఉన్న తన కోళ్లఫామ్‌లో రూ.50 వేల పెట్టుబడితో 2014లో మష్రూమ్ సాగు మొదలుపెట్టారు. పుట్టగొడుగుల కంపోస్టు కోసం మూడు ఎకరాల్లో శాశ్వత ప్లాంటు నిర్మించి, 12 ఎకరాల్లో పుట్టగొడుగులు సాగు చేస్తున్నారు. ఈ పుట్టగొడుగులకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. 11 ఏళ్ల వ్యవధిలో అంచెలంచెలుగా ఎదిగి రూ.7.5 కోట్ల వార్షిక టర్నోవరుకు చేరిన యద్వీందర్ నేడు 250 మందికి తానే ఉపాధి కల్పిస్తున్నారు. –ఈటీవీ భారత్

లైట్ చెప్పేస్తుంది.. లాభమో, నష్టమో

సాధారణంగా స్టాక్ మార్కెట్‌లో షేర్లు లాభాల్లో ఉన్నాయా? నష్టాల్లో ఉన్నాయా? అనేది తెలియాలంటే ఆయా పోర్ట్‌ఫోలియోల వెబ్‌సైట్‌లను తరచూ చూడాల్సిందే. ఇందుకు మొబైల్స్ లేదంటే ల్యాప్‌టాప్‌లను వాడాలి. ఇలాంటి గ్యాడ్జెట్‌ల అవసరం లేకుండా ఇంట్లోని బల్బులకు లాభనష్టాల వెలుగులు అనుసంధానిస్తే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనే చేశారు బెంగళూరుకు చెందిన టెకీ పంకజ్. జెరోదా ప్లాట్‌ఫాంలోని కైట్ కనెక్ట్ ఏపీఐ ద్వారా తన షేర్ల ట్రెండ్లను పరిశీలించే ఆయన.. వీటి లాభనష్టాల సూచీలకు రాస్‌బెర్రీ సింగిల్ బోర్డ్ కంప్యూటర్‌తో పాటు ఏఐ ఆధారిత లైటింగ్‌ను అనుసంధానించారు. తాను పెట్టుబడి పెట్టిన స్టాక్‌లు నష్టాల్లో ఉంటే తన గదిలోని బల్బులు ఎర్రగా, లాభాల్లో ఉంటే ఆకుపచ్చగా వెలిగేలా చేశారు. ఏపీఐలోని



రియల్‌టైమ్ ట్రేడింగ్‌కు అనుగుణంగా ఇంట్లో లైటింగ్ మారడం తనలో ఉత్సాహాన్ని పెంచుతుందని పంకజ్ చెబుతున్నారు. కైట్ కనెక్ట్ సాఫ్ట్‌వేర్‌ను ఇలా మార్చి తయారుచేసిన ఉత్పత్తిని అమ్మాలనుకుంటే తామే తొలి వినియోగదారులం అవుతామని జెరోదా సంస్థ తమ అధికారిక ఎక్స్‌లో పోస్ట్ చేయడం విశేషం. – ఈనాడు, బెంగళూరు

క్కొ.. క్కొ.. కోడి దొరికింది



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఇందిరానగర్ శివారు.. శనివారం ఉదయం. . పత్తి చేనులో పదుల సంఖ్యలో జనాలు కోళ్ల వెంట పరుగెడుతున్నారు. దొరికిన వారు రెండు, మూడింటిని తీసుకుని వెళ్తున్నారు. దొరకని వారు మరో ప్రయత్నం చేస్తున్నారు. కోళ్లేంటి? ఇష్టమొచ్చినట్లు పట్టుకుని తీసుకెళ్లడమేంటి అనుకుంటున్నారా? అసలేం జరిగిందంటే.. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వాహనంలో అల్లి సురేశ్ అనే రైతు పత్తి చేనులో సుమారు వెయ్యి నాటు కోళ్లను తీసుకొచ్చి వదిలేశారు. అటుగా వెళ్తున్న కొంత మంది వాటిని చూసి తమకు తెలిసిన వారికి సమాచారం అందించారు. ఇలా ఎల్కతుర్తి, చింతపల్లి, గోపాల్‌పూర్, ఇందిరానగర్ గ్రామాలకు చెందిన వారు అక్కడికి చేరుకుని వాటిని వెంబడించి పట్టుకెళ్లారు. ఇవి వైరస్ సోకిన కోళ్లని ప్రచారం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ నాలుగు కోళ్లను పశువైద్యాధికారిణి దీపికకు అందజేశారు. వరంగల్‌కు తీసుకెళ్లి ల్యాబ్‌లో పరీక్షించగా ఎలాంటి రోగ లక్షణాలు లేవని, ఆరోగ్యంగానే ఉన్నాయని తేలింది. ఎవరు తీసుకువచ్చారు, ఎందుకు వదిలేశారనే దానిపై విచారిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, ఎల్కతుర్తి



ఈ రెండు పరీక్షల్లో గట్టెక్కితేనే విజయం

విజయవంతమైన వ్యక్తులకు రెండు లక్షణాలు కచ్చితంగా ఉంటాయి. అవేంటంటే.. 1.అనిశ్చితిలోనూ నిర్భయంగా ముందడుగు వేయడం. 2. ఒకే పనిని నిరంతరం చేయడం. విసుగ్గా అనిపించినా, ప్రతిరోజూ స్థిరత్వంతో శ్రమిస్తూనే ఉండటం. అనిశ్చితి మీ ధైర్యాన్ని పరీక్షిస్తుంది. నిరాసక్తత మీ క్రమశిక్షణకు పరీక్ష పెడుతుంది. ఈ రెండు పరీక్షల్లోనే దాదాపు 90 శాతం మంది ఓడిపోతారు. మిగిలినవారి నుంచే విజేతలు పుడతారు.

– డేవిడ్ తలేన్, కాపీరైటర్

వసుంధర

vasundhara@eenadu.in

వర్చువల్ వర్కవుట్స్... ఇప్పుడిదే ట్రెండ్!



ఫిట్‌నెస్ ట్రెండ్‌గా మారిన కొత్తల్లో... వ్యాయామం చేస్తున్న ఏ అమ్మాయిని చూసినా చెవిలో ఇయర్‌ఫోన్స్ ఉండేవి. పరుగు, ప్లాంక్స్, లెగ్‌ప్రెస్, పుల్‌డౌన్... వంటివి ఏం చేసినా పాటలు వినాల్సిందే. తర్వాత యోగ ట్రెండ్ అయినప్పుడేమో టీవీలూ, ఫోన్లూ వ్యాయామశైలిలో భాగం చేశారు. వాటిని చూస్తూ యోగ ఆసనాల్ని అనుకరించేవారు. అలానే ఇప్పుడు 'వర్చువల్ వర్కవుట్స్' ట్రెండ్ అవుతున్నాయి. దీనిలో వీఆర్ గాగుల్స్(హెడ్‌సెట్)ను ధరిస్తారు. మనకు కావాల్సిన జిమ్ రొటీన్ ప్లే చేసుకుని, వ్యాయామం మొదలుపెడితే సరి. బాక్సింగ్, డాన్స్, సైక్లింగ్, పరుగు... వంటి అన్నింటికీ తగినట్లుగా వాతావరణమూ మారుతుంది. స్క్రీన్‌లో 3డీ ఎఫెక్ట్ ఉంటుంది. దాంతో ఇంట్లోనే ఉన్నా... జిమ్, ఆరుబయట వాతావరణాన్ని తలపిస్తుంది. పైగా, దశల వారీగా మనం చేయాల్సినవన్నీ వీడియోలో చూపిస్తూ ఉంటుంది. దాన్ని ఫాలో అయిపోతే సరి. వేలకువేలు జిమ్‌లకు ధారపోసి... ఒక రోజు వెళ్లి ఇంకొక రోజు వెళ్లక డబ్బులు వృథా చేసే బదులు, ఈ పద్ధతి పాటిస్తే మేలు అంటున్నారు ఇప్పటి అమ్మాయిలు. మీకూ అలాగే అనిపిస్తే, ప్రయత్నించి చూడండి మరి!

క్యాన్సర్‌తో పోరాడి... ఎవరెస్ట్‌ను జయించారు!

పర్వతారోహణ అంటే ఇష్టమున్న చాలామంది కల ఎవరెస్ట్ అధిరోహించడం! దీనికి శారీరకంగానే కాదు... మానసికంగానూ సిద్ధం కావాలి. అలాంటిది క్యాన్సర్‌తో పోరాడి... బలహీనపడ్డా ఆ కలను నెరవేర్చుకోవాలి అనుకున్నారు మున్నీ క్రైసరే! 58ఏళ్ల వయసులో ఈ సాహసం చేసి... విజయం సాధించారామె.



మున్నీ

'ఆటలు ఆడతావు. మారథాన్స్‌లో పాల్గొంటావు. వ్యాయామాలు చేస్తావు. నీకు క్యాన్సరేంటి?' చాలామంది నిర్ధారణ అయ్యాక అడిగిన ప్రశ్న ఇది. నిజానికి మా అమ్మానాన్నలిద్దరూ వైద్యులే. చిన్నప్పట్నుంచీ రొమ్ములో గడ్డలా ఉండేది. 'అదెలాగూ పెరగట్లేదు కదా! పర్లేదులే భయపడకు' అని అమ్మ ధైర్యం చెప్పేది. దాంతో నేనూ పట్టించుకోలేదు. మాది విశాఖపట్నం. చిన్నప్పట్నుంచీ ఆటల్లో చురుకు. ఇంటర్ పూర్తవ్వగానే పెళ్లైంది. మావారు ఉమేష్ నేవీలో పనిచేసి, కెప్టెన్‌గా రిటైర్ అయ్యారు. నేనూ 16 ఏళ్లపాటు ఉపాధ్యాయురాలిగా పనిచేశా. మా బాబు ఆశిష్ మర్చంట్ నేవీ ఉద్యోగి. కోడలు గర్భవతి అని 2017లో ఉద్యోగం మానేశా. వాళ్లతో ఎక్కువ సమయం గడపొచ్చు అనుకుంటే... రొమ్ములో గడ్డ పెరగడం గమనించా. ఆసుపత్రికి వెళ్తే 'క్యాన్సర్... మరింత వ్యాపించొద్దంటే శస్త్రచికిత్స చేసి రొమ్ము తొలగించాలి' అన్నారు వైద్యులు.

చనిపోతే మేలనుకున్నా

క్యాన్సర్ అని వినగానే డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. నాకే ఎందుకు వచ్చింది అనుకున్నా. అయినా ఎదుర్కోవాలి అని శస్త్రచికిత్స చేయించుకున్నా. ఇంట్లోవాళ్లకీ ధైర్యం చెప్పా. తీరా రేడియేషన్ ప్రభావంతో కుడివైపు శరీరమంతా నల్లగా మారిపోయింది. కీమోథెరపీ చేయించుకునేటప్పుడు ఈ హింసకన్నా ప్రాణం పోతే బాగుండు అనిపించిన రోజులూ ఉన్నాయి. ఇంతవరకూ వచ్చా ఇప్పుడు వెనుదిరగొద్దు అనుకుంటూనే చికిత్స కొనసాగించా. కోలుకోవడానికి ఏడాదిన్నర పట్టింది. ఆ సమయంలో వంట, మొక్కల పెంపకం, చిత్రలేఖనం వంటి వ్యాపకాలపై ఎక్కువ దృష్టిపెట్టా. నాకు డిస్కవరీ ఛానెల్ చూడటమంటే ఇష్టం. ఓసారి ఎవరెస్ట్ ట్రెకింగ్ ప్రోగ్రామ్ చూసినప్పుడు ఆసక్తి కలిగింది. అధ్యయనం చేశాక నాకూ ప్రయత్నించాలనిపించింది. అప్పటికి నాకు 56 ఏళ్లు. ఇంట్లోవాళ్లకి చెబితే 'ఈ వయసులో, నీ ఆరోగ్యానికి ఇవన్నీ అవసరమా' అన్నారు. అయినా పట్టు వదల్లేదు. కోరగా కోరగా రెండేళ్లకు సరేనన్నారు.

గర్వంగా ఉంది

అయిదు నెలలు సాధన చేశాక చేయగలననిపించింది. 12వేల అడుగుల ఎత్తులో ఉండే ఉత్తరాఖండ్‌లోని 'దయారా బుగ్యాల్'నీ అధిరోహించా. ఆ ఆత్మవిశ్వాసంతోనే ఎవరెస్ట్‌కి సిద్ధమయ్యా. కొంతదూరం వెళ్లేసరికి విపరీతమైన దగ్గు. వైద్యులను సంప్రదిస్తే పర్వత మీద జంతు విసర్జితాలే కారణమన్నారు. కొన్ని జాగ్రత్తలతో తిరిగి మొదలుపెట్టా. రోజుకు 9గం. చొప్పున ఎక్కి... ఈ అక్టోబరు 20 నాటికి పూర్తిచేశా. ఈ పర్యటనలో చాలామంది విదేశీయులు... 85, 90 ఏళ్ల వాళ్లనీ కలిశా. ఈ వయసులోనూ ఎక్కుతున్న వాళ్లని చూసి ఆశ్చర్యమేసింది. నాకు చాలా పొడవైన జుట్టుండేది. క్యాన్సర్ నయమైన కొత్తలో గుండుతో ఉన్న నన్ను చూసి నా స్నేహితులు ధైర్యం చెప్పారు. గ్రాండ్ మదర్ కాంటెస్ట్‌లో పాల్గొనేలానూ చూశారు. ఆ పోటీలో గుండుతోనే పాల్గొని, రెండో స్థానంలో నిలిచా. అప్పుడు నాకు అండగా నిలిచిన స్నేహితులు ఇప్పుడు 'ఎవరెస్ట్ విజయం నీతోపాటు మాది కూడా' అంటోంటే చాలా గర్వంగా ఉంది.

క్యాన్సర్ అనగానే చాలామంది భయపడతారు. ఎన్నో ఏళ్లు బతకమని కంగారుపడతారు. కానీ వాటిని వదిలేయాలి. శరీరంలో ఎక్కడైనా చిన్న గడ్డలా కనిపించినా వైద్యులను కలవాలి. 40 ఏళ్లు దాటిన వాళ్లంతా తప్పనిసరిగా ఏడాదికోసారి వైద్యచికిత్సలు చేయించుకోవాలి. క్యాన్సర్ రాగానే జీవితం ముగిసిపోదు. చికిత్సకి తోడు పోషకాహారం తీసుకుంటూ వ్యాయామం, యోగా వంటివి చేస్తే కోలుకోవడం సులువే.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

బామ్మ చిట్కా



కార్తికం అంటేనే పూజల సమయం. రోజూ పూజా వస్తువులను శుభ్రం చేసుకోక తప్పదు. జిడ్డు, మసిపోయి తళతళ మెరవాలని ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటాం. రసాయనాలుండే క్లీనింగ్ ఉత్పత్తులను వాడుతుంటాం. శ్రమకితోడు చేతులూ పాడవుతుంటాయి. ఈసారి ఈ చిట్కా ప్రయత్నించండి. నాలుగు స్పూన్ల గోధుమపిండిలో స్పూను చొప్పున పసుపు, ఉప్పు, అరచెక్క నిమ్మరసం, తగినన్ని నీళ్లు కలిపి మిశ్రమాన్ని జారుగా కలుపుకోవాలి. దీన్ని మీ ఇత్తడి, రాగి, వెండి పూజా వస్తువులకు పట్టించి అయిదు నిమిషాలు పక్కన పెట్టేయండి. తరవాత నీటితో కడిగేయండి. ఆవు నెయ్యి తాలూకూ జిడ్డు వదలట్లేదు అనిపిస్తే కొంచెం డిష్‌వాష్ లిక్విడ్‌ని మిశ్రమానికి కలిపితే సరి. రుద్దే శ్రమ, చేతులు పాడయ్యే బాధ రెండూ ఉండవు. కావాలంటే ప్రయత్నించండి.

వైరల్: ఇండియా వీళ్ల పేరు!

ఎప్పుడన్నా ఆలోచించారా... మీ మీ పేర్లు మీకు ఎలా పెట్టారో? తాతలు, బామ్మలు, అమ్మల గుర్తుగానో... నక్షత్రం ఆధారంగానో పెట్టేవారే ఎక్కువ కదా! కానీ దేశం మీద ప్రేమతో తమ పిల్లలకు ఇండియా అని పేరు పెట్టుకున్నారు కొంతమంది దంపతులు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు అనుకునేరు, అందరూ విదేశీయులే. మన సంస్కృతీ సంప్రదాయాలకు ఫిదా అయ్యి ఆ ఇష్టాన్ని మరచిపోలేక... రోజూ వాటిని తలచుకోవాలి అనే ఉద్దేశంతో తమ పిల్లలకి ఈ పేరు పెట్టారట.



- దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ దంపతులు కూడా తన పాపకు ఇండియా అని పేరు పెట్టారు. ఈ దేశం మీద తమకున్న మక్కువను చాటుకున్నారు. '2015 ఐపీఎల్ సమయంలో ముంబయి ఇండియన్స్ జట్టుకు రోడ్స్ ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించారు. 'నేను ఇక్కడికి ఓ కోచ్‌గానే వచ్చాను. కానీ ఇక్కడి ప్రజలు, క్రీడాకారులు నన్ను ఆహ్వానించిన తీరు, చూసుకున్న విధానం నాకు ఎంతగానో నచ్చాయి. ఆలయాలు, పురాణాలు అన్నీ నా మనసును కట్టిపడేశాయి. నా భార్యకూ అంతే. మా పాప పుట్టింది కూడా ముంబయిలోనే. అందుకే 'ఇండియా జీని రోడ్స్' అని పేరుపెట్టాలని నిర్ణయించుకున్నాం' అంటారీ దంపతులు.



- ఈమధ్య సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో తెగ వైరలవుతోంది. ఐదారేళ్ల వయసున్న చిన్నారిని... 'నీ పేరేంటమ్మా' అని అడిగితే 'ఇండియా' అని చెబుతోంది. పక్కనే ఉన్న తల్లిని ఆ పేరు ఎందుకు పెట్టారంటే 'భారతదేశం అంటే నాకు చాలా ఇష్టం. అక్కడి సంప్రదాయాలు, వస్త్రధారణ, ప్రకృతి రమణీయత నన్ను ఎంతో ఆకర్షించాయి. అందుకే మా అమ్మాయికి ఆ పేరు పెట్టా' అని సమాధానం ఇచ్చిందా విదేశీ తల్లి. ఈమె మాత్రమే కాదు ఇంకొంతమందీ మన దేశం మీద ప్రేమని చాటుకున్నారు.



- ప్రముఖ హాలీవుడ్ నటి, మోడల్ ఎల్సా పటాకీది కూడా ఇలాంటి కథే. ఎల్సాకి ఇక్కడి యోగా, ఆధ్యాత్మిక వైఖరి అంటే చాలా ఇష్టమట. సినిమాలు, వార్తలు, వీడియోలు, స్నేహితుల ద్వారానే భారత్‌ను చూసి, విని ఫిదా అయ్యారు. ఎప్పటికైనా మన దేశాన్ని చూడాలి అనుకున్నారట. అందుకే తన కూతురికి **ఇండియా రోజ్ హెమ్స్‌వర్త్** అని పేరు పెట్టారు. 2016లో ఆమె భర్తతో కలిసి షూటింగ్ నిమిత్తం ఇక్కడికి వచ్చి, దేశ పర్యటన చేశాక... తన నిర్ణయం సరైనదే అని ఆయనకు చెప్పుకొని మురిసిపోయారట.



- అమెరికన్ నటి, యుగోస్లావియా యువరాణి క్యాథరీన్ ఆక్సెన్‌బర్గ్ కూడా 1991లో వాళ్ల పాపకి **ఇండియా రివెన్ ఆక్సెన్‌బర్గ్** అని పేరు పెట్టారు. ఇస్కాన్ ఆలయాలతో తనకున్న ఆధ్యాత్మిక బంధమే దీనికి కారణం అంటారామె.

చిన్న చిన్నగా... ఉల్లాసంగా!



ఉదయాన్నే లేవడం ఆలస్యం... చకచకా గుమ్మం ముందు శుభ్రం చేసి, ముగ్గేయాలి. గబగబా బ్రష్ కానిచ్చేయాలి. తరవాత వంటగట్టు శుభ్రం చేసి, వంట మొదలుపెట్టేయాలి. ఆ ఉన్న కాస్త మగత పోవాలంటే కప్పు కాఫీనో, టీనో తాగేయాలి. అది కూడా టకటకా పూర్తిచేస్తే... ఇక పెరుగుతుంది చూడండీ పనిలో వేగం. ఇంత వేగంగా పరుగెడుతోంటే ఒత్తిడి కాక ఇంకేం ఉంటుంది చెప్పండి? పనులు పూర్తవ్వాలంటే వేగంగా పనిచేయాల్సిందే. కానీ అయిష్టంగా, భారంగా చేస్తోంటే రోజంతా మరింత భారంగా గడిచేయదూ? అందుకే ఆస్వాదించండి. ముగ్గు పెడుతున్నారా... దాన్నే పనిలా కాకుండా ఇష్టంగా చేయండి. ఒక్కో చుక్కా కలుస్తూ, మెలికలు తిరుగుతూ అందమైన డిజైన్‌గా మారడం... గమనించాలే కానీ ఎంత బాగుంటుంది. కాఫీనే పెట్టారనుకోండి. కాగేటప్పుడు పాల సువాసన... దానికి కాఫీ పొడి చేర్చినప్పుడు జోడైన గుబాళింపు! ఈరోజు అరస్పూను పంచదార ఎక్కువ వేసుకుందామా? అనుకుంటూ కలుపుకోండి. నచ్చినట్టుగా చేసుకున్న కాఫీ కదా ఒక్కో గుటకనీ ఆస్వాదించేయండి. ఎంత చిన్నవో కదా! అవి ఇచ్చే ఉత్సాహం మాత్రం రోజంతా ఆనందంగా ఉండేలా చేయగలవు. దీనికీ ఓ పేరుంది 'మైక్రో సెలబ్రేషన్'.

కాబట్టి, రోజులో ప్రతిదీ కాకపోయినా కొన్నింటినైనా ఇలా ప్రయత్నించేయండి. స్నేహితులతో మాట్లాడుతున్నారా... ఫోన్‌లో చూస్తూ అన్యమనస్కంగా ఊ కొట్టొద్దు. పూర్తి ధ్యాసపెట్టి మాట్లాడండి. పక్కింటివాళ్లు చాలారోజుల తరవాత కనిపించారా నవ్వుతూ పలకరించండి. ప్రయాణాల్లో అలవాటుగా పాటలు వినడం కాదు... లిరిక్స్‌ని గమనిస్తూ ఆస్వాదించండి. ఆరోజు పని సమయానికి అయిపోయినా చాలు... చిన్న చాక్లెట్‌తో వేడుక చేసుకోవచ్చు. వీటికి కేటాయించే సమయమేమీ ఎక్కువ కాదు. కాస్త ధ్యాసపెట్టి ఆ నిమిషాన్ని ఆస్వాదిస్తున్నామంతే. ఎంత చిన్న చిన్న పనులో కానీ రోజంతా ఉల్లాసంగా ఉంచుతాయి. ఇంకేం... ఆస్వాదించడానికి సిద్ధమవండి మరి!

మట్టి బిడ్డలు... తెలుగు తేజాలు

అందరూ డాక్టరు, ఇంజినీరు, లాయర్ అవ్వాలని కలలు కంటుంటే నర్మద, నీరజలు మాత్రం తెలుగు లెక్చరర్లు అవ్వాలనుకున్నారు. కారణం వాళ్ల అమ్మేనట. ఇటీవల ఎంఏ తెలుగులో బంగారు పతకాలు సాధించిన వీళ్ల గురించి తెలియాలంటే...



నీరజ, నర్మద

'అమ్మానాన్నలిద్దరూ వ్యవసాయ కూలీలే. మేం ముగ్గురు ఆడపిల్లలం. మా పోషణ కష్టం అవుతుందని నాన్న లింబరాజు గల్ఫ్ వెళ్లారు. ఇల్లు గడవడం కష్టంగా ఉండటంతో అమ్మ సుగుణ వ్యవసాయం చేసేది. మాది రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేట. అక్క నవ్యకు పెళ్లైంది. మా ముగ్గురి చదువులు అమ్మానాన్నలకి భారం కాకూడదు అనుకున్నాం. మా చదువులన్నీ గవర్నమెంట్ స్కూల్, కాలేజీల్లోనే సాగాయి. చదువంతా తెలుగు మాధ్యమంలోనే. ఆ ఆసక్తితోనే మేము తెలుగులో ఎంఏ చేయాలనుకున్నాం. పట్టుదలతో చదవాలే కానీ, అన్ని రంగాల్లోనూ అవకాశాలు ఉంటాయి. చదువుకుంటూనే అమ్మకి సాయం చేసేవాళ్లం. సెలవుల్లో మేము కూడా పొలం పనులకి వెళ్లేవాళ్లం. అప్పుడే మాకు అమ్మ కష్టం విలువ తెలిసింది. అందుకే ఎలాగైనా చదువుకుని అమ్మని బాగా చూసుకోవాలని నిర్ణయించుకున్నాం. అదీ ఇద్దరం తెలుగు లెక్చరర్లు అవ్వాలనుకున్నాం' అంటారీ ద్వయం.

తాజాగా ఈ ఇద్దరు అక్కచెల్లెళ్లు ఎంఏ తెలుగులో శాతవాహన విశ్వవిద్యాలయంలో అత్యధిక మార్కులు సాధించి నర్మద నాలుగు, నీరజ ఒకటి చొప్పున బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అంతేకాదు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా ప్రశంసా పత్రాలనూ అందుకున్నారు. మంచి ఉద్యోగాన్ని సాధించి, తల్లి కష్టాన్ని దూరం చేయాలి అనుకుంటున్న ఈ అక్కచెల్లెళ్లకు ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా మరి!

– తుమ్మల శ్రీనివాస్, కరీంనగర్

చలివేళ... మాడు జాగ్రత్త!



చలి మొదలైంది కదూ! చర్మం పొడిబారొద్దని ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకుంటామో. అప్పటివరకూ వాడుతున్న క్రీముల్నీ మార్చేస్తుంటాం. మరి మాడు పరిస్థితేంటి?

చలి ప్రభావం మాడు చర్మం మీదా పడుతుంది. ఫలితమే తలలో పొట్టులా రాలడం, దురద వగైరా. దీన్ని పట్టించుకోవడం మానేస్తే... కురులు రాలడానికీ దారితీస్తుంది. దీన్ని మనం చుండ్రు అనుకుంటాం కానీ కాదు. అక్కడి చర్మం పొడిబారడం వల్ల వచ్చే సమస్యలివి. తగ్గాలంటే తేమ అందించాలి. ఇందుకోసం జొజొబా, ఆర్గన్ వంటి ఫ్యాటీయాసిడ్లు ఎక్కువగా ఉండే నూనెలను కొబ్బరినూనెలో కలిపి రాయొచ్చు. లేదంటే నచ్చిన నూనెకు లావెండర్, టీట్రీ వంటి ఎసెన్షియల్ ఆయిళ్లను రెండు మూడు చుక్కలు కలిపి రాసుకున్నా మంచిదే.

పొట్టు రాలడం కనిపించగానే చాలామంది యాంటీ డాండ్రఫ్ షాంపూలకు మారిపోతారు. ఇది మంచిది కాదు. పైగా మాడు మరింత పొడిబారుతుంది. కాబట్టి, సల్ఫేట్లు లేని షాంపూలకు మారండి. ఎంత హాయిగా అనిపించినా వేడి ఎక్కువగా ఉన్న నీటిని స్నానానికి వాడొద్దు. ఇవి తేమను హరించడమే కాదు, జుట్టునీ గడ్డిలా మారుస్తాయి. కాబట్టి, వీటికీ దూరంగా ఉండాలి. గాల్లో తేమ తగ్గడం వల్లే ఈ సమస్యలంతా. వీలుంటే ఇంట్లో హ్యుమిడిఫయర్ ఏర్పాటు చేసుకుంటే ఇంకా మేలు. అలాగే హీటింగ్ స్టైల్స్, రసాయనాల ఉత్పత్తులకు ఈ కాలం వీలైనంత దూరంగా ఉండాలి. దాంతో పాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండే అవిసెలతోపాటు గుడ్లు, నట్స్, బాదం వంటివి ఎక్కువగా తీసుకోవాలి. అప్పుడే మాడు ఆరోగ్యంగా ఉండి, కురులూ బలహీనమవకుండా ఉంటాయి. గమనించుకుంటారుగా మరి?

తొలి మహిళ!



భారత మహిళా క్రికెట్ జట్టు ప్రస్తుతం సంబరాలు చేసుకుంటోంది. అయితే మన జట్టుకి తొలి కెప్టెన్ ఎవరో తెలుసా... శాంత రంగస్వామి. చెన్నైలో పుట్టి పెరిగిన ఈమె... ఆల్ రౌండర్. 1976లో జట్టు సారథిగా ఎంపికయ్యారు. అర్జున అవార్డునీ అందుకున్నారు. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో సేవలందించిన మొదటి భారతీయ మహిళా క్రికెటర్. ఈ ఏడాది ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్‌కి ఎన్నికైన తొలి మహిళా అధ్యక్షురాలు. బీసీసీఐ నుంచి మహిళల విభాగంలో జీవన సాఫల్య పురస్కారాన్ని పొందిన తొలి వ్యక్తి కూడా!

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి



08న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,24,320	1,12,250	1,52,050
విజయవాడ	1,20,490	1,11,850	1,51,600
ప్రొద్దుటూరు	1,21,450	1,11,730	1,51,600
రాజమహేంద్రవరం	1,22,020	1,11,850	1,65,000
విశాఖపట్నం	1,21,570	1,11,850	1,50,000
తమిళనాడు	------	1,13,000	1,65,000

కిడ్స్ కార్నర్: బుజ్జాయిలు వాటితో ఊసులాడుతారు..!



మబ్బులు, వర్షపు చుక్కలు, నక్షత్రాలు, సూర్య-చంద్రులు, బుజ్జి ఏనుగు, చిట్టి ఎలుక, మెడను ఆ బారున చాచే జిరాఫీ బొమ్మలు మనల్నే కాదు... అభం శుభం ఎరుగని చిన్నారుల్ని ఆకర్షిస్తాయి. వారి ఊయలకు కాస్త ఎత్తులో వీటిని వేలాడదీస్తే చాలు... వాటితో వచ్చీరాని భాషలో ఎన్ని ఊసులు చెబుతారో... అంతేనా, వాళ్ల కళ్లు ఎక్కువగా వాటినే గమనిస్తూ ఉంటాయి. తదేకంగా వాటిని చూస్తూ దృష్టి కేంద్రీకరిస్తారు. అవి గాలికి అటూ ఇటూ ఊగుతుంటే... బొమ్మల్ని చేతులతో తాకాలని, నోట్లో పెట్టుకోవాలని ఉత్సాహపడతారు. దాంతో కాళ్లు, చేతుల్లో కదలికలు వస్తాయి. ఓ రకంగా వ్యాయామం కూడా అవుతుంది. అలానే సెన్సరీ, కాగ్నిటివ్ నైపుణ్యాలూ అభివృద్ధి చెంది... నవ్వడం, అరవడం, కేకలు వేయడం వంటివి చేస్తారు. భాషానైపుణ్యాలకి బీజం పడేది కూడా ఇక్కడే. మరి పిల్లల అభివృద్ధికి ఇంత సహాయపడే వాటిని ప్లాస్టిక్ భయంతో వాళ్లకి దూరం చేస్తే ఎలా? 'ప్లాస్టిక్ బొమ్మలకు ఉండే కళ్లని పీకేసి పిల్లలు నోట్లో పెట్టుకుంటే ఇంకేమైనా ఉందా..' అంటారు అమ్మలు. మైక్రోప్లాస్టిక్స్ నోట్లోకి వెళతాయి. బ్యాటరీలు మింగేస్తారు లాంటి భయాలు చాలానే. అందుకే హ్యాంగింగ్స్ పెట్టడమే మానేశారు ఈతరం అమ్మలు. ఈ భయాలన్నింటికీ చెక్ చెబుతూ వచ్చినవే... 'క్రోషె హ్యాంగింగ్స్'. ముద్దుగా, డెకరేటివ్ ఉపకరణాల్లా చూడముచ్చటగా ఉంటాయి. ఊలుతో అల్లుతారు కాబట్టి ప్లాస్టిక్ భయం అక్కర్లేదు. పర్యావరణహితం కూడా. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే, నిశ్చింతగా వాటిని పిల్లలకు అందించొచ్చు. మీకూ నచ్చాయా? ఆన్‌లైన్ వేదికల్లో వెదికేయండి మరి!



వర్ష లక్ష్యం... కలెక్టర్ అవ్వడం!

అమ్మానాన్నలు లేరు. అందుకని బంధువులు అండగా నిలిచారు. అయితే ఆమె కోరిక కలెక్టర్ కావాలని! ఇక్కడే చిక్కొచ్చిపడింది. కారణం ఆమెకు చూపులేదు. అయినా ప్రయత్నిస్తోంది... వర్ష! ఎలాగంటే...



వర్ష

వర్షకి పుట్టుకతోనే 90 శాతం దృష్టిలోపం ఉంది. ఈమెది తమిళనాడులోని వేలాంగుడి గ్రామం. తన లోపాన్ని పక్కనపెట్టి, కష్టపడి చదివింది. వర్ష లక్ష్యం ఐఏఎస్ కావడం. 'ఎవరికైనా అమ్మానాన్నలే గొప్ప నిధి. నేను పుట్టిన కొన్ని నెలలకే అమ్మ కిడ్నీ సమస్యతో చనిపోయింది. ఆ బెంగతో నాన్న కూడా చనిపోయారు. ఒకరకంగా నెలల పాపాయిగా ఉన్నప్పుడే అమ్మానాన్నల్ని కోల్పోయా. అత్త, అవ్వ చేరదీశారు. వాళ్లెప్పుడూ నన్ను ప్రోత్సహించేవారు. అయినా ఈ క్రమంలో ఎదుర్కొన్న కష్టాలెన్నో. ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నా, నలుగురికీ సాయపడాలన్నా చదువే దారని నమ్మాను. బీఏ (ఇంగ్లిష్), ఎంఏ పూర్తిచేశా. దృష్టిలోపం కారణంగా రెట్టింపు కష్టపడాల్సి వచ్చేది. మాగ్నిఫయర్‌తో అక్షరాలు పెద్దవి చేసుకుని చదివేదాన్ని. దాంతో కూడా ఎక్కువసేపు చదవలేను. ఆడియోలను వింటూ అర్థం చేసుకునేదాన్ని. అయితే తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో సాయపడేవారు. స్క్రైబ్ ద్వారా పరీక్షలు రాసి... 10వ తరగతిలో 481 మార్కులు, 12వ తరగతిలో 986 మార్కులు సాధించాను. కానీ నా కంటి సమస్య కారణంగా సైన్స్, ఇంజినీరింగ్ వంటి కోర్సులు తీసుకోవడం కుదరదు. అందుకే ఆంగ్లాన్ని ఎంపిక చేసుకొని ఎంఏ పూర్తిచేశా. ఎక్కడ రాజీపడినా సేవ విషయంలో పడదలచుకోలేదు. కాబట్టే, ఐఏఎస్ లక్ష్యంగా పెట్టుకున్నా' అంటోన్న వర్ష గ్రూప్-2 దివ్యాంగుల కోటాలో తొలిస్థానం సాధించింది. ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ ఆఫీసర్‌గా చేస్తోంది. ఐఏఎస్ లక్ష్యంగా సాగుతోంది. 'సాధించాలన్న పట్టుదల, నిరంతర కృషితో ఏదైనా సాధించొచ్చు' అంటున్న ఆమెని అభినందించాల్సిందే కదూ!

– ఆళ్ల లక్ష్మీహరికృష్ణ, చెన్నై

ఛాంపియన్స్

చివరిది వరుణుడికి.. సిరీస్ భారత్‌కు



బ్రిస్బేన్

ఆస్ట్రేలియాకు వన్డే సిరీస్‌ను కోల్పోయినప్పటికీ.. టీ20 సిరీస్‌ను మాత్రం టీమ్‌ఇండియానే సొంతం చేసుకుంది. శనివారం చివరి టీ20 వర్షం వల్ల రద్దవడంతో ఇప్పటికే ఉన్న 2-1 ఆధిక్యంతో భారత్ సిరీస్‌ను చేజిక్కించుకుంది. కాన్‌బెర్రాలో సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను తుడిచిపెట్టేసిన వరుణుడు.. బ్రిస్బేన్‌లో చివరి మ్యాచ్‌ను కూడా తన ఖాతాలోనే వేసుకున్నాడు. ఆఖరి టీ20లో మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా.. 4.5 ఓవర్లలో 52/0తో ఉన్న దశలో మొదలైన వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకోగా.. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (29 నాటౌట్; 16 బంతుల్లో 6×4), అభిషేక్ శర్మ (23 నాటౌట్; 13 బంతుల్లో 1×4, 1×6) భారత్‌కు అదిరే ఆరంభాన్నిచ్చారు. సిరీస్ నాలుగో మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన శుభ్‌మన్.. అదే జోరులో ఈ మ్యాచ్‌లో బౌండరీల మోత మోగించాడు. అతను ఆరు ఫోర్లు కొట్టాడు. మరో ఎండ్‌లో అభిషేక్ కూడా ఒక సిక్సర్, ఫోర్ అందుకుని ఊపుమీద కనిపించాడు. అయితే అతడికి రెండు జీవనదానాలు లభించాయి. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే అతడి క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ నేలపాలు చేశాడు. తర్వాత నాలుగో ఓవర్లో డ్వార్షుయిస్ తేలికైన క్యాచ్‌ను విడిచిపెట్టాడు. 4.4 ఓవర్లకే 50 మార్కును చేరుకున్న భారత్.. సులువుగా 200 పైచిలుకు స్కోరు సాధించేలా కనిపించింది. కానీ ఇంకో బంతి పడగానే వరుణుడి ప్రతాపం మొదలై మ్యాచ్ రద్దుకు దారి తీసింది. ఈ పర్యటనలో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో ఆస్ట్రేలియా సొంతం చేసుకోగా.. అంతే తేడాతో టీ20ల్లో భారత్ నెగ్గింది. సిరీస్‌ను టీమ్‌ఇండియా ఓటమితో ఆరంభించినప్పటికీ.. తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి పైచేయి సాధించింది.

అభిషేక్ రికార్డు


అభిషేక్

- అంతర్జాతీయ టీ20ల్లో అతి తక్కువ బంతుల్లో వెయ్యి పరుగుల మైలురాయిని అందుకున్న బ్యాటర్‌గా భారత ఓపెనర్ అభిషేక్ శర్మ రికార్డు సృష్టించాడు. శనివారం ఆస్ట్రేలియాతో రద్దయిన చివరి టీ20లో అతనీ మార్కును దాటాడు. ఇందుకోసం అభిషేక్‌కు 528 బంతులే అవసరమయ్యాయి. ఇదే సిరీస్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ టిమ్ డేవిడ్ 569 బంతులతో రికార్డు నెలకొల్పగా.. కొన్ని రోజుల్లోపే దాన్ని అభిషేక్ బద్దలు కొట్టాడు. అంతకుముందు భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 573 బంతులతో నెలకొల్పిన రికార్డునే డేవిడ్ అధిగమించడం విశేషం.
- భారత్ తరఫున అతి తక్కువ మ్యాచ్‌ల్లో వెయ్యి పరుగుల మార్కును చేరుకున్న బ్యాటర్‌గా అభిషేక్ రికార్డులకెక్కాడు. అతడికిది 28వ మ్యాచ్. కోహ్లి (29 మ్యాచ్‌లు)ని అతను అధిగమించాడు. అయితే ఇన్నింగ్స్‌ల పరంగా చూస్తే కోహ్లి (27)దే అగ్రస్థానం. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌లతో ఈ ఘనతను అందుకున్నాడు.

సిద్ధమయ్యే వచ్చా: అభిషేక్

గత ఏడాది కాలంలో భారత టీ20 జట్టులో కీలక బ్యాటర్‌గా ఎదిగాడు అభిషేక్ శర్మ. ప్రతిష్టాత్మక ఆసియా కప్ గెలవడంలోనూ అతడిది కీలక పాత్ర. అయితే ఉపఖండంలో చూపించిన జోరును ఆస్ట్రేలియాలో అభిషేక్ కొనసాగించగలడా అన్న సందేహాలు కలిగాయి. ఆ సందేహాలకు బ్యాటుతోనే సమాధానం చెప్పాడీ ఓపెనర్. ఆసీస్ బౌలర్ల లయను దెబ్బ తీస్తూ జట్టుకు శుభారంభాలు అందించిన అభిషేక్.. 5 మ్యాచ్‌ల్లో 40.75 సగటుతో 163 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ఇక్కడి పిచ్‌లకు తగ్గట్లుగా సరిగ్గా సన్నద్ధమై రావడం వల్లే తాను విజయవంతం అయ్యాయని అతను చెప్పాడు. "ఈ సిరీస్ కోసం ఎదురు చూస్తున్నా. మన జట్టు ఆస్ట్రేలియాకు వెళ్లబోతోందని తెలియగానే ఎంతో ఉత్సాహం కలిగింది. ఆస్ట్రేలియాలో పరిస్థితులు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటాయని తెలుసు. ఇక్కడి పరిస్థితులకు, నేను ఎదుర్కోబోయే బౌలర్ల శైలికి తగ్గట్లు సన్నద్ధమయ్యే ఇక్కడికి వచ్చా. జట్టు కోసం మెరుగైన ప్రదర్శన చేయాలంటే ఇలాంటి ప్రపంచ స్థాయి బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవాలి. నేను సహజ శైలిలో ఆడేలా కెప్టెన్, కోచ్ నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఎన్ని పరుగులు చేశామనే దాని కంటే.. జట్టుకు అవసరమైన ఊపును ఇవ్వాలనే స్పష్టత నాకు కలిసొస్తోంది" అని అభిషేక్ తెలిపాడు. ప్రపంచకప్ గెలవాలన్నది తన కల అని.. వచ్చే ఏడాది సొంతగడ్డపై జరిగే పొట్టి కప్పు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని అభిషేక్ చెప్పాడు.

రవీందర్ పసిడి గురి

- ఇలవేనిల్‌కు కాంస్యం
- ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్


రవీందర్

కైరో: ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రవీందర్ సింగ్ సత్తా చాటాడు. శనివారం పురుషుల 50 మీటర్ల పిస్టల్‌లో అతడు స్వర్ణంతో మెరిశాడు. ఫైనల్లో 569 పాయింట్లతో రవీందర్ అగ్రస్థానంలో నిలిచాడు. కిమ్ (దక్షిణ కొరియా, 556), ఆంటోన్ అరిస్టార్కోవ్ (రష్యా 556) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. 50 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో రవీందర్ (569), కమల్‌జీత్ (540), యోగేశ్ కుమార్ (537)లతో కూడిన భారత బృందం (1646) రజతం గెలుచుకుంది. దక్షిణ కొరియా (1648) స్వర్ణం, ఉక్రెయిన్ (1644) కాంస్యం సాధించాయి. సైన్యంలో పని చేస్తున్న 29 ఏళ్ల రవీందర్.. 2023 బాకు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గాడు. మరోవైపు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఇలవేనిల్ వలరివన్ కాంస్యం గెలుచుకుంది. తుదిపోరులో 232 పాయింట్లతో ఆమె మూడో స్థానంలో నిలిచింది. ఫైనల్లో చివరిదాకా ఇలవేనిల్ ఆధిక్యంలో నిలిచింది. కానీ 19వ షాట్‌లో 10 పాయింట్లే సాధించిన ఆమె మూడో స్థానానికి పడిపోయింది. బాన్ హ్యోజిన్ (దక్షిణ కొరియా, 255) స్వర్ణం గెలవగా.. వాంగ్ జీఫీయ్ (చైనా, 254) రజతం సొంతం చేసుకుంది. టీమ్ విభాగంలోనూ ఇలవేనిల్ కంచు గెలిచింది. భారత బృందం (ఇలవేనిల్, మేహుల్ సజ్జనార్, శ్రేయ అగర్వాల్- 1893.3) మూడో స్థానంలో నిలిచింది. చైనా (1901.7), దక్షిణ కొరియా (1899.9) వరుసగా స్వర్ణ, రజతాలు సొంతం చేసుకున్నాయి.

జురెల్ అజేయ సెంచరీ

- రాణించిన పంత్


జురెల్

- రెండో ఇన్నింగ్స్‌లో భారత్-ఎ 382/7 డిక్లేర్డ్
- దక్షిణాఫ్రికా-ఎతో రెండో అనధికార టెస్టు

బెంగళూరు

దక్షిణాఫ్రికా-ఎ తో రెండో అనధికార టెస్టులో భారత్-ఎ తిరుగులేని స్థితిలో నిలిచింది. మూడో రోజు, శనివారం ధ్రువ్ జురెల్ (127 నాటౌట్; 170 బంతుల్లో 15×4, 1×6) అజేయ శతకం బాదడంతో 382/7 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన భారత్-ఎ.. ప్రత్యర్థికి 417 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. హర్ష్ దూబె (84; 116 బంతుల్లో 12×4, 1×6), రిషభ్ పంత్ (65; 54 బంతుల్లో 5×4, 4×6) బ్యాట్ ఝుళిపించారు. ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా ఛేదనలో వికెట్ నష్టపోకుండా 25 పరుగులు చేసింది. జోర్డాన్ హెర్మన్ (15), లెసెగో సెనొక్వానె (9) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్-ఎ 255 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా-ఎ 221 పరుగులకు ఆలౌటైంది. మ్యాచ్‌కు ఆదివారం చివరి రోజు. ఓవర్‌నైట్ స్కోరు 78/3తో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. మరో ఆరు పరుగులకే కేఎల్ రాహుల్ (27) వికెట్‌ను కోల్పోయింది. 108 వద్ద పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. పేసర్ షెపో మొరాకి బౌలింగ్‌లో పంత్‌కు మూడుసార్లు బంతి బలంగా తగిలింది. మొదట రివర్స్ పుల్ ఆడే ప్రయత్నంలో బంతి హెల్మెట్‌కు తగలగా.. ఆ తర్వాత మోచేతికి తాకింది. ఇంకోసారి బంతి పొట్టలో తగలడంతో అతడు నొప్పితో బాధపడ్డాడు. మూడు సార్లూ అతడికి చికిత్స అవసరమైంది. పంత్ బ్యాటింగ్ కొనసాగించాలని భావించినా.. వెనక్కి రావాలని భారత్-ఎ కోచ్ కనిత్కర్ అతణ్ని ఆదేశించాడు. దీంతో పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. కుల్‌దీప్ యాదవ్ (16) కూడా త్వరగానే వెనుదిరిగాడు. ఆ దశలో హర్ష్‌తో కలిసి భారత్-ఎను జురెల్ ఆదుకున్నాడు. జురెల్‌తో కలిసి ఆరో వికెట్‌కు 184 పరుగులు జోడించాక హర్ష్ ఔటయ్యాడు. తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. అతడు ఔట్ కాగానే భారత్-ఎ.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జురెల్ 158 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. అతడు తొలి ఇన్నింగ్స్‌లోనూ అజేయ సెంచరీ (132 నాటౌట్) సాధించిన సంగతి తెలిసిందే. పంత్ గైర్హాజరీలో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో జురెల్ వికెట్‌కీపింగ్ చేశాడు. గాయం నుంచి కోలుకున్న పంత్.. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు అతడి స్థానంలో జట్టులోకి రానున్నాడు. కానీ ఒక్క మ్యాచ్‌లో రెండు శతకాలతో జురెల్ సెలక్టర్లను సందిగ్ధంలోకి నెట్టాడు.

సంక్షిప్త స్కోర్లు... భారత్-ఎ తొలి ఇన్నింగ్స్: **255; దక్షిణాఫ్రికా-ఎ తొలి ఇన్నింగ్స్:** 211; **భారత్-ఎ రెండో ఇన్నింగ్స్:** 382/7 డిక్లేర్డ్ (జురెల్ 127 నాటౌట్, హర్ష్ దూబె 84, పంత్ 65, రాహుల్ 27, పడిక్కల్ 24; ఒకులె సెనొక్వానె 3/46); **దక్షిణాఫ్రికా-ఎ రెండో ఇన్నింగ్స్:** 25/0 (హెర్మన్ 15 బ్యాటింగ్, సెనొక్వానె 9 బ్యాటింగ్)

చెస్ ప్రపంచకప్ గుకేశ్ ఔట్


గుకేశ్

నాలుగో రౌండ్లో అర్జున్, హరి

పంజిమ్: ప్రపంచ ఛాంపియన్ అయిన దగ్గర నుంచి ఆ స్థాయికి తగ్గ ప్రదర్శనలు చేయలేకపోతున్న దొమ్మరాజు గుకేశ్.. మరోసారి తడబడ్డాడు. చెస్ ప్రపంచకప్‌లో ఫేవరెట్‌గా బరిలో దిగిన ఈ భారత స్టార్ మూడో రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు. పెద్దగా పేరు లేని ఫ్రెడరిక్ స్వాన్ (జర్మనీ) 1.5-0.5తో గుకేశ్‌కు షాకిచ్చాడు. తొలి గేమ్‌ను డ్రా చేసుకున్న గుకేశ్.. రెండో గేమ్‌లో 55 ఎత్తుల్లో ఓడిపోయాడు. మరోవైపు తెలుగు తేజాలు అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణ జోరు కొనసాగుతోంది. వీళ్లిద్దరూ నాలుగో రౌండ్‌కు దూసుకెళ్లారు. అర్జున్ 1.5-0.5తో షంషుద్దీన్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించగా.. హరికృష్ణ అంతే తేడాతో డానియల్ (బెల్జియం)పై పైచేయి సాధించాడు. తొలి గేమ్‌లలో విజయాలు సాధించిన భారత ఆటగాళ్లు.. రెండో గేమ్‌ను డ్రా చేసుకోవడం ద్వారా ముందంజ వేశారు. ప్రజ్ఞానంద, ప్రణవ్ కూడా నాలుగో రౌండ్ చేరారు. రాబర్ట్ (ఆర్మేనియా)పై 1.5-0.5తో ప్రజ్ఞానంద గెలవగా.. ప్రణవ్ అంతే తేడాతో టిటాస్ (లాత్వియా)పై నెగ్గాడు. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో ప్రణేశ్.. గాబ్రియెల్ (ఆర్మేనియా) చేతిలో దీప్తాయన్ ఘోష్ 0.5-1.5తో ఓడారు. విదిత్ గుజరాతి-షంక్‌లాండ్ (అమెరికా), ఎస్.నారాయణన్-యాంగి (చైనా), కార్తీక్ వెంకటరామన్-డానియల్ (రొమేనియా) గేమ్‌లు డ్రా అయ్యాయి.

ఆ ట్రోఫీ కోసం!

దిల్లీ: ఆసియాకప్ ట్రోఫీని భారత్‌కు తీసుకురావడానికి బీసీసీఐ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపాడు. ఐసీసీ సమావేశం సందర్భంగా అతడు పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీని కలిశాడు. "ఓ సీనియర్ ఐసీసీ అధికారి సమక్షంలో నాకు, నఖ్వీకి మధ్య ఐసీసీ సమావేశం ఏర్పాటు చేసింది. చర్చలకు ఇది మంచి ఆరంభం. చర్చలు సానుకూలంగా కొనసాగితే సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది" అని సైకియా చెప్పాడు. ఆసియాకప్ గెలిచిన అనంతరం నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకోవడానికి భారత జట్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. దాంతో అతడు ట్రోఫీని తనతో పట్టుకుపోయాడు. ట్రోఫీ ఇప్పుడు దుబాయ్‌లో ఏసీసీ ప్రధాన కార్యాలయంలో ఉంది. తన అనుమతి లేకుండా ట్రోఫీని ఎవరికీ ఇవ్వొద్దని అక్కడ సిబ్బందిని నఖ్వీ ఆదేశించాడు. భారత్ తన నుంచే ట్రోఫీని తీసుకోవాలనే పట్టుదలతో అతడు ఉన్నాడు.

అప్పుడే నిర్ణయించుకున్నాం


హర్మన్‌ప్రీత్

ముంబయి: ప్రపంచకప్ గెలిస్తే దిగ్గజ ప్లేయర్లు మిథాలీరాజ్, జులన్ గోస్వామికి కప్పు అందించాలని ముందే అనుకున్నామని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చెప్పింది. "గత ప్రపంచకప్‌లో ఓటమి తర్వాత భారత జట్టు చాలా బాధలో మునిగిపోయింది. మిథాలీ, జులన్‌కు అదే చివరి కప్ కావడమే అందుకు కారణం. భవిష్యత్‌లో కప్పు గెలిస్తే మిథాలీ, జులన్ స్టేడియంలో ఉండాలి. వారు ట్రోఫీ అందుకోవాలి. అప్పుడు ఓ ఫొటో తీసుకోవాలి అని అప్పుడే నేనూ, స్మృతి నిర్ణయించుకున్నాం. వాళ్లిద్దరు మాత్రమే కాదు డయానా ఎడుల్జీ, శుభాంగి కులకర్ణి, సుధా షా లాంటి వాళ్ల సమక్షంలో కప్ అందుకోవాలని కోరుకున్నాం" అని హర్మన్ పేర్కొంది. దక్షిణాఫ్రికాను ఓడించి ఫైనల్ గెలిచిన తర్వాత మిథాలీ, జులన్‌ను మైదానంలోకి పిలిచి భారత జట్టు కప్‌ను వారి చేతికి అందించిన సంగతి తెలిసిందే.

బెంగాల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడిగా పేస్

కోల్‌కతా: భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ శనివారం బెంగాల్ టెన్నిస్ సంఘం (బీటీఏ) అధ్యక్షుడిగా లాంఛనంగా బాధ్యతలు స్వీకరించాడు. 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన పేస్‌ను గత నెలలో ఏకగ్రీవంగా బీటీఏ అధ్యక్ష పదవికి ప్రతిపాదించారు. అతడు ఇంతకాలం సంఘంలో గౌరవ ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. శనివారం బీటీఏ వార్షిక సర్వసభ్య సమావేశం అనంతరం పేస్ అధ్యక్షుడిగా బాధ్యతలు అందుకున్నాడు.

రాణించిన రాధేశ్

హైదరాబాద్ 295/7

హైదరాబాద్: రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్ (గ్రూప్-డి)లో హైదరాబాద్ తొలి రోజు బ్యాటుతో మెరుగైన ప్రదర్శన చేసింది. రాహుల్ రాధేశ్ (85 బ్యాటింగ్; 163 బంతుల్లో 8×4) సత్తా చాటడంతో శనివారం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 295 పరుగులు సాధించింది. ఓ దశలో ఆ జట్టు 150కి అయిదు వికెట్లు కోల్పోగా.. రాధేశ్ నిలబడ్డాడు. అతడు.. రోహిత్ రాయుడు (47)తో ఆరో వికెట్‌కు 117 పరుగులు జోడించాడు. అంతకుముందు రాహుల్ సింగ్ (55), హిమతేజ (39) రెండో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆట ముగిసే సమయానికి రాధేశ్‌కు తోడుగా తనయ్ త్యాగరాజన్ (5) క్రీజులో ఉన్నాడు. రాజస్థాన్ బౌలర్లలో అనికేత్, అశోక్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

విజృంభించిన పృథ్వీ: తమిళనాడుతో రంజీ మ్యాచ్ (గ్రూప్-ఎ)ను ఆంధ్ర మెరుగ్గా ఆరంభించింది. బంతితో సత్తా చాటింది. పృథ్వీరాజ్ (4/46), సౌరభ్ కుమార్ (2/4) విజృంభించడంతో తొలి రోజు శనివారం తొలి ఇన్నింగ్స్‌లో తమిళనాడు 182 పరుగులకే ఆలౌటైంది. విద్యుత్ (40) టాప్ స్కోరర్. ఓ దశలో 103 పరుగులకే 9 వికెట్లు కోల్పోయిన తమిళనాడును విద్యుత్, సందీప్ వారియర్ (29 నాటౌట్) ఆదుకున్నారు. ఈ జంట ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించింది. ఆట ముగిసే సమయానికి ఆంధ్ర మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 20 పరుగులు చేసింది. అభిషేక్ (3), విజయ్ (1) క్రీజులో ఉన్నారు.

డెఫ్‌లింపిక్స్‌కు భారత్ 111 మందితో..

దిల్లీ: టోక్యోలో ఈనెల 15న ఆరంభమయ్యే డెఫ్‌లింపిక్స్‌కు భారత్ 111 మంది బృందంతో వెళుతోంది. వీరిలో 73 మంది అథ్లెట్లు ఉన్నారు. ఈ టోర్నీకి ఇంత పెద్ద టీమ్‌ను పంపడం భారత్‌కు ఇదే తొలిసారి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, గోల్ఫ్, జూడో, కరాటె, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, రెజ్లింగ్, టెన్నిస్‌లో భారత క్రీడాకారులు పోటీపడనున్నారు. 2022 బ్రెజిల్ డెఫ్‌లింపిక్స్‌కు 77 మంది అథ్లెట్లను పంపడమే ఇప్పటిదాకా రికార్డు. ఆ క్రీడల్లో 8 స్వర్ణాలు సహా అత్యుత్తమంగా 16 పతకాలు గెలుచుకుంది. ఈసారి ఆ రికార్డును దాటాలని భారత్ పట్టుదలతో ఉంది.

భారత 91వ గ్రాండ్‌మాస్టర్‌గా రాహుల్


రాహుల్

దిల్లీ: భారత చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య సెంచరీ దిశగా దూసుకెళ్తోంది. రాహుల్ వీఎస్ కొత్తగా గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించాడు. ఈ ఘనత అందుకున్న 91వ భారత ప్లేయర్ అతడు. ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఎస్‌ఈఏఎన్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లో ట్రోఫీ గెలిచిన 21 ఏళ్ల రాహుల్.. ఈ క్రమంలో చివరి గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌ను అందుకున్నాడు. 2021లో అతడు ఇంటర్నేషనల్ మాస్టర్ అయ్యాడు. భారత ప్లేయర్ గ్రాండ్‌మాస్టర్ కావడం రెండు వారాల వ్యవధిలో ఇది రెండోసారి. ఇటీవలే ఏఆర్ ఇళంపార్తి జీఎం హోదా అందుకున్నాడు.

పాక్‌దే వన్డే సిరీస్

ఫైసలాబాద్: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో చేజిక్కించుకుంది. శనివారం ఆఖరి వన్డేలో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 37.5 ఓవర్లలో 143 పరుగులకే ఆలౌటైంది. డికాక్ (53) టాప్ స్కోరర్. ప్రిటోరియస్ (39) కూడా రాణించాడు. అబ్రార్ అహ్మద్ (4/27), మహ్మద్ నవాజ్ (2/31), సల్మాన్ ఆఘా (2/18), షహీన్‌షా అఫ్రిది (2/18) ప్రత్యర్థిని కట్టడి చేశారు. సయీమ్ అయూబ్ (77) సత్తా చాటడంతో పాక్ 25.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రిజ్వాన్ (32 నాటౌట్), బాబర్ అజామ్ (27) కూడా రాణించారు. ఈ సిరీస్‌లో తొలి వన్డేను పాక్ గెలవగా.. రెండో వన్డే దక్షిణాఫ్రికా చేజిక్కించుకుంది.

పంకజ్ శుభారంభం

దోహా: ప్రపంచ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో పంకజ్ అడ్వాణీ శుభారంభం చేశాడు. శనివారం తొలి రౌండ్లో ఈ మూడుసార్లు ఛాంపియన్ 4-1తో సాహిల్ (కెనడా)ను ఓడించాడు.

రిచాకు డీఎస్పీ పదవి


రిచా ఘోష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న బెంగాల్ సీఎం మమత బెనర్జీ. చిత్రంలో జులన్ గోస్వామి, సౌరభ్ గంగూలీ

కోల్‌కతా: వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టులో కీలక సభ్యురాలైన వికెట్‌కీపర్ రిచా ఘోష్‌కు ఆమె సొంత రాష్ట్రం బెంగాల్ నజరానాలు ప్రకటించింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో రిచాను సన్మానించి ఆమెకు రాష్ట్ర అత్యుత్తమ పౌర అవార్డు 'బంగ భూషణ్'ను ప్రదానం చేసింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి మమత బెనర్జీ చేతులు మీదుగా రిచా అందుకుంది. అంతేకాక ఆమెను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమిస్తూ బెంగాల్ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. స్వర్ణ హారం ఇవ్వడంతో పాటు ఫైనల్లో ఆమె చేసిన 34 పరుగులకు గుర్తుగా రూ.34 లక్షల నగదు బహుమతిని కూడా బహూకరించింది. మరోవైపు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) పసిడి బ్యాట్, బాల్‌ను రిచాకు అందజేసింది. ప్రపంచకప్ గెలిచిన జట్టులో ఉన్న తొలి బెంగాల్ క్రికెటర్ రిచానే. 2003లో సౌరభ్ గంగూలీ ఆ అవకాశాన్ని కొద్దిలో కోల్పోయాడు. "రిచా బెంగాల్‌ను గర్వించేలా చేసింది. ముమ్మందు కూడా ఆమె ఇలాగే రాణిస్తుందని ఆశిస్తున్నాం" అని క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ అన్నాడు. "ఒత్తిడిని ఆస్వాదించాను. నెట్స్‌లోనూ ఒక సమయం నిర్దేశించుకుని వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించేలా సాధన చేస్తుంటా" అని రిచా తెలిపింది. ఈ కార్యక్రమంలో భారత మాజీ పేసర్ జులన్ గోస్వామి తదితరులు పాల్గొన్నారు. 22 ఏళ్ల రిచా.. ప్రపంచకప్‌లో 8 ఇన్నింగ్స్‌ల్లో 235 పరుగులు చేసింది.

బ్యాడ్మింటన్‌కు తైజు వీడ్కోలు


తైజు యింగ్

దిల్లీ: చైనీస్ తైపీ స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ తైజు యింగ్ ఆటకు వీడ్కోలు పలికింది. 31 ఏళ్ల తైజు మణికట్టు మాయాజాలానికి ప్రసిద్ధి. నెట్ దగ్గర ఆమె చేసే విన్యాసాలను అభిమానులు మరిచిపోలేరు. కొంతకాలంగా గాయాలతో బాధపడుతున్న ఈ మాజీ ప్రపంచ నంబర్‌వన్ ప్లేయర్.. ఆటలో ఇక కొనసాగకూడదని నిర్ణయించుకుంది. 2024 ఇండియా ఓపెనే ఆమెకు కెరీర్‌లో చివరి టోర్నీ. "ఓ అందమైన అధ్యాయానికి తెరపడింది. బ్యాడ్మింటన్‌కు కృతజ్ఞతలు. ఈ ఆట నాకు అన్నీ ఇచ్చింది" అని తైజు ఇన్‌స్టాలో పేర్కొంది. తైజు వీడ్కోలు నేపథ్యంలో భారత స్టార్ పీవీ సింధు స్పందించింది. "గత 15 ఏళ్లలో నీతో తలపడిన ప్రతిసారి ఎంతో శ్రమించేలా చేశావ్. 2016లో రియో ఒలింపిక్స్, 2019 బాసెల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణం సాధించే క్రమంలో నీతో మారథాన్ మ్యాచ్‌లు ఆడాను. 2021 ఆసియా క్రీడల్లో స్వర్ణ పోరులోనూ గొప్పగా పోరాడావు. నీ మణికట్టు ఆట, ప్రత్యర్థిని మాయ చేసే షాట్లు పెద్ద సవాల్‌గా అనిపించేవి" అని సింధు పోస్టు పెట్టింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన తైజు.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 2021లో రజతం, 2022లో కాంస్యం గెలిచింది.

సంజయ్‌కు సారథ్యం

అజ్లాన్ షా టోర్నీకి భారత హాకీ జట్టు

దిల్లీ: సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు డిఫెండర్ సంజయ్ సారథ్యం వహిస్తాడు. ఈ నెల 23 నుంచి 30 వరకు మలేసియాలో జరిగే ఈ టోర్నీ నుంచి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్, స్ట్రైకర్ మన్‌దీప్ సింగ్.. గోల్ కీపర్లు కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరాయాలకు విశ్రాంతినిచ్చారు. పవన్, మోహిత్ శశిల్‌కుమార్ గోల్‌కీపర్లుగా అవకాశం దక్కించుకున్నారు. **జట్టు:** సంజయ్ (కెప్టెన్), రాజిందర్ సింగ్, రాజ్ కుమార్ పాల్, నీలకంఠ శర్మ, రవిచంద్ర సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, మహ్మద్ రహీల్ మౌసీన్, సుఖ్‌జీత్ సింగ్, శీలానంద్ లక్రా, సెల్వమ్ కార్తి, ఆదిత్య అర్జున్, దిల్‌ప్రీత్, అభిషేక్, చందుర బాబీ, నీల్ సంజీప్, యశ్‌దీప్ సివాచ్, జుగ్‌రాజ్ సింగ్, అమిత్ రోహిదాస్, పవన్, మోహిత్ శశిల్‌కుమార్.

తెదేపాతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం

- కురుబలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం
- గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందిస్తాం
- భక్త కనకదాస జయంతి సభలో మంత్రి నారా లోకేశ్


కళ్యాణదుర్గంలో ర్యాలీగా వస్తున్న మంత్రి లోకేశ్, మహిళలు, స్థానికులు

ఈనాడు, అనంతపురం: తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీకి బీసీలు అండగా నిలిచారని.. ఆయా వర్గాలను బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తెదేపాతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. శనివారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో భక్త కనకదాస జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కళ్యాణదుర్గంలో నూతనంగా ఏర్పాటుచేసిన కనకదాస విగ్రహాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించి మాట్లాడారు. ''కనకదాస జయంతిని అధికారికంగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో కురుబ సోదరులు కోరారు. ఆరోజు ఇచ్చిన హామీ ఈరోజు నెరవేర్చాం. 2019-24 మధ్యలో మన బిడ్డలపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. బీసీ సోదరుల్లో తిరుగుబాటు వచ్చి 94% సీట్లతో కూటమిని గెలిపించారు. పాదయాత్ర చేసినప్పుడు బీసీల్లోని ఉపకులాలను కలిసి సమస్యలు తెలుసుకున్నా. వాటిని పరిష్కరించేవరకు నిద్రపోను. ఫైర్‌బ్రాండ్ మంత్రి సవితమ్మ మీకు ఉన్నారు. ఎంపీ బీకే పార్థసారథి కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొస్తున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన పథకాలతో కురుబలను అనుసంధానం చేసి ముందుకు తీసుకెళతాం. బీరప్ప పేరుతో తితిదే సహకారంతో గుడులు నిర్మిస్తాం. గుడికట్ల పూజారులకు త్వరలోనే గౌరవవేతనం అందిస్తాం. అసంపూర్తిగా నిలిచిపోయిన కురుబ భవనాలను 12 నెలల్లో పూర్తిచేస్తాం. బీమా, షెడ్లు నిర్మించి ఇచ్చేలా పవనన్నతో మాట్లాడతా. కురుబల ఆలయాల్లో పూజాదికాల కోసం ఆర్థికసాయం అందిస్తాం'' అని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

తెదేపాతోనే కురుబల అభ్యున్నతి

''2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వం కురుబలను ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చేసింది. కురుబ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. వివిధ కార్యక్రమాల ద్వారా రూ.300 కోట్లు ఖర్చుచేసింది. గొర్రెల కొనుగోలుకు రాయితీ రుణాలు అందించాం. 50% రాయితీతో రూ.4లక్షల వరకు రుణసదుపాయం కల్పించాం. గతంలో బీకే పార్థసారథి ఎమ్మెల్యే, జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా, ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. సవిత గతంలో కురుబ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసి ఇప్పుడు మంత్రిగా ఉన్నారు. కురుబ సాధికార సంస్థ రాష్ట్ర సభ్యుడు బస్తిపాటి నాగరాజు ఇప్పుడు కర్నూలు ఎంపీ. నాయకులను రాజకీయంగా ప్రోత్సహించి ముందుకు తీసుకొచ్చాం'' అని మంత్రి లోకేశ్ వివరించారు. ''ఆర్డీటీ సంస్థకు లైసెన్సు వచ్చేలా చర్యలు చేపట్టాం. అవసరమైతే ప్రభుత్వం తరఫున ఆర్డీటీకి అండగా నిలబడతాం'' అని వెల్లడించారు.

త్వరలో బీసీలకు ఆదరణ-3 పథకం: మంత్రి సవిత

వెనకబడిన తరగతుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వానికి బీసీలంతా అండగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఆదరణ-1, 2 పథకాలు తెచ్చింది చంద్రబాబేనని.. ఆదరణ-3 పథకాన్ని ఆయనే త్వరలో తీసుకొస్తారని పేర్కొన్నారు. ఇటీవలే కార్పొరేషన్ల బాధ్యులతో చర్చించామని ఫెన్సింగ్, ఎల్ఈడీ లైట్లు, గొర్రెల ఉన్ని కటింగ్ యంత్రాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని వెల్లడించారు.


భక్త కనకదాస విగ్రహాన్ని ప్రారంభిస్తున్న నారా లోకేశ్. చిత్రంలో మంత్రులు సవిత, పయ్యావుల కేశవ్, ఎంపీలు పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు, వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణి, ఎమ్మెస్ రాజు, కలెక్టర్ ఆనంద్ తదితరులు

ఎర్రచందనం జోలికెళ్తే తాట తీస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడే 70 వేల చెట్లు నరికేశారు: 'స్మగ్లర్లు ఎన్ని వేల చెట్లు నరికితే ఇంత ఎర్రచందనం ఇక్కడకు చేరింది. వీటి రికార్డులు వర్షం, అగ్ని ప్రమాదాల వల్ల పాడైతే ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? పట్టా భూముల్లో పెంచుతూ స్మగ్లర్లు చీటింగ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎర్రచందనం అమ్మకాల్లో అవకతవకలు జరిగితే చర్యలేం తీసుకుంటున్నారు' అంటూ ఉపముఖ్యమంత్రి అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక్కడ 8 గోదాముల్లో ఎర్రచందనం ఉందని, ఇదంతా సుమారు 70 వేల చెట్లు నరకడంతో వచ్చిందని గోదాముల డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్ విలేకర్లతో మాట్లాడారు.

ఎవ్వరినీ వదిలిపెట్టం

'ప్రకృతిని విధ్వంసం చేసి ఎర్రచందనాన్ని అడ్డగోలుగా నరికేసి రూ.వేల కోట్లు దండుకున్న వారెవ్వరినీ వదలం. మధ్యాహ్నం ఇక్కడి డిపోలోకి వెళ్తే దాదాపు 2.60 లక్షల దుంగలున్నాయి. 40 లక్షల టన్నులు అనుకుంటే దాదాపు రూ.2-5 వేల కోట్ల వరకు విలువ ఉంటుంది. పట్టుకోనిది దీనికి రెండు మూడింతలు ఉంటుంది. ఇటీవల కర్ణాటకకు వెళ్లినప్పుడు గతంలో అక్కడి అధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రదుంగలను వేలం వేస్తే రూ.140 కోట్లు వచ్చిందని చెప్పారు. ఇలాంటివి భవిష్యత్తులో జరగకూడదనే ఉద్దేశంతో ఎస్పీ సుబ్బరాయుడు నేతృత్వంలో అటవీశాఖ అధికారులు, యాంటీ టాస్క్‌ఫోర్స్, ఐదు జిల్లాల ఎస్పీలతో సమీక్షించాం. ఉదయం మామండూరు వెళ్లి చూస్తే పెద్ద చెట్ల స్థానంలో మొలకలున్నాయి. ఇప్పటికైనా వాటిని కాపాడుకుంటే పర్యావరణం మెరుగుపడుతుంది.


మామండూరులో ఎర్రచందనం చెట్టును పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఇతర రాష్ట్రాలతో సమన్వయం ఉండాలి

కర్ణాటక వెళ్లినప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో రాష్ట్రాల మధ్య సమన్వయం కావాలని, లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఉండాలని కోరాను. మన రాష్ట్రంలో అలాంటి సమన్వయం లేకపోవడంతో కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌తో చర్చించా. అన్ని రాష్ట్రాల మధ్య సమన్వయం చేయండని కోరా. రెండు మూడు సమీక్షలు జరిగాక ఏ రాష్ట్రంలో అయినా ఎర్రచందనం దొరికినా తిరిగి అప్పగించేలా ఒప్పందం చేసుకున్నాం. దీని ప్రకారం ఇతర రాష్ట్రాల్లో పట్టుబడిన రూ.25-30 కోట్ల విలువైన ఎర్రచందనాన్ని వెనక్కి తెప్పించాం. 149 మంది ఎర్రదొంగలను అరెస్టు చేశాం. ఉమ్మడి కడప జిల్లాలో రెండు, మూడు జోన్లలో ఎక్కువగా స్మగ్లింగ్ జరుగుతోంది. దీన్ని నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. పట్టుకున్న ప్రతి దుంగకూ జియో ట్యాగ్ వేసి లైవ్ ట్రాక్‌లో ఉంచుతాం. ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతాం. నేపాల్‌లోనూ ఆంధ్రా ఎర్రచందనం దొరుకుతోంది. నేను బాధ్యతలు తీసుకున్నాక సొంతంగా దీనిపై అధ్యయనం చేశా.

నలుగురు కింగ్ పిన్‌లను గుర్తించాం

ఎర్రచందనం స్మగ్లర్లలో నలుగురు కింగ్ పిన్‌లను గుర్తించాం. వారిని త్వరలో పట్టుకుంటాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇందులో ఇరుక్కోకుండా ఉండేలా అవగాహన సదస్సులు ప్రారంభిస్తున్నాం. ఒక్క మొక్క కూడా కొట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ తొలుత మామండూరు అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. గుంటిమడుగు వాగు వద్ద కాసేపు సేదతీరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మిలిటరీ కమాండో ఆహార్యంతో కనువిందు చేశారు. అభిమానులు ఆయన్ను చూసేందుకు బారులు తీరారు.

దిల్లీ తితిదే ఆలయంలో త్వరలో నిత్యాన్నదానం ప్రారంభం


మాట్లాడుతున్న సుమంత్‌రెడ్డి. చిత్రంలో అనిల్‌కుమార్ సింఘాల్, అర్జాశ్రీకాంత్

ఈనాడు, దిల్లీ: దిల్లీ గోల్‌మార్కెట్ ప్రాంతంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థాన బాలాజీ మందిరంలో సాధ్యమైనంత త్వరగా నిత్యాన్నదానం ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు ఇస్కాన్ ఆధ్వర్యంలోని అక్షయపాత్ర.. లేదంటే ఇతర సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకోనున్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, దిల్లీ తితిదే ఆలయ సలహా కమిటీ ఛైర్మన్ సుమంత్‌రెడ్డిలు ఈ మేరకు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ ఆలయ వ్యవహారాల పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ అర్జా శ్రీకాంత్‌ను నియమించారు. ప్రస్తుతం దిల్లీ ఆలయానికి సాధారణ రోజుల్లో వెయ్యి నుంచి 1,500 మంది దాకా భక్తులు వస్తున్నారని, ఆ సంఖ్యను పెంచేందుకు ప్రచారం కల్పించాలని తీర్మానించారు. ఏపీభవన్‌లోని తితిదే సమాచార కేంద్రాన్ని పునరుద్ధరించి తిరుమలలో అందించే సేవల వివరాలను దేశ రాజధాని, చుట్టుపక్కల నుంచి వచ్చే భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేయడంతోపాటు, తిరుమల ప్రసాదం, క్యాలెండర్లు, డైరీలు అందుబాటులో ఉంచాలని తీర్మానించారు. తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో వాటి ప్రత్యక్షప్రసారాలను ఇక్కడ పెద్దతెరలపై ప్రదర్శించాలని నిర్ణయించారు. తెలుగువారితోపాటు తమిళ, కన్నడ, కేరళ సంఘాలను ఆహ్వానించి ఇక్కడి వేంకటేశ్వరస్వామివారికి నిర్వహించే సేవలు, ఉత్సవాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని తీర్మానించారు.

న్యాయవాదుల కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.46 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: మృతిచెందిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్కో కుటుంబానికి రూ.4లక్షల చొప్పున చెల్లించేందుకు మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.46 కోట్లు విడుదల చేసింది. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఈ మేరకు రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధిలో సభ్యత్వం తీసుకున్న వారు మృతిచెందితే రూ.8లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తారు. రాష్ట్రప్రభుత్వం రూ.4 లక్షలు, ఏపీ అడ్వొకేట్స్ వెల్ఫేర్‌ఫండ్ నుంచి బార్ కౌన్సిల్ మరో రూ.4లక్షలు చెల్లిస్తుంది. బార్ కౌన్సిల్ తన రూ.4లక్షల వాటాను ఇప్పటికే నామినీలకు చెల్లించింది.

నవశకానికి శ్రీకారంగా..!

- ఐదోసారి 'భాగస్వామ్య సదస్సు'కు విశాఖ ముస్తాబు
- భూకేటాయింపులు, ప్రోత్సాహకాలు, వేగంగా అనుమతులపై కూటమి ప్రభుత్వం దృష్టి
- భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాల సృష్టికి ప్రణాళిక


ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భాగస్వామ్య సదస్సుకు జరుగుతున్న ఏర్పాట్లు

ఈనాడు-విశాఖపట్నం: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో ఐదోసారి 'భాగస్వామ్య సదస్సు'కు విశాఖ సిద్ధమవుతోంది. వైకాపా ప్రభుత్వంలో కేవలం ఒకసారి సదస్సు నిర్వహించగా, క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ చేసి ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమలు 6-8 శాతం కూడా లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతంలోలా కాకుండా ప్రతి ఒప్పందం క్షేత్రస్థాయిలో కార్యాచరణకు వచ్చేలా... ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. 'టెక్నాలజీ ట్రస్ట్ అండ్ ట్రేడ్ - నావిగేటింగ్ ది న్యూ జియో ఎకనామిక్ ఆర్డర్' అనే థీమ్‌తో ఈ నెల 14, 15 తేదీల్లో సదస్సు నిర్వహిస్తోంది.

గతానికి, ఇప్పటికీ వ్యత్యాసం ఇదే

గతంలో జరిగిన సదస్సులకు, తాజాగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సుకు ఓ వ్యత్యాసం ఉంది. సదస్సుకంటే ముందే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఏం కావాలో అన్నింటినీ సమకూర్చేలా కసరత్తు సాగింది. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యాలు పుష్కలంగా ఉన్నాయి. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 'ల్యాండ్‌బ్యాంక్' ఏర్పాటు చేసి తక్కువ ధరకు భూములు కేటాయిస్తున్నారు. ఆర్సెలార్ మిత్తల్, ఎన్టీపీసీ, గూగుల్, సిఫీ, టీసీఎస్, కొన్ని ఐటీ కంపెనీలకు భూ కేటాయింపులు వేగంగా పూర్తిచేశారు. ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రకటించడంతోపాటు, జీఎస్టీపైనా రాష్ట్రప్రభుత్వ వాటాను రాయితీగా ఇస్తున్నారు. కొత్త రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులకు పచ్చజెండా ఊపారు.

ఏపీలో పెట్టుబడులు ఎందుకు పెట్టాలంటే?

'ఈజ్ ఆఫ్ డూయింగ్', 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లలో ఏపీ ముందంజలో ఉంది. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్‌కు సోలార్, విండ్, పంప్డ్‌స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీలో టాటా, నవయుగ వంటి పెద్ద కంపెనీలు ఇప్పటికే రూ.3.50 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాయి. సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకునే పరిశ్రమలు గ్రౌండ్ అయ్యేలోగా 'పోలవరం' పూర్తిచేసి నీటిని అందించనున్నారు. లాజిస్టిక్స్ రంగంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు ప్రధానం. ఏపీలో ప్రస్తుతం విశాఖ, గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ మేజర్ పోర్టులున్నాయి. నూతన పెట్టుబడులతో పరిశ్రమలు పూర్తయ్యేనాటికి మూలపట్నం, రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ డీప్ వాటర్ యాంకరేజ్ పోర్టులు అందుబాటులోకి తెచ్చేలా అడుగులు వేస్తున్నారు. రూ.70 వేల కోట్లతో రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో అమరావతి రింగ్‌రోడ్డు, అమరావతి-బెంగళూరు, అమరావతి-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే ఉన్నాయి. ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ నోడ్‌లకు ప్రధాని మోదీ ఇటీవల రూ.5 వేల కోట్లు ప్రకటించారు.

సదస్సు అయ్యాక మరిన్ని పెట్టుబడులొస్తాయి

– ఒ.నరేష్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్, రుషికొండ ఐటీ హిల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు

సదస్సు కంటే ముందే పరిశ్రమలకు ఏం కావాలో ప్రభుత్వం సమకూర్చుతోంది. తక్కువ ధరలకు భూములిచ్చి ఆహ్వానిస్తోంది. ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ వస్తే చదరపు అడుగుకు రూ.2 వేల సబ్సిడీ ప్రకటించింది. ఈ సదస్సు అయ్యాక ప్రోత్సాహకాలు, రాయితీలు తెలుసుకుని మరిన్ని పెట్టుబడులొస్తాయి.

సమీపిస్తున్న సమయం.. సిద్ధమవుతున్న సాగరతీరం



విశాఖపట్నంలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 14, 15న భారీస్థాయిలో తలపెట్టిన 'భాగస్వామ్య సదస్సు' నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు వేగవంతం చేసింది. పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ అనుకూలమైన రాష్ట్రమని పేర్కొంటూ నగరంలో పలు చోట్ల హోర్డింగులు ఏర్పాటు చేశారు. సదస్సు గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు వీలుగా వాటిపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించారు. – ఈనాడు, విశాఖపట్నం

128 దేశాల్లో ఒకే జెండా.. అదే బౌద్ధం

- అంబేడ్కర్ మునిమనుమడు అశోక్ అంబేడ్కర్

కోరుకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రాలను, ప్రాంతాలను బట్టి జెండాలు ఉంటాయని, కానీ 128 దేశాల్లో బౌద్ధానిది ఒకటే జెండా అని డా.బీఆర్ అంబేడ్కర్ మునిమనుమడు రాజరత్న అశోక్ అంబేడ్కర్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరం పాండవుల మెట్ట వద్ద శనివారం జరిగిన భారతీయ బౌద్ధ వారసత్వ సాంస్కృతిక ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ''ఒకప్పుడు మతాలు, జాతులు లేవు. ఆనాటి సంస్కృతి, విధానాలు అంతరిస్తున్నాయి. పలు మతాల వారు తమ మతాన్ని స్వీకరించాలని కోరినా ఆనాడు అంబేడ్కర్ బౌద్ధమే ఆచరించారు. మథురలో వెలికితీసిన వస్తువుల్లోనూ బుద్ధుని విగ్రహం బయటపడింది'' అని ఆయన గుర్తుచేశారు. అంతకుముందు అశోక్ పాండవుల మెట్టపై ఉన్న బౌద్ధ చైత్యం, ఆరామాలను సందర్శించారు. కొందరు బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రాలతో సామాజిక మాధ్యమాల్లో ఓ వర్గాన్ని విమర్శిస్తున్నారని, అది బౌద్ధంపై ప్రభావం చూపుతుందన్నారు. మరో ముఖ్యఅతిథి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. పాండవుల కొండ అభివృద్ధికి రూ.21 కోట్లతో తయారుచేసి డీపీఆర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించామన్నారు.



బౌద్ధ వారసత్వ ఉత్సవంలో మాట్లాడుతున్న రాజరత్న అశోక్ అంబేడ్కర్


జీవితంలో అన్నీ కోల్పోవడమూ ఓ అవకాశమే..

మీరు జీవితంలో అన్నీ కోల్పోయి అట్టడుగు స్థాయికి పడిపోయారా? అయితే మీరొక అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. అదేంటో తెలుసా.. వైఫల్యంతో ఏదైనా కోల్పోతామేమో అన్న భయం లేకుండా కొత్త ప్రయత్నాలకు సాహసించే సౌలభ్యం. పరిస్థితులు మిమ్మల్ని కంఫర్ట్‌జోన్ నుంచి నెట్టేశాయి కాబట్టి, ఇకపై మీ శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించి కష్టపడతారు. ఇప్పటినుంచి మీరు సాధించే ప్రతి చిన్న విజయం మీకు ఎనలేని ఆనందాన్నిస్తుంది.

– అభిదీప్ మైతీ, యాప్ డెవలపర్

న్యాయవాదులకు ఆటల పోటీలు



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్. చిత్రంలో బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, ఏపీ హైకోర్టు బార్ అధ్యక్షుడు చిదంబరం, బీబీఏ ఉపాధ్యక్షుడు పిల్లాశ్రీనివాసరావు, ఏపీ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న 148 బార్ అసోసియేషన్లలోని న్యాయవాదులు పాల్గొనే క్యారమ్స్, చెస్ పోటీలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ప్రారంభించారు. బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) హాల్లో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ.. ఎంతో మంది న్యాయమూర్తులు, న్యాయవాదులు బెజవాడ బార్ అసోసియేషన్ నుంచే వచ్చారని అన్నారు. అన్ని అసోసియేషన్లనూ ఒక వేదికపైకి తీసుకొచ్చి పోటీలు నిర్వహించడం సామాన్యమైన విషయం కాదని కృష్ణా జిల్లా న్యాయమూర్తి గుట్టల గోపి పేర్కొన్నారు. ఏపీ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా, సంయుక్త కార్యదర్శి కె.సీతారాంలు మాట్లాడారు. ఏపీ హైకోర్టు బార్ అధ్యక్షుడు చిదంబరం, బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు స్థిరంగా కొనసాగితేనే రాష్ట్రాల అభివృద్ధి

- డబుల్ ఇంజిన్ సర్కారు వల్లే ఏపీకి భారీగా పెట్టుబడులు
- బిహార్ పారిశ్రామికవేత్తల సమావేశంలో మంత్రి లోకేశ్


పట్నాలో బిహార్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్

ఈనాడు, అమరావతి: 'ప్రభుత్వాలు స్థిరంగా కొనసాగితే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. రాష్ట్రాలు బలోపేతమైతేనే దేశం అభివృద్ధి సాధిస్తుంది' అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్నాలో బిహార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో ఒకే ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగడంతోనే పెద్ద ఎత్తున అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ సర్కారు కారణంగా భారీ పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. నీతీశ్‌కుమార్‌కు ముందు, తర్వాత అన్నట్లుగా బిహార్ అభివృద్ధి సాధించిందని, సమర్థమైన నాయకుడి వల్లే ఇది సాధ్యమైందన్నారు. నాయకత్వ పటిమతో పాటు.. శాంతి భద్రతలు, మహిళల భద్రత, అవినీతి రహిత పాలన ఇందుకు కారణమని లోకేశ్ తెలిపారు. భారత్‌లో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఏపీకి రావడానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీవైష్ణవ్‌ల సహకారం కీలకమని గుర్తుచేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పాజిటివ్ లీడర్‌షిప్, పన్నుల్లో మార్పుల కారణంగా 12 నెలల్లోనే గూగుల్ సంస్థను రప్పించగలిగామన్నారు. గత ప్రభుత్వం పీపీఏలను రద్దు చేయడం వల్లనే ఈసారి పెట్టుబడుల సాధనకు 10 రెట్లు కష్టపడాల్సి వస్తోందని లోకేశ్ అన్నారు. సమావేశంలో బిహార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ నాయకులు రాంజీ గోయెంకా, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఏపీ ఫలితాలు బిహార్‌లో పునరావృతం కావాలి

'బిహార్‌లో తొలిసారి పర్యటిస్తున్నాను.. ఆంధ్రప్రదేశ్ మంత్రిగా కాదు.. భారతీయుడిగా వచ్చాను' అని మంత్రి లోకేశ్ అన్నారు. పట్నాలో బిహార్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో అభివృద్ధి కోసం ఎన్డీయేను 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ప్రజలు గెలిపించారని, ఇక్కడా అలాంటి ఫలితాలు పునరావృతం కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. భాజపా జాతీయ సహ ఇన్‌ఛార్జి సంజయ్ మయూక్, మరో నేత మనోజ్‌తివారీలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

భర్తీకాని ఇంజినీరింగ్ సీట్లు 1,764

- ఎంటెక్, ఎంఫార్మసీల్లో 1,296
- ఇదీ ప్రభుత్వ కళాశాలల పరిస్థితి
- స్పాట్ కోటా కింద భర్తీకి అవకాశమివ్వాలని కోరుతున్న విశ్వవిద్యాలయాలు
- అలా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని ఆ ప్రతిపాదనలు పక్కన పెట్టిన ఉన్నత విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో భారీగా సీట్లు మిగిలిపోయాయి. ఇంజినీరింగ్‌లో 24%, ఎంబీఏ, ఎంసీఏల్లో 28%, ఎంటెక్, ఎంఫార్మసీల్లో 51%, సాధారణ పీజీ కోర్సుల్లో మొదటి విడత పూర్తయ్యాక 67% సీట్లు మిగిలాయి. ఇంజినీరింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అనంతపురం, కాకినాడ, విజయనగరం జేఎన్‌టీయూల్లో కలిపి 269 సీట్లు భర్తీ కాలేదు. ఒక్క జేఎన్‌టీయూ కాకినాడలోనే 130 మిగిలిపోయాయి. వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్‌లో ఈఏపీసెట్ కింద భర్తీ చేసే సీట్లు 4 మాత్రమే నిండాయి.

ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి సాంకేతిక విద్యా శాఖ 3 విడతల ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ కౌన్సెలింగ్‌లలో చేరిన కొంతమంది ఇతర వాటిల్లో అవకాశాలు రావడంతో ఈ సీట్లను వదులుకున్నారు. కొన్ని బ్రాంచిలకు డిమాండ్ లేకపోవడంతో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఎక్కువగా సీఎస్ఈ, ఈసీఈ, ఐటీకే డిమాండ్ నెలకొంది.

ఎంటెక్, ఎంఫార్మసీల్లోనూ..

- ఎంటెక్, ఎంఫార్మసీల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీఈసెట్‌లో అన్ని ప్రభుత్వ వర్సిటీలు, కళాశాలల్లో కలిపి 2,547 సీట్లు ఉండగా.. 1,251(49%) మాత్రమే నిండాయి.
- ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్‌కు సంబంధించి 3,540 సీట్లు ఉంటే 2,561(72%) భర్తీ కాగా.. 979(28%) సీట్లు మిగిలాయి.
- ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లను మెరిట్ ప్రాతిపదికన స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని వర్సిటీలు కోరుతున్నాయి. తరగతిలో ఎంత మంది విద్యార్థులున్నా బోధనా వ్యయం ఒక్కటేనని, ఎక్కువ మంది పిల్లలు ఉంటే నిర్వహణకు నిధులు వస్తాయని ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి ప్రతిపాదనలూ పంపింది. కానీ, అలా అనుమతిస్తే వర్సిటీల ప్రతిష్ఠ మసకబారుతుందని ఉన్నత విద్యాశాఖ పేర్కొంటోంది.

సాధారణ పీజీ ఘోరం..

ఏంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంహెచ్ఆర్ఎం, ఎంపీఈడీ, ఎంఈడీ, లైబ్రరీ కోర్సుల్లో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక 67% సీట్లు మిగిలిపోయాయి. రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయినా.. సీట్లు పొందిన విద్యార్థులు పూర్తిస్థాయిలో చేరలేదు.

✦ వర్సిటీల్లో సుమారు 50%పైగా సీట్లు ఖాళీగానే ఉన్నాయి. ఆంధ్ర, ఆదికవి నన్నయ, ఆచార్య నాగార్జున, శ్రీవేంకటేశ్వరంలాంటి వర్సిటీల్లోనే సాధారణ పీజీ సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి.

✦ పీజీ కోర్సుల్లో పూర్తి స్థాయిలో మార్పు చేయకపోవడం, చదివినా ఉపాధి లభిస్తుందనే భరోసా లేక అభ్యర్థులు చేరేందుకు ఆసక్తి చూపించడం లేదు.

ఇంజినీరింగ్‌లో మిగిలిన సీట్లు

వర్సిటీ	సీట్లు	భర్తీ	మిగులు
ఆదికవి నన్నయ	330	257	73
ఆచార్య ఎన్జీరంగా	118	54	64
ఆచార్య నాగార్జున	528	502	26
ఆంధ్ర	968	902	66
డా. బీఆర్ అంబేడ్కర్	330	177	153
జేఎన్‌టీయూ అనంతపురం	1,089	1,035	54
జేఎన్‌టీయూ కాకినాడ	825	695	130
జేఎన్‌టీయూ గురజాడ	396	311	85
కృష్ణా	198	100	98
రాయలసీమ	396	184	212
శ్రీకృష్ణదేవరాయ	462	321	141
శ్రీపద్మావతి మహిళ	396	327	69
శ్రీవేంకటేశ్వర	528	470	58
శ్రీవేంకటేశ్వర వెటర్నరీ	21	17	4
యోగి వేమన	396	169	227
వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్	308	4	304
మొత్తం	7,289	5,525	1,764

మొదటి విడత కౌన్సెలింగ్ తర్వాత సాధారణ పీజీ సీట్ల భర్తీ

వర్సిటీ	సీట్లు	భర్తీ	మిగులు
అబ్దుల్ హక్ ఉర్దూ	198	18	180
ఆదికవి నన్నయ	2,121	675	1,446
ఆంధ్ర కేసరి	600	43	557
ఆచార్య నాగార్జున	1,510	603	907
ఆంధ్ర	3,670	1,991	1,679
డా. బీఆర్ అంబేడ్కర్	811	347	464
క్లస్టర్ వర్సిటీ	396	32	364
ద్రవిడ	220	23	197
కృష్ణా	1,047	222	825
రాయలసీమ	580	181	399
శ్రీకృష్ణదేవరాయ	1,504	263	1,241
శ్రీపద్మావతి మహిళ	926	292	634
శ్రీవేంకటేశ్వర	2,917	853	2,064
విక్రమసింహపురి	1,012	262	750
యోగివేమన	864	301	563
జేఎన్‌టీయూ అనంతపురం	28	18	10
మొత్తం	18,404	6,124	12,280

భాస్కర్‌రెడ్డి పోస్టుల వెనుక వైకాపా

- తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి నిత్యం మంతనాలు
- పోలీసు విచారణలో అంగీకరించిన నిందితుడు
- రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

ఈనాడు, అమరావతి - ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: తాడేపల్లిలోని వైకాపా సోషల్ మీడియా కేంద్ర కార్యాలయం సంపూర్ణ సహకారంతోనే.. తెదేపా, జనసేన, భాజపా ముఖ్యనేతలు, వారి కుటుంబసభ్యులపై అభ్యంతరకరమైన పోస్టులను తన ఫేస్‌బుక్ ఖాతాలో పెట్టినట్లు మాలపాటి విజయభాస్కర్‌రెడ్డి పోలీసు విచారణలో వెల్లడించాడు. వైకాపా కేంద్ర కార్యాలయంలోని సోషల్ మీడియా సెల్ తనకు దిశానిర్దేశం చేసేదని, అవసరమైన ఫొటోలు, పోస్టులను వాట్సప్ ద్వారా పంపేవారని అంగీకరించాడు. ఆ కార్యాలయంలో పనిచేసే శ్రీను, జెట్టి రాజా.. అనే ఇద్దరు తనతో నిత్యం మాట్లాడుతూ ఏ పోస్టులు పెట్టాలో తెలియజేసేవారని బయటపెట్టాడు. నిందితుడు వెల్లడించిన విషయాలన్నింటినీ పోలీసులు రిమాండ్ రిపోర్టులో పొందుపరిచి కోర్టుకు అందజేశారు.

కీలక విషయాల వెల్లడి: వైకాపా సోషల్ మీడియా కార్యకర్త విజయభాస్కర్‌రెడ్డి పోలీసు విచారణలో అనేక కీలక విషయాలు వెల్లడించాడు. అతని సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫేస్‌బుక్ ఖాతాలో ఏమేం పోస్టులు పెట్టాడు? వాటిలో తొలగించినవి ఎన్ని?.. అనే వివరాలు సేకరించారు. ఫోన్ మెమరీ, వాట్సప్‌లో డిలీట్ చేసేసిన పాతడేటా తీసేందుకు.. దాన్ని ఫోరెన్సిక్ బృందానికి అందజేశారు.

ప్రతిష్ఠ దిగజార్చడమే లక్ష్యం: తెదేపా, జనసేన, భాజపా ముఖ్యనేతల కుటుంబాల్లోని మహిళలే లక్ష్యంగా భాస్కర్‌రెడ్డి పోస్టులు పెట్టేవాడు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించాలనే లక్ష్యంతోనూ ఈ పోస్టులు పెట్టేవాడు. కడపకు చెందిన వైకాపా నేత వర్రా రవీంద్రరెడ్డి కూడా భాస్కర్‌రెడ్డితో నిత్యం ఫోన్‌లో టచ్‌లో ఉండేవాడు. ఈ అభ్యంతరకరమైన పోస్టుల్లో కొన్నింటిని భాస్కర్‌రెడ్డి తయారుచేయగా, మరికొన్ని వైకాపా సోషల్ మీడియా సెల్ నుంచి వచ్చేవి. వాటిని అలాగే తన ఫేస్‌బుక్‌లో పెట్టేవాడు.

యూకే నంబరుతో వాట్సప్: విజయభాస్కర్‌రెడ్డి +44 7773212073 యూకే నంబరుతో వాట్సప్ యాక్టివేట్ చేశాడు. దీంతోపాటు.. పలు గ్రూపుల్లో ఉండి.. నిత్యం ఆ పోస్టులను షేర్ చేసేవాడని పోలీసు విచారణలో అంగీకరించాడు. వైఎస్ఆర్‌సీపీ అనే పేరుతో ఉండే గ్రూపుల్లో ఈ అభ్యంతరకరమైన పోస్టులు పెట్టేవాడు. ఈ గ్రూపుల్లో వైకాపాకు చెందిన యూకే, ఇండియాలోని నేతలు, సానుభూతిపరులు ఉన్నారు. ఇందు టీవారికి ఈ పోస్టులు కనిపించకుండా ఉండేలా సెట్టింగ్ మార్చారు.

న్యాయమూర్తుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బకొట్టాలని..: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ సహా న్యాయవ్యవస్థలోని ఉన్నతస్థానంలో ఉన్నవారిపై కూడా.. అభ్యంతరకర పోస్టులు పెట్టడానికి ప్రధాన కారణం. . వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బకొట్టడమేనని భాస్కర్‌రెడ్డి అంగీకరించాడు. తమ పార్టీకి వ్యతిరేకంగా వాళ్లు ఎలాంటి తీర్పులు ఇవ్వకూడదనే ఇలా చేసినట్టు పోలీసు విచారణలో వెల్లడించాడని రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారు.

తెలీదు.. గుర్తులేదు..!

- పోలీసు విచారణలో మాజీ మంత్రి అప్పలరాజు

ఈనాడు డిజిటల్-శ్రీకాకుళం, న్యూస్‌టుడే-కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీసులు స్థానిక పోలీసు స్టేషన్‌లో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును శనివారం విచారించారు. ఓ మైనర్ బాలికపై దాడి విషయంలో గత ఏడాది అక్టోబర్ 27న పోలీస్ వ్యవస్థ, కూటమి ప్రభుత్వంపై మీడియా సమావేశంలో ఆయన అనుచితంగా వ్యాఖ్యలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి 'స్టేషన్‌కి పసుపు రంగు వేసి.. ప్రజలెవరూ రావొద్దు, తెదేపా కార్యకర్తలకే ప్రవేశం అని బోర్డులు పెడతాం. ఈ ఘటనలో చర్యలు తీసుకోకపోతే ప్రైవేటు పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేస్తాం. జిల్లా ఎస్పీతో ప్రారంభోత్సవం చేయిస్తాం' అని వ్యాఖ్యానించారు. దీనిపై అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసులో అప్పలరాజు విచారణకు హాజరుకాగా మధ్యాహ్నం 2:30 నుంచి రాత్రి 9:30 వరకు పోలీసులు ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌కి పసుపురంగు వేయాలని ఏ ఉద్దేశంతో అన్నారని అడగ్గా తాను అనలేదని సమాధానమిచ్చారు. పోలీస్‌స్టేషన్‌కి రావొద్దని ప్రజలకు ఎందుకు తప్పుడు సమాచారం ఇచ్చారని ప్రశ్నించగా గుర్తులేదంటూ దాటవేశారు. అప్పలరాజు నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన పోలీసులు సోమవారం విచారణకు హాజరుకావాలని చెప్పి పంపించేశారు.



కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సీదిరి అప్పలరాజును ప్రశ్నిస్తున్న సీఐ సూర్యనారాయణ

టీచర్ ఫిరోజ్‌కు అభినందనలు

మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: అక్షరాలను పొందికగా రాయడం నేర్పిస్తున్న పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు మెయిన్ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) షేక్ ఫిరోజ్ భాషాకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. 'రోజూ ఉదయం ముందుగా పాఠశాలకు వెళ్లి, సాయంత్రం అదనపు సమయం కేటాయిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఆయన నిబద్ధతకు హ్యాట్సాఫ్. మీరు పిల్లలకు నేర్పిన తెలుగు, ఆంగ్లం చేతి రాత డిజిటల్ ప్రింట్‌లా అందంగా ఉంది. పిల్లలకు వివిధ సబ్జెక్టుల్లో ఉన్న భయాలను పోగొట్టేందుకు, వారిలో ఒకరిగా కలిసిపోతూ ఆటపాటలతో విద్యా బోధన చేస్తున్న ఫిరోజ్ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు' అని పేర్కొన్నారు.

మనసును మీటిన మ్యాస్ట్రో కచేరీ

విజయవాడను ఓలలాడించిన ఇళయరాజా బృందం



ఇళయరాజాతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్న దర్శకుడు వంశీ

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే- విజయవాడ సిటీ: విజయవాడలో తొలిసారిగా మ్యాస్ట్రో ఇళయరాజా శనివారం నిర్వహించిన సంగీత విభావరి శ్రోతల మనసులు మీటింది. ఇందిరా గాంధీ మైదానంలో నిర్వహించిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. సాగర సంగమంలోని తకిట తధిమి తందానా, మౌనమేలనోయి ఈ మరపు రాని రేయి.. పాటలు ఆకట్టుకున్నాయి. హలో గురూ ప్రేమ కోసమేరా జీవితం, ఒళ్లంత తుళ్లింత కావాలిలే, ప్రతిదినం నీ దర్శనం మరి దొరకునా దొరకునా అన్న పాటలు యువతలో హుషారు నింపాయి. ఇళయరాజా స్వరకల్పనలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలను ఆయన తనయుడు చరణ్ పాడటంతో ప్రేక్షకులు బాలును గుర్తు చేసుకున్నారు. గాయకులు కౌశిక్, మధుబాలకృష్ణన్, విభావరి, హరిచరణ్, అనిత తదితరులు పాడిన పాటలు అలరించాయి.

వంశీతో సినిమా ముచ్చట్లు

ప్రముఖ దర్శకుడు వంశీ కార్యక్రమానికి హాజరుకాగా ఇళయరాజా ఆయన్ను వేదిక పైకి పిలిచారు. లేడీస్ టైలర్, సితార సినిమాల సమయంలో పాటల స్వరకల్పన, చిత్రీకరణ సమయంలో సంఘటనలను గుర్తుచేసుకుని ఆయనతో వేదికపైనే సరదాగా సంభాషించారు. ఇళయరాజా తనకు మరపురాని పాటలు ఇచ్చారని వంశీ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, అనిత, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బోండా ఉమా, కామినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంపై అధ్యయనానికి 'స్ట్రాటో ఎక్స్'

- రూపొందించిన ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



స్ట్రాటో ఎక్స్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు


చాపాడు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో పలు విభాగాలకు చెందిన 35 మంది విద్యార్థులు తయారుచేసిన స్ట్రాటో ఎక్స్-2025 ప్రయోగాన్ని శనివారం ఆవిష్కరించారు. ఏరో లాంచ్ ఇండియా చెన్నై కంపెనీ ఆధ్వర్యంలో చేసిన ఈ బెలూన్ 25 కిలోమీటర్ల ఎత్తులోకి వెళ్లి వాతావరణంపై అధ్యయనం చేస్తుంది. బెలూన్‌లో అధునాతన సెన్సర్లు, హెచ్‌డీ కెమెరాలు అమర్చారు. విద్యార్థుల ఆవిష్కరణకు ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కింది. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ జయరామిరెడ్డి, కళాశాల ఛైర్మన్ జయచంద్రారెడ్డి, శాస్త్రవేత్త రాధాకృష్ణ, సీఈవో లోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

అశోక్ లేల్యాండ్‌లో ఉద్యోగాలంటూ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు

- నిరుద్యోగులను ముంచుతున్న దుండగులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలోని అశోక్ లేల్యాండ్‌లో ఉద్యోగాలంటూ నమ్మబలికి, నిరుద్యోగుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు దండుకుంటున్నారు. రోజుకో నంబరు నుంచి అభ్యర్థులకు ఫోన్లు చేస్తూ కంపెనీలో నియామక ప్రక్రియ చేపట్టామని చెబుతూ విద్యార్హతలు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. కొద్దిసేపు నమ్మకంగా మాట్లాడిన తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్లను ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. ఫలానా తేదీన యూనిట్‌లో రిపోర్టు చేయాలని, బీమా కోసం రూ.4వేలు యూపీఐ ద్వారా చెల్లించాలని సూచిస్తున్నారు. వారి మాటతీరు, అపాయింట్‌మెంట్ లెటర్లను చూసి నిజమేనని నమ్మిన కొందరు రూ.4వేల చొప్పున ఆన్‌లైన్ చెల్లింపులు చేశారు. తీరా యూనిట్ వద్దకు వెళ్లాక తాము మోసపోయినట్లు తెలుసుకున్నారు. ఇలా కొన్ని నెలల నుంచి పందల మంది యువకులు ఈ ఉచ్చులో చిక్కుకుని నగదు నష్టపోయినట్లు తెలిసింది. ఈ విషయంపై అశోక్ లేల్యాండ్ హెచ్ఆర్ మేనేజర్ సాంబశివరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా, తమ సంస్థ పేరు చెప్పి నిరుద్యోగులను ఎవరో మోసం చేస్తున్న విషయం తమ దృష్టికీ వచ్చిందని, చాలామంది నకిలీ అపాయింట్‌మెంట్ లేఖలతో తరచూ యూనిట్‌కు వస్తున్నారని చెప్పారు. తమ సంస్థలో ఈ విధంగా ఉద్యోగాల భర్తీ ఉండదని, నేరుగానే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. నిరుద్యోగులు ఇలాంటి ప్రచారం నమ్మి మోసపోవద్దని సూచించారు.

బండెనక బండి.. అక్రమ రవాణా దండి!



నదిలో బారులుతీరిన ఈ ఎడ్లబండ్లు తుంగభద్ర నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు వెళ్తున్నాయి. కర్నూలు జిల్లా సుంకేసుల ఆనకట్ట వద్ద నది లోపలికి వెళ్లి.. ఇసుక తవ్వి బండ్లలో నింపుకొని వెళ్తున్నారు. మూడు నెలలుగా తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఇసుక చౌర్యం ఆగిపోయింది. ప్రస్తుతం ఎగువ నుంచి వరద తగ్గిపోవడంతో ఆనకట్ట గేట్లన్నీ మూసివేశారు. దీంతో నదిలో ప్రవాహం తగ్గింది. ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్న వారు ఆనకట్ట దిగువన ఇసుక తరలించేందుకు ఇలా బారులుతీరారు. అక్రమంగా తరలించిన ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. **- ఈనాడు, కర్నూలు**

చుక్క పాలూ సేకరించకుండా రూ.240 కోట్లు నొక్కేశారు

- వైకాపా హయాంలో తితిదేను నిలువుదోపిడీ చేసిన భోలేబాబా డెయిరీ
- సిట్ విచారణ సాగేకొద్దీ వెలుగులోకి విస్మయకర వాస్తవాలు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): నెయ్యి ఎలా వస్తుందంటే పాల నుంచి అని ఠక్కున చెప్పేస్తాం. ఉత్తరాఖండ్ రాష్ట్రం భగవాన్‌పూర్ పారిశ్రామికవాడలోని భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ మాత్రం చుక్కపాలు సేకరించకుండానే నెయ్యి తయారుచేసింది. కొంత వెన్నకు భారీ ఎత్తున రసాయనాలు కలిపి నెయ్యి తయారు చేసి, వైకాపా హయాంలో తితిదేకు సరఫరా చేసింది. దాంతోనే శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారుచేసినట్లు సిట్ విచారణలో తేటతెల్లమైంది. ఉత్తరాఖండ్‌లో కేవలం పది మంది ఉద్యోగులు, కనీసం వేబ్రిడ్జి లేని ఈ సంస్థ ఐదేళ్లలో ఏకంగా రూ.240 కోట్ల తితిదే సొమ్మును దోచేసింది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్.. కమీషన్లు ఇస్తామంటూ ఈ దందాలోకి తిరుపతి జిల్లాలోని శ్రీవైష్ణవి డెయిరీ, తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీనీ లాగారు. ఆ సంస్థలకు కల్తీ నెయ్యిని పంపి అక్కడినుంచి తిరుమలకు సరఫరా చేయించారు. తాము పంపించేది స్వచ్ఛమైన నెయ్యేనని నమ్మించడానికి దిల్లీలోని ఓ ల్యాబ్ నిర్వాహకులతో నకిలీ రిపోర్టులూ తయారు చేయించారు. కల్తీనెయ్యి వ్యవహారంలో సిట్ లోతుగా విచారణ చేసేకొద్దీ ఇలాంటి వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి.

అది ఆర్గానిక్ కాదు.. ఓరోగానిక్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ధోల్‌పుర్‌లో భోలేబాబా మిల్క్ ఫుడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనే పేరున్న డెయిరీ సుమారు 60,000 మంది రైతుల నుంచి పాలు సేకరించి ఉత్పత్తులు తయారుచేస్తోంది. దీన్ని సరిపోలేలా విపిన్ జైన్, పొమిల్ జైన్ తమ కంపెనీకి భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ అని పేరు పెట్టారు. సిట్ అధికారుల విచారణలో తేల్చేవరకు అందరూ దాన్ని ఆర్గానిక్ డెయిరీ అని అనుకున్నారు. ఈ డెయిరీ డైరెక్టర్లు 25 ఏళ్ల వయసులోనే నెయ్యి కల్తీ చేయడంలో ఆరితేరిపోయారు. దాదాపు 20 ఏళ్లుగా ఈ దందాలో పండిపోయారు.

బయటపడగానే ప్లాంట్ మూసివేత

కూటమి అధికారంలోకి వచ్చాక ఏఆర్ డెయిరీ నుంచి వచ్చే నెయ్యి కల్తీ అయ్యిందని తేలడంతో భగవాన్‌పూర్‌లోని భోలేబాబా డెయిరీ ప్లాంటును పొమిల్ జైన్, విపిన్ జైన్ మూసేశారు. సిట్ విచారణలో భోలేబాబా డెయిరీ అసలు పాలే సేకరించడం లేదని వెల్లడైంది. రికార్డుల్లో లడ్డూ నాణ్యంగా ఉండాలంటే మొదట నెయ్యి నాణ్యత బాగుండాలని పోటు కార్మికులు పలుమార్లు చెప్పినా తితిదే అధికారులు పెడచెవిన పెట్టారు. ఇలా మూడేళ్లు భోలేబాబా డెయిరీ ఆటలు సాగాయి. తర్వాత ఆ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో వైష్ణవి, ఏఆర్ డెయిరీలను అడ్డుపెట్టుకుని కల్తీ నెయ్యి సరఫరా చేసింది.

అయోధ్య లడ్డూలకు నాణ్యమైన నెయ్యి

2024 జనవరిలో అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి తితిదే లక్ష లడ్డూలు పంపింది. నాణ్యత గురించి ప్రశ్నలు వస్తాయనే ఉద్దేశంతోనే దానికి నాణ్యమైన నెయ్యి కొంది. అంటే అన్నీ తెలిసే చేశారన్న అనుమానాలు వస్తున్నాయి. గత నెలలో తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను అరెస్టు చేయడంతో తితిదేలోని పెద్దల పాత్ర దిశగా అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

మాత్రం ఆ సంస్థలో జనరల్ మేనేజర్‌గా ఉన్న హరిమోహన్ రాణా, ఆయన భార్య, ఆమె తమ్ముడు రోజూ 200 లీటర్ల పాలు పోస్తున్నారని చూపారు. సమీప పాడిరైతుల నుంచి పాలు కొంటున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారించగా చుట్టుపక్కల గ్రామస్థులు తమకు భోలేబాబా డెయిరీ ఉన్నట్టే తెలియదన్నారు. .

కల్తీ నెయ్యి వ్యవహారంలో 8కి చేరిన అరెస్టులు

ఇప్పటి వరకు 28 మంది నిందితుల గుర్తింపు

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో దిల్లీలోని సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్ యజమాని అజయ్‌కుమార్ సుగంధ్‌ను శుక్రవారం రాత్రి అరెస్టుచేశారు. దీంతో ఈ కేసులో అరెస్టుల సంఖ్య 8కి చేరింది. అజయ్ తన సంస్థ ద్వారా ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా డెయిరీకి మోనో గ్లిజరైడ్స్ ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్‌ను సరఫరా చేసి 2020 నుంచి 2024 వరకు నాలుగేళ్లలో రూ.7 కోట్లు సంపాదించినట్లు రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యి తయారీకే రసాయనాలు వినియోగిస్తున్నారని తెలిసినా నిందితుడు వాటిని సరఫరా చేసినట్లు సిట్ గుర్తించింది. విచారణలో సహకరించకపోవడంతో నెల్లూరు ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. ఈ కేసులో ఫిబ్రవరిలో భోలేబాబా, ఏఆర్, వైష్ణవి డెయిరీల ప్రతినిధులు పొమిల్ జైన్, విపిన్ జైన్, రాజురాజశేఖరన్, అపూర్వ వినయ్ కాంత్ చావ్డాలను అరెస్టు చేశారు. తర్వాత దశలో హరిమోహన్ రాణా, ఆశీష్ అగర్వాల్, గత నెల చివర్లో తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను అరెస్టు చేశారు. కల్తీ నెయ్యిపై ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన తొలి ఛార్జ్‌షీట్‌లో 15 మందిని నిందితులుగా పేర్కొన్నారు. చిన్నఅప్పన్న అరెస్టు సందర్భంలో మరో 9 మందికి ఇందులో హస్తం ఉందని తెలిపారు. తాజాగా మరో నలుగురిని నిందితుల జాబితాలో చేర్చినట్లు సమాచారం. దాంతో మొత్తం నిందితుల సంఖ్య 28కి పెరిగింది.

రాజధాని పనుల్లో యువతకు ఉపాధి కల్పించేలా శిక్షణ

- సీఆర్డీఏ పరిధిలో 6 న్యాక్ కేంద్రాలు
- ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 13 వేల మందికి శిక్షణ లక్ష్యం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించేందుకు జాతీయ నిర్మాణ సంస్థ (న్యాక్) ప్రత్యేక నైపుణ్య శిక్షణ నిర్వహిస్తోంది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) పరిధిలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఆరు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తోంది. తుళ్లూరులో ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసింది. ఇందులో సహాయ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్, పెయింటర్, డెకొరేటర్, ఫీల్డ్ టెక్నీషియన్-ఏసీ, ప్లంబర్, తాపీమేస్త్రీ లాంటి వృత్తుల్లో శిక్షణ ఇస్తోంది. రాజధాని పనులు ఊపందుకోవడంతో రాష్ట్ర యువతకు ఉపాధి లభించేలా ఈ శిక్షణ అందిస్తున్నారు. తుళ్లూరులో 294 మందికి నైపుణ్య శిక్షణ లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 244 మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో 208 మందికి ఉద్యోగాలు కల్పించారు.

రాష్ట్రంలో 31 చోట్ల శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా 31చోట్ల న్యాక్ తరపున నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. వీటిలో మూడు అడ్వాన్స్‌డ్ నైపుణ్య శిక్షణ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఒకేసారి 2,430 మందికి శిక్షణ ఇవ్వచ్చు. 2025-26లో మొత్తం 13,905 మందికి శిక్షణ అందించాలనే లక్ష్యం కాగా.. సెప్టెంబరు నాటికి 4వేల మందికి పైగా శిక్షణ పూర్తయింది. వీరిలో 3వేల మందికి సర్టిఫికెట్లు అందించారు.

■ శ్రీకాకుళం, వైఎస్సార్ కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో 450 మంది సామర్థ్యంతో అడ్వాన్స్‌డ్ నైపుణ్య శిక్షణ సంస్థలను నిర్వహిస్తోంది.

■ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ద్వారా 169 మంది సర్టిఫైడ్ మాస్టర్ శిక్షకులు ఉన్నారు. అన్నిచోట్ల ల్యాబ్‌లను ఏర్పాటుచేశారు. డిమాండ్‌కు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నారు.

బాంబుల తయారీకి ఏపీ నుంచి వ్యక్తుల సమీకరణ

ఎన్ఐఏ విచారణలో ఉగ్రవాది అబూబకర్ సిద్ధిక్ వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: బాంబుల తయారీ కోసం ఉగ్రవాది అబూబకర్ సిద్ధిక్ ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా వ్యక్తులను సమీకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారుల విచారణలో తెలిసింది. భాజపా అగ్రనేత ఎల్.కె.అడ్వాణీ హత్యకు కుట్ర సహా తమిళనాడులోని పలు ఉగ్రవాద కార్యకలాపాలకు సూత్రధారి అయిన సిద్ధిక్‌ను అన్నమయ్య జిల్లా రాయచోటిలో తమిళనాడుకు చెందిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎస్‌టీఎస్) పోలీసులు సెప్టెంబరులో అరెస్టు చేశారు. చెన్నై శివారు పుళల్ జైలులో ఉన్న నిందితుడిని ఎన్ఐఏ ఏడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించింది. ఆ సమయంలో నిందితుడిని విశాఖ తీసుకెళ్లి విచారించినట్లు తెలిసింది. కోవైలో వరుస బాంబుపేలుళ్ల ఘటన తర్వాత నిందితుడు విదేశాలకు వెళ్లి, ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు సమీకరించాడని, స్థిరాస్తి వ్యాపారం ముసుగులో ఆంధ్రప్రదేశ్‌లోని పలుచోట్ల పర్యటించి.. బాంబుల తయారీకి వ్యక్తులను సమీకరించే ప్రయత్నాలు చేశాడని తెలిసింది.

పర్యాటకుల భద్రతకు సేఫ్‌గార్డ్ బాయ్స్‌ను నియమించాలి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: కార్తికమాసం వంటి ప్రత్యేక సందర్భాల్లో బీచ్‌ల వద్దకు భారీగా తరలివచ్చే పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని సేఫ్‌గార్డ్ బాయ్స్‌ను నియమించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. మంగళగిరిలోని మారిటైమ్ బోర్డు కార్యాలయంలో ఏపీ మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌పై మంత్రి సమీక్షించారు. తుపానుతో నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు.



ఆరోగ్యకర జీవితానికి అలవాట్లే కీలకం

ఎవరైనా జిమ్‌కు డుమ్మా కొట్టినందుకు, మద్యం సేవించినందుకు, రాత్రి ఆలస్యంగా నిద్రపోయినందుకు పశ్చాత్తాపం చెందుతారేమోగానీ, వ్యాయామాలు చేసినందుకు, తగినన్ని నీళ్లు తాగినందుకు, త్వరగా నిద్రకు ఉపక్రమించినందుకు ఏ ఒక్కరూ పశ్చాత్తాపానికి గురికారు. మీరు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటే, అందుకు దోహదపడే వ్యాపకాలను అలవాట్లుగా మార్చుకోండి.

- జానీ బ్రౌన్, హెల్త్ కంటెంట్ క్రియేటర్

45 ఏళ్ల శ్రమతో..

జానపద వాయిద్యాల సేకరణ

ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌కు చెందిన ప్రముఖ జానపద కళాకారుడు రిఖీ క్షత్రియ గత 45 ఏళ్లుగా శ్రమిస్తూ 211 అరుదైన జానపద సంప్రదాయ వాయిద్యాలను సేకరించారు. భిలాయ్ స్టీల్ ప్లాంటు రిటైర్డ్ ఉద్యోగి అయిన ఈయన వాయిద్యాలను భద్రపరచడానికి ఓ మ్యూజియం ఏర్పాటు చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా పలు రంగాల్లో విశేష సేవలందించిన 41 మంది విశిష్ట వ్యక్తులను ఇటీవల సత్కరించారు. జానపద కళలకు రిఖీ క్షత్రియ చేసిన కృషికి గాను ఈ వేడుకల్లో 'దావూ మందరాజ్ సింగ్ మాండ్రాజ్' అవార్డును ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా అందుకున్నారు. భావితరాలు మన జానపద వారసత్వం సజీవంగా ఉండేలా చూసుకోవాలన్న లక్ష్యంతో వాటిని సేకరించినట్లు రిఖీ క్షత్రియ తెలిపారు.



గిరిజన ప్రాంతాల్లో తిరిగి అరుదైన ఈ జానపద వాయిద్యాలను సేకరించిన రిఖీ, ఆయన భార్య అన్నపూర్ణ 'ఛత్తీస్‌గఢ్ జానపద వాయిద్యాలు' అనే పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చారు.

అర్చనాదేవి చొరవతో

అల్లుకొన్న మహిళా సాధికారత

ఝార్ఖండ్ రాజధాని రాంచీ శివారులోని హటియాకు చెందిన అర్చనాదేవి చొరవ వేలాది మహిళల జీవితాల్లో వెలుగు రేఖలను ప్రసరింపజేస్తోంది. పెళ్లి తర్వాత అర్చనాదేవి బాధ్యతలు పెరిగాయి. దీంతో ఆమె కుట్లు, అల్లికల్లో తనకున్న నైపుణ్యాన్ని ఉపాధి వనరుగా మార్చుకున్నారు. రోజంతా ఇంట్లో కూర్చొని వివిధ వస్తు ఉత్పత్తులను తయారు చేసేవారు. అవి మార్కెట్లో మంచి ధరకు అమ్ముడుపోయేవి. కుట్లు, అల్లికల ఉత్పత్తుల తయారీకి ఆర్డర్ల సంఖ్య క్రమంగా పెరిగింది. ఇందుకు అనుగుణంగా వేగంగా ఉత్పత్తులను తయారుచేయాలంటే నైపుణ్యం కలిగిన మానవ వనరులు కావాలి. మార్కెట్ డిమాండును గుర్తించిన అర్చన ఔత్సాహిక మహిళలకు ఈ పనిని నేర్పి



తన ఆర్డర్లలో కొన్నింటిని వారికి చేయూతనివ్వడం మొదలుపెట్టారు. అలా ఇప్పటిదాకా దాదాపు 10 వేల మంది మహిళలకు ఆమె స్వావలంబన మార్గాన్ని చూపించడం విశేషం. ఈ కార్యక్రమంలో భాగంగా అర్చనాదేవి ప్రస్తుతం పలు స్వచ్ఛంద సంస్థలతోనూ కలిసి పనిచేస్తున్నారు.

1 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు

ఈనాడు, దిల్లీ: డిసెంబరు 1 నుంచి 19 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. సెలవురోజులు మినహాయిస్తే పార్లమెంటు మొత్తం 15 రోజులు సమావేశంకానుంది. గత ఏడాది శీతాకాల సమావేశాలు నవంబరు 25 నుంచి డిసెంబరు 20వరకు జరిగాయి.



ఈ సంవత్సరం దాదాపు వారం రోజులు కుదించారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే నాటికల్లా బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి ఉంటాయి కాబట్టి వాటి ఆధారంగా అధికార, విపక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అంశం, భారత్-పాక్ యుద్ధాన్ని ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపై చర్చలు వాడీవేడిగా జరగనున్నాయి. పార్లమెంటు సమావేశాలు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయని, కావాలనే కుదించారని కాంగ్రెస్ ఆరోపించింది.



ఒంటరితనం మేలు చేస్తుంది

చెడు సాంగత్యం కన్నా ఒంటరితనం చాలా మేలు. దుర్జనుల స్నేహం మీలోని సద్గుణాలను దూరం చేస్తుంది. కానీ ఒంటరితనం మిమ్మల్ని మీరు సమీక్షించుకోవడానికి సమయమిస్తుంది. తద్వారా మిమ్మల్ని సంస్కరించుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. అందుకే అనవసర స్నేహాలను విడిచిపెట్టి ఏకాంతంగా గడపడానికి ప్రాధాన్యతనివ్వండి.

– జిమ్ క్విక్, బ్రెయిన్ కోచ్



ఆడ్వాణీతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ ★ భాజపా అగ్రనేతను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు

ఆడ్వాణీకి మోదీ జన్మదిన శుభాకాంక్షలు

ఈనాడు, దిల్లీ: భారత మాజీ ఉపప్రధాని, భాజపా సీనియర్ నేత, రాజకీయ కురువృద్ధుడు, భారతరత్న లాల్‌కృష్ణ ఆడ్వాణీ 98వ పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి మోదీ శనివారం ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆడ్వాణీ.. అత్యున్నత దూరదృష్టి గల నేత అని, రాజనీతిజ్ఞుడని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కొనియాడారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఆడ్వాణీ నివాసానికి వెళ్లి ఆయనకు శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకోసం వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా దిల్లీకి వచ్చారు. ఆడ్వాణీ దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, దృఢసంకల్పం యువతకు ఆదర్శనీయమైనవని పేర్కొన్నారు. ఆయనకు భగవంతుడు పరిపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధిపథంలో దూసుకుపోతున్నాం

- కొత్తతరం రైల్వేకు వందేభారత్‌లతో పునాది: మోదీ

వారణాసి: అభివృద్ధి చెందిన దేశాల ఆర్థికాభివృద్ధిలో మౌలిక సదుపాయాలదే ప్రధాన భూమిక అని, అలాంటి వృద్ధి పథంలో భారత్ దూసుకువెళ్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసి పరిధిలోని బనారస్ రైల్వేస్టేషన్ నుంచి శనివారం ఆయన నాలుగు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించి ప్రసంగించారు. "ఏ దేశమైనా ఆర్థికంగా పురోగమిస్తోందంటే దానికి చోదకశక్తిగా అక్కడి మౌలిక సదుపాయాల అభివృద్ధి నిలుస్తుంది. సదుపాయాలంటే కేవలం భారీ వంతెనలు, జాతీయ రహదారుల్ని నిర్మించడం మాత్రమే కాదు. వాటిద్వారా ఆ ప్రాంతంలో సమగ్రాభివృద్ధి ఊపందుకుంటుంది. దేశంలో వందేభారత్ రైళ్ల సంఖ్య 160 దాటింది. వందేభారత్, నమో భారత్, అమృత్ భారత్ వంటి రైళ్లు కొత్తతరం రైల్వేకి పునాదులుగా నిలుస్తున్నాయి. భారతీయులు తమ కోసం తాము తయారు చేసుకున్న వందేభారత్‌లు దేశ పౌరులందరికీ గర్వకారణం. వీటిని చూసి విదేశీ పర్యాటకులూ అబ్బురపడుతున్నారు" అని ప్రధాని చెప్పారు. కొత్త వందే భారత్ రైళ్లు బనారస్-ఖజురహో, లఖ్‌నవూ-సహారన్‌పుర్, ఫిరోజ్‌పుర్-దిల్లీ, ఎర్నాకుళం-బెంగళూరు మధ్య పరుగులు తీయనున్నాయి.

శభాష్ పిల్లలూ

రైల్వేస్టేషన్లో, వారణాసి-ఖజురహో వందేభారత్ రైల్లో పిల్లలతో మోదీ ముచ్చటించారు. పిల్లలు తాము రాసిన పద్యాలను వినిపించినప్పుడు ఆయన పులకించిపోయారు. ఇంతటి ప్రతిభావంతులైన పిల్లలు తన నియోజకవర్గమైన కాశీలో ఉన్నందుకు గర్విస్తున్నానని చెప్పారు. 'వీరిని చూసి మది ఉప్పొంగిపోతోంది. ఈ పిల్లలతో కవిసమ్మేళనం నిర్వహిస్తే బాగుంటుంది. వీరిలో బాగా రాణించిన 8-10 మందిని దేశవ్యాప్తంగా పద్యాలు వల్లెవేయడానికి తీసుకువెళ్లవచ్చు' అని పేర్కొన్నారు.

పాకిస్థాన్‌కూ త్రిదళాధిపతి!

మునీర్‌కు మరింత 'పవర్'!



ఆసిం మునీర్

ఇస్లామాబాద్: భారత్ మాదిరిగా త్రివిధ దళాలను ఏకీకృతం చేసేందుకు పాకిస్థాన్ సిద్ధమైంది. సైన్యం, వైమానిక, నౌకా దళాల మధ్య సమన్వయం కోసం ఏకీకృత కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. 'కమాండర్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్స్' (సీడీఎఫ్) అనే సరికొత్త పదవిని సృష్టించనుంది. సీడీఎఫ్ ఈ ఏకీకృత వ్యవస్థకు అధిపతిగా ఉంటారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం శనివారం పాకిస్థాన్ పార్లమెంటులో 27వ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టి అధికరణం 243లో మార్పులను ప్రతిపాదించింది. ఈ నెల 28న పదవీ విరమణ చేయనున్న మునీర్‌ను కొత్తగా సృష్టిస్తోన్న సీడీఎఫ్‌గా నియమించనున్నట్లు పాకిస్థాన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అదే జరిగితే మునీర్‌కు పాక్ సైన్యంపై మరింత పట్టు పెరుగుతుంది.

నేటి నుంచి దిల్లీ-షాంఘై విమాన సర్వీసులు

బీజింగ్: దిల్లీ నుంచి చైనాలోని షాంఘైకి విమాన సర్వీసులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. చైనా ఈస్టర్న్‌కు చెందిన విమానం ఆదివారం రాత్రి 8 గంటలకు దిల్లీ నుంచి బయల్దేరనుంది. ఇది సోమవారం తెల్లవారుజామున షాంఘై చేరుకుంటుంది. మళ్లీ మధ్యాహ్నం 12.30 గంటలకు అక్కడ నుంచి బయల్దేరి సోమవారం సాయంత్రం 6 గంటలకు దిల్లీ చేరుకుంటుంది. వారానికి మూడు సార్లు (బుధ, శని, ఆదివారాల్లో) ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఇటీవల ఇండిగో సంస్థ కూడా దిల్లీ నుంచి చైనాలోని గ్వాంగ్‌ఝౌ నగరానికి విమాన సర్వీసులు ప్రారంభించిన సంగతి తెలిసిందే.

హెచ్-1బీ దుర్వినియోగంపై ట్రంప్ 'ఫైర్‌వాల్'

- 175 కేసుల్లో దర్యాప్తు

న్యూయార్క్: హెచ్-1బీ వీసా దుర్వినియోగం వల్ల విదేశీ కార్మికులతో ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇందులో భాగంగా కార్మిక శాఖ సెప్టెంబరులో ప్రాజెక్ట్ ఫైర్‌వాల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దానికింద ఈ వీసా అవకతవకలపై దర్యాప్తు ప్రారంభించిన కార్మిక శాఖ తాజాగా.. 175 కేసులు నమోదు చేసింది. ఈ మేరకు అమెరికా మీడియా సంస్థ కథనం పేర్కొంది. 'అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులతో కంపెనీలు ఉద్యోగాలు భర్తీ చేయకుండా చూడటమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం. అలాంటి దుర్వినియోగంపై కార్మిక విభాగం ఆడిట్ నిర్వహిస్తోంది. ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తున్నాం. అధ్యక్షుడి నాయకత్వంలో.. అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు మొదట అమెరికా కార్మికులకే వెళ్లేలా చూస్తాం' అని కార్మిక శాఖ మంత్రి లోరి చావెజ్ డెరెమెర్ వెల్లడించారు.

బిహార్ తొలి దశలో 65.08 శాతం పోలింగ్

పట్నా: బిహార్ అసెంబ్లీ తొలిదశ ఎన్నికల్లో 65.08 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం(ఈసీ) వెల్లడించింది. రాష్ట్ర చరిత్రలోనే ఇది అత్యధికమని తెలిపింది. 2020 ఎన్నికల్లో నమోదైన 57.29 శాతం కంటే ఈసారి 7.79 శాతం అధికంగా పోలింగ్ నమోదైందని బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) తెలిపారు. తొలిదశ పోలింగ్ 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో జరిగింది. ఇందులో 3.75 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 6న జరిగిన ఎన్నికల్లో భారీ సంఖ్యలో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సీఈవో వెల్లడించారు.

అమ్మా! స్కూలుకు పంపొద్దు..

ఎవరికీ పట్టని పాప వేడుకోలు

- జైపుర్ బాలిక ఆత్మహత్య కేసులో తల్లి ఆవేదన



బాలిక దూకుతున్న సీసీటీవీ ఫుటేజి.. మాట్లాడుతున్న తల్లి శివానీ మీనా

ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్ రాజధాని నగరం జైపుర్‌లో ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న అమైరా (9) అనే బాలిక కేసులో తాజాగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో తోటి విద్యార్థుల వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూలుకు వెళ్లనంటూ అమైరా ఏడుస్తున్న వాట్సప్ ఆడియోను తల్లి శివానీ మీనా మీడియాతో పంచుకున్నారు. "ఏడాది కిందటి ఈ ఆడియోను క్లాస్ టీచరుతోపాటు స్కూలు కో-ఆర్డినేటరుకు పంపి వారితో చాలా సార్లు మాట్లాడాను. అమైరా ఇబ్బంది ఏమిటో చెబుతారనుకున్నా. అయినా వాళ్లు నా మాటలు పట్టించుకోలేదు. పాఠశాలలో నా కుమార్తెను ఆట పట్టించడం, బెదిరించడం, లైంగిక వేధింపుల వంటివి కొన్ని నెలలపాటు కొనసాగాయి" అంటూ శివానీ ఆవేదన వెళ్లగక్కారు. తన కుమార్తెను మరో అబ్బాయి పేరుతో తోటి విద్యార్థులు ఏడిపించారని బాలిక తండ్రి ఆరోపించారు. జైపుర్‌లోని ప్రముఖ పాఠశాల నాలుగో అంతస్తు నుంచి దూకి అమైరా నవంబరు 1న ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికే.. ఆ విద్యార్థిని పడినచోట రక్తపు మరకలు మాయమయ్యాయి. దీంతో పాఠశాల యాజమాన్యంపై తల్లిదండ్రులు కేసు పెట్టారు.

అది చూసి నా హృదయం ముక్కలైంది: రాహుల్



దిల్లీ: మధ్యప్రదేశ్‌లోని కొంతమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని న్యూస్‌పేపర్‌పై వడ్డించినట్లు కనిపించిన వీడియో చూసి తన హృదయం ముక్కలైందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను చూసి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సిగ్గుపడాలన్నారు. ఆ వీడియో ఎక్స్‌లో పోస్టు చేసిన రాహుల్.. 'ఈ పిల్లలపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. కానీ వారు కనీస మర్యాదకు నోచుకోవడం లేదు. నేను ఇప్పుడే అక్కడికి వెళ్తున్నాను. 20 ఏళ్లకు పైగా ఉన్న భాజపా పాలనలో పిల్లల ప్లేట్లనూ దొంగలించారు. వారి హయాంలో అభివృద్ధి అంటే భ్రమే. వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని అధికారంలోకి వస్తున్నారు. పిల్లలను ఇంతటి దయనీయ స్థితిలో ఉంచినందుకు సీఎం, పీఎం సిగ్గుపడాలి' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. శ్యోపుర్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఈ వీడియో తీసినట్లు సమాచారం. ఈ వ్యవహారం కాస్త నెట్టింట వైరల్‌గా మారడంతో.. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. తర్వాత విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను సమకూర్చారు.

మెగసెసె అవార్డును స్వీకరించిన ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ

- 55 వేల మంది వాలంటీర్లకు అంకితమిస్తున్నట్లు ప్రకటన



అవార్డుతో సఫీనా హుసేన్, సంస్థ ప్రతినిధులు

మనీలా: ప్రతిష్ఠాత్మకమైన 'రామన్ మెగసెసె' అవార్డును పొందిన 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్వచ్ఛంద సంస్థ.. దాన్ని తమ క్షేత్రస్థాయి సమన్వయకర్తలు, వాలంటీర్లు, మెంటార్లకు అంకితమిస్తున్నట్లు ప్రకటించింది. 2025కు గాను రామన్ మెగసెసె అవార్డును భారత్‌కు చెందిన 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్వచ్ఛంద సంస్థకు ఆగస్టు 31న ప్రకటించిన విషయం తెలిసిందే. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని మెట్రోపాలిటన్ థియేటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 25 మందితో కూడిన 'ఎడ్యుకేట్ గర్ల్స్' సంస్థ ఈ అవార్డును స్వీకరించింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు సఫీనా హుసేన్, సీఈవో గాయత్రి నాయర్ లోబో మాట్లాడుతూ.. "తమ కుటుంబ, దేశ భవిష్యత్తు కోసం చదువుకోవడానికి ధైర్యంగా ముందుకొచ్చిన బాలికలతో సహా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ సభ్యులు, బాలికలకు అండగా నిలిచిన మా సంస్థకు చెందిన 55 వేల మంది వాలంటీర్లకు ఈ అవార్డును అంకితమిస్తున్నాం. 2035 నాటికి కోటి మంది బాలికలకు విద్యను చేరువ చేసే మా లక్ష్యానికి ఇది మరింత దోహదం చేస్తుంది" అని పేర్కొన్నారు.

2007లో ఏర్పాటైన 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్వచ్ఛంద సంస్థ.. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోని 30 వేలకు పైగా గ్రామాల్లో పేదరిక నిర్మూలన, అక్షరాస్యత కోసం కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు 20 లక్షలకు పైగా బాలికలను తిరిగి పాఠశాలలకు వెళ్లేలా చేసింది. అలాగే వివిధ విద్య కోర్సులను నేర్పించడం ద్వారా 24 లక్షలకు పైగా బాలికలకు అండగా నిలిచింది.

సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బును తృణమూల్ ఎంపీకి చెల్లించిన బ్యాంకు



- కల్యాణ్ బెనర్జీ ఖాతాలో రూ.57 లక్షలు జమ

కోల్‌కతా: ఓ జాతీయ బ్యాంకులోని తన ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.57 లక్షలను బ్యాంకు తనకు తిరిగి చెల్లించిందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారం వెల్లడించారు. అయితే, నిందితుల జాడ ఇంకా తెలియరాలేదని, వారి కోసం అన్వేషిస్తున్నామని కోల్‌కతా సైబర్ విభాగ పోలీసులు తెలిపారు. గతంలో అసన్‌సోల్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తెరచిన బ్యాంకు ఖాతాను కొన్నాళ్లుగా వాడటం లేదని సెరంపుర్ ప్రస్తుత ఎంపీ కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు. తన ఫొటో, ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న ఖాతాకు అనుసంధానమైన ఫోన్ నంబరును సైబర్ నేరగాళ్లు మార్చారని వివరించారు. ఈ ఖాతా నుంచి వినియోగంలో లేని ఖాతాకు డబ్బు బదిలీ చేసి...అక్కడి నుంచి వివిధ ఖాతాలకు మళ్లించుకున్నారని బెనర్జీ తెలిపారు. ఫోన్ నంబరు మార్చివేయడంతో తనకు మెసేజ్‌లు రాలేదన్నారు. పార్లమెంటు సభ్యుడిగా ఉన్న వ్యక్తికే ఇలా జరిగితే సామాన్య ప్రజల మాటేమిటని ఆయన ప్రశ్నించారు.

అఫ్గాన్-పాకిస్థాన్ చర్చలు విఫలం

తమ భూభాగంపై దాడికి దిగితే యుద్ధానికి సిద్ధమంటూ తాలిబన్ల హెచ్చరిక

ఇస్తాంబుల్: సరిహద్దు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య తుర్కియే రాజధాని ఇస్తాంబుల్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. రెండు దేశాలు ఎటువంటి ఒప్పందానికి రాకుండానే అవి శనివారం ముగిశాయి. పాకిస్థాన్‌పై దాడికి పాల్పడుతున్న తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడానికి కాబూల్ ఎటువంటి లిఖితపూర్వక హామీ ఇవ్వలేదని పాక్ పేర్కొంది. "నాలుగో రౌండు చర్చలకు ఎటువంటి ప్రణాళిక లేదు. వాటిని నిలిపివేశాం" అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. పాకిస్థాన్‌కు చిత్తశుద్ధి లేదని, చర్చల పురోగతిని అడ్డుకుందంటూ అఫ్గాన్‌లోని తాలిబన్ల ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ దేశ భద్రతకు ముప్పు కలిగిస్తే సహించబోమని, యుద్ధానికి సిద్ధమేనని హెచ్చరించింది. ఇరు దేశాల మధ్య వివాదాన్ని ముగించేందుకు తుర్కియే, ఖతార్ చేసిన ప్రయత్నాలకు అఫ్గాన్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది.

పాకిస్థాన్‌లో భారీగా పెరిగిన అఫ్గాన్ పౌరుల అరెస్టులు

ఐరాస నివేదిక

పెషావర్: పాకిస్థాన్‌లో అఫ్గాన్ జాతీయుల అరెస్టులు, నిర్బంధాలు గత ఒక్క వారంలోనే 146% పెరిగాయని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. అక్టోబరు 26 నుంచి ఈ నెల 1 వరకు మొత్తం 7,764 మంది అఫ్గాన్ పౌరులను పాక్ అరెస్టు చేసిందని, అంతకుముందు వారంతో పోలిస్తే నిర్బంధించిన వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఐక్యరాజ్యసమితి శరణార్థుల హై కమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్), అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) విడుదల చేసిన నివేదిక పేర్కొంది. అరెస్టులు, నిర్బంధాలు అత్యధికంగా పాక్‌లోని బలూచిస్థాన్ కేంద్రంగానే జరిగాయి.

ఆరెస్సెస్ పాటపై పినరయి అభ్యంతరం

తిరువనంతపురం: ఎర్నాకుళం-బెంగళూరు వందేభారత్ రైల్లో పాఠశాల విద్యార్థులు ఆరెస్సెస్ పాటను పాడటంపై కేరళ సీఎం పినరయి విజయన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణరైల్వే తీరును తప్పుబట్టారు. అధికారిక కార్యక్రమంలో ఈ పాట ఉండటం రాజ్యాంగ సూత్రాల ఉల్లంఘనేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రామస్వామి గొప్ప గవర్నర్ అవుతారు: ట్రంప్



న్యూయార్క్: అమెరికాలోని ఒహాయో గవర్నర్‌గా పోటీ చేయనున్న భారతీయ మూలాలున్న నాయకుడు వివేక్ రామస్వామికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మద్దతు ప్రకటించారు. వ్యాపారవేత్త నుంచి రాజకీయ నేతగా మారిన వివేక్ రామస్వామి ఒహాయో రాష్ట్ర గవర్నర్‌గా అద్భుతంగా పనిచేస్తారని ట్రంప్ విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'నాకు వివేక్ బాగా తెలుసు. ఆయనతో ఎన్నికల్లో పోటీ చేశాను. ఆయన నిజంగా ప్రత్యేక వ్యక్తి. యువకుడు, బలమైనవాడు, తెలివైనవాడు. అమెరికాను నిజంగా ప్రేమించే వ్యక్తిగా రామస్వామి.. ఆర్థికాభివృద్ధి, పన్నుల తగ్గింపు, దేశీయ ఉత్పత్తుల ప్రోత్సాహం, అమెరికా శక్తిమంతమైన ఆధిపత్యం, సరిహద్దుల్లో పటిష్ఠ భద్రత, వలస నేరాల నివారణ, శాంతి భద్రతల కోసం సైన్యం/మాజీ సైనికుల బలోపేతం, ఎన్నికల పారదర్శకత వంటి అంశాల కోసం ఆయన అవిశ్రాంతంగా పోరాడతారు' అంటూ ప్రశంసలు కురిపించారు. ట్రంప్ మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ రామస్వామి స్పందించారు. 'ధన్యవాదాలు ప్రెసిడెంట్ ట్రంప్! ఒహాయోను మరింత గొప్పగా మార్చుదాం' అని ఆయన సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

దక్షిణాఫ్రికాలో జరిగే జీ-20 సదస్సును బహిష్కరిస్తున్నాం

- ట్రంప్ సంచలన ప్రకటన

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటనచేశారు. ఈ ఏడాది దక్షిణాఫ్రికాలో జరగనున్న జీ-20 దేశాల అధినేతల సదస్సుకు అమెరికా నుంచి ఎవరూ హాజరు కాబోరని ఆయన స్పష్టంచేశారు. దక్షిణాఫ్రికాలో మైనారిటీలైన శ్వేతజాతి రైతులను చూస్తున్న తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇటీవల మయామిలో చేసిన ప్రసంగంలో దక్షిణాఫ్రికాను జీ-20 గ్రూప్ నుంచి తొలగించాలని డిమాండ్‌చేసిన ట్రంప్, తాజాగా అక్కడ జరిగే సదస్సును బహిష్కరించాలని నిర్ణయించారు. 'జీ-20 సదస్సు దక్షిణాఫ్రికాలో జరగడం పూర్తి అవమానకరం. ఆ దేశంలో తెల్లజాతి రైతులపై జరుగుతున్న హింస, ఆస్తుల స్వాధీనం, హత్యలు వంటి దారుణాలు ప్రపంచానికి తెలియాలి. వచ్చే ఏడాది ఫ్లోరిడాలోని మయామిలో నిర్వహించే జీ-20 సదస్సు కోసం వేచిచూస్తున్నా' అని తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా శనివారం పేర్కొన్నారు.

రష్యా దాడుల్లో ఆరుగురు ఉక్రెయిన్ పౌరుల మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని గృహసముదాయాలు, విద్యుత్ సదుపాయాలపై శనివారం తెల్లవారుజామున రష్యా జరిపిన క్షిపణి, డ్రోన్ దాడుల్లో ఆరుగురు మరణించారు. పలువురు గాయపడ్డారు. దేశంలోని నాలుగో అతిపెద్ద నగరమైన నిప్రోలో ఒక బహుళ అంతస్థుల అపార్ట్‌మెంట్ భవనంపై జరిగిన రష్యన్ దాడిలో ఇద్దరు మరణించారు, 12 మంది గాయపడ్డారు. జపోరిజ్జియాపై జరిగిన దాడిలో మరో ముగ్గురు మరణించారు. రష్యా ఏకకాలంలో క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించిందని స్థానిక అధికారి ఒకరు తెలిపారు. జపోరిజియా నగరంలోని ఓ తొమ్మిది అంతస్తుల భవనంపై జరిగిన డ్రోన్ దాడిలో అనేక ఫ్లాట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక విద్యుత్ పరిశ్రమపై జరిగిన దాడిలో ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ దాడుల్లో రష్యా మొత్తం 45 క్షిపణులు 458 డ్రోన్‌లు ఉపయోగించింది. రష్యా ప్రయోగించిన క్షిపణుల్లో 32 బాలిస్టిక్ క్షిపణులని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ బలగాలు 406 డ్రోన్‌లు, తొమ్మిది క్షిపణుల్ని గాల్లోనే ధ్వంసం చేశాయని స్థానిక వైమానికదళ అధికారులు తెలిపారు. మరోవైపు తమ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశాల మేరకు అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ శనివారం వెల్లడించారు. సమగ్ర అణ్వస్త్ర నిషేధ ఒప్పందం కింద విధించిన మారటోరియం నుంచి అమెరికా వైదొలగితే అణు పరీక్షల్ని తిరిగి ప్రారంభించేందుకు గల అవకాశాలపై నివేదిక సమర్పించాల్సిందిగా పుతిన్ వివిధ విభాగాలను ఇటీవల ఆదేశించారు.



నిప్రోలో ధ్వంసమైన అపార్ట్‌మెంట్

ట్రంప్ సర్కారుకు ఊరట

ఎస్ఎన్ఏపీ చెల్లింపులపై సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే

బోస్టన్: సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రాం (ఎస్ఎన్ఏపి) పేరుతో అమెరికా ప్రభుత్వం అల్పాదాయ వర్గాల కోసం నిర్వహిస్తున్న ఆహార భద్రతా పథకానికి పూర్తి చెల్లింపులు జరపాలంటూ కిందిస్థాయి కోర్టు జారీ చేసిన ఆదేశాలను ఆ దేశ సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఎన్ఏపి పథకానికి శుక్రవారం నాటికల్లా చెల్లింపులు పూర్తి చేయాలని కింది స్థాయి కోర్టు న్యాయమూర్తి ఇటీవల ట్రంప్ యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే ఈ ఆదేశాన్ని నిలువరించాల్సిందిగా కోరుతూ ట్రంప్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకుంది. ఎస్ఎన్ఏపి పథకం కింద అమెరికా ప్రభుత్వం ప్రతి 8 మంది అమెరికన్లలో ఒకరికి ఆహార భద్రత కల్పిస్తోంది.

మరో 15 మంది పాలస్తీనా వాసుల మృతదేహాల అప్పగింత

ఖాన్ యూనిస్ (గాజా): అమెరికా మధ్యవర్తిత్వంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్ శనివారం 15 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను హమాస్‌కు అప్పగించింది. హమాస్ తాను బందీగా చేసుకున్న ఒక ఇజ్రాయెలీ వ్యక్తి మృతదేహాన్ని అప్పగించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. హమాస్ నుంచి విడుదలయ్యే ప్రతి బందీ మృతదేహానికి బదులుగా ఇజ్రాయెల్ 15 మంది పాలస్తీనియన్ల మృతదేహాలను అప్పగిస్తోంది.


దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి గుప్పిట్లో భారత్

దిల్లీ: దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి తీవ్రత భారత్‌లో ఎక్కువగానే ఉందని తాజా అధ్యయనం పేర్కొంది. 2023లో ఈ రుగ్మత బాధితుల సంఖ్య విషయంలో మన దేశం.. ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని తెలిపింది. 15.2 కోట్ల మంది వ్యాధిగ్రస్తులతో చైనా మొదటి స్థానంలో ఉండగా.. భారత్‌లో 13.8 కోట్ల మంది ఈ రుగ్మతతో బాధపడుతున్నారు. అమెరికా, బ్రిటన్ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలు 'ద లాన్సెట్'లో ప్రచురితమయ్యాయి. ప్రాణాలు హరిస్తున్న వ్యాధుల జాబితాలో దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధి 9వ స్థానంలో ఉంది. ఈ రుగ్మత.. గుండె జబ్బులకూ దారితీస్తోంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బు మరణాల్లో ఇది దాదాపు 12 శాతాన్ని ఆక్రమించింది. మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం సహా దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధికి సంబంధించి 14 ముప్పు అంశాలు ఉన్నాయని పరిశోధకులు తెలిపారు.

క్వాంటమ్ కంప్యూటర్ సిద్ధమైంది..

తీసుకురావడమే మిగిలింది

- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం చంద్రబాబు వెల్లడి



ఈనాడు, అమరావతి: అమరావతిలో త్వరలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ కంప్యూటర్ సిద్ధమైందని.. తీసుకురావడమే (షిప్‌మెంట్) మిగిలిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అన్ని అడ్డంకులు అధిగమించి.. అనుకున్న సమయానికి దాన్ని అమరావతికి తీసుకొస్తామన్నారు. ఎక్కడ ఏర్పాటుచేసేదీ త్వరలో స్పష్టతనిస్తామని వెల్లడించారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సును నిర్మాణాత్మకంగా నిర్వహిస్తామన్నారు. శనివారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన కొంతసేపు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బాధితులకు స్పష్టమైన సమాచారం ఇచ్చేలా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. "భాగస్వామ్య సదస్సును పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ప్రజెంటేషన్, ఎగ్జిక్యూషన్, ఎగ్జిబిషన్, ఎంవోయూలు ఇలా వేటికవే జరుగుతాయి. గ్రీన్ ఎనర్జీ, క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ సహా అధునాతన సాంకేతిక అంశాలపై ఇందులో చర్చిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం తరఫున మంత్రులు, అధికారులు దేశవిదేశాల్లోని ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులు, పెట్టుబడిదారులను ఆహ్వానించారు" అని చంద్రబాబు వివరించారు.

ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కారమయ్యేలా..

ప్రజా సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారం అయ్యే వ్యవస్థను తీసుకురానున్నట్లు చంద్రబాబు వివరించారు. "ప్రజాదర్బార్‌ను పటిష్ఠం చేస్తున్నాం. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే, పార్టీ బాధ్యుడు కచ్చితంగా ప్రతి శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించాల్సిందే. సీఎం వద్దకు వస్తేనే సమస్య పరిష్కారం అవుతుందనే భావన ఉండకూడదు. కొన్ని సాంకేతిక కారణాలతో ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే ఎందుకు కాలేదో బాధితుడికి స్పష్టంగా తెలియజేసే విధానాన్ని మెరుగుపరుస్తాం" అని చంద్రబాబు వివరించారు. ముందు పెండింగ్ రెవెన్యూ సమస్యల్ని పరిష్కరించాల్సి ఉందని.. ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. త్వరలో 22ఏ భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తామని చంద్రబాబు వెల్లడించారు.

అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరుగుతోంది

హైదరాబాద్ తరహాలోనే అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరుగుతోందని చంద్రబాబు అన్నారు. వివిధ ఈవెంట్లను ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. "సినీ సంగీత దర్శకుడు తమన్ మ్యూజికల్ నైట్, విజయవాడ ఉత్సవ్, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా మ్యూజికల్ నైట్ వంటి కార్యక్రమాలు అమరావతికి ప్రత్యేకగుర్తింపు తెస్తున్నాయి" అని చంద్రబాబు అన్నారు. తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలో భారీ పెట్టుబడులు పెట్టనుండడం శుభపరిణామమని పేర్కొన్నారు. 'లోక్‌సభ నియోజకవర్గ కమిటీల మీద ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాం. డిసెంబరు చివరి నాటికి అన్ని కమిటీల ఏర్పాటు పూర్తి చేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.





భూగర్భ డ్రైనేజీ, పచ్చదనంతో చల్లపల్లిలోని గంగులవారిపాలెం రహదారి ★ స్వచ్ఛ' కార్యకర్తలు

'స్వచ్ఛ చల్లపల్లి'కి 11 ఏళ్లు

- నిరాటంకంగా కొనసాగుతున్న కార్యక్రమం

చల్లపల్లి, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా 'స్వచ్ఛ సుందర చల్లపల్లి' ఉద్యమానికి 11 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇచ్చిన స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ పిలుపునకు స్పందించి 2014 నవంబరు 12న ప్రముఖ వైద్యులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు, నల్లూరి రామారావు, టి.లక్ష్మణరావు, ఎన్.వెంకటేశ్వరరావు, ఇంకా అనేకమంది స్వచ్ఛసైనికులు.. రహదారులను ఊడ్చి, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఈ సేవకు నడుం కట్టారు. ఇందుకు మేము సైతం అంటూ పలువురు ముందుకు రావడంతో ఈ కార్యక్రమం నాటినుంచి నేటి వరకు నిరాటంకంగా సాగుతోంది.

ఇవిగో సేవలు

15 మంది కార్యకర్తలతో మొదలైన ఈ కార్యక్రమంలో ప్రస్తుతం రోజూ 63 మంది పారిశుద్ధ్య, అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నారు. ★ చల్లపల్లి రహదారుల్లో 30వేల మొక్కలు నాటారు. దీంతో చల్లపల్లి-మచిలీపట్నం జాతీయ రహదారి పచ్చదనంతో కళకళలాడుతోంది. శివరామపురం-వెంకటాపురం మార్గంలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. ★ డంపింగ్‌యార్డు, శ్మశానం, బస్టాండ్ లాంటి ప్రదేశాలు పచ్చని చెట్లతో అందంగా మారాయి. ★ గంగులవారిపాలెం బజారు భూగర్భ డ్రైనేజీని సుందరంగా తీర్చిదిద్దారు.



డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి దంపతులు

నేడు వార్షికోత్సవం

స్వచ్ఛ సుందర చల్లపల్లి 11వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డాక్టర్ ఏవీ గురవారెడ్డి(హైదరాబాద్)లు పాల్గొంటారని 'స్వచ్ఛ చల్లపల్లి' రథసారథి, మన కోసం మనం ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతిలు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనుషులకు ఆరోగ్యవంతమైన జీవనం దక్కుతుందని పేర్కొన్నారు. 2014 నుంచి స్వచ్ఛతకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



తెల్లవారుజామున స్వచ్ఛ సేవలో..

EENADU Vol: 52, Issue: 89 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

బస్సుల కాలుష్యం తగ్గుతోందా?

ఈనాడు - హైదరాబాద్

డీజిల్ బస్సుల స్థానాన్ని నెమ్మదిగా విద్యుత్తు బస్సులు ఆక్రమిస్తున్నాయి. మన దేశంలో విద్యుత్తు బస్సులకు ఆదరణ, వినియోగం పెరుగుతున్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. విద్యుత్తు బస్సులతో వాయు, శబ్ద కాలుష్యం సమస్య లేదు. నిర్వహణ వ్యయాలు తక్కువ. ఎక్కువ దూరం ప్రయాణం చేయటానికి వీలుగా సమర్థమైన బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోంది. దీంతో రోడ్డు రవాణా విభాగంలో విద్యుత్తు బస్సుల వాటా క్రమంగా పెరుగుతోంది.

- పెరుగుతున్న విద్యుత్తు బస్సుల వినియోగం
- వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి 10-12% వాటా
- మద్దతుగా ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- డెలివరీలు వేగవంతం కావాలి



రెండేళ్లలో రెట్టింపు వాటా

2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టే కొత్త బస్సుల్లో 10- 12 శాతం విద్యుత్తు బస్సుల వాటా ఉంటుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ ఒక నివేదికలో పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇది 5 శాతం మాత్రమే కావటం గమనార్హం. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలో రెట్టింపు వాటాను విద్యుత్తు బస్సులు సాధించనున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి ఎన్నో సానుకూలతలు వీలుకల్పిస్తున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు ఒక ఎత్తు కాగా ఛార్జింగ్ సదుపాయాలు విస్తరించటం, విద్యుత్తు బస్సుల్లో వినియోగించే బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానం విస్తరించి ఒకసారి ఛార్జి చేస్తే ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం కలగటం, బస్సుల ధరలు కూడా తగ్గుముఖం పట్టటం, ఎక్కువ కంపెనీలు విద్యుత్తు బస్సులను ఉత్పత్తి చేస్తుండటం ఇతర కారణాలుగా ఉన్నాయి.

పీఎం ఇ-డ్రైవ్‌తో..

కాలుష్య ఉద్గారాలను బాగా తగ్గించుకోవాలనే లక్ష్యాన్ని మన దేశం నిర్దేశించుకుంది. 2070 నాటికి 'నెట్ జీరో' లక్ష్యాన్ని చేరుకోవాలని నాలుగేళ్ల క్రితం 'కాప్26'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఇది దీర్ఘకాలిక లక్ష్యం. ఇదేకాకుండా 2030 నాటికి ఇప్పుడున్న కాలుష్య ఉద్గారాలను 45 శాతం మేరకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇంధన రంగం నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్ వాయువుల్లో వాహనాల వాటా 12 శాతం ఉంటోంది. డీజిల్‌తో నడిచే ట్రక్కులు, బస్సులు వెదజల్లే కాలుష్యం ఇందులో 50 శాతం ఉండటం గమనార్హం. అందువల్ల వాహనాల విభాగంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యుత్తు బస్సుల వాడకాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ఏడాది అక్టోబరులో పీఎం ఇ-డ్రైవ్ అనే పథకాన్ని రూ.10,900 కోట్ల బడ్జెట్‌తో ప్రకటించిన విషయం గమనార్హం. విద్యుత్తు బస్సుల వాడకాన్ని పెంపొందించే కార్యక్రమాలకు, ఛార్జింగ్ సదుపాయాలను భారీగా అందుబాటులోకి తీసుకురావటానికి ఈ నిధులు వెచ్చిస్తారు. ఈ కార్యక్రమం వల్ల దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో 14,000 ఇ-బస్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదేకాకుండా పీఎం ఈ-బస్ సేవ కార్యక్రమాన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు.

నగరాల్లోనే ఎక్కువ..

ప్రస్తుతానికి నగరాల్లో విద్యుత్తు బస్సుల వాడకం అధికంగా ఉంది. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్... తదితర నగరాల్లో విద్యుత్తు బస్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తిరుపతితో పాటు మరికొన్ని పుణ్యక్షేత్రాల్లోనూ విద్యుత్తు బస్సుల ప్రాధాన్యాన్ని గుర్తించి అధికంగా వినియోగిస్తున్నారు. ఇకపై సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్యుత్తు బస్సులను వినియోగించే దిశగా దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పుడిప్పుడే ఇ-బస్సుల వాడకం పెరగటం మొదలైందని, ఇకపై వేగం పుంజుకుంటుందని ఈ రంగానికి చెందిన నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ సవాళ్లు..

అయితే ఇప్పటికీ కొన్ని సవాళ్లు ఉన్నాయి. వివిధ కంపెనీలు విద్యుత్తు బస్సులను ఆశించనంత వేగంగా వినియోగదార్లకు అందించలేకపోతున్నాయి. బస్సుల డెలివరీలో ఎంతో జాప్యం జరుగుతోంది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం వచ్చే రెండేళ్లలో 25,000 కుపైగా విద్యుత్తు బస్సులను డెలివరీ చేయాల్సి ఉంది. విడిభాగాలు సకాలంలో లభించకపోవటం, బ్యాటరీ, మోటార్లు వంటి కీలకమైన విడిభాగాల కోసం చైనాపై అధికంగా ఆధారపడి ఉండటం దీనికి కారణాలు. ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను ప్రైవేటు ఆపరేటర్లకు వర్తింపజేయకపోవటం కూడా ఒక అవరోధంగా భావిస్తున్నారు. అంతేగాక ఛార్జింగ్ సదుపాయాలను ఇంకా బాగా విస్తరించాల్సి ఉంది. ఈ సవాళ్లను ఎంత త్వరగా అధిగమిస్తే, అంత త్వరగా ఇ-బస్సుల వాడకం పెరుగుతుందని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఎస్ఎంఎస్ ఫార్మా లాభం రూ.25 కోట్లు

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ రూ.25 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.14.25 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.196.70 కోట్ల నుంచి 23.2 శాతం పెరిగి రూ.242.4 కోట్లకు పెరిగింది. ఎబిటా రూ.31.85 కోట్ల నుంచి 51.8 శాతం పెరిగి రూ.48.34 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 16.19 శాతం నుంచి 19.94 శాతానికి పెరిగింది. 2024 మార్చిలో ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 90 లక్షల కన్వర్టబుల్ వారెంట్లను జారీ చేసి సమీకరించిన నిధులను సామర్థ్య విస్తరణ, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించినట్లు కంపెనీ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఆ కన్వర్టబుల్ వారెంట్లలో 40 లక్షల వారెంట్లను 2025 మార్చిలో, 50 లక్షల వారెంట్లను సెప్టెంబరులో ఈక్విటీ షేర్లుగా మార్చినట్లు పేర్కొంది.

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ లాభం రూ.75 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై- సెప్టెంబరు త్రైమాసికానికి జేఎస్ డబ్ల్యూ సిమెంట్ రూ.75.36 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.75.82 కోట్ల నష్టాన్ని నమోదుచేసింది. అమ్మకాల్లో రెండంకెల వృద్ధి వల్లే ఈ సారి లాభాలు ఆర్జించినట్లు కంపెనీ తెలిపింది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.1,223.71 కోట్ల నుంచి పెరిగి రూ.1,436.43 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.1,348.72 కోట్లుగా ఉన్నాయి. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తం అమ్మకాలు 2.71 మిలియన్ టన్నుల నుంచి పెరిగి 3.11 మిలియన్ టన్నులకు చేరాయి. 2025 సెప్టెంబరు 30 చివరి నాటికి కంపెనీకి ఉన్న మొత్తం నికర రుణం రూ.3,231 కోట్లుగా నమోదైంది. 2025 జూన్ 30 నాటికి ఉన్న రూ.4,566 కోట్లతో పోలిస్తే నికర రుణం బాగా తగ్గినట్లు కంపెనీ తెలిపింది. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులు ఇందుకు దోహదం చేశాయని వివరించింది.

కోడి గుడ్డు

9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(౧౦౦కు రూపాయలలో)

హైదరాబాద్	590
వరంగల్	592
విజయవాడ	600
తూ/ప గోదావరి	600
విశాఖపట్నం	585
చిత్తూరు	623

డిజిటల్ గోల్డ్‌తో జాగ్రత్త

- నియంత్రణ పరిధిలో లేదు
- మదుపరులకు సెబీ హెచ్చరిక



ఈనాడు, హైదరాబాద్: బంగారం ధర పరుగులు పెడుతోంది. దీంతో పసిడిలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఇతర మార్గాల కోసం చూస్తున్నారు. ఈ సమయంలోనే చాలామందిని డిజిటల్ గోల్డ్ ఆకర్షిస్తోంది. నేరుగా బంగారం కొనుగోలు చేసే బదులు ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్/ఇ-గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వీలు కల్పిస్తూ ఈ మధ్య కాలంలో ఎన్నో పథకాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. చెల్లింపుల సేవలను అందిస్తున్న సంస్థలూ వీటిని తీసుకొచ్చాయి. తక్కువ మొత్తంతోనూ బంగారంలో మదుపు చేసేందుకు ఇవి అవకాశం ఇస్తుండటంతో ఎంతోమంది మదుపు చేస్తున్నారు. వెసులుబాటు మాట ఎలా ఉన్నా.. డిజిటల్ గోల్డ్ పథకాలు అత్యంత నష్టభయంతో కూడుకున్నవని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మదుపరులకు హెచ్చరిక జారీ చేసింది. ఇవేవీ తమ నియంత్రణ పరిధిలోకి రావని, అందువల్ల పెట్టుబడిదారులకు ఎలాంటి రక్షణ ఉండదని స్పష్టం చేసింది.

'డిజిటల్ గోల్డ్‌ను సంప్రదాయ బంగారం కొనుగోలుకు ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు. ఇవేవీ సెబీ గుర్తించిన ఉత్పత్తులు కావు. కమొడిటీ డెరివేటివ్ పరిధిలోనూ లేవు. కాబట్టి, మీ పెట్టుబడులకు సెబీ ఆధీనంలో ఉండే పెట్టుబడిదారుల రక్షణ వ్యవస్థ వర్తించదు. ఒకవేళ ఆ సంస్థ/యాప్‌ను మూసేసినా, దివాలా తీసినా మదుపరుల సొమ్ముకు నష్టం వాటిల్లుతుంది' అని శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది.

బంగారంలో పెట్టుబడి కోసం సెబీ ఆమోదించిన కొన్ని సురక్షిత మార్గాలనూ సూచించింది..

✦ మ్యూచువల్ ఫండ్లు అందించే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (గోల్డ్ ఈటీఎఫ్), గోల్డ్ ఫండ్లు, ఇ-గోల్డ్ రశీదులు (ఈజీఆర్), ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ డెరివేటివ్స్ లాంటి వాటిల్లోనే మదుపు చేయాలని పేర్కొంది. వీటిలోనూ సెబీ వద్ద నమోదైన మధ్యవర్తుల ద్వారా మాత్రమే మదుపు చేయాలని వివరించింది.

ఏం చేయాలి?

✦ డిజిటల్ గోల్డ్ లేదా ఇ-గోల్డ్ పేరుమీద వచ్చిన సంస్థలు, యాప్‌లకు సెబీ రిజిస్ట్రేషన్ ఉందా అనేది ముందుగా తనిఖీ చేసుకోండి. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఈజీఆర్‌లను డీమ్యాట్ ఖాతా ద్వారానే కొనుగోలు చేయండి.

✦ ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి, వెంటనే పెట్టుబడులు పెట్టొద్దు. నష్టం గురించీ అంచనా వేయండి.

✦ ఇప్పటికే ఇలాంటి పథకాల్లో మదుపు చేస్తే అప్రమత్తత అవసరం. పెద్దగా పేరు లేని సంస్థల్లో పెట్టుబడులు పెట్టి ఉంటే, వాటిని వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయండి. ఈ మొత్తాన్ని సెబీ నియంత్రణ పరిధిలోని మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే గోల్డ్ ఫండ్లు లేదా గోల్డ్ ఈటీఎఫ్, గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్‌లోకి మళ్లించడం శ్రేయస్కరం.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయాల్లో 25% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు బస్సుల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం రూ.656.62 కోట్ల ఆదాయం, రూ.49.43 కోట్ల నికర లాభం ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.6.04 ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.523.70 కోట్లు, నికర లాభం రూ.47.65 కోట్లు, ఈపీఎస్ రూ.5.79 ఉన్నాయి. దీంతో పోల్చితే ఆదాయం 25 శాతం, నికర లాభం 4 శాతం పెరిగినట్లు అవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలానికి ఆదాయం రూ.1,003.85 కోట్లు, నికర లాభం రూ.75.46 కోట్లు నమోదయ్యాయి.

ఎంతో అధికంగా ఈ రెండో త్రైమాసికంలో 375 బస్సులు డెలివరీ ఇచ్చినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడించింది. దీంతో ఇంతవరకూ 8,818 బస్సులు డెలివరీ ఇచ్చినట్లు అవుతోందని పేర్కొంది. ప్రస్తుతం ఈ సంస్థ చేతిలో 9,818 విద్యుత్తు బస్సుల ఆర్డర్లు ఉన్నాయి. ఈ రెండో త్రైమాసికంలో 25 విద్యుత్తు టిప్పర్లు సహా రికార్డు స్థాయిలో విద్యుత్తు బస్సుల డెలివరీ ఇచ్చినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ మహేష్ బాబు వివరించారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని, లాభదాయకతను పెంచుకోవటానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. దేశీయ విద్యుత్తు బస్సుల విభాగంలో తొలిసారిగా తమ బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కు ధ్రువీకరణ లభించిందని వెల్లడించారు. ఈ కొత్త టెక్నాలజీతో బస్సులను వచ్చే త్రైమాసికం నుంచి డెలివరీ ఇస్తామని అన్నారు.

హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ లాభం రూ.387 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రక్షణ, ఏవియేషన్, బ్యాటరీలు తదితర ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థ హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. జులై-సెప్టెంబరులో ఆదాయం రూ.1,238.68 కోట్లు, నికర లాభం రూ.387.27 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.533.19 కోట్లు, నికర లాభం రూ.87.26 కోట్లను ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఆదాయం రూ.1,860 కోట్లు, నికర లాభం రూ.530.54 కోట్లుగా ఉన్నాయి.

ఫిజిక్స్‌వాలాలో థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.136.17 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: ఎడ్‌టెక్ యూనికార్న్ ఫిజిక్స్‌వాలాలో అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.136.17 కోట్ల పెట్టుబడులు పెట్టింది. వచ్చే వారంలో ఐపీఓకు రాబోతున్న ఫిజిక్స్‌వాలాలో తాజా పెట్టుబడులు రావడం గమనార్హం. తాజా లావాదేవీ ద్వారా థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 1.07 కోట్ల ఈక్విటీ షేర్లు (0.37 శాతం వాటా) లభించాయి. వీటిని ఫిజిక్స్‌వాలాలో పని చేస్తున్న 14 మంది ఉద్యోగులు విక్రయించారు. ఒక్కో ఈక్విటీ షేరును రూ.127తో కొనుగోలు చేసింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 17 శాతం ఎక్కువ.

✦ ఫిజిక్స్‌వాలా ఐపీఓ ఈ నెల 11 నుంచి ప్రారంభమై 13న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.103-109.

నోపేపర్ ఫామ్స్ ఐపీఓ: సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ (సాస్) ఆధారిత ఎన్‌రోల్‌మెంట్ ఆటోమేషన్ సొల్యూషన్ సేవల సంస్థ నోపేపర్ ఫామ్స్ ఐపీఓకు రాబోతోంది. దీనికి సంబంధించిన ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద కాన్ఫిడెన్షియల్ పద్ధతిలో దాఖలు చేసింది. 2017లో నవీన్ గోయల్ దీన్ని స్థాపించారు. ఇన్ఫోఎడ్జ్ నిధులు సమకూర్చింది.

పానసోనిక్ ఇండియా ఛైర్మన్ మనీశ్ రాజీనామా

దిల్లీ: పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ఛైర్మన్ మనీశ్ శర్మ తన పదవికి రాజీనామా చేశారు. నోటీసు పీరియడ్ ముగిసిన తర్వాత 2026 జనవరి నుంచి ఆయన సంస్థ నుంచి వైదొలగనున్నారు. 13 ఏళ్ల పాటు కంపెనీకి సేవలు అందించిన ఆయన వ్యక్తిగత కారణాలతోనే బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. ఆయన పదవీ కాలంలో రూమ్ ఏసీ, ఎల్ఈడీ టీవీ విభాగాల్లో పానసోనిక్ మార్కెట్‌లో గట్టి పోటీ ఇచ్చింది.

భారత ఏఐ విపణిలో టెక్ దిగ్గజాలు సై అంటే సై

- ఉచిత సేవల ద్వారా వినియోగదార్లను ఆకర్షించే యత్నం
- దీర్ఘకాలిక వ్యాపార వృద్ధి వ్యూహంతో ముందుకు



దిల్లీ: భారత్‌లో కృత్రిమ మేధ (ఏఐ) సేవల విపణిలో వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అంతర్జాతీయ దిగ్గజ టెక్ సంస్థలు పోటీపడుతున్నాయి. తమ ఖరీదైన కృత్రిమ మేధ ఉత్పత్తుల సేవలను ఉచితంగా లేదా తగ్గింపు ధరతో అందించడం ద్వారా భారతీయులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందుకోసం భారత టెలికాం సంస్థలతోనూ జట్టుకడుతున్నాయి. భారతీయులందరికీ చాట్‌జీపీటీ 'గో' ఏఐ చాట్‌బోట్ సేవలను ఏడాది పాటు ఓపెన్‌ఏఐ ఉచితంగా అందిస్తోంది. ఇప్పటికే గూగుల్, పర్‌ప్లెక్సిటీ సంస్థలు కూడా ఇదే తరహా ప్రకటనలు చేశాయి. నెలవారీ డేటా ప్యాక్‌లతో ఉచితంగా లేదా తగ్గింపు ధరకు ఏఐ ఉత్పత్తుల సేవలను అందించేందుకు భారతీ ఎయిర్‌టెల్‌తో పర్‌ప్లెక్సిటీ, రిలయన్స్ జియోతో గూగుల్ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. అయితే ఈ నిర్ణయాలు.. ఈ ఒప్పందాల వెనక సదరు కంపెనీల దీర్ఘకాలిక వ్యూహాలు దాగి ఉన్నాయని, విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాని ఉదారంగా ఈ ఉచిత సేవలను అందిస్తున్నాయని అనుకుంటే పొరపాటే అవుతుందని అంటున్నారు. తమ జనరేటివ్ ఏఐ సేవలను వాడుకునేందుకు డబ్బులు చెల్లించమని అడగకుండా.. ముందు ప్రజలను ఈ సేవలకు అలవాటు పడేలా చేయాలనే వ్యూహాన్ని కంపెనీలు అమలు చేస్తున్నట్లుగా కనిపిస్తోందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ విశ్లేషకుడు తరుణ్ పాఠక్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనం తెలిపింది. భారత్‌లో యువ జనాభా ఎక్కువగా ఉండటంతో వారిని ఈ సేవల వైపు ఆకర్షితులను చేయాలన్నది కూడా దీని వెనక ఆ కంపెనీల వ్యూహమై ఉండొచ్చని వెల్లడించింది.

చైనాతో పోలిస్తే భిన్న పరిస్థితులు..

భారత్‌లో 90 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది యువతే. అంతేకాకుండా ప్రపంచంలో చౌకగా డేటాను అందిస్తున్న అతి కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. వినియోగదారుల సంఖ్యాపరంగా భారత్ మాదిరే చైనా కూడా అతిపెద్ద విపణుల్లో ఒకటి. అయితే ఆ దేశంలో కఠిన నియంత్రణతో కూడిన సాంకేతిక వాతావరణం ఉండటం వల్ల విదేశీ సంస్థలకు వ్యాపార అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. అందుకే భారత్‌లోని లక్షలాది కొత్త వినియోగదార్లకు తమ ఏఐ మోడళ్లపై శిక్షణ అవకాశాలను అందివ్వడం ద్వారా వ్యాపారాన్ని పెంచుకునేందుకు అంతర్జాతీయ టెక్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. పైగా ప్రపంచంలోని చాలా దేశాలతో పోలిస్తే భారత్‌లో డేటా వినియోగం కూడా ఎక్కువే. అందుకే దేశీయ టెలికాం కంపెనీలతో జట్టుకట్టి డేటా ప్యాక్‌లతో కలిపి ఏఐ ఉత్పత్తులను అందివ్వడం ద్వారా వ్యాపారపరంగా అపార అవకాశాలను సృష్టించొచ్చనే వ్యూహంతో ఇవి ముందుకెళ్తున్నాయి.

ఏరోస్పేస్, సాస్, ఎడ్యుటెక్ అంకురాలదే పైచేయి

'లింక్డ్‌ఇన్' ఉత్తమ అంకుర సంస్థల జాబితాలో స్కైరూట్ ఏరోస్పేస్, రిసైకల్, స్పైప్

ఈనాడు - హైదరాబాద్



ప్రపంచంలో అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన లింక్డ్‌ఇన్, తాజాగా హైదరాబాద్‌లోని ఉత్తమ అంకుర సంస్థల జాబితాను వెల్లడించింది. ఇందులో ఏరోస్పేస్, సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్), ఎడ్యుటెక్ అంకుర సంస్థలదే పైచేయి కావటం ప్రత్యేకత. ఈ జాబితాను లింక్డ్‌ఇన్ ఏటా ప్రకటిస్తోంది. ఉద్యోగి వృద్ధి, ఉద్యోగంపై ఆసక్తి, ప్రతిభావంతులను ఆకర్షించటం... వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని దీన్ని రూపొందిస్తారు. '2025 టాప్ స్టార్టప్స్ లిస్ట్ ఫర్ హైదరాబాద్' అనే పేరుతో రూపొందించిన ఈ జాబితాలో ఏరోస్పేస్ రంగానికి చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అగ్రస్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో రిసైకల్, స్పైప్ ఉన్నాయి. ఈ ఏడాది జాబితాలో ఏడు కొత్త సంస్థలు స్థానం సంపాదించాయి.

హైదరాబాద్‌లో '2025 లింక్డ్‌ఇన్ ఉత్తమ అంకుర సంస్థలు'...

- స్కైరూట్ ఏరోస్పేస్
- రీసైకల్
- స్పైప్
- జెహ్ ఏరోస్పేస్
- విజన్ లైఫ్ సైన్సెస్
- క్రెడ్‌జెనిక్స్
- ఫ్రంట్‌లైన్స్ ఎడ్యుటెక్
- భాన్జు
- లిక్విడ్‌నైట్రో గేమ్స్
- కోస్మోక్

హైదరాబాద్‌లో సానుకూల వాతావరణం

అంకుర సంస్థలకు అత్యంత సానుకూలమైన వాతావరణం హైదరాబాద్‌లో ఉన్నట్లు దీంతో నిర్ధారణ అవుతోందని లింక్డ్‌ఇన్ విశ్లేషించింది. హైదరాబాద్ నగరంలో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు చెందిన సంస్థలు ఎంతో కాలంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ సానుకూలత వల్ల ఈ విభాగంలో అంకుర సంస్థలు రూపుదిద్దుకునే అవకాశం కలుగుతోంది. స్కైరూట్ ఏరోస్పేస్, జెహ్ ఏరోస్పేస్ కంపెనీలు ఈ కోవలోని సంస్థలే. ఎడ్యుటెక్ రంగానికి ఫ్రంట్‌లైన్స్ ఎడ్యుటెక్, భాన్జు, కోస్మోక్ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. లైఫ్‌సైన్సెస్ విభాగానికి చెందిన విజన్ లైఫ్‌సైన్సెస్, సాస్ ఇన్నోవేటర్ అయిన క్రెడ్ జెనిక్స్, స్పైప్ ఈ ఏడాది జాబితాలో ఉన్నాయి. హైదరాబాద్‌లో అంకుర సంస్థల వ్యవస్థ బలమైన పునాదులతో వేగంగా ఎదుగుతున్నట్లు లింక్డ్‌ఇన్ కెరీర్ నిపుణురాలు నిరాజితా బెనర్జీ వివరించారు. డీప్-టెక్, డిజైన్ ఆధారిత విధానాలు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. 'సాస్' పునాదులు నుంచి కొత్త విభాగాలకు అంకుర సంస్థల ప్రస్థానం కనిపిస్తోందని పేర్కొన్నారు. అంకుర సంస్థల వ్యవస్థాపకులు సమాజం మీద ప్రభావం చూపే విధంగా తమ సాంకేతిక లక్ష్యాలకు కార్యరూపం ఇస్తున్నారని విశ్లేషించారు. ఈ సందర్భంగా లింక్డ్‌ఇన్‌లోని ఉద్యోగార్థులకు నిరాజితా బెనర్జీ కొన్ని సూచనలు చేశారు.

అవేమిటంటే..

✦ ఏ సంస్థ ఉద్యోగ నియామకాలు చేపడుతోందని కాదు, ఏ సంస్థ వేగంగా విస్తరిస్తోందనేది ప్రధానం. అంకుర సంస్థలు సేకరించే నిధులు, ఆవిష్కరిస్తున్న ఉత్పత్తులు, మార్కెట్లో విస్తరిస్తున్న తీరును పరిగణనలోకి తీసుకోవాలి.

✦ ఉద్యోగార్థులు తమ మేనేజర్లను ఏవిధంగా పరిశీలిస్తారో, అదేవిధంగా అంకుర సంస్థల వ్యవస్థాపకులను గమనించాలి.

✦ వివిధ సంస్థల వ్యాపార విధానాలను పరిశీలించాలి.

✦ సవాళ్లకు పరిష్కారం చూపే సంస్థల కోసం అన్వేషించాలి. పనిముట్లు మారవచ్చు, కానీ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనటమే అసలైన సత్తా అనేది గుర్తించాలి.

మన బ్యాంకులపై 'విదేశీ' కన్ను.. అయితేనేం..

- పెద్ద వాటాదార్ల ఓటింగ్ హక్కులకు పరిమితి కొనసాగింపు
- తద్వారా పూర్తి అధికారం వెళ్లకుండా చర్యలు



బ్యాంకింగ్ రంగంలో స్థిరత్వం కొనసాగేలా మనదేశం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. బ్యాంకుల్లోని పెద్ద వాటాదార్ల ఓటింగ్ హక్కులపై పరిమితులు కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడిదార్లు మన బ్యాంకుల్లో పెద్దమొత్తంలో వాటాలు కొనుగోలు చేసినా, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారికి పూర్తి అధికారం ఉండదని అవగతమయ్యేలా చేయాలని భావిస్తోంది.

✦ ఆర్థిక రంగంలో పెట్టుబడులకు సంక్లిష్టంగా ఉన్న నియంత్రణలను సడలించే దిశగా కొద్ది నెలలుగా ఆర్‌బీఐ పలు చర్యలు తీసుకుంటోంది. దేశీయ బ్యాంకుల్లో విదేశీయులు అధిక వాటా కొనేందుకూ అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడుల పరిమితిని ప్రస్తుతం కంటే రెట్టింపు చేసి 49 శాతానికి చేర్చాలన్న ప్రణాళికలో ఉందని గత వారం వార్తా సంస్థ రాయిటర్స్ తెలిపింది.

నిబంధనలు ఏం చెబుతున్నాయ్?

ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రైవేటు బ్యాంకులో ఒక వాటాదారుకు 26% కంటే ఎక్కువ ఓటింగ్ హక్కు ఉండదు. సదరు వాటాదారుకు బ్యాంకులో 26% కంటే ఎక్కువ ఉన్నా, ఓటింగ్ హక్కు మాత్రం అంత ఉండదు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ పరిమితి 10 శాతంగా ఉంది. పెద్ద వాటాదార్లకు ఓటింగ్ హక్కుల పరిమితిని పెంచడం ద్వారా, వారు వ్యూహాత్మక నిర్ణయాల్లో ఎక్కువగా పాలుపంచుకునేందుకు వీలుంటుందనే విషయంపై ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే ఒక వాటాదారుకు 26% ఓటింగ్ హక్కు పరిమితి వల్ల, ఒకరికే నిర్ణయాధికారం లేకుండా చూడొచ్చని భావిస్తున్నారు.

పరిమితితో మేలేనా?

ఓటింగ్ హక్కులపై పరిమితి కొనసాగిస్తే, భారతీయ బ్యాంకుల్లో నియంత్రిత వాటా కొనుగోలు చేయడానికి పెద్ద ఇన్వెస్టర్లు.. ముఖ్యంగా విదేశీ పెట్టుబడుదార్లు ఆసక్తి చూపరనే అనుమానాలూ ఉన్నాయి. ఈ ఏడాదిలోనే.. దుబాయ్‌కి చెందిన ఎమిరేట్స్ ఎన్‌బీడీ, మన ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 60% వాటా కొనగా, యెస్ బ్యాంక్‌లో జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్ప్ పెట్టుబడులు పెట్టింది. ఐడీబీఐ బ్యాంక్‌లోనూ మెజారిటీ వాటాను వచ్చే మార్చి కల్లా విక్రయించాలని కేంద్రప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. బ్యాంకుల్లో ఓటింగ్ హక్కులపై పరిమితి కొనసాగించినా, ఇక్కడి వ్యాపారావకాశాల నేపథ్యంలో విదేశీయులు పెట్టుబడులు పెడతారనే భావనా ఉంది.

సిగ్నేచర్ గ్లోబల్ నష్టం రూ.46.86 కోట్లు

దిల్లీ: స్థిరాస్తి సంస్థ సిగ్నేచర్ గ్లోబల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో రూ.46.86 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.4.15 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ.777.42 కోట్ల నుంచి రూ.372.51 కోట్లకు తగ్గింది. 2025-26 ఏప్రిల్-సెప్టెంబరు కాలానికి కంపెనీ నికర నష్టం రూ.12.42 కోట్లుగా ఉంది. 2024-25 ఇదే కాలంలో రూ.10.94 కోట్ల లాభం నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ.1,205.40 కోట్ల నుంచి రూ.1,270.86 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.12,500 కోట్ల ప్రీ-సేల్స్ లక్ష్యాన్ని కంపెనీ నిర్దేశించుకున్నట్లు సిగ్నేచర్ గ్లోబల్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ ప్రదీప్ అగర్వాల్ వెల్లడించారు. ఏప్రిల్-సెప్టెంబరులో కంపెనీ విక్రయ బుకింగ్‌లు రూ.5,900 కోట్ల నుంచి రూ.4,650 కోట్లకు తగ్గాయి.

చలికాలంలో రాజ్‌గిరా..



రాగి, మఖానా, మునగ, ఉసిరి... ఇలా పోషకాలతో నిండిన ఆహారపదార్థాలను సూపర్ ఫుడ్స్‌గా పేర్కొనడం తెలిసిందే. ఆ కోవకే చెందుతుంది రాజ్‌గిరా. ఇది అమరాంత్, సూడో మిల్లెట్‌గానూ ప్రసిద్ధి. వరి, జొన్న, మొక్కజొన్నల కంటే శక్తిదాయకం. పోషకాలు అధికంగా ఉన్నందున రాజ్‌గిరాని రామ్‌దానా (దేవుడి కానుక) అంటారు. రాజ్‌గిరా తినడం వల్ల శరీరంలో జీవక్రియ మెరుగవుతుంది. అందుకే ఉత్తరాదిన చలికాలంలో వీటి వాడకం ఎక్కువ. వ్రతాలు, ఉపవాసాల వేళ రాజ్‌గిరా పిండితో పూరీ, రోటీ, పాయసం వంటివి చేస్తుంటారు. ఈ ధాన్యంతో చేసిన వంటలు పిల్లల్లో పోషకాహార లోపం రానివ్వవు. ప్రొటీన్ ఫుడ్ అయినందున మఖానా మాదిరిగానే రాజ్‌గిరా వాడకం మనదగ్గరా పెరుగుతోంది.

అసలేమిటీ రాజ్‌గిరా?

తోటకూర కుటుంబానికి చెందిన రాజ్‌గిరాను అమరాంత్ గ్రెయిన్ లేదా తోటకూర విత్తనాలు అంటారు. వేల ఏళ్ల నుంచీ వీటిని ఆహారంగా తీసుకుంటున్నట్లు ఆధారాలున్నాయి. గింజలతోబాటు వీటి ఆకుల్నీ కాండాల్నీ అనేక వ్యాధుల నివారణలో వాడతారు.

ఏ ఇతర ధాన్యంలోనూ లేని లైసీన్ అనే ప్రొటీన్ రాజ్‌గిరాలో పుష్కలం. లైసీన్‌తో సహా కీలకమైన తొమ్మిది రకాల అమైనో ఆమ్లాలు ఇందులో ఉన్నాయి. వంద గ్రాముల ధాన్యంలో సుమారు 15 గ్రా. ప్రొటీన్ లభిస్తుంది. ఈ ప్రొటీన్ ఇన్సులిన్ శాతాన్ని నియంత్రిస్తుంది. మధుమేహులకి రాజ్‌గిరా ఎంతో మంచిది. అన్నిటినీ మించి గ్లూటెన్ ఉండదు కాబట్టి అది పడనివాళ్లకి ఈ పిండితో చేసిన రోటీ మేలు. రాజ్‌గిరాలో పీచు, యాంటీఆక్సిడెంట్లు అధికం. బి-విటమిన్లూ, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం శాతమూ ఎక్కువే. మహిళలు వీటిని ఆహారంలో చేర్చుకుంటే మెనోపాజ్ తర్వాత వచ్చే ఆస్టియోపొరోసిస్‌ను నివారించవచ్చు. వీటిల్లోని ఫోలేట్ గర్భిణులకు మంచిది. జుట్టు ఊడటాన్ని తగ్గించి, బలంగా పెరిగేలా చేస్తాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా హృద్రోగ సమస్యలున్నవాళ్లకి ఇవి మంచిది. అయితే మూత్రపిండాల సమస్యలు ఉన్నవాళ్లు రాజ్‌గిరా ఎంత మోతాదులో తీసుకోవచ్చో వైద్యుల సలహా తీసుకోవాలి.

రాజ్‌గిరాతో ఉప్మా, కిచిడీ, స్మూథీ, లడ్డూలు, చిక్కీలు చేయొచ్చు. బేకరీ ఉత్పత్తుల తయారీలోనూ వాడతారు. మొలకెత్తిన అమరాంత్‌లో పోషకాల శాతం మరింత ఎక్కువ. కాబట్టి వాటిని ఉడికించి.. ఉప్పు, మిరియాలపొడి వంటివి జోడించి అల్పాహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. రాజ్‌గిరా మొలకల పిండి కూడా మార్కెట్లో దొరుకుతోంది. వరి, గోధుమ, రాగుల్లా వీటితోనూ మరమరాలు చేస్తున్నారు. ఇన్ని విధాలుగా మేలు చేసే తోటకూర విత్తనాల్ని తిందామా మరి!

– వసుంధర డెస్క్



వాహ్మో బంగాళదుంపలు!


బ్యాచిలర్స్ కిచెన్



నౌకు ఉద్యోగం వచ్చిన తొలి రోజులు. ఉదయం తొమ్మిదింటికే.. మా లాంటి రాత్రి పక్షులకు అది తెల్లవారుజాము తెల్సా! అంత పొద్దున్నే లేచి వంట మొదలెట్టా. బంగాళదుంపలతో కూర వండుదామని కుక్కర్‌లో పెట్టి అమ్మకు ఫోన్ చేశా. యూట్యూబ్ లేని రోజులు గనుక.. ఏదైనా అమ్మను అడగాల్సిందే మరి.

ఆలుగడ్డలు ఎంతసేపు ఉడికించాలి అనేది నా డౌటనుమానం. అవి గట్టిగా ఉంటాయి కదా.. ఓ పది విజిల్స్ వచ్చే వరకూ ఉంచాలన్నది నా దుంప బుర్ర ఆలోచన. అమ్మ ఫోన్ ఎత్తలేదు. సర్లే.. నాకు తెలుసు కదా అనుకున్నాను. విజిల్స్ రావడం మొదలైంది. ఒకటి, రెండు, మూడు.. ఒకదాని తర్వాత ఒకటి వచ్చేశాయ్. ఏడు వచ్చాక.. ఇక చాల్లెమ్మనిపించి స్టవ్ కట్టేశా. సరిగ్గా అప్పుడే అమ్మ ఫోన్ చేసింది. చాలా తెలివైన వాణ్ణనే ధీమాతో 'అమ్మా! దుంపలకు ఏడు విజిల్స్ సరిపోతాయిగా' అన్నాను. 'అయ్యో కన్నా! ఇంకో రెండు విజిల్స్ రానివ్వకపోయావా?' అంది అమ్మ. ఆ క్షణంలో అది వెటకారమని అర్థంకాలేదు. టక్కున ఫోన్ పెట్టేశా. 'ఛ.. ముందు పదనే అనుకున్నాగా.. తర్వాతెందుకు మనసు మార్చుకున్నట్టు?' అనుకుని మళ్లీ స్టవ్వు వెలిగించాను. ఇంకో రెండు విజిల్స్ వచ్చాక సెగ తీసేశాను. కుక్కర్ చల్లారి.. మూత తీసి చూద్దును గదా.. నా ముఖం తెల్లబడింది. దుంపలు మసిబొగ్గుల్లా ఉన్నాయి. కుక్కర్ కారు చీకటిలా ఉంది. ఇంకేముంది.. మా రూమ్మేట్ టిఫిన్ కోసం హోటల్‌కి పరుగుపెట్టాడు. మాడిన దుంపలను బయటకు విసిరేస్తే.. ఆశగా వచ్చిన కుక్క- తీరా వాటిని చూసి ఛీత్కారంగా ముఖం విదిలించింది. నేనేదో బాంబులు విసిరానన్నట్టు కోపంగా అరిచింది కూడా. ఈ సంగతి మా అమ్మకు చెబితే.. అక్షింతలు తప్పవని.. ఫోన్ జోలికి వెళ్లలేదు. చేతులు కడుక్కుని, రూమ్మేట్ తెచ్చిన పార్శిల్ తెరిచి పూరీలు డబ్బాలో సర్దుకుని ఆఫీసుకు బయల్దేరా. అన్నట్టు దుంపలు ఉడకడానికి ఎన్ని విజిల్స్ సరిపోతాయన్న సందేహం మాత్రం అలాగే ఉండిపోయింది. మీరైనా చెప్పండి!

– రామకృష్ణ సకలాబత్తుల, పలాస, కాశీబుగ్గ



వెల్లుల్లి పెరుగు పచ్చడి

పాఠక వంట



ఇడ్లీ, వడ, దోశ.. ఏ టిఫినైనా.. అందులోకి ఏదైనా చట్నీ ఉండాల్సిందే. ఎప్పుడూ చేసే పల్లీ లేదా కొబ్బరి పచ్చడికి బదులు వేగంగా తయారయ్యే వెల్లుల్లి పెరుగు పచ్చడి చేశారనుకోండి.. భిన్నంగా ఉంటుంది, సమయం ఎంతో కలిసొస్తుంది. ఇది ఆరోగ్యానికి వరం కూడా.

కావలసినవి: వెల్లుల్లి రెబ్బలు - గుప్పెడు, ఉప్పు - రుచికి తగినంత, తాజా పెరుగు - అర కప్పు, నూనె - 2 స్పూన్లు, ఆవాలు, మినప్పప్పు - అర స్పూన్ చొప్పున, ధనియాల పొడి - స్పూన్, కారం - ఒకటిన్నర స్పూన్లు

తయారీ: ముందుగా పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలను మరీ మెత్తగా కాకుండా కొంచెం కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పెరుగును బాగా గిలకొట్టాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నూనె కాగనిచ్చి.. ముందు ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు మినప్పప్పు వేయాలి. అది లేత గోధుమ రంగులోకి మారాక.. వెల్లుల్లి ముద్దను జోడించి.. మంచి సువాసన వచ్చే వరకూ వేయించాలి. అందులో ధనియాల పొడి, కారం, ఉప్పు జోడించి కొన్ని క్షణాలు వేయించాలి. తర్వాత గిలకొట్టిన పెరుగును జతచేసి కలియబెట్టాలి. నిమిషం తర్వాత అర కప్పు నీళ్లు పోసి అంతా కలిసేలా తిప్పాలి. ఇప్పుడు మూత పెట్టేసి.. నాలుగు నిమిషాలు ఉడికించాలి. నూనె పైకి తేలుతున్నప్పుడు సెగ తీసేయాలి. అంతే ఘుమఘుమలాడే రుచికరమైన వెల్లుల్లి పెరుగు పచ్చడి సిద్ధమైపోతుంది.

– ఆనంద మైత్రేయం, హైదరాబాద్

ఆరోగ్యాల ఉసిరి

పుల్లపుల్లటి ఆమ్లాతో వంటలు రుచిగానూ ఉంటాయి, ఔషధంగానూ పనిచేస్తాయి. ఉసిరితో ఊరగాయ, రోటిపచ్చడి, జామ్, జ్యూస్, మిఠాయి, సబ్జీ, రసం, రైతా, క్యాండీ, ఫ్రైస్, పులిహోర, చాయ్.. ఇలా ఎన్నెన్నో చేయొచ్చు. మీ కోసం మరికొన్ని వెరైటీలు..

ఆమ్లా ముఖ్వాస్

కావలసినవి: ఉసిరికాయలు - అర కిలో, అల్లం - 200 గ్రాములు, పంచదార పొడి - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - స్పూన్, ఛాట్ మసాలా - 2 స్పూన్లు

తయారీ: నాణ్యమైన, పెద్ద ఉసిరికాయలను ఎంచుకోవాలి. వాటిని కడిగి, తడి లేకుండా తుడిచి తురమాలి. అల్లం పొట్టు తీసి సన్నగా, పొడుగ్గా ముక్కలు కోసి.. ఉసిరి తురుములో కలపాలి. అందులో ఉప్పు, పంచదార పొడి, మిరియాల పొడి, ఛాట్ మసాలా జతచేసి కలియబెట్టాలి. ఈ పాత్రకు మూత పెట్టేసి.. రాత్రంతా అలా ఉంచేయాలి. ఉదయం వాటిని తీసి పళ్లెంలో పరిచినట్టుగా అమర్చి.. బాగా ఎండ తగిలేచోట ఉంచాలి. అవసరమైతే మర్నాడు కూడా ఎండబెట్టాలి. అంతే.. 'ఆమ్లా ముఖ్వాస్' తయారైపోతాయి.





గటాగట్

కావలసినవి: ఉసిరికాయలు - పావు కిలో, బెల్లం - పావు కిలో, మిరియాల పొడి, వాము - స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి - 2 స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, ఇంగువ - అర స్పూన్, ఆమ్‌చూర్ పౌడర్ - ముప్పావు స్పూన్, పంచదార పొడి - 2 స్పూన్లు

తయారీ: ఉసిరికాయల్లో కొన్ని నీళ్లు పోసి.. కుక్కర్‌లో రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. మిగిలిన నీళ్లను వార్చేసి.. గింజలు తీయాలి. వాటిని మిక్సీజార్‌లో వేసి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ఉసిరి ముద్దను కడాయిలో వేసి.. కొన్ని నీళ్లు, బెల్లం చేర్చి వేడిచేయాలి. రెండు మూడు నిమిషాల తర్వాత.. మిరియాల పొడి, వాము, జీలకర్ర పొడి, ఉప్పు, ఇంగువ, ఆమ్‌చూర్ పౌడర్ జోడించాలి. అడుగంటకుండా కలియతిప్పుతూ చిక్కబడే వరకూ ఉంచి.. సెగ తీసేయాలి. చల్లారాక.. చిన్న ఉండల్లా చేయాలి. వాటి మీద పంచదార పొడి చల్లితే ఒకదానికొకటి అంటుకోవు. ఇవి చిన్నా పెద్దా అందరికీ నచ్చేస్తాయి.

మురబ్బా



కావలసినవి: ఉసిరికాయలు - అర కిలో, తేనె - మూడు కప్పులు, కుంకుమ పువ్వు - కొద్దిగా, ఉప్పు - చిటికెడు, మిరియాల పొడి - ముప్పావు స్పూన్, డ్రై జింజర్ పౌడర్, యాలకుల పొడి - అర స్పూన్ చొప్పున

తయారీ: పక్వానికి వచ్చిన మంచి ఉసిరికాయలను కడిగి, తుడిచి.. ఫోర్క్‌తో దగ్గరదగ్గరగా, లోతుగా రంధ్రాలు చేసి.. పది నిమిషాలు ఉడికించాలి. ఆ నీళ్లు వార్చేసి.. ఐదు గంటలు ఎండబెట్టాలి. వాటిని తడి లేని సీసాలో వేసి.. తేనె పోయాలి. అందులో మిరియాల పొడి, కుంకుమ పువ్వు, ఉప్పు, డ్రై జింజర్ పౌడర్, యాలకుల పొడి జోడించాలి. సీసా మూత పెట్టేసి.. వస్త్రం చుట్టి ఎండలో ఉంచాలి. సాయంత్రం లోనికి తెచ్చి.. మర్నాడు మళ్లీ ఎండలో ఉంచాలి. ఇలా పది రోజులు ఎండబెడితే.. 'ఆమ్లా మురబ్బా' తయారవుతుంది. ఉసిరికాయలు ఉబ్బుతాయి కనుక.. లోపల కొంత ఖాళీ ఉండేలా పెద్ద సీసాను తీసుకోవాలి.

ఉసిరి కారం



కావలసినవి: ఉసిరికాయల తరుగు - 2 కప్పులు, ఎండుమిర్చి - 25 నుంచి 30 వరకూ, ఉప్పు - రుచికి తగినంత, శనగపప్పు - ఒక కప్పు, మినప్పప్పు - అర కప్పు, ఎండుకొబ్బరి తురుము - 2 కప్పులు, కరివేపాకు - ముప్పావు కప్పు, పసుపు - స్పూన్, నూనె - 3 స్పూన్లు, ఆవాలు - ఒకటిన్నర స్పూన్, జీలకర్ర - స్పూన్, ఇంగువ - పావు స్పూన్

తయారీ: ఉసిరి తురుమును అందులో ఉన్న చెమ్మ పోయే వరకూ సన్న సెగ మీద వేయించాలి. శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, కొబ్బరి, కరివేపాకులను విడివిడిగా వేయించాలి. పూర్తిగా చల్లారాక.. మిక్సీజార్‌లో వేసి.. గ్రైండ్ చేయాలి. అందులో ఉసిరి తురుము, ఉప్పు, పసుపు వేసి కలపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు జీలకర్ర, ఇంగువ వేయాలి. ఈ తాలింపును గ్రైండ్ చేసిన మిశ్రమంలో వేసి కలియబెట్టాలి. అంతే.. రుచికరమైన 'ఉసిరి కారం' సిద్ధం. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. వేడన్నంలో కాస్త కారం, కొద్దిగా నెయ్యి వేసుకుని తింటే సూపర్‌గా ఉంటుంది.

ఖట్టా మీఠా

కావలసినవి: ఉసిరికాయలు - ముప్పావు కిలో, ఉప్పు - రుచికి తగినంత, బెల్లం - అర కిలో, డ్రై జింజర్ పౌడర్ - ఒకటిన్నర స్పూన్, కారం, మిరియాల పొడి - స్పూన్ చొప్పున, నిమ్మరసం - ముప్పావు స్పూన్

తయారీ: ఉసిరికాయలను ఉడకబెట్టాలి. చల్లారాక.. గింజలు తీసేసి, తొనల్లా కోయాలి. బెల్లంలో పావు కప్పు నీళ్లు పోసి మరిగించాలి. అందులో ఉసిరితొనలు జతచేసి.. సన్న సెగమీద ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వాత... డ్రై జింజర్ పౌడర్, కారం, మిరియాల పొడి, నిమ్మరసం జోడించి కలియతిప్పాలి. ఇంకో మూడు నిమిషాలుంచి సెగ తీసేయాలి. పూర్తిగా చల్లారాక తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే.. రెండు మూడు వారాలు నిలవుంటుంది. తియ్యతియ్యగా కారంకారంగా ఉండే 'ఖట్టా మీఠా' ప్రత్యేక రుచితో వారెవా అనిపిస్తుంది.



క్రిస్పీ ఫ్రైడ్ ఓక్రా చేసేయండి!

చెఫ్ స్పెషల్



కరకరలాడే స్నాక్స్.. ముఖ్యంగా ఫ్రైడ్ ఓక్రా ఇష్టపడని వాళ్లు ఉండరు. కానీ అవి మనకు కుదరవు.. బయట దొరికేవే బాగుంటాయి- అనుకుంటారు. నిజానికి ఫ్రైడ్ ఓక్రా ఇంట్లోనూ సులువుగా చేసేయొచ్చు.

కావలసినవి: బెండకాయలు - అర కిలో; ఉప్పు - రుచికి తగినంత; వేయించిన పల్లీలు - పావు కప్పు; నిమ్మరసం - అర స్పూన్; డ్రై జింజర్ పౌడర్ - అర స్పూన్; కచ్చాపచ్చా దంచిన వెల్లుల్లి - 3 చెంచాలు; శనగపిండి - అర కప్పు; బియ్యప్పిండి - 3 టేబుల్ స్పూన్లు; కారం, జీలకర్ర, ధనియాల పొడులు - స్పూన్ చొప్పున; నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: బెండకాయలను కడిగి తడి లేకుండా తుడిచి కొంచెం పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. అందులో ఉప్పు, నిమ్మరసం వేసి కలపాలి. ఒక పాత్రలో శనగపిండి, బియ్యప్పిండి, కొన్ని నీళ్లు, జీలకర్ర, ధనియాల పొడులు, కారం, కచ్చాపచ్చా దంచిన వెల్లుల్లి, డ్రై జింజర్ పౌడర్ వేసి కలియబెట్టాలి. ఈ పిండిలో బెండకాయ ముక్కలు జోడించి మరోసారి కలిపి.. కాగుతున్న నూనెలో వేయించాలి. ఇందులో వేయించిన పల్లీలు జతచేయాలి. అంతే.. కరకరలాడే 'ఫ్రైడ్ ఓక్రా' తయారైపోతుంది.

తియ్యతియ్యటి పంచామృత్ చట్నీ



బీరకాయ, బెండకాయ, గోంగూర, కొత్తిమీర.. ఇలా కాయగూరలతో పచ్చళ్లు చేయడం మామూలే. కానీ 'పంచామృత్ చట్నీ' ఎప్పుడైనా తిన్నారా?!

ఈ ప్రత్యేకమైన చట్నీ కోసం... పల్లీలు, ఎండు కొబ్బరి, బెల్లం పొడి - అర కప్పు చొప్పున; నువ్వులు - పావు కప్పు; జీడిపప్పు, ఎండుద్రాక్ష - టేబుల్‌స్పూన్ చొప్పున; చింతపండు - నిమ్మకాయంత; ఉప్పు - రుచికి తగినంత; నూనె - 3 స్పూన్లు; ఆవాలు, కారం - స్పూన్ చొప్పున; కరివేపాకు - 2 రెబ్బలు; ఇంగువ - పావు స్పూన్; గోడా మసాలా - 2 స్పూన్లు; మెంతులు, పసుపు - అర స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే... ఎండు కొబ్బరి, పల్లీలు, నువ్వులను విడివిడిగా వేయించి గ్రైండ్ చేయాలి. చింతపండును వేడినీళ్లలో నానబెట్టాలి. పాత్రలో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు మెంతులు, కరివేపాకు, ఇంగువ, పసుపు, చింతపండు గుజ్జు, ఎండుద్రాక్ష, జీడిపప్పు, బెల్లం పొడి ఒక్కొక్కటిగా వేయాలి. అందులో కొబ్బరి, పల్లీలు, నువ్వుల మిశ్రమం, ముప్పావు కప్పు నీళ్లు చేర్చి ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వాత గోడా మసాలా, కారం, ఉప్పు వేసి కలియబెట్టి ఇంకో నిమిషం ఉంచి దించేయాలి. అంతే.. తియ్యతియ్యటి 'పంచామృత్ చట్నీ' తయారైపోతుంది.

చందన్ షర్బత్ తాగుదామా!

మనలో చాలామందికి గంధాన్ని పూజలు, శుభకార్యాల్లో ఉపయోగించడమే తెలుసు. కానీ దీంతో పానీయం కూడా చేస్తారు. చందన్ కాన్సన్‌ట్రేట్ తయారుచేసుకుంటే.. ఇన్‌స్టంట్ డ్రింక్‌గా సిద్ధంగా ఉంటుంది.



చందన్ షర్బత్ కోసం... పంచదార - కప్పు, ఎడిబుల్ శాండల్‌వుడ్ పౌడర్ - 2 టేబుల్ స్పూన్లు, కుంకుమపువ్వు - కొద్దిగా, యాలకుల పొడి - పావు చెంచా, నిమ్మరసం - టేబుల్ స్పూన్, రోజ్ వాటర్ - ఒకటిన్నర టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. సౌందర్య సాధనంగా ఉపయోగించేది కాకుండా తినదగ్గ గంధంపొడిలో అర కప్పు నీళ్లు చేర్చి ఉండలు కట్టకుండా కలిపి ఓ గంట నాననివ్వాలి. ఈలోగా పంచదారలో రెండు కప్పుల నీళ్లు చేర్చి కలియతిప్పుతూ మరిగించాలి. అందులో నిమ్మరసం జోడించి ఇంకో రెండు నిమిషాలుంచి సెగ తీసేయాలి. గంధపు నీళ్లను వడకట్టి పంచదార సిరప్‌లో పోయాలి. కుంకుమపువ్వు, యాలకుల పొడి కూడా జోడించి సన్న సెగ మీద ఏడెనిమిది నిమిషాలు ఉడికించి దించేయాలి. పూర్తిగా చల్లారాక రోజ్ వాటర్ కలపాలి. ఈ చిక్కటి పానీయాన్ని తడిలేని సీసాలో పోసి రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు నీళ్లు లేదా పాలల్లో కలిపి తాగొచ్చు. చందన్ పౌడర్ కొనడం ఇష్టం లేదంటే 50 గ్రాముల గంధపుచెక్కలను రాత్రంతా నానబెట్టి ఉదయం లీటరు నీళ్లలో ఉడికించి వడకట్టి.. చల్లారనిస్తే సరిపోతుంది. తక్కినదంతా పైన చెప్పిన విధానమే.

అరటి బొమ్మలివి!

చిత్రంగా..

రుచీ ఆరోగ్యాల గని అరటి. రోజుకొక పండు తింటే శరీరానికి అవసరమైన పోషకాలన్నీ అందుతాయి. పిల్లలు మాత్రం చిప్స్ లాంటి చిరుతిళ్లే కావాలంటారు గానీ పండ్లను పెద్దగా ఇష్టపడరు. వాళ్లకి నచ్చాలని అరటిపండ్లను ఇలా అందంగా మలిచి.. ప్లేట్లలో అమర్చారు. ముచ్చటగొల్పేలా ఉన్నాయి కదూ!






'అఖండ 2: తాండవం'

ఏడాదికి రెండు వందలకుపైగా సినిమాల్ని ఉత్పత్తి చేసే స్థాయి తెలుగు సినిమాది. నచ్చితే చాలు... చిన్న సినిమా, పెద్ద సినిమానా అనే తేడాని ఉండదు తెలుగు ప్రేక్షకుడికి. తెరపై కనిపించేది అగ్ర హీరోనా? కొత్త హీరోనా అనే పట్టింపు అసలే లేదు. అందుకే పొరుగు భాషల నుంచి వచ్చిన అనువాదాలతో సహా వారం వారం మన బాక్సాఫీస్ దగ్గర సినీ మారథాన్ కనిపిస్తుంది. గత శుక్రవారమైతే ఎనిమిది సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. ఎలా ఉంటున్నాయనేది పక్కనపెడితే... సినీ ప్రియుల కాలక్షేపానికి మాత్రం ఢోకాలేదు. వారం వారం కొత్త సినిమాలు ముచ్చట్లు బోలెడన్ని. ఈ ఏడాదిలో రానున్న శుక్రవారాలన్నీ కూడా కొత్త సినిమాలతో కళకళలాడనున్నాయి.

ఈనాడు సినిమా

కప్పు గెలిచాక కదిలిన 'చక్దా ఎక్స్‌ప్రెస్'!



దక్షిణాఫ్రికాను చిత్తుచేసి తొలిసారిగా మహిళల వన్డే ప్రపంచ కప్‌ను అందుకుంది మన భారత మహిళల జట్టు. ఇలాంటి అద్భుతమైన సమయంలో క్రికెట్ నేపథ్యంలో ఓ సినిమా వస్తే థియేటర్లలో ఆ సందడే వేరు కదా! ఇప్పుడలాంటి హంగామాకు 'చక్దా ఎక్స్‌ప్రెస్' చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. భారత దిగ్గజ మహిళా క్రికెటర్ ఝులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రమిది. బాలీవుడ్ నటి అనుష్క శర్మ ప్రధాన పాత్రలో ప్రోసిత్ రాయ్ తెరకెక్కించారు. చిత్రీకరణ పూర్తయిన ఈ సినిమా అనుకోని కారణాల వల్ల కొన్నేళ్లుగా విడుదలకు నోచుకోలేదు. ప్రస్తుతం మన భారతీయ అమ్మాయిలు ప్రపంచకప్ గెలిచిన నేపథ్యంలో ఝులన్ గోస్వామి బయోపిక్‌ను విడుదల చేయాలని నెట్టింట్లో ప్రేక్షకులు పోస్టులు పెడుతున్నారు. దీంతో ఈ సినిమా విడుదల కోసం నిర్మాతలు నెట్‌ఫ్లిక్స్‌తో చర్చలు చేస్తున్నట్లు సమాచారం.

నాయకుడి ఆట


మమితా బైజు, విజయ్, పూజా హెగ్డే

నాయకుడి ఆట మొదలైంది అంటూ రంగంలోకి దిగారు తమిళ హీరో విజయ్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జన నాయగన్'. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. మమితా బైజు కీలక పాత్రలో కనిపించనుంది. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా.. తాజాగా ఈ సినిమా మొదటి గీతాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేసింది చిత్రబృందం. 'దళపతి కచేరీ..' అంటూ సాగుతున్న ఈ పాటలో పూజ, మమితాతో కలిసి విజయ్ వేసిన స్టెప్పులు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అనిరుధ్ స్వరపరిచిన ఈ పాటని ఆయనతో కలిసి విజయ్ కూడా ఆలపించడం విశేషం. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

సందడి తగ్గేదే లే!

● వరుస కడుతున్న చిత్రాలు

నవంబరు సినిమాకి సరైన సీజన్ కాదనే వారు. సిద్ధమైన సినిమాల్ని విడుదల చేయడానికి వెనకాడేవారు నిర్మాతలు. డిసెంబరులోనేమో సంక్రాంతి ఫీవర్ మొదలైపోతుందని, సినిమాల్ని చూస్తారో లేదో అనే భయాలు వెంటాడేవి. దాంతో ఏడాది చివరికొచ్చేసరికి విడుదలల జోరు తగ్గిపోయేది. కానీ ఇప్పుడు అలాంటి భయాలకు చోటే లేదని చాటుతున్నారు సినీ ప్రేక్షకులు. సినిమా బాగుంటే చాలు... సీజన్‌తో పనేముంది అంటున్నారు. అందుకే గత కొన్నేళ్లుగా నవంబరు, డిసెంబరు నెలల్లోనూ సినిమాలు బాక్సాఫీస్ ముందుకు వరుస కడుతున్నాయి. 2025లోనూ అదే వరస.


'రాజు వెడ్స్ రాంబాయి'


'ఛాంపియన్'


'సంతాన ప్రాప్తిరస్తు'


'మోగ్లీ'


'శంబాల'


'ప్రేమంటే'

చిన్న, మధ్యస్థాయి సినిమాలే ఎక్కువ...


'మాస్ జాతర'తో నవంబరు నెల ఆరంభమైంది. అక్టోబరు 31నే ఆ చిత్రం విడుదలైనా ప్రభావం నవంబరుపైనే ఎక్కువగా ఉంటుందని బాక్సాఫీస్ అంచనా వేసింది. కానీ అవి నిజం కాలేదు. 'బాహుబలి: ది ఎపిక్' విడుదలైనా అది కూడా రీరిలీజ్ ఖాతాలోనే చేరింది. దాంతో నవంబరు తొలి శుక్రవారంపై దృష్టి పెట్టారు సినీ ప్రేమికులు. రష్మిక... 'ది గర్ల్‌ఫ్రెండ్', సుధీర్‌బాబు 'జటాధర'తోపాటు, 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' తదితర సినిమాలు 7వ తేదీన విడుదలయ్యాయి. తదుపరి శుక్రవారమైన 14వ తేదీ విడుదలయ్యే సినిమాల జాబితా కూడా చాలా పెద్దదే. పదికిపైగా సినిమాలొస్తున్నాయి. అందులో ప్రధానంగా 'సంతాన ప్రాప్తిరస్తు', 'కాంత', 'గత వైభవం'తోపాటు, రీరిలీజ్‌గా వస్తున్న 'శివ' చిత్రాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 21వ తేదీనేమో తొమ్మిది సినిమాలు విడుదల ఖరారు చేసుకున్నాయి. అందులో అల్లరి నరేశ్ కథానాయకుడిగా నటిస్తున్న '12ఏ రైల్వే కాలనీ', ఈటీవీ విన్ సమర్పణలో వస్తున్న 'రాజు వెడ్స్ రాంబాయి'తోపాటు, ప్రియదర్శి 'ప్రేమంటే' చిత్రాలు ప్రధానమైనవి. ఈ నెలలో అగ్ర హీరోల జోరు తక్కువే. చిన్న, మధ్యస్థాయి బడ్జెట్‌తో రూపొందిన సినిమాలే ఎక్కువ. 28న వస్తున్న రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలూకా' మాత్రమే ఈ నెల విడుదలల్లో కాస్త భారీగా కనిపిస్తున్న సినిమా.


'ఆంధ్ర కింగ్ తాలూకా'

బాలకృష్ణ తాండవం

డిసెంబరు నెల మాత్రం స్టార్ హంగామాతో షురూ కాబోతోంది. 5న బాలకృష్ణ 'అఖండ 2: తాండవం' విడుదల కానుంది. ఈ ఏడాదిని ముగించే అగ్ర హీరో సినిమా కూడా అదే కానుంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. 6న శర్వానంద్ కథానాయకుడిగా తెరకెక్కిన 'బైకర్' విడుదల కానుంది. అందులో సీనియర్ కథానాయకుడు రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. 12వ తేదీన రోషన్ కనకాల కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన 'మోగ్లీ' విడుదల కానుంది. 19న విడుదలయ్యే 'అవతార్ ఫైర్ అండ్ యాష్' ఈ నెల విడుదలల్లో మరో ప్రధానమైన ఆకర్షణ. క్రిస్మస్ సందర్భంగా 25వ తేదీన ఐదు సినిమాలు విడుదల ఖరారు చేసుకున్నాయి. అందులో వైజయంతీ మూవీస్ నుంచి రోషన్ కథానాయకుడిగా నటించిన 'ఛాంపియన్' ఒకటి కాగా, గుణశేఖర్ దర్శకత్వం వహించిన 'యుఫోరియా' మరొకటి. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన 'శంబాల'తోపాటు, 'పతంగ్', 'దండోరా' అనే చిత్రాలూ వస్తున్నాయి. సెప్టెంబరు, అక్టోబరు నెలలు తెలుగు సినిమాకి బాగా కలిసొచ్చాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో కూడా కథే బలంగా రూపొందిన సినిమాలు చాలానే కనిపిస్తున్నాయి. దాంతో స్టార్ కథానాయకుల చిత్రాలు తక్కువైనా, విజయాలు మాత్రం ఎక్కువే నమోదు కావొచ్చని సినీ వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.


'కాంత'



'బైకర్'

విజయ్‌నే పెళ్లి చేసుకుంటా!


రష్మిక

కథానాయిక రష్మిక విజయ పరంపర కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న అభినందనలు చూసి ఉప్పొంగిపోతోంది రష్మిక. ఈ ఆనందంలోనే ఆమె పెళ్లి పీటలెక్కేందుకూ సన్నద్ధమవుతోంది. వచ్చే ఫిబ్రవరిలోనే కథానాయకుడు విజయ్ దేవరకొండతో ఆమె వివాహం జరగనున్నట్టు సమాచారం. ఇటీవలే వివాహ నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే ఇప్పటివరకూ ఈ జంట తమ వివాహం గురించి ఎక్కడా మాట్లాడలేదు. ఇటీవల ఓ షోలో రష్మిక మందన్న ఓ ప్రశ్నకు బదులుగా విజయ్‌నే పెళ్లి చేసుకుంటా అని బదులిచ్చింది. డేటింగ్, పెళ్లిపై ఎదురైన ఓ సరదా ప్రశ్నకు రష్మిక మాట్లాడుతూ "యానిమేషన్ పాత్ర నరుటో అంటే నాకు చాలా ఇష్టం. నరుటోతో డేటింగ్ చేస్తా. పెళ్లి అంటే విజయ్‌నే పెళ్లి చేసుకుంటా" అని బదులిచ్చారు.

ప్రకృతిని ప్రేమిద్దాం


సమ్మెట గాంధీ

వన సంరక్షణ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'కలివి వనం'. రాజ్ నరేంద్ర తెరకెక్కించారు. రఘుబాబు, సమ్మెట గాంధీ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. నాగదుర్గ కథానాయికగా పరిచయం అవుతుంది. మల్లికార్జున్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి నిర్మాతలు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ.. "తల్లిదండ్రులు తమ పిల్లలకు చూపించాల్సిన సినిమా ఇది. ప్రకృతిని కూడా ప్రేమించాలన్న విషయం పిల్లలకి తెలియజేయాలనే ఉద్దేశంతో దీన్ని తెరకెక్కించాం" అని అన్నారు. ఈ నెల 21న రానుందీ చిత్రం.

సిద్ధార్థ వినోదం


యామిని, నందు

సాధారణమైన విషయాలకు కూడా ఎక్కువగా స్పందిస్తూ.. . ఆవేశం, నిరాశని వ్యక్తం చేసే ఓ యువకుడి కథతోనే 'సైక్ సిద్ధార్థ' చిత్రం తెరకెక్కింది. సిద్ధార్థ ఎందుకలా తయారయ్యాడు? అతను జీవితంలో ఏమేం పోగొట్టుకున్నాడో తెలియాలంటే డిసెంబరు 12న విడుదలయ్యే ఆ సినిమాని చూడాల్సిందే. శ్రీనందు కథానాయకుడిగా, వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. యామిని భాస్కర్ కథానాయిక. శ్యామ్ సుందర్‌రెడ్డి తుడితో కలిసి శ్రీనందు నిర్మించారు. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా మార్కెటింగ్ చేస్తున్న ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విడుదల కానుంది. టీజర్ విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "కథకి తగ్గ పేరు ఇది. అన్నీ పోగొట్టుకున్న యువకుడిగా కనిపించే నందు పాత్ర చాలా మందికి కనెక్ట్ అవుతుంది" అన్నారు.

ఆ సమస్యని వినోదంతో చెప్పాం



"ఒక నిజాన్ని హాస్య ప్రధానంగా చెప్పామంటే అది మృదువుగా ప్రేక్షకులకు చేరువవుతుందని నేను బలంగా నమ్ముతా. సంతానలేమి సమస్య వెనుక ఉన్న నిజాల్ని... ఎన్నో అపోహల్ని మా సినిమాతో అదే తరహాలో చెప్పే ప్రయత్నం చేశాం" అన్నారు సంజీవ్ రెడ్డి. 'ఏబీసీడీ'తో దర్శకుడిగా పరిచయమైన ఆయన ఇటీవల విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రాన్ని తెరకెక్కించారు. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సంజీవ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

◆ "సంతాన లేమి సమస్యని స్పృశించిన సినిమాలు చాలానే వచ్చాయి. వీర్యకణాలు తక్కువగా ఉన్న కథానాయకుడు మన తెలుగు తెరపై ఇప్పటిదాకా కనిపించలేదు. మన సమాజంలో ఇలాంటి విషయాల్ని బయటకు మాట్లాడుకోవడాకే ఇబ్బంది పడుతుంటాం. ఇది నాలుగ్గోడల మధ్య మాత్రమే మాట్లాడుకునే సమస్య కాదు, అందరూ అవగాహన పెంచుకోవాలనే ఈ కథ రాశా. ఇలాంటి సమస్యని సీరియస్‌గా చర్చిస్తే భయపడతారు. అలాగని తమాషాగా చూపించే సమస్య కూడా కాదు. భావోద్వేగాలతో ముడిపడిన ఆ సమస్యని గౌరవిస్తూనే, దాని చుట్టూ జరిగే పరిణామాల్ని హాస్యం ప్రధానంగా చూపిస్తూ ఈ సినిమాని తెరకెక్కించాం".

◆ "సున్నితమైన ఇలాంటి కాన్సెప్ట్‌లను స్పృశిస్తున్నప్పుడు ఎక్కడా హద్దు దాటకూడదు. ఆ విషయంలో నేను, మా రచయితలు షేక్ దావూద్, కల్యాణ్‌రాఘవ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటూ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశాం".

పహల్గామ్‌లో చిత్రీకరణ


రాగ్ మయూర్

'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రాగ్ మయూర్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలకా ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని కీలకమైన సన్నివేశాల చిత్రీకరణని కశ్మీర్‌లోని పహల్గామ్, శ్రీనగర్ ప్రాంతాలలో పూర్తిచేశారు. "ఈ ఏడాదిలో పహల్గామ్ దుర్ఘటన తర్వాత చిత్రీకరించిన తొలి చిత్రమిది. భద్రతా నియమాలు పాటిస్తూ 20రోజుల పాటు చిత్రీకరణ చేశామ"ని చిత్రవర్గాలు తెలిపాయి.

ఈ విజయం స్ఫూర్తితో మరిన్ని సహజమైన కథలొస్తాయి!


తిరువీర్, టీనా

'బలగం' తర్వాత మళ్లీ అలాంటి అనుభూతిని పంచిన చిత్రం 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అని... ఇలాంటి చిత్రాలు విజయవంతమైతే కొత్తతరానికి మరిన్ని అవకాశాలు వస్తాయన్నారు దర్శకుడు, రచయిత బి.వి.ఎస్.రవి. ఆయన ముఖ్య అతిథిగా శనివారం హైదరాబాద్‌లో 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' విజయోత్సవం జరిగింది. తిరువీర్ కథానాయకుడిగా, రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. సందీప్ అగరం, అస్మిత రెడ్డి నిర్మించారు. ఇటీవలే విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో తిరువీర్ మాట్లాడుతూ "ఒక చిన్న గదిలోనే ఈ సినిమా పనులన్నీ జరిగాయి. ఈ ప్రయాణంలో మేం ఆర్థికంగా చాలా కష్టాలుపడ్డాం. కానీ విడుదల తర్వాత ప్రతి ఒక్కరూ సినిమా బాగుందని చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే సినిమాకి ఆదరణ దక్కుతోంది" అన్నారు. దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ "ఇలాంటి కథలు థియేటర్లో ఆడవేమో అనే సందేహం ఉండేది. కానీ ప్రేక్షకులు మాత్రం పెద్ద విజయాన్ని కట్టబెట్టారు. ఈ స్ఫూర్తితో సహజత్వంతో కూడిన ఇలాంటి కథల్ని చేసేందుకు మరికొంతమంది దర్శకులు ముందుకొస్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో టీనా శ్రావ్య, యామిని, నరేంద్ర రవి, రోహన్ రాయ్, జోగారావు తదితర తారాగణంతోపాటు, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి, ఎడిటర్ నరేశ్, సౌండ్ డిజైనర్ అశ్విన్, గీత రచయిత సనారె తదితర చిత్రబృందం పాల్గొంది.

కార్తిక్ కొత్త చిత్రంలో లాపతా లేడీ


ప్రతిభా రంతా

కిరణ్‌రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్' చిత్రంలో పుష్ప రాణి పాత్రతో ప్రేక్షకుల్ని అలరించింది నటి ప్రతిభా రంతా. తాజాగా ఆమె కార్తిక్ ఆర్యన్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'నాగ్జిల్లా' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోన్నట్లు తెలుస్తోంది. మృగ్‌దీప్ సింగ్ లాంబా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని ధర్మ ప్రొడక్షన్స్, మహావీర్ జైన్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇటీవలే కార్తిక్ ఆర్యన్ ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాడు. "ప్రతిభ... మాడాక్ ఫిల్మ్స్‌లో ఓ చిత్రాన్ని చేయనుంది. అది వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. ఇప్పుడామె కార్తిక్ సరసన 'నాగ్జిల్లా'లో నటిస్తుంది. ఈ సినిమా కోసం నిర్మాతలు తొలుత సన్యా మల్హోత్రాను ఎంపిక చేసినప్పటికీ.. ప్రతిభాని ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిత్రబృందం త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంద"ని చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం. ఈ సినిమా వచ్చే ఏడాది ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ప్రతిభా.. నిఖిల్ అద్వానీ దర్శకత్వంలో తదుపరి 'ది రివల్యూషనరీస్' సిరీస్‌తో త్వరలోనే ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని పలకరించనుంది.

'జూటోపియా' ప్రపంచంలోకి శ్రద్ధ


శ్రద్ధా కపూర్

ఎన్నో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించిన బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్.. ఇప్పుడు మరో కొత్త పాత్రలోకి అడుగు పెట్టబోతుంది. మరి ఆమె ఆ పాత్రతో సందడి చేసేది తెరపై అనుకుంటున్నారా? కాదు.. ఆమె హంగామా అంతా తెర వెనుకే. ప్రముఖ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ స్టూడియోలో రూపొంది పిల్లలతో పాటు పెద్దల్నీ విశేషంగా ఆకట్టుకుంది 'జూటోపియా' చిత్రం. దీనికి సీక్వెల్‌గా రెండో భాగం వస్తున్న సంగతి తెలిసిందే. వాల్ట్ డిస్నీలో రాబోతున్న 64వ యానిమేషన్ చిత్రమిది. తాజాగా హిందీలో జూడీ హాప్స్ పాత్రకు శ్రద్ధ తన గాత్రాన్ని అందించనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది నిర్మాణ సంస్థ. "అద్భుతమైన నటి శ్రద్ధా కపూర్ 'జూటోపియా 2' కుటుంబంలో చేరడం ఉత్సాహంగా ఉంది" అనే వ్యాఖ్యను జోడించింది. జూరెడ్ బుష్, బైరన్ హోవార్డ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 28న పలు భాషల్లో విడుదల కానుంది.

ఒక్క రోజులో ఆరుగురి కథ


మేఘాలయ సీఎం కె.సంగ్మా, వేణు

మేఘాలయలోనే పూర్తిగా చిత్రీకరణ చేసుకోనున్న తొలి చిత్రంగా మా 'బా బా బ్లాక్‌షీప్' నిలుస్తుందని చెప్పారు వేణు దోనేపూడి. ఆయన చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రమిది. టిను ఆనంద్, ఉపేంద్ర లిమయే, జార్జ్ మరియన్, రాజా రవీంద్ర, అక్షయ్ లఘుసాని కీలక పాత్రలు పోషిస్తున్నారు. గుణి మంచికంటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం మేఘాలయలో ఎప్పుడూ వర్షం కురుస్తూ ఉండే సోహ్రా ప్రాంతంలో చిత్రీకరణ చేస్తున్నట్టు నిర్మాత తెలిపారు. "ఒక్క రోజులో... ఆరుగురి మధ్య సాగే ఆసక్తికరమైన కథ ఇది. ఈ కథలోనే అందం ఉంది. జలపాతాలు, కొండలు, అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించాల్సి రావడంతో మేఘాలయని ఎంచుకున్నాం. చిత్రం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె.సంగ్మా ఇటీవలే మా సెట్‌ని సందర్శించి అభినందనలు చెప్పారు" అని నిర్మాత తెలిపారు. విష్ణు ఓ.ఐ, కార్తికేయ దేవ్, కశ్యప్, విస్మయ, మాల్వి మల్హోత్రా, సమృద్ధి కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

రాహుల్ దుకాణం మూతపడుతుంది

- బిహార్‌లో ఇండియా కూటమి ఓటమి ఖాయం
- ఎన్డీయేకు 160 సీట్లకు పైగా వస్తాయి: అమిత్ షా



బిహార్‌లోని సుపాల్‌లో ఎన్నికల ప్రచార సభలో నేతలు బహూకరించిన గదతో అమిత్ షా

పూర్ణియా: బిహార్ శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దుకాణం మూత పడుతుందని, విపక్ష ఇండియా కూటమి తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పటికే సగం రాష్ట్రంలో ఆ కూటమికి తలుపులు మూసేశారని, 160కి పైగా సీట్లు గెలుచుకుని ఎన్డీయే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. శనివారం బిహార్‌లోని పూర్ణియా, కటిహార్, సుపాల్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. రాహుల్, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ కలిసి బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతాన్ని నరకప్రాయం చేశారని, అక్రమ వలసదారుల్లో ప్రతి ఒక్కర్నీ కేంద్రం గుర్తించి.. వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించి.. వెనక్కి పంపడం ఖాయమని పేర్కొన్నారు.

లాలూలా స్కాంలు మోదీ చేయలేరు

ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరి కుంభకోణాలను ప్రధాని మోదీ చేయలేరని అమిత్‌షా చురకలంటించారు. 'లాలూ రైల్వేల్లో చేసిన అవినీతిని దేశం మరచిపోలేదు. కానీ మోదీ ప్రజల కోసం పనిచేస్తున్నారు, దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు' అని తెలిపారు.

ఆర్జేడీ, కాంగ్రెస్‌కు 65 వోల్టుల షాక్

- తొలి దశ పోలింగ్ శాతం చూసి మహాగఠ్‌బంధన్‌కు నిద్ర పట్టడం లేదు
- బిహార్ ఎన్నికల సభలో మోదీ

సీతామఢీ/బేతియా: బిహార్ శాసనసభ తొలి దశ పోలింగ్ శాతాన్ని చూసి ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమికి 65 వోల్టుల షాక్ తగిలిందని, వారు ప్రస్తుతం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సీతామఢీ, బేతియాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో మోదీ శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాగఠ్‌బంధన్ అధికారంలోకి వస్తే బిహార్‌లో తుపాకుల రాజ్యం వస్తుందని ఓటర్లను హెచ్చరించారు. ఎన్డీయే విజయం ఖాయమన్న ధీమాను వ్యక్తంచేశారు. తొలి దశలో 65 శాతానికి పైగా పోలింగ్ నమోదవ్వడంతో విపక్షాలకు 65 వోల్టుల షాక్ తగిలిందని అన్నారు. రెండో దశ ఓటింగ్‌లో తొలి దశ రికార్డును బద్దలుకొట్టాలని పిలుపునిచ్చారు. "బిహార్‌లో తుపాకీతో వచ్చి హ్యాండ్సప్ అని చెప్పడం ఫ్యాషన్‌గా ఉండేది కదా. రాష్ట్రంలో అలాంటివారికి ఇప్పుడు స్థానం లేదు. బిహార్‌లో స్టార్టప్‌ల గురించి కలలు కనేవారు కావాలి. హ్యాండ్సప్ చెప్పేవాళ్లు వద్దు. మేం పిల్లల చేతికి పుస్తకాలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఇస్తున్నాం. ఆర్జేడీ మాత్రం యువతకు రివాల్వర్లు, డబుల్ బ్యారెల్ గన్లు ఇవ్వడం గురించి మాట్లాడుతోంది" అని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపల వేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులో దిగడంపై ప్రధాని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. చేపలను చూడటానికి పెద్ద పెద్దవాళ్లు వస్తున్నారని.. వారంతా బిహార్ ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు.

మోదీ సామ్రాజ్యంపై మా యుద్ధం: ప్రియాంక



కటిహార్: ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై మహాత్మా గాంధీ చేసిన పోరాటమే తాము ఇప్పుడు నరేంద్ర మోదీ సామ్రాజ్యంపై చేస్తున్నామని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ అన్నారు. కటిహార్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడారు. "ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటిని తన ఇద్దరు కార్పొరేట్ స్నేహితులకే అప్పగిస్తున్నారు. ఆయన కట్టా (నాటు తుపాకీ) వంటి పదాలను ఉపయోగించి, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అంటూ దుయ్యబట్టారు. కట్టా వంటి పదాలను ఉపయోగిస్తూ.. తన హోదాకు తగినట్లు ప్రధాని మోదీ ప్రవర్తించడం లేదని విమర్శించారు. ఓవైపు అహింసకు నిలయమైన 'వందేమాతరం'ను కీర్తిస్తూనే, మరోవైపు నాటు తుపాకీల గురించి ప్రధాని మాట్లాడటాన్ని తప్పుబట్టారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధిస్తుందని మోదీ, అమిత్ షా చేస్తున్న ప్రకటనలు గాలికబుర్లుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొట్టివేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ 400కు పైగా స్థానాలు గెలుచుకుంటామని చెప్పారని.. మెజారిటీ దాటలేకపోయారని పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా వందేమాతరం వేడుకలు..!

వాషింగ్టన్: భారతదేశ జాతీయ గేయమైన వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు సామూహిక, సాంస్కృతిక ప్రదర్శనలతో దేశ ఐక్యత భావాన్ని చాటిచెప్పారు. వాషింగ్టన్‌లో భారత సంతతికి చెందిన విద్యార్థులు చేసిన సామూహిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఒట్టావాలో హై కమిషనర్ దినేష్ కె.పట్నాయక్ నేతృత్వంలో ప్రవాస భారతీయులు, అధికారులు సామూహికంగా 'వందేమాతర గేయాన్ని' ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఒడిస్సీ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దోహా(ఖతార్), రియాద్(సౌదీ అరేబియా), కాన్‌బెరా(ఆస్ట్రేలియా), లండన్(ఇంగ్లండ్)లలోనూ ఈ తరహా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేపాల్, పెరూ, చిలీ, అర్జెంటీనా, కొలంబియా, దుబాయ్, సింగపూర్, దక్షిణాఫ్రికా మొదలైన దేశాల్లోనూ వేడుకలు జరిగాయి.



వారణాసిలో వందేభారత్ రైలును ప్రారంభించిన అనంతరం లోకో పైలట్లతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ ✦ రైల్లో విద్యార్థులతో మాటామంతి

ఓటుచోరీ ఆరోపణలు నిరాధారం: రాజ్‌నాథ్

సాసారాం: ఓటుచోరీ జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమైనవని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తోసిపుచ్చారు. దీనికి సంబంధించి ఏమైనా ఆధారాలుంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని సూచించారు. బిహార్‌లోని రోహ్‌తాస్, కైమూర్‌లలో శనివారం ఎన్నికల ప్రచార సభల్లో రాజ్‌నాథ్ ప్రసంగించారు. కాంగ్రెస్ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, అందుకే ఆ పార్టీ నేత అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై రాహుల్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ వర్గాల నుంచి ఒకరిని లోక్‌సభ విపక్షనేతగా నియమించి ఉండాల్సిందని అన్నారు. మనదేశం ఎంతమాత్రం బలహీనమైనది కాదని స్పష్టంచేశారు. ఉగ్రవాదులు దాడులుచేస్తే బలంగా బదులిస్తామని, మనంతట మనం ఎవరినీ కవ్వించబోమని చెప్పారు.

రోడ్డుపక్కన వీవీప్యాట్‌లు..ఎన్నికల అధికారి సస్పెన్షన్

సమస్తీపుర్: బిహార్‌లోని సమస్తీపుర్ జిల్లాలో సరైరంజన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రోడ్డుపక్కన ఎద్దఎత్తున వీవీప్యాట్‌లు పడిఉండటం కలకలం రేకెత్తించింది. దీంతో అక్కడి సహాయ రిటర్నింగ్ అధికారిని శనివారం సస్పెండ్ చేశారు. ఒక కళాశాల పక్కన పడిఉన్న స్లిప్పుల గురించి వీడియో వైరల్ అయిన తర్వాత ఈసీ స్పందించింది. ఆ స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఇవి నమూనా పోలింగులో వచ్చిన స్లిప్పులని, పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేవని అధికారులు చెబుతున్నారు.

అంగోలాకు రాష్ట్రపతి ముర్ము



దిల్లీ: ఆఫ్రికాలోని అంగోలా, బోట్స్‌వానా దేశాల్లో ఆరు రోజులపాటు భారత రాష్ట్రపతి ముర్ము పర్యటించనున్నారు. ఈ నెల 11 తేదీ వరకు పర్యటన కోసం అంగోలాకు చేరుకున్నారు. 11-13 తేదీల్లో బోట్స్‌వానాలో ఆమె పర్యటించనున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంగోలా అధ్యక్షుడు జోవో మాన్యుయెల్, బోట్స్‌వానా అధ్యక్షుడు డ్యుమా బొకోలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని పేర్కొంది. ఆ దేశాల పార్లమెంటులో ప్రసంగించడంతో పాటు, అక్కడి భారతీయులతో ముర్ము ముచ్చటిస్తారని తెలిపింది. అంతేకాకుండా అంగోలా 50వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొననున్నారు.

ట్రంప్ దూకుడుకు జడ్జి అడ్డుకట్ట

- పోర్ట్‌ల్యాండ్ నగరానికి అనవసరంగా సైన్యాన్ని పంపారని వెల్లడి

పోర్ట్‌ల్యాండ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోర్ట్‌ల్యాండ్ నగరానికి నేషనల్ గార్డ్ సైనికులను చట్ట విరుద్ధంగా పంపారనే వాదనలతో ఒరెగాన్ రాష్ట్రంలోని జిల్లా కోర్టు జడ్జి కరిన్ ఇమ్మర్ గట్ శుక్రవారం ఏకీభవించారు. ఆమె ట్రంప్ నియమించిన న్యాయమూర్తే కావడం గమనార్హం. ట్రంప్ అనుసరిస్తోన్న విధానానికి నిరసనగా పోర్ట్‌ల్యాండ్ నగరంలోని వలసలు, కస్టమ్స్ వ్యవహారాల శాఖ భవనం ముందు జూన్‌లో 20-30 మంది శాంతియుతంగా ప్రదర్శన చేశారు. అయితే, ట్రంప్ దానిని అతిగా చిత్రీకరిస్తూ.. పోర్ట్‌ల్యాండ్ నగరం యుద్ధంలో చిక్కుకుందనీ, అక్కడ మంటలు రేగుతున్నాయని పేర్కొంటూ సైనికులను పంపారు. ట్రంప్ చెప్పిన దానికీ, అక్కడి వాస్తవ పరిస్థితులకూ పొంతనేలేదని జడ్జి ఇమర్ గట్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ చట్ట నిబంధనల ప్రకారం.. తిరుగుబాటు, లేదా తిరుగుబాటు యత్నం జరిగితేనే సైనికులను రంగంలోకి దించాలి. అలాంటిదేమీ లేకున్నా నేషనల్ గార్డ్ దళాలను ట్రంప్ దుర్వినియోగపరిచారని పోర్ట్‌ల్యాండ్ నగర పాలక సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరులో దావా వేశాయి. దాన్ని జడ్జి ఇమర్ గట్ అంగీకరించి నేషనల్ గార్డ్స్‌ను పంపకుండా నిరోధించారు. ప్రతిపక్ష డెమోక్రాట్ల ఏలుబడిలోని షికాగో వంటి నగరాలపైనా ట్రంప్ కత్తిదూశారు. ఆ నగరాలూ ఆయనపై దావాలు వేశాయి.

వచ్చేవారం భూటాన్‌లో పర్యటించనున్న మోదీ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల అధికార పర్యటన కోసం మంగళవారం భూటాన్ బయలుదేరి వెళ్తారు. ఆయన పర్యటన భారత్- భూటాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. ఇరు దేశాలూ సంయుక్తంగా అభివృద్ధిపరచిన జల విద్యుత్ ప్రాజెక్టును మోదీ ఈ సందర్భంగా ప్రారంభిస్తారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా మోదీ భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్, భూటాన్ ప్రధాని త్షెరింగ్ టోబ్గేలతో అనేక అంశాలపై చర్చలు నిర్వహిస్తారు. భూటాన్ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జయంతి ఉత్సవాల్లో మోదీ పాల్గొంటారు. ఈ పర్యటన ఇరుదేశాల ప్రత్యేక స్నేహ సంబంధాలను, సహకారాన్ని మరింత పటిష్ఠపరుస్తుందని విదేశాంగ శాఖ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.



బిహార్‌లోని బోధ్‌గయా మహాబోధి ఆలయంలో శనివారం పూజలు చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఆఫ్రికా నుంచి మరో 8 చీతాలు రాక

భోపాల్: దక్షిణాఫ్రికాలోని బోట్స్‌వానా నుంచి భారత్‌కు మరో ఎనిమిది చీతాలు రానున్నాయి. వీటిలో రెండు మగ చీతాలు ఉన్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. వీటిని మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కుకు జనవరిలో తరలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే మూడో బ్యాచ్ చీతాల కోసం అవసరమైన ఏర్పాట్లను చేశామన్నారు. గురువారం కునో జాతీయ పార్క్, గాంధీసాగర్ అభయారణ్యాన్ని (జీఎస్‌డబ్ల్యూఎస్) దక్షిణాఫ్రికా బృందం పరిశీలించింది. చిరుత ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు దేశంలో 27 చీతాలు ఉన్నాయి. వీటిలో 16 భారత్‌లో జన్మించాయి.

జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వాడా జిల్లాలో నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంబడి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని సైన్యం భగ్నం చేసింది. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు శనివారం తెలిపారు.

మాలీలో ఐదుగురు భారతీయుల కిడ్నాప్

ఇంటర్నెట్‌డెస్క్: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలీలో ముష్కరులు ఐదుగురు భారతీయులను కిడ్నాప్ చేశారని అక్కడి భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. కోబ్రీ సమీపంలో విద్యుదీకరణ ప్రాజెక్టులకు సంబంధించి స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్న వారిపై గురువారం కొందరు దుండగులు ఆకస్మాత్తుగా దాడిచేసి ఐదుగురు భారతీయులను అపహరించినట్లు వివరించాయి. ఈ క్రమంలో కంపెనీలో పనిచేసే మిగతా భారతీయులను రాజధాని బమాకోకి తరలించినట్లు వెల్లడించాయి. వీరి కిడ్నాప్‌ను కంపెనీ ప్రతినిధులు కూడా ధ్రువీకరించారు. అయితే, బాధితుల వివరాలు మాత్రం వెల్లడికాలేదు.

పంజాబ్‌లో సీనియర్ ఎస్పీ సస్పెన్షన్: ఈసీ

చండీగఢ్: పంజాబ్‌లో అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో తరన్‌తారన్ సీనియర్ ఎస్పీ రవ్‌జోత్ కౌర్ గ్రేవాల్‌ను సస్పెండ్ చేస్తూ ఎన్నికల కమిషన్(ఈసీ) శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఆమె స్థానంలో అమృత్‌సర్ పోలీసు కమిషనర్ గురుప్రీత్ సింగ్ భుల్లర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ప్రకటనలో పేర్కొంది. ఉప ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి ప్రచారం చేసుకోనివ్వకుండా సీనియర్ ఎస్పీ రవ్‌జోత్ కౌర్ అడ్డుపడుతున్నారని శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్బీర్ సింగ్ బాదల్ ఫిర్యాదు చేయడంతో ఈసీ ఈ చర్య తీసుకుంది.

పాక్ అణుకేంద్రంపై దాడికి ఇందిరాగాంధీ అంగీకరించలేదు

- అనుమతించి ఉంటే చాలా సమస్యలు పరిష్కారమయ్యేవి
- సీఐఏ మాజీ అధికారి రిచర్డ్ బార్లో

ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్‌లోని కహూటా అణుస్థావరంపై 1980లో భారత ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా దాడి జరిపేందుకు సంబంధించిన ప్రతిపాదనకు అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అనుమతించలేదని అమెరికా గూఢచార సంస్థ సీఐఏ మాజీ అధికారి రిచర్డ్ బార్లో వెల్లడించారు. ఇందిరాగాంధీ దాడికి అనుమతించకపోవడం సిగ్గుచేటని ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇందిర ఆనాడు ఇజ్రాయెల్‌తో కలిసి దాడి చేయడానికి అంగీకరించి ఉంటే అనేక అణు సమస్యలు పరిష్కారమయ్యేవని ఆయన అన్నారు. 1980 దశకంలో భారత్ అలీన విదేశాంగ విధానాన్ని అనుసరించేది. ఈ విధానం కింద అరబ్బు దేశాలకు పూర్తి మద్దతునిస్తూ ఇజ్రాయెల్‌కు దూరంగా ఉండేది. సైనిక గూఢచర్యం విషయంలో మాత్రం భారత్- ఇజ్రాయెల్‌లు రహస్య సంబంధాలను కొనసాగించేవి. అప్పట్లో అమెరికా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు పలికేది. ఏక్యూ ఖాన్ నేతృత్వంలో పాకిస్థాన్ అణ్వాయుధాలు రూపొందిస్తోందన్న సమాచారం తెలిసీ అమెరికా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రిచర్డ్ బార్లో మరో ఇంటర్వ్యూలో తెలిపారు. పాకిస్థాన్‌లోని కహూటా న్యూక్లియర్ ప్లాంట్‌పై వైమానిక దాడులు నిర్వహించేందుకు ఇండియా, ఇజ్రాయెల్ ప్రణాళికలు వేసినట్లు కొన్ని నివేదికలు, కథనాల ప్రకారం అవగతం అవుతోంది. పాక్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా, వాటిని ఇతర దేశాలకు అందించకుండా చూడటం నాటి ప్రతిపాదిత దాడి లక్ష్యం. పాకిస్థాన్ నుంచి తన బద్ధశత్రువైన ఇరాన్‌కు అణ్వాయుధాలు అందకుండా చేయాలన్నది ఇజ్రాయెల్ లక్ష్యం. అయితే ఆ కోవర్ట్ ఆపరేషన్‌కు నాటి ప్రధాని ఇందిరాగాంధీ అంగీకారం తెలపలేదని తనకు తెలిసిందని రిచర్డ్ బార్లో పేర్కొన్నారు.

దేశ ఆర్థిక విధానాల్లో జోక్యం చేసుకోబోం

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

దిల్లీ: సుప్రీంకోర్టు ఎప్పుడూ చట్టబద్ధ పాలనకు సంరక్షకురాలిగా వ్యవహరిస్తూ వస్తోందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘనలకు గురైనప్పుడు తప్ప ఆర్థిక రంగంలోని విధానపరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టంచేశారు. స్టాండింగ్ ఇంటర్నేషనల్ ఫోరం ఆఫ్ కమర్షియల్ కోర్ట్స్ సమావేశంలో సీజేఐ మాట్లాడారు. 'పన్నుల విధింపు, పునర్వ్యవస్థీకరణలో రాజ్యానికి ఉన్న అధికారాన్ని గుర్తిస్తున్నాం. అదే సమయంలో వారి చర్యలు రాజ్యాంగానికి లోబడి ఉండాలని ఆశిస్తాం. ఆర్థిక, వ్యాపార వ్యవహారాల్లో పారదర్శకత, సమగ్రత ఉండేలా చూడటంతో పాటు కార్పొరేట్ వ్యవస్థను, చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని ఎవరైనా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారా అనే అంశాలపైనే న్యాయస్థానాల దృష్టి ఉంటుంది. ఆర్థికపరమైన స్వేచ్ఛ, నిబంధనల అమలు మధ్య సమతూకానికే అధిక ప్రాధాన్యం ఇస్తాం' అని సీజేఐ నొక్కి చెప్పారు. కాలయాపన లేకుండా వివాదాలను పరిష్కరించడం, బాధ్యత తీసుకోవడం.. దేశ ఆర్థిక రంగ పురోగతికి అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజస్థాన్ ప్రమాదం కేసును సుమోటోగా చేపట్టిన సుప్రీంకోర్టు

దిల్లీ: రాజస్థాన్‌లోని ఫలోడిలో 15 మంది భక్తుల మృతికి కారణమైన ప్రమాదం కేసును సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు చేపట్టింది. భారత్ మాల రహదారిపై భక్తులతో వెళుతున్న మినీ వ్యాను మాతోడా గ్రామ సమీపంలో నిలిచి ఉన్న ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. ఈ కేసు సోమవారం జస్టిస్ జె.కె.మహేశ్వరీ, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

పుణె భూకుంభకోణం కేటాయింపు రద్దు కావాలంటే రూ.42 కోట్లు చెల్లించాలి

- అమేడియా సంస్థకు తెలిపిన రిజిస్ట్రేషన్ల శాఖ

పుణె: మహారాష్ట్రలోని పుణె నగరంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన సంస్థకు రూ 1800 కోట్లు విలువ చేసే భూమిని రూ 300 కోట్లకే అప్పగించేసిన కేసు మరో మలుపు తిరిగింది. తన కుమారునికి చెందిన అమేడియా ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి సంస్థకు కేటాయించిన భూమిని రద్దు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రకటించినా ఆ భూ కేటాయింపును రద్దు చేయాలంటే సదరు సంస్థ రూ.42 కోట్ల డబుల్ స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుందని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ అంటోంది. అమేడియా సంస్థకు కేటాయించిన ఆ స్థలంలో డేటా సెంటర్ నిర్మిస్తామని పేర్కొంటూ సంస్థ స్టాంప్ డ్యూటీ మినహాయింపు పొందింది. ఇప్పుడు భూమి కేటాయింపును రద్దు చేయాలంటే ఆ సంస్థ మహారాష్ట్ర స్టాంపు చట్టం కింద 5 శాతం, స్థానిక సంస్థల పన్ను పన్ను 1 శాతం, 1 శాతం మెట్రో సెస్సు మొత్తంగా 7 శాతం స్టాంప్ డ్యూటీ చెల్లించాలి. మరోవైపు ఈ వ్యవహారంపై తాజాగా అజిత్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది ప్రభుత్వానికి చెందిన భూమి అని తన కుమారుడికి తెలియదన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో రూ. 300 కోట్ల భూ కేటాయింపులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఈ అంశంపై విచారణకు ఆదేశించడాన్ని ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ సమర్థించారు.

రూ.200 కోట్ల విలువైన భూమి రూ.3 కోట్లకే

- మహారాష్ట్రలో మరో భూకుంభకోణం!

పుణె: మహారాష్ట్రలో మరో భూకుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ.200 కోట్ల విలువైన నాలుగెకరాల భూమిని.. రూ.3 కోట్లకే దక్కించుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రతాప్ సర్‌నాయక్.. ఒక విద్యా సంస్థను నిర్మిస్తామని చెప్పి మీరా భయందర్‌లో దాదాపు రూ. 200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని కేవలం రూ.3 కోట్లకు దక్కించుకున్నారని కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ ఆరోపించారు. అయితే మంత్రి సర్‌నాయక్ ఈ ఆరోపణను తోసిపుచ్చారు. "వాడెట్టివార్ ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. నాపై చేసిన ఆరోపణకు ఆయన సాక్ష్యాలను సమకూరుస్తారని నేను ఆశిస్తాను" అని మంత్రి అన్నారు.

అంతర్జాతీయ అటవీ సంరక్షణ కార్యక్రమంలో భారత్

దిల్లీ: కర్బన ఉద్గారాలను పీల్చుకునే ఉష్ణమండల అరణ్యాల సంరక్షణ కార్యక్రమం (టీఎఫ్ఎఫ్ఎఫ్)లో భారత్ పరిశీలకురాలి హోదాలో చేరింది. గురువారం బ్రెజిల్ 12,500 కోట్ల డాలర్ల టీఎఫ్ఎఫ్ఎఫ్ నిధిని ప్రారంభించింది. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు ఈ కార్యక్రమానికి నిధులు సమకూరుస్తాయి. అడవులను సమర్థంగా పరిరక్షిస్తున్న దేశాలకు ఈ నిధి నుంచి ఆర్థిక సహాయం అందుతుంది. ఈ కార్యక్రమానికి భారత్ పూర్తి మద్దతునిస్తోందని బ్రెజిల్‌లోని భారత రాయబారి దినేశ్ భాటియా ప్రకటించారు. బ్రెజిల్‌లోని బెలెంలో ఈ నెల 10 నుంచి వాతావరణ మార్పుల నిరోధంపై కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్ 30) మహాసభ జరగనున్నది. దాని కన్నా ముందు శుక్రవారం జరిగిన కాప్ 30 నాయకుల శిఖరాగ్ర సభలో భాటియా పైవిధంగా ప్రకటించారు. పదేళ్ల క్రితం పారిస్‌లో జరిగిన వాతావరణ సభ కర్బన ఉద్గారాల తగ్గింపునకు నిర్దేశించిన లక్ష్యాలను ప్రపంచం ఇంతవరకు అందుకోలేకపోయింది. అప్పటికన్నా మరింత ఎక్కువగా ఉద్గారాల తగ్గింపునకు ప్రపంచ దేశాలు నిబద్ధత ప్రకటించాలని భారత్ కోరుతోంది.

ఇజ్రాయెల్ రాయబారి హత్యకు ఇరాన్ కుట్ర

- భగ్నం చేశామన్న అమెరికా, టెల్‌అవీవ్

వాషింగ్టన్: మెక్సికోలో ఇజ్రాయెల్ రాయబారి ఐనత్ క్రాంజ్ నైగర్‌ను హత్యచేసేందుకు ఇరాన్ కుట్రపన్నిందని టెల్ అవీవ్, అమెరికా ఆరోపించాయి. ఈ కుట్రను తాము భగ్నం చేసినట్లు తెలిపాయి. గతేడాది చివరి నుంచి నైగర్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక సిద్ధమైందని, ఈ ఏడాది మధ్య వరకు కొనసాగిందని అమెరికా అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆమెకు ఎటువంటి ప్రాణభయం లేదన్నారు. 'నైగర్‌ను హత్య చేసేందుకు పన్నిన కుట్రను భగ్నం చేసినందుకు మెక్సికోలో పనిచేస్తున్న మా భద్రతా, న్యాయాధికారులకు కృతజ్ఞతలు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెలీలను, యూదులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్, దాని అనుబంధ సంస్థల ఉగ్రవాద ముప్పును అడ్డుకోవడానికి ఇజ్రాయెలీ భద్రత, నిఘా సంస్థలు పూర్తి సహకారంతో అవిశ్రాంతంగా పని చేస్తూనే ఉంటాయి" అని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా ఈ ఆరోపణలపై మెక్సికో లేదా ఇరాన్ స్పందించలేదు.

ఆయుధం లభించకున్నా హత్య కేసు ఆధారరహితం కాబోదు

- జీవిత శిక్షను సమర్థిస్తూ కలకత్తా హైకోర్టు తీర్పు

కోల్‌కతా: హత్యకు వినియోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేకపోయినంత మాత్రాన కేసు ఆధారరహితం కాబోదని కలకత్తా హైకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తీరును విచారణ సమయంలో ప్రాసిక్యూషన్ నిరూపించగలిగిందని తెలిపింది. 1999లో జరిగిన ఓ హత్య కేసులో ముగ్గురు దోషులకు ట్రయల్ కోర్టు విధించిన జీవిత శిక్షను సమర్థిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. దోషులపై మోపిన అభియోగాలకు సరైన ఆధారాలను చూపడంలోనూ ప్రాసిక్యూషన్ సఫలమైందని జస్టిస్ దేవాన్షు ఘోష్, జస్టిస్ షబ్బర్ రష్దీతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరంలేదని అభిప్రాయపడింది. ఈ కేసులో ముగ్గురు ప్రత్యక్ష సాక్షులున్న విషయాన్నీ ప్రస్తావించింది.

చందమామ ధ్రువాలపై చంద్రయాన్-2 దృష్టి!

- లోతైన వివరాలు సేకరించిన వ్యోమనౌక


బెంగళూరు: చంద్రుడి కక్ష్యలో పరిభ్రమిస్తున్న చంద్రయాన్-2 ఆర్బిటర్‌లోని పరికరాల నుంచి సవివర డేటాను సేకరించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. జాబిల్లి ధ్రువ ప్రాంతాలపై లోతైన అవగాహనకు ఇది వీలు కల్పిస్తుందని పేర్కొంది. అక్కడి ఉపరితల భౌతిక లక్షణాలనూ తెలుసుకోవచ్చని వివరించింది. 2019లో చంద్రుడి కక్ష్యలోకి చేరిన చంద్రయాన్-2 ఆర్బిటర్.. నాటి నుంచి అత్యంత నాణ్యమైన డేటాను సేకరిస్తోందని పేర్కొంది. ఆ వ్యోమనౌకలోని డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ ఎపెర్చర్ రాడార్ (డీఎఫ్‌సార్) చందమామను ఎల్-బ్యాండ్‌లో మ్యాప్ చేసిందని తెలిపింది. దాదాపు 1,400 రాడార్ డేటాసెట్‌లను అది అందించిందని, వాటిని గుదిగుచ్చి జాబిల్లి ఉత్తర, దక్షిణ ధ్రువాలకు సంబంధించిన పొలారిమెట్రిక్ చిత్రాలను రూపొందించినట్లు పేర్కొంది. వీటి సాయంతో అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ శాస్త్రవేత్తలు జాబిల్లిపై నీటి ఐస్ ఉనికికి ఆస్కారం, ఉపరితల కరుకుదనం, విద్యుత్ లక్షణానికి సంబంధించిన డేటా ఉత్పత్తులను రూపొందించినట్లు వివరించింది. ఇవి జాబిల్లి ఉపరితల సాంద్రత వంటి లక్షణాలను వివరిస్తున్నట్లు తెలిపింది.



అమెరికాలోని లూయీవిల్‌లో ఇటీవల టేకాఫ్ సమయంలో యూపీఎస్ కార్గో విమానం కూలిపోయిన పరిసరాల్లో ధ్వంసమైన వాహనాలు

భారత రాజ్యాంగ పరిణామక్రమాన్ని బి.సి. రావత్ ఆరు దశలుగా వర్గీకరించారు. మొదటి (1600-1773) దశలో భారత్‌లో ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాల కోసం నాటి మహారాణి అనుమతి మంజూరు చేశారు. బొంబాయి, మద్రాసు, కలకత్తా ప్రెసిడెన్సీలను ఏర్పాటు చేశారు. ప్లాసీ, బక్సర్ యుద్ధాలు గెలిచిన ఆంగ్లేయులు సామ్రాజ్య స్థాపన, విస్తరణకు నాంది పలికారు. రెండో (1773-1858) దశలో రెగ్యులేటింగ్ చట్టం, పిట్స్ ఇండియా చట్టం, పలు చార్టర్ చట్టాలను రూపొందించారు.


గోపాలకృష్ణ గోఖలే


దాదాభాయ్ నౌరోజీ


ఫిరోజ్‌షా మెహతా

భారత రాజ్యాంగ స్వరూపం

మూడో దశ (1858-1909)

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

ఆ ప్రముఖ చట్టమే.. స్వేచ్ఛా స్వాతంత్ర్యపు మాగ్నాకార్టా

భారత ప్రభుత్వ చట్టం - 1858

మొదటి స్వాతంత్ర్య సంగ్రామం లేదా సిపాయిల తిరుగుబాటుగా పేరుగాంచిన 1857 తిరుగుబాటును అణచివేసి 1858 నవంబరు 1న బ్రిటిష్ రాణి విక్టోరియా మహారాణి భారతదేశ పరిపాలనా బాధ్యతలను స్వీకరిస్తూ ఒక ప్రకటనను జారీ చేశారు. దీన్నే విక్టోరియా మహారాణి ప్రకటన అంటారు. దీన్ని మొదటిసారిగా చదివి వినిపించిన గవర్నర్ లార్డ్ కానింగ్. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం.

✦ ఈ చట్టాన్ని భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి మాగ్నాకార్టాగా పేర్కొంటారు. టి.బి. మెకాలే ఈ చట్టాన్ని ప్రజా నిరంకుశత్వాన్ని నెలకొల్పే చట్టంగా అభివర్ణించాడు.

ముఖ్యాంశాలు: ఈ చట్టం భారతదేశంలో కేంద్రీకృత పాలనా వ్యవస్థను క్రమానుగత శ్రేణిలో ప్రవేశపెట్టింది. కాబట్టి దీన్ని 'గుడ్ గవర్నెన్స్ ఇన్ ఇండియా' చట్టంగా పేర్కొంటారు.

❖ భారతదేశంలో కంపెనీ పరిపాలన అంతమై, చక్రవర్తి (రాజు లేదా రాణి) ప్రత్యక్ష పరిపాలన ప్రారంభమైంది.

❖ ఈ చట్టం ద్వారా భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. హర్ మెజెస్టి (మహారాణి) పేరుతో పరిపాలన కొనసాగింది.



☛ గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు. వైస్రాయ్ అంటే రాజప్రతినిధి అని అర్థం. భారతదేశ మొదటి వైస్రాయ్ లార్డ్ కానింగ్.

❖ భారత గవర్నర్ జనరల్, భారత వైస్రాయ్ అనే పదవులు ఆవిర్భవించాయి. ఈ రెండు పదవులను ఒకరే నిర్వహిస్తారు. బ్రిటిష్ పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ జనరల్‌గా, స్వదేశీ సంస్థానాల్లో వైస్రాయ్‌గా వ్యవహరిస్తారు.

❖ ఈ చట్టం భారత రాజ్యకార్యదర్శి (సెక్రటరీ ఆఫ్ స్టేట్) అనే నూతన పదవిని ఏర్పాటు చేసింది. మొదటి కార్యదర్శిగా స్టాన్లీ, రెండో కార్యదర్శిగా చార్లెస్ ఉడ్స్ పని చేశారు.

❖ భారత రాజ్యకార్యదర్శి బ్రిటన్ కేబినెట్‌లో భాగంగా భారతదేశ పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి బ్రిటిష్ పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తారు.

❖ కార్యదర్శికి సలహాలు ఇచ్చేందుకు 15 మంది సభ్యులతో కూడిన ఒక కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు.

❖ 1784లో ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అనే వ్యవస్థను రద్దు చేసి ద్వంద్వ ప్రభుత్వ వ్యవస్థను ముగించింది.

❖ ఈ చట్టం ద్వారా బ్రిటిష్ రాణి 'భారత సామ్రాజ్ఞి' బిరుదు ధరించింది.

❖ 1858 చట్టం చాలా వరకు పరిపాలనా యంత్రాంగాన్ని మెరుగుపర్చడానికి ఉద్దేశించింది. అయితే ఇంగ్లండ్ నుంచి భారత ప్రభుత్వాన్ని నియంత్రించారు. అయినప్పటికీ ఇది భారత పరిపాలనా వ్యవస్థని మౌలికంగా మార్చలేదు.

కౌన్సిల్ చట్టం (1892)

కౌన్సిల్ చట్టం-1861లోని లోపాలను సరిదిద్దేందుకు ఈ చట్టం చేశారు. ముఖ్యంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ (INC) ఏర్పడటం, విద్యావంతులైన భారతీయులు బ్రిటిష్ పాలనలోని లోపాలను ఎత్తిచూపుతూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని రూపొందించారు.

ముఖ్యాంశాలు: ఈ చట్టం ద్వారా మొదటిసారిగా పరోక్ష పద్ధతిలో శాసన సభ్యులను ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు.

❖ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక శాఖలో సభ్యుల సంఖ్యను 5 నుంచి 6కి పెంచారు.

❖ కేంద్ర శాసనసభలో సభ్యుల సంఖ్యను 10కి తక్కువ కాకుండా 16కు మించకుండా నియంత్రించారు. ❖ రాష్ట్ర శాసనసభలో సభ్యుల సంఖ్యను 8కి తక్కువ కాకుండా 20కి మించకుండా నియంత్రించారు.

❖ కేంద్ర శాసనసభలో బడ్జెట్ మినహాయించి, మిగిలిన పరిపాలనా అంశాలపై ప్రశ్నించే అవకాశం కల్పించారు.

❖ కేంద్ర శాసనసభలో ప్రశ్నలు అడిగేందుకు గవర్నర్ జనరల్ ముందస్తు అనుమతి పొందాలి.

❖ కేంద్ర శాసనసభకు నామినేట్ అయిన భారతీయ ప్రముఖులు

◆ సురేంద్రనాథ్ బెనర్జీ ◆ గోపాలకృష్ణ గోఖలే
◆ దాదాభాయ్ నౌరోజీ ◆ ఫిరోజ్‌షా మెహతా
◆ రాస్‌బిహారీ ఘోష్ ◆ బిల్‌గ్రామ్

భారత కౌన్సిల్ చట్టం - 1861

ఈ చట్టం ద్వారా భారతదేశంలో శాసన నిర్మాణ ప్రక్రియలో భారతీయులకు మొట్టమొదటిసారిగా ప్రాతినిధ్యం కల్పించారు. ఇలా నామినేట్ చేసిన వారిలో బెనారస్ మహారాజు నారాయణ సింగ్, పటియాలా మహారాజు నరేంద్ర సింగ్, సర్ దినకర్‌రావు ఉన్నారు.

▮ 1858లో విక్టోరియా మహారాణి ప్రకటన ద్వారా బ్రిటిష్‌వారు ప్రత్యక్షంగా భారతదేశ పరిపాలన చేపట్టారు. అనంతరం భారతదేశ పరిపాలన కోసం బ్రిటిష్ పార్లమెంట్‌లో రూపొందిన చట్టాలను కౌన్సిల్ చట్టాలుగా పేర్కొంటారు. భారత రాజ్యకార్యదర్శితో ఉన్న 15 మంది కౌన్సిల్ సభ్యుల పేరిట ఈ చట్టాలను రూపొందించారు.

ముఖ్యాంశాలు: గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్ జారీచేసే అధికారం కల్పించారు.

❖ ఆర్డినెన్స్ అంటే ఉత్తర్వు. దీనికి సాధారణ శాసనాలకు ఉన్నంత విలువ ఉండదు. దీని కాలపరిధి 6 నెలలు.

❖ ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు సంబంధించిన సంవత్సర నివేదిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే పద్ధతిని ప్రారంభించారు.

1858-1909 మధ్య జరిగిన ముఖ్య ఘట్టాలు

పోర్ట్‌ఫోలియో విధానం వ్యవస్థాపకుడు - **లార్డ్ కానింగ్ (1859)**

▼ పోర్ట్‌ఫోలియో వ్యవస్థ అంటే - వివిధ మంత్రులను నియమించి వారికి శాఖలను కేటాయించడం, ఆ శాఖలకు వారే పూర్తి బాధ్యత వహించడం.

▼ పోర్ట్‌ఫోలియో వ్యవస్థ 1859లో ప్రారంభించినప్పటికీ 1861 భారత కౌన్సిల్ చట్టం ద్వారా అమల్లోకి వచ్చింది.

▼ 1859లో సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ) చట్టం

▼ 1860లో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) భారతీయ శిక్షా స్మృతి

▼ 1861లో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) అమల్లోకి వచ్చాయి.

▼ భారతదేశంలో సివిల్ సర్వీస్‌ను ప్రవేశపెట్టినవారు - **కారన్ వాలీస్**

▼ భారతదేశంలో ఆంగ్ల విద్యా విధానానికి మాగ్నాకార్టా - **ఉడ్స్ డిస్పాచ్**

▼ భారత్‌లో ఆంగ్ల విద్యా విధానానికి దశ దిశలను నిర్దేశించినవారు - **లార్డ్ మెకాలే.**

❖ గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక శాఖలో సభ్యుల సంఖ్యను 4 నుంచి 5కి పెంచారు. ❖ కొత్త లెజిస్లేటివ్ కౌన్సిల్‌ని ఈ చట్టం ఏర్పాటు చేసింది. ఈ కౌన్సిళ్లను 1862లో బెంగాల్‌లో, 1866లో నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లో, 1897లో పంజాబ్‌లో ఏర్పాటు చేశారు.

❖ 1862లో మూడు హైకోర్టులను కలకత్తా, మద్రాస్, బాంబేలలో, 1866లో 4వ హైకోర్టును అలహాబాద్‌లో ఏర్పాటు చేశారు.

❖ 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా రద్దు చేసిన బాంబే, మద్రాస్ ప్రెసిడెన్సీల శాసన అధికారాలను పునరుద్ధరించడం ద్వారా వికేంద్రీకృత పాలనకు శ్రీకారం చుట్టారు.

❖ ఆదాయ పన్నును ప్రవేశపెట్టారు.


రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day

825 ***Mendacious***

Telugu meaning: అబద్ధపు, అసత్య

English meaning: The word mendacious (మెన్డేషియస్) is an adjective that describes someone who is not truthful or who tells lies.

Synonyms: Deceitful, Untruthful

Antonyms: Truthful, Honest

Usage: **1.** The politician was known for his mendacious statements that often misled the public.

2. Her mendacious nature made it difficult for anyone to trust her words.

నోటిఫికేషన్స్

ఎన్‌ఐడీలో కోర్సులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)లో 2026-27 సంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డాట్) ద్వారా ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. అహ్మదాబాద్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, హరియాణా క్యాంపస్‌లలో నాలుగేళ్ల వ్యవధితో గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజైన్ (జీడీపీడీ) కోర్సు, దాదాపు రెండున్నరేళ్ల మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సును అహ్మదాబాద్, గాంధీనగర్, బెంగళూరు క్యాంపస్‌లలో అందిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 1 డిసెంబరు 2025.

జూనియర్ టెక్నీషియన్ పోస్టులు

చెన్నైలోని ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్), ఆవడి ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో జూనియర్ టెక్నీషియన్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం ఖాళీల సంఖ్య 133. దరఖాస్తు ఫీజు రూ.300. అర్హులైన అభ్యర్థులు 2025, నవంబరు 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు

బిలాస్‌పుర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 64. దరఖాస్తు ఫీజు రూ.1180. ఇంటర్వ్యూ తేదీ 12 నవంబరు 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ ప్రవేశాలకు నేడే (నవంబరు 9) చివరి తేదీ

☛ సీఈఈఆర్ఐలో 23 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు. ఐటీఐ, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ, బీఎస్సీ, బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

☛ సైనిక్ స్కూల్-2026 నోటిఫికేషన్.

☛ నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ఠ 2026.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం

నవంబరు 9
చరిత్రలో ఈనాడు

మన దేశంలో శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలతో సమానంగా న్యాయ వ్యవస్థ కూడా రాజ్యాంగబద్ధంగా ఏర్పాటై, స్వతంత్రంగా పనిచేస్తోంది. వెనుకబడిన ప్రజలకు న్యాయాన్ని చేరువ చేసేలా, పేదలకు న్యాయ సహాయం అందించడం సహా వివిధ కార్యక్రమాలను ఇది చేపట్టింది. ఈ క్రమంలోనే లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం, 1987ను తీసుకొచ్చింది. దీన్ని ప్రారంభాన్ని గుర్తుచేసుకునేందుకు ఏటా **నవంబరు 9న 'జాతీయ న్యాయ సేవల దినోత్సవం'**గా (National Legal Services Day) నిర్వహిస్తారు. ఉచిత న్యాయ సేవల లభ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పౌరులందరికీ సహేతుకమైన పద్ధతిలో న్యాయం అందేలా చూడటం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



దేశంలో న్యాయవ్యవస్థ

భారత న్యాయవ్యవస్థ ఏకీకృత, సమగ్ర, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సర్వోన్నత న్యాయవ్యవస్థ. సాధారణంగా కొన్ని సమాఖ్య ప్రభుత్వాల్లో ద్వంద్వ న్యాయవ్యవస్థ ఉంటుంది. అదేవిధంగా అక్కడ కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరుగా న్యాయశాఖలు ఉంటాయి.

✦ దేశంలోని న్యాయస్థానాలన్నీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే ఉంటాయి.

✦ భారతదేశంలో ఈస్ట్ ఇండియా పరిపాలనా కాలంలో సుప్రీంకోర్టును ప్రీవీ కౌన్సిల్‌గా పిలిచేవారు.

✦ స్వాతంత్ర్యానంతరం 1950 జనవరి 28 నుంచి దిల్లీ కేంద్రంగా ఫెడరల్ కోర్టును సుప్రీంకోర్టుగా మార్చారు.

చారిత్రక నేపథ్యం

దేశవ్యాప్తంగా న్యాయ సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించేందుకు భారత పార్లమెంట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987ను రూపొందించింది. 1994లో దీనికి కొన్ని సవరణలు చేశారు. 1995, నవంబరు 9న ఈ చట్టం అమల్లోకి వచ్చింది. మాజీ సీజేఐ రంగనాథ్ మిశ్రా దీని అమల్లో ముఖ్య భూమిక పోషించారు.

❖ దీని అమలుకు గుర్తుగా ఏటా నవంబరు 9న 'జాతీయ న్యాయ సేవల దినోత్సవం' నిర్వహించాలని సుప్రీంకోర్టు తీర్మానించింది.

మన దేశంలో ప్రస్తుతం ఎన్ని హైకోర్టులు ఉన్నాయి? ఉచిత న్యాయ సహాయం పొందడానికి ఎవరు అర్హులు? తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

పత్ర రూపాంతరాలు

మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ, ట్రాన్స్‌పిరేషన్ లాంటి సాధారణ విధులతోపాటు కొన్ని ప్రత్యేక విధులను నిర్వహించడానికి పత్రాలు రూపాంతరాలతో సవరణకు గురవుతాయి. కొన్నిసార్లు ఈ మార్పులు పలు పర్యావరణ పరిస్థితులకు ప్రతిస్పందనగా ఉంటాయి.



లీఫ్ టెండ్రిల్స్, స్కేల్ - పత్రాలు, పత్రం మూలాలు, ఫైలోడ్ మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


నిల్వ పత్రాలు

నీరు లభించని పరిస్థితుల్లో (జిరోఫైటిక్ ఆవాసాల్లో) కొన్ని మొక్కలు, క్రాసులేసి కుటుంబానికి చెందినవి సాధారణంగా నీటి నిల్వ కణజాలాల్లో బాగా దగ్గరగా అమరి ఉండే కణజాలంతో రసవంతమైన పత్రాలను కలిగి ఉంటాయి.

లీఫ్-స్పైన్స్

కొన్ని మొక్కల పత్రాలు పూర్తిగా లేదా పాక్షికంగా రక్షణ ప్రయోజనం కోసం స్పైన్స్ లేదా కంటకం అనే పదునైన, కోణాల నిర్మాణాలుగా మార్పు చెందుతాయి. అందుకే ఒపన్షియాలో పార్శ్వ మొగ్గ సూక్ష్మ పత్రాలు కంటకాలుగా మారతాయి.

Current Affairs



The Royal College of Physicians (RCP), London, has conferred the 2025 Ambuj Nath Bose Prize to Dr. D. Nageshwar Reddy. He is the Chairman of AIG Hospitals, Hyderabad. He got this award in recognition of his contributions to the field of endoscopy.

✦ Dr. Reddy becomes only the second Indian to receive this prestigious award since Dr. C. Gopalan was recognised in 1998.

The Office of the Principal Scientific Adviser (OPSA) to the Government of India, in collaboration with the Indian Institute of Science (IISc) and the Consulate General of France in Bengaluru, organised the third edition of the India-France AI Policy Roundtable at IISc on 7 November 2025. The event was held as part of the pre-summit series leading up to the AI Impact Summit 2026, which will be hosted by India.



The Public Enterprise Selection Board (PESB) has recommended Deepak Gupta as the next Chairman and Managing Director of GAIL (India) Ltd. He is currently Director (Projects) at GAIL (India) Ltd. Gupta is set to succeed Sandeep Kumar Gupta, who is scheduled to retire on 28 February 2026.

The Sports Authority of India and Hockey India on 7 November 2025 celebrated the centenary of Indian hockey at Major Dhyan Chand National Stadium in New Delhi. The celebration marked a century of sporting excellence, pride, and unity, honouring the journey of Indian hockey from its beginnings in 1925 to its resurgence in the modern era.

For more Current Affairs: Scan QR code

Mathematical Operations

1. If + means '×', − means '+', '×' means '−', then find $8 + 6 \times 4 - 2 = ?$
A) 30 B) 40 C) 46 D) 50

2. If '+' means '−' and '−' means '+', find $25 + 15 - 10 = ?$
A) 50 B) 30 C) 20 D) 10

3. Evaluate $25 + 36 \times 2 - 18 \div 3$
A) 90 B) 91 C) 92 D) 93

4. Evaluate $144 \div 12 + 15 \times 3$
A) 57 B) 52 C) 50 D) 48

5. Evaluate $7^2 - 5 \times 6 + 4$
A) 25 B) 23 C) 21 D) 22

6. Evaluate $45 \div 5 + 6 \times (3^2 - 4)$
A) 37 B) 38 C) 39 D) 40

7. Find the value of $(63 \div 7 + 5)^2 \div 7$
A) 26 B) 27 C) 28 D) 29

8. Evaluate $2^3 \times 3^2 - 5 \times (6 + 4)$
A) 20 B) 21 C) 22 D) 23

9. Calculate $150 - [25 \times (4 + 2)] + 18$
A) 16 B) 18 C) 20 D) 22

10. Solve $(36 \div 6 + 7) \times 3 - 4^2$
A) 23 B) 26 C) 29 D) 32

11. Find $100 \div (5 \times 2) + 7^2 - 30$
A) 28 B) 29 C) 30 D) 31

12. Evaluate $50 - 2 \times (3^2 + 4^2)$
A) 0 B) 5 C) 10 D) 15

Railway Exams
Reasoning

13. If 'sun' means '+', 'moon' means '−', 'star' means '×' and 'sky' means '÷', then what will be the value of: "6 star 4 sun 12 sky 3 moon 2"?
A) 18 B) 16 C) 14 D) 26

14. If 'add' means '+', 'sub' means '−', 'mul' means '×' and 'div' means '÷', then what is the value of: "5 mul 6 add 12 div 3 sub 4"?
A) 28 B) 30 C) 32 D) 34

15. If 'alpha' means '+', 'beta' means '−', 'gamma' means '×' and 'delta' means '÷', then what is the value of: "7 gamma 3 alpha 18 delta 6 beta 2"?
A) 20 B) 21 C) 22 D) 23

16. If '+' means '×', '×' means '−', '÷' means '+' and '−' means '÷', then what will be the value of $175 - 25 \div 5 + 20 \times 3 + 10$?
A) 77 B) 160 C) 240 D) 2370

17. If '+' means 'divide by', '−' means 'added to', '×' means 'subtracted from' and '÷' means 'multiplied by', then what is the value of: $36 \div 6 - 15 + 5 \times 10$?
A) 199 B) 205 C) 209 D) 215

18. If '+' means 'divide by', '−' means 'added to', '×' means 'subtracted from' and '÷' means 'multiplied by', then what is the value of: $20 \div 5 - 8 + 4 \times 6$
A) 92 B) 94 C) 96 D) 98

19. If '+' means 'divide by', '−' means 'added to', '×' means 'subtracted from' and '÷' means 'multiplied by', then what is the value of: $18 \div 3 - 6 + 2 \times 5$
A) 50 B) 51 C) 52 D) 53

20. If '+' means 'divide by', '−' means 'added to', '×' means 'subtracted from' and '÷' means 'multiplied by', then what is the value of: (Approx) $25 \div 5 - 10 + 3 \times 8$
A) 119 B) 123 C) 121 D) 122

21. If + means 'divide by', '−' means 'added to', '×' means 'subtracted from' and '÷' means 'multiplied by', then what is the value of: $30 \div 10 - 12 + 4 \times 9$
A) 292 B) 294 C) 296 D) 298

22. If '+' means 'divide by', '−' means 'added to', '×' means 'subtracted from' and '÷' means 'multiplied by', then what is the value of: $15 \div 3 - 9 + 6 \times 5$
A) 40 B) 44 C) 42 D) 43

23. If '+' means '×', '×' means '−', '÷' means '+' and '−' means '÷', then find the value of $120 - 40 \div 10 + 15 \times 2 + 5$
A) 140 B) 143 C) 145 D) 150

24. If '+' means '×', '×' means '−', '÷' means '+' and '−' means '÷', then find the value of $90 - 15 \div 5 + 10 \times 4 + 6$
A) 30 B) 32 C) 34 D) 36

25. If '+' means '×', '×' means '−', '÷' means '+' and '−' means '÷', then find the value of $60 - 20 \div 4 + 8 \times 5 + 4$
A) 14 B) 15 C) 16 D) 17

26. If '+' means '×', '×' means '−', '÷' means '+' and '−' means '÷', then find the value of $150 - 30 \div 5 + 25 \times 4 + 10$
A) 85 B) 90 C) 95 D) 100

27. If '+' means '×', '×' means '−', '÷' means '+' and '−' means '÷', then find the value of $200 - 50 \div 10 + 30 \times 2 + 8$
A) 286 B) 288 C) 290 D) 292


Scan the QR code for Key

These model questions were prepared by subject experts

శిఖరానికి చేరి.. పతనానికి జారి!

జనరల్ స్టడీస్ – భారతదేశ చరిత్ర

దిల్లీ సుల్తానుల్లో తుగ్లక్ రాజవంశం పాలనా కాలం ప్రత్యేకమైంది. వీరు సుల్తాన్ సామ్రాజ్యాన్ని విస్తరించి, అనేక కొత్త ప్రాంతాలను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. దక్షిణాదిన కూడా బలమైన రాజ్యాలను జయించారు. వ్యవసాయానికి నీటిపారుదల వసతులను కల్పించడం, తపాలా వ్యవస్థను ప్రవేశపెట్టడం తదితర నిర్మాణాత్మక పనులను చేపట్టి శిఖర స్థాయికి చేరారు. అదే సమయంలో రాజకీయంగా, ఆర్థికంగా విభిన్న ప్రయోగాలు చేసి విఫలమై పతనమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ బిన్ తుగ్లక్ రాజధానిని, కరెన్సీని మార్చడంతో పాటు అనవసరమైన దండయాత్రలతో ఖజానాను ఖాళీ చేశాడు. ఆ తర్వాత వచ్చిన ఫిరోజ్ షా విధానాలతో సామ్రాజ్య విచ్ఛిన్నానికి కారణమయ్యాడు. ఈ వంశంలోని ప్రధాన పాలకులు, వారి పరిపాలనా విశేషాలు, ప్రజల్లో తిరుగుబాటుకు కారణమైన సంస్కరణలను పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి.


మహమ్మద్ బిన్ తుగ్లక్


ఫిరోజ్ షా తుగ్లక్

తుగ్లక్ వంశం (క్రీ.శ.1320–1414)

దిల్లీ సుల్తానుల వంశాల్లో మూడోది తుగ్లక్ వంశం. దీనిలో ముఖ్య సుల్తానులు ◆ ఘియాజుద్దీన్ తుగ్లక్ (1320-25) ◆ మహమ్మద్ బిన్ తుగ్లక్ (1325-51) ◆ ఫిరోజ్ షా తుగ్లక్ (1351-88)

చివరి పాలకులు (1388–1414): రెండో ఘియాజుద్దీన్ తుగ్లక్, అబూబకర్, నసీరుద్దీన్ మహమ్మద్ ఖుస్రూ షా.

ఘియాజుద్దీన్ తుగ్లక్ (1320-25): అల్లాఉద్దీన్ ఖిల్జీ మరణానంతరం దిల్లీ సల్తనత్‌లో అరాచక పరిస్థితులు ఏర్పడి శాంతిభద్రతలు లోపించాయి. దిల్లీలోని ముస్లిం సర్దారులు పంజాబ్ గవర్నర్‌గా ఉన్న ఘాజి మాలిక్‌ను దిల్లీ సింహాసనం అధిష్ఠించాలని కోరారు. ఘాజి మాలిక్, ఖిల్జీ వంశ చివరి పాలకుడైన నసీరుద్దీన్ ఖుస్రూ షాను వధించి క్రీ.శ.1320లో ఘియాజుద్దీన్ తుగ్లక్ అనే బిరుదుతో దిల్లీ సింహాసనంపై తుగ్లక్ వంశ పాలన ప్రారంభించాడు. స్వల్ప పాలనాకాలంలోనే రాజ్య విస్తరణ, పటిష్ఠత, ప్రజాసంక్షేమ సంస్కరణలు చేపట్టాడు. 1324లో దిల్లీ సల్తనత్‌పై దాడి చేసిన మంగోలులను ఓడించి, ఖైదు చేసి శిక్షించాడు. ఇతడి పాలనాకాలంలో యువరాజు జునాఖాన్ (తర్వాత మహమ్మద్ బిన్ తుగ్లక్) కాకతీయ రాజ్యాన్ని, ఒడిశా ప్రాంతాన్ని జయించి తుగ్లక్ రాజ్యంలో కలిపాడు. ఓరుగల్లు పేరు సుల్తాన్‌పుర్‌గా మారింది. ఘియాజుద్దీన్ పంటపొలాలకు నీటి వనరులు కల్పించి, భూమి శిస్తు తగ్గించాడు. వ్యవసాయాభివృద్ధికి పంట కాలువలు తవ్వించి, అధికోత్పత్తి సాధించాడు. నూతన రహదార్ల నిర్మాణం, దోపిడీ దొంగల బారి నుంచి ప్రజలకు రక్షణ, అంచెల వారీగా గుర్రాల మీద వార్తలను పంపే తపాలా పద్ధతి ప్రవేశపెట్టాడు. అత్యవసర పరిస్థితుల్లో, కరవు సమయంలో భూమిశిస్తు రద్దు చేసి వ్యవసాయదారులకు మేలు చేశాడు. తనను సన్మానించడానికి కుమారుడు జునాఖాన్ నిర్మించిన వేదిక పైనుంచి జారి పడి మరణించాడు.


జునాఖాన్ నిర్మించిన వేదిక కూలుతున్న దృశ్యం. (ఊహాచిత్రం)


ఘియాజుద్దీన్


ఘియాజుద్దీన్ సమాధి

మహమ్మద్ బిన్ తుగ్లక్ (1325 -1351): తుగ్లక్ అనేక భాషలు, శాస్త్రాల్లో విద్యావంతుడు. తండ్రి కాలంలోనే యువరాజు జునాఖాన్‌గా ఓరుగల్లుపై దండెత్తి, కాకతీయ రెండో ప్రతాపరుద్రుడిని ఓడించి రాజ్యాన్ని ఆక్రమించాడు. జాజ్‌నగర్(ఒడిశా)పై దాడిచేసి కొల్లగొట్టాడు.


తుగ్లక్ పాలనా సంస్కరణలు

అ) గంగా–యమునా అంతర్వేదిలో పన్నుల పెంపు: 1326 నాటికి గంగా-యమునా మైదానంలో క్షామం తాండవించింది. కానీ ప్రభుత్వోద్యోగులు ఇక్కడి భూములపై శిస్తులు పెంచి, నిర్దాక్షిణ్యంగా వసూలు చేశారు. ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. రాజ్యంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల గురించి తెలుసుకుని కరవు నివారణ కోసం రైతులకు రుణాలు ఇవ్వడం, శిస్తు వసూలు నిలుపుదల చేయడం మొదలైన పలు నష్టనివారణ చర్యలు చేపట్టినప్పటికీ, ఆ కార్యక్రమాలు ఆచరణలోకి వచ్చేసరికే కాలాతీతమై ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు. సుల్తాన్ చేష్టలు ప్రజలకు ఏవగింపు కలిగించాయి.

ఆ) రాజధాని మార్పిడి (1326–1327): తుగ్లక్ చేసిన పాలనా సంస్కరణల్లో తీవ్ర విమర్శలకు గురైంది రాజధాని మార్పిడి. మంగోలుల దండయాత్రలకు రాజధానిని దూరంగా ఉంచడానికి, విస్తరించిన తుగ్లక్ రాజ్యానికి మధ్యలో రాజధానిని నెలకొల్పడానికి, బలవంతులైన దిల్లీ సర్దారుల ప్రాబల్యానికి దూరంగా ఉంచడం కోసం రాజధానిని మార్చడానికి సంకల్పించాడు. దిల్లీలోని పౌరులందరినీ తమ ఆస్తిపాస్తులతో పాటు 700 మైళ్ల దూరంలో ఉన్న దౌలతాబాద్‌కు తరలివెళ్లమని ఆజ్ఞాపించాడు. ప్రజలు అష్టకష్టాలు అనుభవించారు. సుల్తాన్ తన తప్పును తెలుసుకుని తిరిగి రాజధానిని దౌలతాబాద్ నుంచి దిల్లీకి మార్చాడు. ఈ ప్రక్రియలో ఖజానా ఖాళీ అయింది. ప్రజల్లో సుల్తాన్ అంటేనే అలక్ష్యభావం, తిరుగుబాటు మనస్తత్వం పెరిగాయి. రాజధానిని దౌలతాబాద్‌కు మార్చినప్పుడు మంగోలులు టర్మా షిరిన్ నాయకత్వంలో దిల్లీ సామ్రాజ్యంపై దాడి చేయగా సుల్తాన్ అతడికి అపార ధనరాశులు ఇచ్చి దిల్లీని కాపాడుకోవాల్సి వచ్చింది.

ఇ) రాగి నాణేల చెలామణి: సుల్తాన్ ఆర్థిక వ్యవస్థను అత్యంత ప్రభావితం చేసి రాజ్యాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన సంస్కరణ రాగి నాణేల చెలామణి. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం దృష్ట్యా సుల్తాన్ చైనాలోని కుబ్లఖాన్ మాదిరి నామమాత్రపు కరెన్సీ (టోకెన్ కరెన్సీ) విడుదల చేయాలని నిర్ణయించాడు. వెండి టంకాతో సమాన విలువ ఉండే రాగి నాణేన్ని ప్రవేశపెట్టాలని తుగ్లక్ 1330లో నిర్ణయించాడు. కానీ నాణేల ముద్రణ విషయంలో ఇతరులు తయారుచేయకూడదన్న ఆంక్షలను విధించకపోవడం, అధికార పర్యవేక్షణ కొరవడటంతో ప్రతి ఇల్లు ఒక టంకశాలగా మారి నకిలీ నాణేలు మార్కెట్‌లోకి వెల్లువెత్తాయి. దీంతో తుగ్లక్ తన నామమాత్రపు నాణేలను చెలామణి నుంచి ఉపసంహరించాడు. రాగి నాణేలు తీసుకుని వెండి నాణేలు ఇచ్చాడు. ఈ ప్రక్రియలో ప్రజలు సుల్తాన్‌ను మోసగించారు. ఖజానా ఖాళీ అయ్యింది.


తుగ్లక్ రాగి నాణేలు


తుగ్లక్ రాగి నాణేల పంపిణీ దృశ్యం

ఈ) వ్యవసాయాభివృద్ధి: దేశంలో వ్యవసాయాభివృద్ధి చేసి ప్రభుత్వ సంపదను పెంచడానికి 'దివాన్-ఇ-కోహీ' అనే ప్రత్యేక వ్యవసాయ శాఖ ఏర్పాటు చేశారు. అది రైతుల సంక్షేమానికి చర్యలను చేపట్టింది.

ఉ) ఖోరసాన్ దండయాత్ర: తుగ్లక్ సామ్రాజ్యవాది. మధ్య ఆసియా రాజ్యమైన ఖోరసాన్‌ను జయించడానికి ఒక భారీ పథకాన్ని రూపొందించాడు. అపార ధనం వెచ్చించి, దాదాపు నాలుగు లక్షల సైన్యాన్ని ఏర్పాటు చేసి ఏడాది జీతాన్ని ముందుగానే చెల్లించాడు. తర్వాత హిమాలయ పర్వతాలు దాటడంలో కష్టనష్టాలను గ్రహించి ఖోరసాన్ పథకాన్ని నిలిపేసి సైన్యాన్ని రద్దు చేశాడు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారింది. ఈ విధంగా తుగ్లక్ ప్రయోగాలు, ఆశయాలన్నీ విఫలమై, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చింది.

◆ క్రీ.శ.1335లో మధుర నవాబైన జలాలుద్దీన్ హాసన్ స్వతంత్రుడయ్యాడు. ◆ దక్షిణాదిన క్రీ.శ.1336లో హరిహర రాయలు, బుక్కరాయలు స్వాతంత్ర్యం ప్రకటించుకుని, విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. ◆ ఓరుగల్లులో ముసునూరి కాపయ నాయకుడు, బెంగాల్లో ఫక్రుద్దీన్ తిరుగుబాటు చేయగా, గుల్బర్గాలో హాసన్ గంగూ 1347లో బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఈ తిరుగుబాట్లను అరికట్టడానికి సుల్తాన్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

మరణం: క్రీ.శ.1351లో గుజరాత్‌లో థాగీ సుల్తాన్ చేసిన తిరుగుబాటును అణచివేయడానికి తుగ్లక్ బయలుదేరాడు. మార్గమధ్యంలో జ్వరపీడితుడై థట్టా సమీపంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇతడి మరణంపై బరౌనీ "ప్రజల నుంచి సుల్తాన్, సుల్తాన్ నుంచి ప్రజలు బంధ విముక్తులయ్యారు." అని వర్ణించాడు.

ఫిరోజ్ షా తుగ్లక్ (1351-88): మహమ్మద్ బిన్ తుగ్లక్ మరణం తర్వాత బంధువు ఫిరోజ్ షా తుగ్లక్ సుల్తాన్ పదవి చేపట్టాడు. మతం, విద్య, శాంతి, నీటిపారుదల, నిర్మాణాల పట్ల ఇతడు ఆసక్తిని ప్రదర్శించాడు. కానీ అప్పటికే రాజ్యం ఆర్థిక సంక్షోభంలో ఉంది. సామ్రాజ్య విచ్ఛిన్నాన్ని అరికట్టలేకపోయాడు. తన విధానాలతో మరింత వినాశనానికి కారణమయ్యాడు. షరియత్‌కు అనుగుణంగా పాలించాడు. పాలనలో ఉలేమాలకు ప్రాముఖ్యత ఉండేది. సర్దారుల సంతృప్తికి అల్లాఉద్దీన్ రద్దుచేసిన 'ఇక్త' వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టాడు. బానిసలు, పేదల ప్రయోజనం కోసం దివాన్ ఇ బందగాన్, దివాన్ ఇ ఖైరత్ అనే శాఖలను ప్రభుత్వంలో స్థాపించాడు. ప్రజల కోసం దార్-ఉల్-షిఫా అనే వైద్యశాలలు నిర్మించాడు. వ్యవసాయాభివృద్ధికి కాలువలు తవ్వించాడు. రైతు బకాయిలు రద్దు చేశాడు. ఫతేబాద్, హిస్సార్, ఫిరోజాబాద్, జాన్‌పుర్ తదితర నూతన నగరాలను నిర్మించాడు. కుతుబ్ మినార్ పాక్షికంగా దెబ్బతినడంతో బాగుచేయించి అదనంగా రెండు అంతస్తులు కట్టించాడు. మీరట్‌లోని అశోక స్తంభాలను దిల్లీకి తెప్పించాడు. ఫిరోజ్ షా మరణానంతరం (1388) దిల్లీలో తిరుగుబాట్లతో సుల్తాన్‌లు తరచూ మారారు. నసీరుద్దీన్ మహమ్మద్ కాలంలో సమర్ఖండ్ పాలకుడు తిమూర్ దండయాత్ర చేసి సంపదను దోచుకుని ప్రజలను చిత్రహింసలు పెట్టాడు. తన ప్రతినిధిగా ఖిజార్‌ఖాన్‌ను ముల్తాన్‌లో ఉంచాడు. నసీరుద్దీన్ తర్వాత ఖిజార్‌ఖాన్ దిల్లీని ఆక్రమించి సయ్యద్ వంశాన్ని స్థాపించాడు.


ఫిరోజాబాద్ కోట


జాన్‌పుర్ కోట


రచయిత: రామావతారం

వ్యతిరేక అభిప్రాయాలతో నిర్ణయం వద్దు!

లైఫ్‌స్కిల్స్

అక్కడో.. ఇక్కడో.. ఎక్కడో విన్న ఆధారరహితమైన విషయాలను నమ్మి ఒక స్థిర నిర్ణయానికి రాకూడదు. హేతుబద్ధత లేకుండా తొందరపాటుతో, వ్యతిరేక ఆలోచనలతో తీసుకునే నిర్ణయం సరిగా ఉండదు. అలాంటి మనస్తత్వం ఒక్కోసారి కెరియర్‌కూ, జీవితంలో ఎదుగుదలకూ ఆటంకమవుతుంది. ఉదాహరణకు ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం ఉంటాయనే అభిప్రాయంతో కొందరు ప్రతిభావంతులు ఆ పోటీ పరీక్షలను కనీసం ప్రయత్నించరు. వ్యతిరేక భావం ఉన్న అంశాన్ని ఎలా సరిచేసుకోవాలో, సవ్యమైన అభిప్రాయాలతో మెరుగైన నిర్ణయం ఏవిధంగా సాధ్యమవుతుందో చక్కటి ఉదాహరణలతో సహా తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



■ ఏ దేశంలో ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, ఓడరేవు పునరాభివృద్ధి, వ్యూహాత్మక సహకారాన్ని అందించేందుకు ఇటీవల భారత ప్రభుత్వం రూ.680 మిలియన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది?

జ: మారిషస్ (ఈ దేశ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్ చంద్ర రామ్‌గులం భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ ప్రకటన చేశారు.)

■ దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలు నమో భారత్ ఇటీవల ఏ మార్గంలో గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణించి వార్తల్లో నిలిచింది?

జ: దిల్లీ- మీరట్ రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్)

■ ఇటీవల ఏ భారత మాజీ ప్రధాన మంత్రికి మరణానంతరం ప్రతిష్ఠాత్మక పీవీ నరసింహారావు స్మారక ఆర్థికశాస్త్ర పురస్కారాన్ని ప్రకటించారు?

జ: డాక్టర్ మన్మోహన్ సింగ్ (పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది.)

■ ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు?

జ: సెప్టెంబరు రెండో శనివారం ('ఫస్ట్ ఎయిడ్ అండ్ క్లైమేట్ చేంజ్' అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.)

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?

☛ ఎన్‌ఎస్‌యూటీ దిల్లీలో 176 ప్రొఫెసర్ ఖాళీలు
చివరి తేదీ: 2025 నవంబరు 11.


☛ ఈఎస్‌ఐసీ దిల్లీలో సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు (40)
చివరి తేదీ: నవంబరు 11, 2025

స్త్రీలంటే భయపడితే గైనో ఫోబియా!

మానవ సంక్షేమంలో జీవశాస్త్రం

జనరల్ స్టడీస్- బయాలజీ

మానవ జీవితాన్ని మెరుగ్గా మార్చేందుకు, వివిధ రకాల వ్యాధులను గుర్తించి, నివారించేందుకు జీవ శాస్త్ర పరిజ్ఞానం కీలకంగా మారింది. ముఖ్యంగా సూక్ష్మజీవుల ద్వారా సోకుతున్న వ్యాధులను అర్థం చేసుకోవడం, చికిత్స చేయడంలో ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతోంది. మానవాళిని నిత్యం భయపెడుతున్న అలాంటి రోగాలు, వాటి కారకాలు, వాహకాల గురించి పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. మనుషులకు వచ్చే వ్యాధుల్లో ఏది, ఏ శరీర అవయవం, వ్యవస్థపై ప్రభావం చూపుతుంది, వాటి చికిత్సకు, ముందస్తు నివారణకు ఉన్న టీకాలు, కనిపెట్టిన శాస్త్రవేత్తల వివరాలను తెలుసుకోవాలి.



1. కింది వాటిలో ఉష్ణ దేశాల్లో సాధారణంగా సంభవించే వ్యాధి?
   1) ప్లేగు 2) అమీబియాసిస్
   3) ఫైలేరియాసిస్ 4) పైవన్నీ

2. కింది వాటిలో సత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) జీవ జాతులన్నింటిలో జంతువులన్నీ పరపోషితాలు.
   బి) 'పారాసైట్' అనే ఆంగ్ల పదం లాటిన్ పదమైన 'పారాసైటోస్' నుంచి వచ్చింది.
   సి) పరాన్నజీవనంలో రెండు జీవులూ లాభపడతాయి.
   డి) సముద్ర చేపలో 'కోపిపాడ్స్' అనేవి బాహ్య పరాన్నజీవులు.
   1) ఎ, బి, 2) బి, సి 3) ఎ, డి 4) బి, డి


కోపిపాడ్స్

3. కింది వాటిలో ఏకాతిథేయి పరాన్నజీవి?
   1) ఆస్కారిస్ లుంబ్రికాయిడిస్ 2) ప్లాస్మోడియం వైవాక్స్
   3) ఉకరేరియా బాంక్రాఫ్టి 4) నోసిమా నోటాబిలిస్

4. కింది వాటిని జతపరచండి.
   1) నియోప్లాసియా ఎ) ఫాసియోలా హెపాటికా ఉండే గొర్రె
   2) గింగాన్‌టిజమ్ బి) ట్రిపనోసోమా గాంబియెన్సి
   3) హైపర్ ప్లాసియా సి) క్యాన్సర్‌ను కలిగించే వైరస్‌లు
   4) హైపర్ ట్రోఫి డి) నత్తలో ఫాసియోలా హెపాటికా
   1) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి 2) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
   3) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి 4) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి

5. కింది వాటిలో తప్పుగా జతపరిచిన దాన్ని గుర్తించండి.
   1) ట్రిపనోసోమా గాంబియెన్సి - ఆఫ్రికా అతినిద్రా వ్యాధి
   2) లీష్మానియా డోనవాని - దండం జ్వరం
   3) ప్లాస్మోడియం వైవాక్స్ - మలేరియా
   4) ఉకరేరియా బాంక్రాఫ్టి - తాష్కంట్ పుండ్లు

6. ఎంటమీబా హిస్టోలైటికా జీవితచక్రంలో లేని దశ?
   1) పూర్వపోషణ దశ 2) పోషక దశ
   3) కోశస్థ దశ 4) పూర్వ కోశస్థ దశ

7. కింది వాటిలో ప్లాస్మోడియంకు ద్వితీయ ఆతిథేయి?
   1) దోమ 2) కోతి
   3) మానవుడు 4) పంది

8. కింది వాటిలో ప్లాస్మోడియం సాంక్రమిక దశ ?
   1) కొడవలి ఆకారపు స్పోరోజాయిట్లు
   2) స్పోరోజాయిట్లు
   3) కణాంతస్థ దశ 4) 1, 2

9. మలేరియా అనేది ఏ భాషాపదం?
   1) జర్మనీ 2) లాటిన్
   3) జర్మన్ 4) ఇటలీ

10. ప్రపంచ మలేరియా దినోత్సవం?
    1) ఆగస్టు - 20 2) జులై - 20
    3) జూన్ - 30 4) సెప్టెంబరు - 26


11. కింది వాటిని జతపరచండి.
    1) టైఫాయిడ్ ఎ) ఉకరేరియా బ్రాంకాఫ్టి
    2) న్యుమోనియా బి) సాల్మోనెల్లా టైఫీ
    3) జలుబు సి) స్ట్రెప్టోకోకస్
    4) ఫైలేరియాసిస్ డి) రైనో వైరస్
    1) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
    3) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ 4) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి

12. మశూచికి వ్యాక్సిన్‌ను కనుక్కున్నది?
    1) ఎడ్వర్డ్ జెన్నర్ 2) లూయీ పాశ్చర్
    3) విలియం హార్వే 4) రాబర్ట్ బ్రౌన్

13. కింది వాటిలో కలరా వ్యాధి జనకం?
    1) సాల్మొనెల్లా టైఫీ 2) విబ్రియో కలరా
    3) రైనో వైరస్ 4) ప్లాస్మోడియం

14. కింది వాటిలో సైటోజాయిక్ పరాన్నజీవి?
    1) ఎంటమీబా 2) ఉకరేరియా
    3) స్పోరోస్పోరా 4) ప్లాస్మోడియం

15. అద్భుత ఔషధ సృష్టికి మంత్రగాడు?
    1) ఎల్లాప్రగడ సుబ్బారావు
    2) విలియం హార్వే
    3) లూయీపాశ్చర్
    4) 1, 2


ఎల్లాప్రగడ సుబ్బారావు

16. కింది వాటిలో క్యాన్సర్ నిరోధకం?
    1) ఫాస్ఫోక్రియాటిన్ 2) డై ఈథైల్ కార్బమజైన్
    3) టెట్రాసైక్లిన్ 4) మెథోట్రెక్సేట్

17. కింది వాటిలో వ్యాధి అధ్యయన శాస్త్రం?
    1) సింప్టమాలజీ 2) ట్రామాలజీ
    3) పాథాలజీ 4) నోటోలజీ

18. కింది వాటిలో ప్లేగు వ్యాధికి ఆతిథేయి?
    1) ఎలుక 2) పంది
    3) ఈగ 4) దోమ

19. కింది వాటిలో పాండమిక్ వ్యాధి కానిది?
    1) ధనుర్వాతం 2) బర్డ్ ఫ్లూ
    3) ఆంత్రాక్స్ 4) స్వైన్ ఫ్లూ

20. కింది వాటిలో తప్పుగా జతపరిచినదాన్ని గుర్తించండి.
    1) రేబిస్ - నాడీవ్యవస్థ 2) టైఫాయిడ్ - పేగు
    3) డిఫ్తీరియా - గొంతు 4) డయాబెటిస్ - రక్తం

21. మార్చి – 24 ఏ వ్యాధి దినోత్సవం?
    1) టైఫాయిడ్ 2) టీబీ
    3) ప్లేగు 4) ఆంత్రాక్స్

22. కింది వాటిలో లైంగిక వ్యాధి కానిది?
    1) గనేరియా 2) సిఫిలిస్
    3) ఎయిడ్స్ 4) ఆంత్రాక్స్

23. కింది వాటిలో జన్యు సంబంధిత వ్యాధి కానిది?
    1) స్లీపింగ్ సిక్‌నెస్ 2) హీమోఫీలియా
    3) థలసీమియా 4) గౌషర్

24. బయోటెక్నాలజీ ద్వారా తయారుచేసిన మొదటి వ్యాక్సిన్?
    1) బీసీజీ
    2) డీపీటీ
    3) హెపటైటిస్-బి
    4) ఎంఎంఆర్

25. కింది వారిలో ఇమ్యునాలజీ పితామహుడు?
    1) ఎడ్వర్డ్ జెన్నర్
    2) విలియం హార్వే
    3) లూయీ పాశ్చర్ 4) 1, 2



ఎడ్వర్డ్ జెన్నర్

26. కింది వాటిలో తప్పుగా జతపరిచింది?
    1) పెన్సిలిన్ - శిలీంద్రం
    2) క్లోరోమైసిన్ - శిలీంద్రం
    3) స్ట్రెప్టోమైసిన్ - బ్యాక్టీరియా
    4) ఎరిత్రోమైసిన్ - బ్యాక్టీరియా

27. కింది వాటిలో రెండో అద్భుత ఔషధం?
    1) పెన్సిలిన్ 2) టెట్రాసైక్లిన్
    3) స్ట్రెప్టోమైసిన్ 4) క్లోరోమైసిన్

28. స్త్రీలంటే భయపడటాన్ని ఏమంటారు?
    1) గైనో ఫోబియా 2) గ్లీరో ఫోబియా
    3) గెట్టో ఫోబియా 4) 1, 2

29. సూక్ష్మజీవ శాస్త్ర పితామహుడు?
    1) ఎడ్వర్డ్ జెన్నర్
    2) విలియం హార్వే
    3) లూయీ పాశ్చర్
    4) లీవెన్ హుక్


లూయీ పాశ్చర్

30. హెన్‌హెర్జ్ అనేది ఏ వ్యాధి నిర్మూలన కార్యక్రమం?
    1) మలేరియా 2) టీబీ
    3) సిఫిలిస్ 4) గనేరియా

31. కింది వాటిలో మధుమేహ దినోత్సవం?
    1) డిసెంబరు - 11 2) నవంబరు - 12
    3) నవంబరు - 14 4) డిసెంబరు - 1

32. కింది వాటిలో బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణలో ఉపయోగించేది?
    1) రెలెంజా 2) డాప్సోన్
    3) జనామాలీల్ 4) కాలమైన్

33. సర్ రోనాల్డ్ రాస్ నోబెల్ పొందిన సంవత్సరం?
    1) 1972 2) 1912 3) 1942 4) 1902

34. కాలమైన్ అనే వాక్సిన్ దేని కోసం వాడతారు?
    1) తట్టు 2) ఆటలమ్మ
    3) గవదబిళ్లలు 4) గన్యా

35. ఎయిడ్స్‌ను మొదటిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ కనుక్కున్నారు?
    1) గుంటూరు 2) కర్నూలు
    3) చిత్తూరు 4) హైదరాబాద్

36. పిచ్చి కుక్క కాటు వల్ల సంభవించే వ్యాధి?
    1) రేబిస్ 2) ఆంత్రాక్స్
    3) ఎయిడ్స్ 4) ఫైలేరియా

37. అంగుడు వాపు వ్యాధి జనక జీవి ఇంక్యుబేషన్ ఎన్ని రోజులు?
    1) 15 2) 7 3) 5 4) 8

38. నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపే వ్యాధి?
    1) ఆంత్రాక్స్ 2) న్యుమోనియా
    3) క్షయ 4) ధనుర్వాతం

39. కింది వాటిలో ట్రిపుల్ యాంటీజన్‌తో సంబంధం లేనిది?
    1) డిఫ్తీరియా 2) కోరింతదగ్గు
    3) మలేరియా 4) ధనుర్వాతం

40. ఎడిస్ దోమ ద్వారా వ్యాపించే వ్యాధి?
    1) డెంగీ 2) గన్యా
    3) స్వైన్ ఫ్లూ 4) 1, 2

41. కింది వాటిలో సరైన జతలు గుర్తించండి.
    ఎ) టెట్రాసైక్లిన్ - ఎల్లాప్రగడ సుబ్బారావు
    బి) పెన్సిలిన్ - అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    సి) పోలియో టీకా - జోనస్ సాక్
    డి) పోలియో చుక్కల మందు - ఆల్బర్ట్ సాబిన్
    1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి

42. 'హూపింగ్ కాఫ్' అని దేన్ని అంటారు?
    1) డిఫ్తీరియా 2) టైఫాయిడ్
    3) కలరా 4) కోరింత దగ్గు

43. అజిటోథైమిన్ ఏ వ్యాధి నివారణకు ఇస్తారు?
    1) బర్డ్ ఫ్లూ 2) ఎయిడ్స్
    3) మలేరియా 4) డెంగీ

44. ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ ఏ వ్యాధికి వాహకంగా ఉంటుంది?
    1) గన్యా
    2) ఎయిడ్స్
    3) రేబిస్
    4) పోలియో



45. కింది వాటిలో పాండమిక్ వ్యాధి కానిది?
    1) పోలియో
    2) క్షయ
    3) కరోనా
    4) ఇన్‌ఫ్లూయెంజా


రచయిత: వట్టిగౌనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-4; 2-3; 3-1; 4-3; 5-4; 6-1; 7-3; 8-1; 9-4; 10-1; 11-3; 12-1; 13-2; 14-3; 15-1; 16-4; 17-3; 18-1; 19-1; 20-4; 21-2; 22-4; 23-1; 24-3; 25-1; 26-2; 27-2; 28-1; 29-3; 30-1; 31-3; 32-1; 33-4; 34-2; 35-4; 36-1; 37-3; 38-1; 39-3; 40-4; 41-1; 42-4; 43-2; 44-1; 45-4.

హిందాల్కో ఏర్పాటుతో యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లోకి ఏపీ

వేగవంతమైన అనుమతులతోనే ఈ ఘనత: నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన హిందాల్కో ఇండస్ట్రీస్ రాష్ట్రానికి రావడం మన ఎలక్ట్రానిక్స్ ఎకో సిస్టంలో కీలక మలుపని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లో ఏపీ భాగస్వామి కానుందని తెలిపారు. కుప్పంలో రూ.586 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్ ఏర్పాటుతో 613 మందికి ప్రత్యక్షంగా, మరెందరికో పరోక్షంగా ఉద్యోగాలు, ఉపాధి లభించనున్నాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఇస్తున్న వేగవంతమైన అనుమతులు, ప్రోత్సాహకాల కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. 'బెంగళూరుకు 120 కి.మీ., చెన్నైకి 200 కి.మీ దూరంలో వ్యూహాత్మక స్థానంలో కుప్పం ఉంది. భవిష్యత్తులో స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో గ్లోబల్ తయారీ కేంద్రంగా మారనుంది. 2027 మార్చి నాటికి ఈ యూనిట్ నుంచి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభమవుతాయి' అని పేర్కొన్నారు.

పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అనువైన రాష్ట్రం

హిందాల్కో ఎండీ సతీశ్ పాయ్

ఈనాడు, అమరావతి: పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అన్ని విధాలుగా అనువైన రాష్ట్రమని హిందాల్కో ఎండీ సతీశ్ పాయ్ అన్నారు. తమ ప్లాంటును కుప్పంలో నెలకొల్పాలనుకుంటున్నామని ఆయన మాట్లాడిన వీడియోను లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టుచేశారు. 'దక్షిణ భారతదేశంలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి వ్యూహాత్మక ప్రాంతం కుప్పం. రవాణా సౌకర్యాలు, నైపుణ్యం ఉన్న కార్మికులు, రాష్ట్ర ప్రభుత్వం ఇలా అన్నీ మాకు అనుకూల అంశాలే. ఇవే ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాయి. ఏపీలో ప్రతిభ ఉన్న యువతకు కొదవ లేదు. కుప్పంలో యూనిట్ ఏర్పాటు చేస్తే నైపుణ్యం ఉన్న ఉద్యోగులు దొరుకుతారు. పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో మా ఆలోచనల్ని కార్యరూపంలో పెట్టేందుకు ఏపీ మాకు సరైన వేదిక అని ఆ వీడియోలో సతీశ్ పాయ్ పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించిన నీచ చరిత్ర వైకాపాది

మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించిన నీచ చరిత్ర వైకాపా వారిదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనాన్ని కూటమి ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తోందని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్మృతివనంపై వైకాపా వారు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

న్యాయవాదుల సంక్షేమాన్ని విస్మరించిన జగన్: మంత్రి ఫరూక్

ఈనాడు, అమరావతి: మ్యాచింగ్ గ్రాంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.46 కోట్లను ఏపీ బార్ కౌన్సిల్ పర్యవేక్షణలో పంపిణీ చేస్తారని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020 ఏప్రిల్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కన్నుమూసిన 1150 మంది న్యాయవాదుల కుటుంబాల కోసం ఈ మొత్తాన్ని విడుదల చేసిందన్నారు. వైకాపా హయాంలో న్యాయవాదుల సంక్షేమాన్ని విస్మరించారని దుయ్యబట్టారు.

ఐ ఫోన్ తయారీకి 'గేట్ వే'గా కుప్పం

శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

ఈనాడు, అమరావతి: కుప్పంలో హిందాల్కో సంస్థ రూ.586 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న పరిశ్రమతో 613 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని శాసనమండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ తెలిపారు. ఐ ఫోన్ తయారీకి కుప్పం గేట్ వేగా మారనుందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'ఐఫోన్ తయారీలో వాడే హై-గ్రేడ్ అల్యూమినియం చాసిస్‌ను హిందాల్కో సంస్థ కుప్పంలో తయారుచేయనుంది. ఇంతటి ప్రతిష్ఠాత్మక సంస్థ రాష్ట్రానికి రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేశ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌గా బి.సుందర్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ అదనపు ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి బి.సుందర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

హైకోర్టులో వాదనలకు ఏజీపీల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్రప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో తొమ్మిది మంది న్యాయవాదులు.. సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఏజీపీ)గా నియమితులయ్యారు. వీరి నియామకానికి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీచేశారు. ఏజీపీలుగా ఖత్రావత్ దిలీప్ నాయక్, దుప్పారి దావీదు, పెరుమాళ్ల ఉష, మోదుకూరు చంద్రశేఖర్, మటాడ యువశివ స్వామి, కన్నేధార అనూరాధ, జె.నూకపతిరావు, సింగరాజు అనంత వెంకట సాయికుమార్, తలుపుల బాలకృష్ణను నియమించారు.

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జాలిరెడ్డి

ఈనాడు, అమరావతి: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేశపరపు జాలిరెడ్డి, జంషీద్ ఎన్నికైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కోశాధికారిగా ప్రేమ్‌సాగర్ ఎంపికైనట్లు తెలిపారు.

ఆ పనులు పూర్తి చేస్తే.. 2.42 లక్షల ఎకరాలకు నీళ్లు!

- గతంలో రద్దు చేసిన వైకాపా ప్రభుత్వం
- మళ్లీ ఇప్పుడు ప్రతిపాదనలు
- త్వరలో చేపట్టే దిశగా అడుగులు

ఈనాడు, అమరావతి: ఎన్ని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినా.. కొత్తగా ఎంత ఆయకట్టుకు నీళ్లిచ్చామన్నది ప్రధానం. ఒక ప్రాజెక్టుపై ఖర్చుకు.. దానివల్ల వచ్చే ప్రయోజనాలను ఆర్థిక శాఖ తూకం వేసి చూసిన తర్వాతే పాలనామోదం ఇచ్చేందుకు అంగీకరిస్తుంది. రాయలసీమలోని కరవు ప్రాంతాలకు కీలకమైన హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకంలో ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనులను జగన్ సర్కార్ రద్దు చేసింది. ఇప్పుడు వాటిని చేపట్టి పొలాలకు నీళ్లు ఇచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకు ప్రభుత్వం వద్దకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో 2,42,000 ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

ఇదీ హంద్రీ-నీవా..

- ◆ శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా వరద జలాల ఎత్తిపోత ద్వారా రాయలసీమ జిల్లాల్లో 6.025 లక్షల ఎకరాలకు సాగు, 10 లక్షల మందికి తాగునీరు లక్ష్యం.
- ◆ ప్రధాన కాలువ 554 కి.మీ., బ్రాంచి కాలువలు 344 కి.మీ. మేర పనులు దాదాపు పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- ◆ 70 చోట్ల ఎత్తిపోతల పనులు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.13 వేల కోట్ల ఖర్చు చేశారు.
- ◆ అధికారిక లెక్కల ప్రకారం ఈ పథకం కింద నిర్వచించిన ఆయకట్టులో 52,654 ఎకరాలకు నీళ్లందుతున్నాయి. మిగిలిన ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలంటే పిల్ల కాల్వలు తవ్వాల్సి ఉంది.
- ◆ ఇటీవల హంద్రీ-నీవా కాలువను తొలిదశలో వెడల్పు, రెండో దశలో లైనింగ్ పనులు చేసి కుప్పం వరకు నీళ్లు మళ్లించారు. ఈ మార్గంలో 19 నియోజకవర్గాల్లోని 430కి పైగా చెరువులను నింపి వాటి కింద ఉన్న 71,765 ఎకరాల ఆయకట్టుకు ప్రాణం పోసే ప్రయత్నాలు చేశారు. ఈ చెరువుల్లో దాదాపు నీళ్లు నింపారు.

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో..

హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం తొలిదశలో కృష్ణగిరి జలాశయంలో 0.161 టీఎంసీలు, పత్తికొండ జలాశయంలో 1.216 టీఎంసీలు, జీడిపల్లి జలాశయంలో 1.686 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. ఆ నీటిని వినియోగించిన తర్వాత మళ్లీ నింపుతూ ఉంటారు. తొలిదశలో 14 టీఎంసీలను వినియోగించేలా రూపకల్పన చేశారు. మొత్తం మీద 40 టీఎంసీలు మళ్లించేలా ఈ పథకం నిర్మించారు. రెండో దశలో గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి జలాశయాలు కీలకం. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లు రెండో దశలోకి వస్తాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80,600 ఎకరాలకు గాను 39 వేల ఎకరాలకే నీళ్లందుతున్నాయి. ఉమ్మడి అనంతపురంలో తొలిదశ కింద 1,18,000 ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా డిస్ట్రిబ్యూటరీలు చేపట్టాల్సి ఉండగా 20 వేల ఎకరాలకు మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండో దశలో 1,03,362 ఎకరాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా ఆ పనులనూ అప్పట్లో నిలిపివేశారు. 2020లో జగన్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 365తో ఈ పనులన్నీ ఆగిపోయాయి. తొలిదశలో మిగిలిన పనులకు ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.250 కోట్ల వ్యయమవుతుంది. మళ్లీ టెండర్లు పిలిచి పనులు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు 1,03,362 ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా డిస్ట్రిబ్యూటరీల పనులు చేయాల్సి ఉంది. హంద్రీ-నీవా ప్రధాన కాలువ 216 కి.మీ. నుంచి 320కి.మీ. వరకు డిస్ట్రిబ్యూటరీలు, పిల్లకాలువలు తవ్వాల్సి ఉంది. వీటిని చేపట్టేలా డీపీఆర్ రూపకల్పనకు ప్రస్తుతం ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే డీపీఆర్ తయారు చేసి తర్వాత ప్రభుత్వ ఆమోదం పొంది పనులు చేయాల్సి ఉంటుంది.

బంగాళాఖాతంలో తుపాన్ల పరంపర

1970 నుంచి రాష్ట్రంపై ప్రభావం చూపినవి 61

ఈనాడు- విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడే తుపాన్లు ఆంధ్రప్రదేశ్‌లో అలజడి రేపుతున్నాయి. 1970 నుంచి ఇప్పటి వరకు 60 తుపాన్లు రాష్ట్రంపై ప్రభావం చూపాయి. ఇవి పొరుగున ఉన్న తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరిలలో తీరం దాటినా రాష్ట్రానికి మాత్రం తీవ్ర నష్టమే మిగిల్చాయి. తాజాగా 'మొంథా'తో కలిపి వాటి సంఖ్య 61కి చేరింది. ఇందులో 16 తుపాన్లు అక్టోబరు నెలలోనే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు పరిధిలో తీరం దాటినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతం (చెన్నై నుంచి కళింగపట్నం వరకు) ఎక్కువ తుపాన్లు తీరం దాటాయి. ఆ తర్వాత వాయవ్య బంగాళాఖాతం (కళింగపట్నం నుంచి కోల్‌కతా వరకు) తీరం దాటిన తుపాన్లున్నాయి. అతి పెద్ద తుపాన్ల జాబితాలో దివిసీమ (గాలి వేగం 230 కి.మీ.), కోనసీమ (270 కి.మీ.), హుద్‌హుద్ (220 కి.మీ.) నిలిచాయి. ప్రచండ గాలులు పూడ్చలేని నష్టాన్ని మిగిల్చాయి. ఇదే స్థాయిలో కొన్ని తీవ్ర తుపాన్లు (సూపర్ సైక్లోన్లు) ఏర్పడ్డాయి. అవి ఎక్కువగా ఒడిశా వద్ద తీరం దాటాయి.

● నీలం తుపాను 2010 అక్టోబరు 28న తీరం దాటింది. భూమిని తాకి బలహీనపడిన తర్వాత భారీ వర్షాలు కురిశాయి. ఇప్పుడు మొంథా తుపాను సైతం అక్టోబరు 28నే తీరం దాటింది. దీంతో ఏపీతోపాటు తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. 2013లో ఏకంగా ఐదు తుపాన్లు ఏర్పడగా, 1987, 1996, 2016, 2018ల్లో ఒకే ఏడాదిలో మూడు తుపాన్లు ఏర్పడ్డాయి.

కొన్ని తుపాన్ల గమనం (తీరం దాటిన, ప్రభావం చూపిన రోజులివి)

సంవత్సరం	నెల/ రోజు	పేరు	తీరం దాటిన ప్రదేశం
2025	అక్టోబరు 28	మొంథా	నరసాపురం
2023	డిసెంబరు 1	మిచాంగ్	బాపట్ల
2022	డిసెంబరు 6–10	మండోస్	మహాబలిపురం, తమిళనాడు
2021	సెప్టెంబరు 24–28	గులాబ్	కళింగపట్నం
2019	ఏప్రిల్ 26– మే 4	ఫణి	ఒడిశా
2018	డిసెంబరు 13–18	పెథాయ్	కాకినాడ
2018	అక్టోబరు 8–12	తిత్లీ	శ్రీకాకుళం
2018	సెప్టెంబరు 19–22	డాయే	గోపాలపూర్, ఒడిశా
2016	డిసెంబరు 6–13	వర్ధ	చెన్నై
2016	అక్టోబరు 21–28	క్యాంట్	ఏపీ
2016	మే 17–22	రోను	చిట్టగాంగ్, బంగ్లాదేశ్
2014	అక్టోబరు 7–14	హుద్‌హుద్	విశాఖపట్నం
2013	డిసెంబరు 7–14	మది	తమిళనాడు
2013	నవంబరు 23–28	లెహర్	మచిలీపట్నం
2013	నవంబరు 20–22	హెలెన్	మచిలీపట్నం
2013	అక్టోబరు 8–12	పైలిన్	గోపాలపూర్, ఒడిశా
2013	మే 10–16	మహాసేన్	చిట్టగాంగ్, బంగ్లాదేశ్
2012	అక్టోబరు 28– నవంబరు 1	నీలం	మహాబలిపురం
2011	డిసెంబరు 5–31	థానే	పుదుచ్చేరి
2010	నవంబరు 5–7	జల్	తమిళనాడు
2010	మే 17–20	లైలా	బాపట్ల

పునశ్చరణ తరగతులతో సిబ్బంది నైపుణ్యం పెంచండి

- ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలు చేపట్టాలి..
- వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు కేంద్ర బృందం సూచన



వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్‌తో చర్చిస్తున్న కామన్ రివ్యూ మిషన్ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వైద్య సేవలతో పాటు మాతా శిశు సంరక్షణ చర్యలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్యశాఖకు కేంద్ర బృందం పలు సూచనలు చేసింది. ఈ నెల 4 నుంచి పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో పర్యటించిన కామన్ రివ్యూ మిషన్ (సీఆర్ఎం) బృందాలు మంగళగిరిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ సంచాలకులు చక్రధర బాబు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులతో శనివారం సమావేశమయ్యాయి. కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జోయ అలీ రిజ్వీ, ఉప కార్యదర్శి డాక్టర్ భవానీ సింగ్ నేతృత్వంలోని బృందాల సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

● ప్రభుత్వాసుపత్రులతోపాటు, జిల్లా ఆసుపత్రుల్లోని ఎన్‌సీడీ క్లినిక్‌లలో వైద్యులను నియమించాలి.

● వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పునశ్చరణ తరగతులు నిర్వహించాలి.

● ఆసుపత్రుల్లో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్నిమాపక వ్యవస్థ సమర్థంగా సాగేలా చూడాలి.

● ఎన్‌సీడీ సర్వేల్లో గుర్తించిన పీడితులను సకాలంలో పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయాలి.

● మానసిక సమస్యలున్న వారికి కౌన్సెలింగ్ చేరువ చేయాలి.● పెండింగులో ఉన్న కాటరాక్ట్ శస్త్రచికిత్సలు త్వరగా పూర్తిచేయాలి ● టీబీ స్క్రీనింగ్‌ను సమర్థంగా నిర్వహించాలి. క్షయ రోగులకు ఎక్స్‌రే సేవలు, నగదు సాయం అందజేతలో అడ్డంకులు అధిగమించాలి.

సేవలపై సంతృప్తి: కమిషనర్

రెండు జిల్లాల్లో 19 ఆసుపత్రులను పరిశీలించిన కేంద్ర బృందం.. వైద్య సేవలు, ఎఫ్ఆర్ఎస్, డేటా నమోదు, ఆశా, ఏఎన్ఎం యాప్‌ల నిర్వహణ, ప్రసూతి, శిశు సేవలు తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేసిందని వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు స్థానికులతో మమేకమై సేవలందిస్తున్న తీరు, విద్యాశాఖ- అంగన్‌వాడీల సమన్వయం బాగుందని బృందం పేర్కొన్నట్లు చెప్పారు.

పరిశ్రమల కోసం.. ఉప్పు భూములు

- 8 జిల్లాల్లో.. 21 వేల ఎకరాలున్నట్లు గుర్తింపు
- రాష్ట్రానికి కేటాయించేలా కేంద్రానికి ప్రతిపాదన

ఈనాడు-అమరావతి: పెట్టుబడుల ఆకర్షణ కోసం కనీసం లక్ష ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు ప్రస్తుతం ఏపీఐఐసీ వద్ద ఉన్న సుమారు 46 వేల ఎకరాల భూములు పోగా..మిగిలిన వాటిని గుర్తిస్తోంది. ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు సమీపంలో 20 వేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న 21 వేల ఎకరాల ఉప్పు భూములను పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వాటితో పాటు పలు జిల్లాల్లో అందుబాటులో ఉన్న భూములనూ అధికారులు గుర్తిస్తున్నారు. ఆ భూములను ఏపీఐఐసీకి బదిలీ చేసి.. వాటిని పరిశ్రమలకు కేటాయించాలన్నది ప్రభుత్వ ఆలోచన. భూములకు పరిహారం చెల్లింపు.. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5 వేల కోట్లు రుణంగా తీసుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించింది.

8 జిల్లాల్లో.. 21 వేల ఎకరాలు

రాష్ట్రంలోని 8 జిల్లాల పరిధిలో తీర ప్రాంతం వెంట ఉప్పు భూములు ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాల్లో అత్యధికంగా సుమారు 11 వేల ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 19 ప్రాంతాల్లో 21,002.46 ఎకరాలు పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేందుకు వీలుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆ భూములు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అంతర్గత వాణిజ్యం, పరిశ్రమల ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) పరిధిలో ఉన్నాయి. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరుతూ అధికారులు ప్రతిపాదన పంపారు. దీనికి అనుగుణంగా సుమారు 12 వేల ఎకరాలను బదిలీ చేసేందుకు డీపీఐఐటీ సూత్రప్రాయంగా అంగీకరించింది.

జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న భూములు

జిల్లా	విస్తీర్ణం (ఎకరాల్లో)
శ్రీకాకుళం	11,724.50
విజయనగరం	873.05
కాకినాడ	2,279.17
తూర్పు గోదావరి	383.35
కృష్ణా	507.49
ప్రకాశం	2,486.55
నెల్లూరు	1,966.60
తిరుపతి	781.75

ధర విషయంలో తేలని పంచాయతీ

ఉప్పు భూములకు ధర నిర్ణయించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తున్న దృష్ట్యా.. వాటిని నామమాత్రపు ధరకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుండగా ఆ ప్రాంతాల్లో మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని డీపీఐఐటీ వాదిస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టుకు సమీపంలోని సుమారు 6 వేల ఎకరాల విషయంలోనూ ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. వాటిని కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకుని..భారీ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అయితే వాటిని కూడా ఇవ్వాలని.. పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి వినియోగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీంతో కేంద్రం నుంచి అందిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

తుపాను నష్టాల పరిశీలనకు కేంద్ర బృందం

10, 11 తేదీల్లో ప్రభావిత జిల్లాల్లో పర్యటన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మొంథా తుపాను నష్టాల అంచనాకు నవంబరు 10, 11 తేదీల్లో కేంద్ర బృందం ప్రభావిత జిల్లాల్లో పర్యటించనుంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పౌసమి బసు నేతృత్వంలో ఏడుగురు ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొననున్నారు. వారిని సమన్వయం చేసుకునేందుకు విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్‌ను నోడల్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అన్ని ప్రభుత్వ శాఖల విభాగాధిపతులు, ముఖ్య కార్యదర్శులు తుపాను నష్టాలపై నివేదికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.

● కేంద్రబృందం సోమవారం బాపట్ల, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, మంగళవారం ప్రకాశం, కోనసీమ జిల్లాల్లో పర్యటించనుందని ప్రఖర్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు.

● ఆ బృందంలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.పొన్నుసామి (హైదరాబాద్), కేంద్ర వ్యయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ మహేష్‌కుమార్ (దిల్లీ), కేంద్ర జలసంఘం సభ్యులు శ్రీనివాసు బైరి (హైదరాబాద్), రోడ్డు రవాణా, రహదారుల శాఖ ఈఈ శశాంక్ శేఖర్ రాయ్, గ్రామీణాభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ మనోజ్ కుమార్ మీనా, విద్యుత్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తిసింగ్ (దిల్లీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాస్త్రవేత్త సాయి భగీరథ్ (హైదరాబాద్) సభ్యులుగా ఉన్నారు.



భక్త కనకదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మహనీయుడు భక్త కనకదాసు

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా తన రచనలు, కీర్తనలతో సమాజంలో నెలకొన్న కుల వివక్షను రూపుమాపేందుకు కృషిచేసిన మహనీయుడు భక్త కనకదాసు అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. భక్త కనకదాసు జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు, కన్నడ ప్రజలకు ముఖ్యంగా కురుబ సామాజికవర్గానికి చెందిన కనకదాసు ఆరాధ్యుడని పేర్కొన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నవేళ ఆ మహనీయుడి సాహిత్య, సంగీత, సామాజిక సేవలను స్మరించుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

కులమత భేదాలను చెరిపేసిన యోధుడు కనకదాసు: జగన్

కులమత భేదాల గోడల్ని చెరిపేసిన యోధుడు, శ్రీకృష్ణ భగవాన్‌కి గొప్ప భక్తుడు, భక్త కనకదాసు అని మాజీ సీఎం జగన్ తెలిపారు. 'సాహిత్యంతో సామాజిక విప్లవం సాధించవచ్చని నిరూపించిన మహానుభావుడు. ఎన్నో కీర్తనలతో కవిత్వానికి కొత్త ఊపిరి పోశారు. కురుబ, గౌడదాస సమాజానికి ఆరాధ్యదైవంగా నిలిచిన భక్త కనకదాసు జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అని జగన్ పేర్కొన్నారు.

ఆడ్వాణీ, రేవంత్‌రెడ్డిలకు సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: భారత మాజీ ఉపప్రధాని ఎల్‌కే ఆడ్వాణీకి ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా శనివారం హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఆడ్వాణీజీ.. ఆయురారోగ్యం, ఆనందం, ప్రశాంతతో ఎన్నో ఏళ్లు జీవించాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. ఈ పోస్టుకు ఆడ్వాణీతో కరచాలనం చేస్తూ తీసుకున్న ఫోటోను జోడించారు.

● తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు' అని శనివారం ఎక్స్ వేదికగా చంద్రబాబు పేర్కొన్నారు.

నాయకులకు మార్గదర్శకం: పవన్‌కల్యాణ్

భారత మాజీ ఉపప్రధాని ఎల్‌కే ఆడ్వాణీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'ఎక్స్' వేదికగా శనివారం వేర్వేరుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఆడ్వాణీ రాజనీతిజ్ఞత, దేశానికి ఆయన అందించిన సేవలు తరతరాల నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తాయి. రామజన్మభూమి రథయాత్రలో ఆడ్వాణీ పాత్ర దేశ ఆధ్యాత్మిక, రాజకీయ ప్రయాణంలో నిర్వచనాత్మక అధ్యాయనంగా నిలిచిపోతుంది' అని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజలకు మరింత సేవ చేసే ఆయురారోగ్యాలను భగవంతుడు అందించాలని పవన్‌కల్యాణ్ కోరారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ కుట్రలు

భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి. చిత్రంలో రాష్ట్ర యువ మోర్చా కార్యదర్శి రాజేశ్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కుట్రలు పన్నుతున్న జగన్‌కు కడప జిల్లాలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు అడ్డుకునే దమ్ము ఉందా..? అని విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సీహెచ్ ఆదినారాయణరెడ్డి ప్రశ్నించారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో జరిగే అభివృద్ధిని ఎవరూ ఊహించలేరన్నారు. అభివృద్ధిని జీర్ణించుకోలేక జగన్ ఇంట్లో నుంచి రాలేపోతున్నారని ఎద్దేవా చేశారు. పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికలను తానే పర్యవేక్షిస్తానని, ఆ ఎన్నికల్లోనూ వైకాపాకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో.. ఎవరు అరాచకాలకు పాల్పడ్డారో బహిరంగంగా తెల్చుకోవడానికి సిద్ధమని, తాడేపల్లిలోని జగన్ ఇంటికి రమ్మన్నా చర్చకు వస్తానని ఆదినారాయణరెడ్డి సవాల్ విసిరారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు.

బీమాతో రొయ్య రైతుకు భరోసా

- వ్యాధులకూ వర్తింపుతో ధీమా

ఈనాడు, అమరావతి: రొయ్యల సాగులో తొలి 60రోజులు అత్యంత కీలకం. ఈ సమయంలో వ్యాధులతో నష్టపోతున్న సందర్భాలు ఎక్కువ ఉంటున్నాయి. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన బీమా పథకంలో చేరితే రొయ్య రైతులకు భరోసా లభించనుంది. ఎకరా సాగుకు రూ.4 లక్షల వరకు ఖర్చుచేస్తున్న రైతులు బీమా కోసం రూ.8-12వేల దాకా వెచ్చిస్తే ధీమాగా ఉండవచ్చు. పంటల బీమాలో ప్రకృతి విపత్తులు, సగటు దిగుబడుల కంటే తగ్గితే బీమా పరిహారం లభిస్తుంది. కానీ రొయ్యల సాగులో వ్యాధులకు కూడా బీమా వర్తిస్తుంది. వైరస్ సమస్యల నుంచి భరోసా కల్పించేందుకు వ్యవసాయ బీమా సంస్థ (ఏఐసీ) రొయ్యల బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఉప్పునీరు, మంచినీటి చెరువుల్లో రొయ్యలసాగు చేస్తున్న రైతులకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. వనామీ, టైగర్, స్కాంపి, పీనస్ ఇండికస్ రకాల రొయ్యలకు బీమా వర్తిస్తుంది. కోస్తా ఆక్వాకల్చర్ అథారిటీ(సీఏఏ) సంస్థ నుంచి అనుమతి తప్పనిసరి. అన్ని అనుమతులు ఉన్న వారికి జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ(ఎన్ఎఫ్‌డీబీ) ద్వారా బీమా ప్రీమియంలో 40శాతం రాయితీ ఇస్తారు.

రోజులు	సాధారణ బీమా	సంపూర్ణ బీమా (ప్రీమియం శాతం)
60	3.25	6.58
61-80	3.33	6.75
81-100	3.45	6.99
100-150	3.50	7.09

రొయ్యలు సాగు కాలం, హెక్టారుకు బీమా మొత్తం ఇలా....

రోజులు	బీమా వర్తించే సొమ్ము (రూపాయల్లో)
0-15	3,85,000
16-30	5,20,000
31-45	7,25,000
46-60	9,10,000
61-80	11,50,000
81-100	15,00,000
101-130	18,00,000

రెండు అంశాల్లో బీమా

రొయ్యల సాగులో రెండు రకాల అంశాలకు బీమా చేస్తారు. వేసవిలో అధిక ఎండలకు రొయ్యలు చనిపోవడం, విషప్రయోగం, భూకంపం, పేలుళ్లు, వరదలు, తుపాన్లు తదితర అంశాల వల్ల జరిగే నష్టాలకు సాధారణ బీమా చేస్తారు. దీంతోపాటు వైరస్, తెగుళ్లు, వ్యాధులకు సైతం బీమా చేస్తారు. ఇందులో ఒకదానికి లేదా రెండింటికి కలిపి బీమా చేసుకోవచ్చు.